Damage Book

UNIVERSAL LIBRARY
OU_204415
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T82 K92A Accession No. T 255

Author కృష్ణారావు. వెం

Title అర్థాంగ్ల ప్రయాస 1919

This book should be returned on or before the date last marked below.

[[illegible] గ్రంథము ౨.

అపూర్వప్రతిభ.

ప్రథమభాగము.

ఇది

కొచ్చెర్లకోట రామచంద్ర వేంకటకృష్ణారావు బి.ఏ. గారిచే

రచియింపఁబడి

చెలికాని లచ్చారావుగారిచే

సంపాదింపఁబడి

ఐరోపామహాసంగ్రామసంధి (28-6-19) జ్ఞాపకార్థము

ప్రకటింపఁబడినది.

Title Printing onlv V. M P

1919.

[illegible] వెల [illegible] ౧-౨-౮.]

పీఠిక

ఈ "సుపూర్ణప్రతిథ" యను నవల శ్రీ పోలవరపు ... కొచ్చెర్లకోట రామచంద్ర వేంకటకృష్ణారావు బహద్దర్ బి.ఏ. గారిచే రచింపఁబడిన యొక సాంఘికనవల. ఆయన దీనిఁ గష్టించి వ్రాసి లోకాంతరంబున కేఁగుటచే పూర్వమే పరమపదించినందులకు విచారించితిమి. దైవవిధికి నెవరేమిచేయఁగలరు. ఇట్టి బ్రహ్మశ్రీ దివాకర్ల తిరుపతిశాస్త్రులుగారు మా గ్రంథమాలికయందుఁ బ్రకటించు భాగ్యము లభింపఁజేసినందులకు నాయనకు మా కృతజ్ఞతావందనము లర్పించుచున్నాము. ఇందు ముఖ్యపాత్రలు — లోకనాథ మొదలియారు, కస్తూరిశెట్టి, రంగనాథపిళ్లె, తిరుమంగళేశ్వరు నాయుఁడు గార్లు. వీరు స్వార్జితధనము వ్యయపరచి దేశసేవాతత్పరులై, పరోపకారదీక్షాపరతంత్రులై, కార్యశూరత్వంబు గాని దేశాభివృద్ధికరమగు సాధనంబుల న్వేషించి దేశ ముద్ధరింప బయలుదేరిరి. వీరికి ప్రతిపక్షము, సంఘమునందుండు లోపంబులు స్వభావముగఁ బరికించి పనిచేయవలెనని ముఖ్యాభిప్రాయము. ఇందువిషయములో వీరు పడిన పాట్లు పరమాత్మునికెఱుక. పాత్రలయొక్క నిర్మలాంతఃకరణము, స్వార్థత్యాగము మొదలగునవి బహునిపుణతగాఁ బ్రదర్శింపఁబడినవి. కథావిధానము నూతనపద్ధతి. శైలిసులభము. ఇట్టి నవలాపఠనంబున "ఏకక్రియాద్వ్యర్థకరి" యనునట్టుల భాషాభివృద్ధియగుటయు దేశంబునందుండు గుణదోషంబులు తెలిసికొనుటయు సంభవించును. ఇట్టినవలను మనదేశీయు లభివృద్ధిపరచి కృతార్థులయ్యెదరు గాక.

ఇఁక ఈయనవిషయమై నే నెఱుంగునది కొంచెము ప్రసంగించి విరమించుచున్నాఁడ. ఈయనతో మొట్టమొదట 1916 సంవత్సరమున ... జరిగిన ఆంధ్రసారస్వతమహాసభయందుఁ బరిచయము కలిగెను. (20-12-1917 సం॥న) ప్రత్యేకాంధ్రరాష్ట్రమును గుఱించి ఆంధ్ర...

గా హిందూదేశపుమంత్రి మాంటాగుగారిని, ప్రతినిధి షేమ్సుఫర్డుప్రభువును చెన్నపురియందు సందర్శించి విజ్ఞాపనపత్రిక సమర్పింపఁ గలుసుకొన్నప్పుడు ఆయన జమీందారునను టెక్కులేక పరిచితులయెడ గనుపఱచిన యనురాగము. ఆదరణబుద్ధి, నిష్కాపట్యము, నిగర్వము నా కెంతయో సంతసము గలుగజేసె. ధనము శాశ్వతంబా! తనువు నిత్యమా! మఱల (23-6-18 సం॥న) ఐదవఆంధ్ర దేశగ్రంథాలయప్రతినిధుల మహాసభయందు విశాఖపట్టణంబునగలుసుకొంటిని. ఇదియే కడసారిచూపు. అప్పుడు ఆయన అనారోగ్యస్థితిలోనుండియు భాషా విషయమై పట్టుదలతో నుపన్యసించుటయే ఆయనకు భాషాభిమాన మెంతవఱకు గలదో చదువరు లూహించుకొనగలరు. ఈయన పెక్కుగ్రంథంబులు రచించియును రచింపించియు భాషాపోషణ నెంతో మేలొనరించిరి. ఈయన పేరెఱుంగని యాంధ్రభాషాభిమాని యుండడు. ఈయనఅకాలమృతివలన దేశభాషకుఁ గొంతలోటు వాటిల్లినదని చెప్పక తప్పదు. భగవంతుఁ డీయనయాత్మకు శాంతినొసంగుగాక.

చిత్రాడ.
6—6—19.

ఇట్లు
చెలికాని లచ్చారావు.

శ్రీరస్తు.

అపూర్వప్రతిభ.

మొదటి ప్రకరణము.

ఉత్తమచారిత్రులును, సద్గుణగరిష్ఠులును, సదాచారప్రవర్తకులును, పరోపకారదీక్షాపరతంత్రులును, నగుపుణ్యపురుషు లగుమహామహులు గతించినను వారు కీర్తికాయులై చిరకాలము మృతజీవులుగా నుందురుగదా! లోకనాథమొదలియారుగారును వారిస్నేహితులును దమసాహసౌదార్యసద్గుణసంపత్తినిఁ బట్టియుఁ దాము చేసిన నిష్కపటమైన పరోపకారకార్యములను బట్టియు జనులపొగడ్తలకుఁ బాత్రులై మృతజీవులై యాచంద్రతారార్కముగ నుందురనుటకుసందియములేదు. మనుష్యుఁడు ప్రపంచమున జీవించుకాలము పరిమితికలదియే యైననుఁ దానుచేసిన సత్కార్యములను బట్టి చిరకాలము జనుల యంతరంగముల జీవించియుండవచ్చును. లోకనాథమొదలియారుగారెవరో మన మెఱుఁగకపోయినను వారిని మనమెన్నఁడును జూచియుండకపోయినను వారుచేసిన మహత్కార్యములను బట్టి వారియొక్కయు వారిస్నేహితులయొక్కయు సచ్చారిత్రములను పుణ్యకథలనుబట్టియు వారిని మనము గౌరవపూర్వకముగ జ్ఞాపక ముంచుకొని శ్లాఘింపవలసియున్నది.

కథానాయకులలో నగ్రగణ్యుఁడగునీలోకనాథమొదలియారుగారు తామువ్రాసిన దినచర్యనుబట్టియుఁ దమచరిత్రమునుబట్టియుఁ దాదాపు ఏఁబదిసంవత్సరముల వయసుకలవాఁడని నిశ్చయింపవచ్చును. ఈయనతండ్రిపేరు అమృతలింగమొదలియారు. ఈయన చెన్నపట్టణములోఁ జిరకాలము గొప్పవర్తకుఁడుగా నుండి యనేకసత్కార్యములను జేసి కీర్తిఁగాంచి విశేషము

గా ద్రవ్యమార్జించి పరలోకగతుఁ డాయెను. అప్పుడులింగమొదలియారు తనపుత్రుఁడైన లోకనాథమునకు విద్యనేర్పించి యతఁడు పెద్దపరీక్షలు ప్యాసయి గొప్పయుద్యోగమును జేయుచుండఁ జూడవలయునని యత్యాసక్తితో నాతనికి విద్యాబుద్ధులు చెప్పించెను. కాని లోకనాథము చిన్నప్పటినుండియు నాటపాటలయందుఁ దనకాలమంతయు వ్యర్థపుచ్చి తనతండ్రి యభీప్సితము తీరునట్లు పరీక్షలయందుఁ గృతార్థుఁడు కాకపోయెను. గొప్ప గారవకుటుంబమున జన్మించి తండ్రిగారాబమున లోఁబడినవాఁ డగుటచే దుర్గుణములను మాత్రము పొందెను. తనకుమారుని విద్యార్థునిఁ జేయవలయు నను తండ్రి పట్టుదలచేతను చిరకాలవ్యాసంగముచేతను లోకనాథమిరువది సంవత్సరముల వయసువచ్చునప్పటికి మెట్రిక్యులేషన్ పరీక్ష మాత్రము ప్యాసాయెను. తరువాతఁ దండ్రి తనకుమారుని కీదేశమున విద్యగఱపించినయెడలఁ జాలసంవత్సరములకుఁ గాని బి. యే. పరీక్ష ప్యాసుకాఁజాలఁడని యోచించి త్వరలో నాతని నొకకలెక్టరుగాఁ జూడవలయు ననుకుతూహలముతో లోకనాథమును నింగ్లాండుదేశమునకుఁ బంపి విద్యనేర్పించెను. లోకనాథ మింగ్లాండుదేశమునకుఁ బోయి తనతండ్రిపంపున నాతనిపూర్వపరిచితుఁ డగునొక గొప్పగృహస్థుని యింట బసదిగి కలెక్టరుపరీక్షకుఁ జదువ నారంభించెను.

లోకనాథము మేధావంతుఁడు కాఁడు. ఇంగ్లాండుదేశములో నితఁడు విద్యగఱచుచున్నప్పుడు తనతండ్రి కావలసినద్రవ్యము పంపుచువచ్చుచుండుటచే మిక్కిలి సౌఖ్యముగాఁ గాలముఁ గడపుచు నితరదేశములకుఁబోయి యచ్చటి చిత్రములనెల్లఁ గాంచుచు గొప్పవారిస్నేహము సంపాదించుచుండెను. ఇతఁడు మేధాశాలియు సూక్ష్మబుద్ధియుఁ గాకపోవుటఁబట్టియు, స్వభావముచే శరీరశ్రమ కోర్వఁజాలని సుకుమారుఁడగుటచేతను నంతగా శ్రమపడి విద్యాభ్యాసము చేయకపోవుటచేతను దనతండ్రి మనోవాంఛితముఁ దీరఁ గలెక్టరుపరీక్షయందుఁ గృతార్థుఁడు గాఁజాలక బారిష్టరుపరీక్షనుమాత్రము ప్యాసాయెను. లోకనాథము శరీరదార్ఢ్యమును చక్కని [illegible]తోఁగూడిన యారో

గ్యమును కలవాఁడగుటచే విశేషముగా విద్యాభ్యాసఁగమక్కఱలేకయే సులభముగాఁ గృతార్థతనొందఁగల పరీక్షయని జనులనుకొను నీబారిష్టరుపరీక్షను ప్యాసుకాఁగలిగి యూరోపుఖండమునఁ బలి దేశములన్నిటిని యమెరికాదేశమును తిరిగి మరల యింటికివచ్చెను. తరువాత కొన్నిమాసములకు నమ్మతలింగ మొదలియారు పరమపదమునొందెను. తండ్రి పోయిన కొన్నిమాసములవఱకు లోకనాథము తన స్వంతవ్యవహారమునే చక్కఁబెట్టుకొనుచుఁ దనతండ్రి వ్రాసిన మరణశాసనమును బట్టి తనయక్కచెల్లెండ్రకును సమీపబంధువులకును నిచ్చివేయవలసినవంతయు నిచ్చివేసి న్యాయవాదిగా నుండఁ దలంచి కోర్టునకుఁ బోవుచుండెను. ఇతఁడు స్వభావముచే మిక్కిలి యమాయికుఁడు. పాపభీతికలవాఁడు. పరోపకారమునకు వెనుదీయని స్వభావము కలవాఁడగుటచేతను అపారమయిన దయకల యంతఃకరణము కలవాఁడు. మఱియు స్నేహితుల యెడలను బంధువుల పట్లను బరిచితుల యెడలను మిక్కిలి దయయు దాక్షిణ్యము కలవాఁడు. ఇంతియకాక జనానురంజనముగఁ బదిమందిలో నాత్మగౌరవము నిలిపికొనుచుఁ దిరుగుచు దేశాభిమానమానసుఁడై పరోపకారము కొఱకెట్టికార్యమైనను వెనుదీయక చేయ సమకట్టువాఁడు. మఱియు వస్తుతత్త్వమును గ్రహించి యెంతటి యల్పకార్యమైనను మిక్కిలి శ్రద్ధతోఁ ద్రికరణశుద్ధిగాఁ జేయవలయునను సదుద్దేశము కలవాఁడు. ఇతనికి ధనలోభమెన్నఁడును లేదు. తనతండ్రి గడించి పెట్టిన ధనము పాడుచేయక యభివృద్ధిపఱచుకొనుచు మిక్కిలి గౌరవముగాఁ గాలక్షేపము చేయుచుండెను. ధనమార్జింపవలసిన యవసరమితనికి లేకపోయినను నుద్యోగము పురుషలక్షణమని యెంచి న్యాయస్థానమునకుఁ బోవుచుఁ గొంతకాలమయినతరువాత యితరులచే గౌరవపురస్సరముగ నాహ్వానింపఁబడినంగాని యాచితముగ నెక్కడకును బోఁగూడదనియు నాత్మగౌరవమును గాపాడుకొనుట కిది ప్రధానానుష్ఠానము ముఖ్యమనియుఁ జక్కఁగ గ్రహించినవాఁడగుటచే లోకనాథము పిన్నఁబిలువకుండ న్యాయస్థానమునకుఁ బోఁగూడదని నిశ్చయించుకొని తనయింటనే యుం

డెను. పశ్చిమఖండమునకుఁ బోయి యచ్చట చాలకాలముండి వచ్చినవాఁడగుటచేఁ దాను మిక్కిలి ప్రజ్ఞావంతుఁడననియు, ననుభవశాలిననియుఁ దెలిసినవాఁడననియు నను మనోగర్వమితనికి లేకపోలేదు. తనయూరజరుగు నన్ని కార్యములయందునుఁ బ్రతిసమాజమున లోకోపకారార్థము జరుగు నన్ని పనులయందును నితఁడు జోక్యముకలుగఁజేసికొనుచు మిక్కిలి పాటుపడి పనిచేయుచుఁ బరార్థప్రాపకుఁడై స్నేహపాత్రుఁడై కాలము గడుపుచుండెను. ఇతఁడు మిక్కిలి మంచిస్వభావముకలవాఁడగుటచే నాయూరివారందరు నితనికి స్నేహితులేయని వేరే చెప్పనవసరములేదు. కొందఱుమాత్రము బారిస్టరు మొదలియారమాయికుఁడనియు లోకజ్ఞానమెఱుఁగనివాఁడనియుఁ దలఁచుచుండిరికాని యితఁడు సదుద్దేశముకల పరోపకారియగుటచే నితని నెఱిఁగినవారందఱు గౌరవించుచునే యుండిరి. ఇతఁడు తన యాత్మగౌరవమును నిలబెట్టుకొననెంచి తనయింటనె యుండి యితరకార్యములయందుఁ గాలమంతయుఁ గడపకుండుటచేఁ దానభ్యసించిన న్యాయశాస్త్రమును క్రమక్రమముగ మఱచిపోయి వయస్సుచేతను శరీరలాఘవము నానాటికిఁ దగ్గిపోవుటచేతను విద్యనభ్యసించుచున్నప్పుడితఁడు నేర్చుకొనిన కొన్నియలవాటులనుపట్టియుఁ గొంతకాలమునకు శరీరస్వాస్థ్యమును బుద్ధిబలమును క్షీణింప న్యాయస్థానమునకు బోవుటయే మానుకొని బారిస్టరుపదవిశిష్టుఁడై యుండెను.

ఇట్లు లోకనాథమొదలియారుగారు న్యాయస్థానములకుఁ బోయి పనిచేయుట మానుకొనినను పరోపకారబుద్ధి గలవాఁడు గావున దేశక్షేమముకొఱకును, సంఘసంస్కారముకొఱకును, దేశాభివృద్ధికొఱకును మిక్కిలి పాటుపడి పనిచేయుచు నాయూరనున్న యన్నిసమాజములలోను, అన్నివిషయములలోను, అన్నివ్యవహారములలోను ముఖ్యుఁడుగాఁ బ్రవర్తించుచు గాలము గడపుచుండెను. ఇతఁడు స్వభావముచేఁ బ్రతికార్యమునుగూర్చియు మిక్కిలి దూరాలోచనముచేసి యందలి సాధకబాధకములను జక్కగాఁ బరిశీలించువాఁడు. కాని యమాయికస్వభావము గలవాఁడగుటచేతను బరోపకారమన్న

ను దేశక్షేమమన్నను నించుకయిన వెనుదీయక యెంతకష్టమునకైన నొడిగట్టి యతినిశ్చయముగా మిక్కిలి సాహసములోఁ బనిచేయఁ గంకణముకట్టుకొని కార్యాచరణదీక్షతో శక్తివంచన యించుకయిన లేకుండఁ బ్రవర్తించు సస హాయశూరుఁడని యాతని విరోధులుగూడ నొప్పుకొనకతీరదు. మఱియు వా యూరనున్న సమాజములు, సంఘములును, అప్పుడప్పుడచ్చటను యితరస్థల ములయందును జరుగు సభలును బహిరంగభాషణములుగను బహిరంగవినోదోద్దేశము లు గలవిగను గనుపించినను అవియన్నియు దేశక్షేమముకొఱకును, సంఘాభి వృద్ధికొఱకును ధర్మసంస్థాపనముకొఱకును నుద్దేశింపఁబడిన మూలకారణమును జక్కగా గ్రహించి యుచితానుచితమును బరిశీలింపఁగల కార్యవాదియగు నీ సత్పురుషుఁడు దనకుఁ దోఁచినరీతిని వాటినన్నిటి యందునుజేరి యలంకరించు చుఁ దనసామర్థ్యమును అనుభవజ్ఞానమును గ్రహించి యాసమాజికులును స భాసదులును దన సలహాల నామోదించి యంగీకరింపకపోయినను దాను చెప్పు విషయములను గూర్చి యితరులేమనుకొన్నను పాటింపకఁ దానుచేయవలసిన హితోపదేశమును నిర్భయముగాఁ జేసివచ్చి సంతుష్టిగల యంతరాత్మతో న తఁడానందించుచు నింటికి వచ్చుచుండును. ఇంతియగాక నితఁడు సర్వజనసమ్మ తుఁడుగా నుండవలయుననియు నందఱిచే స్నేహభావముతో గౌరవింపఁబడ వలయుననియుఁ గోరికగలవాఁడు. కావున నెప్పటి వాదప్రతివాదముల న ప్పుడే మఱచిపోయి తనమనసు నాయాసపెట్టుకొనకఁ బ్రవర్తించుచుండెను.

లోకనాథమొదలియారు ఆకారమున గొంచెము పొట్టిగాను స్థూల ముగాను చామనచాయగాను నుండును. నలుబదియేండ్లకు మీరినవయసు గలిగి యుండుటచేతను దేహపరిశ్రమమునందు గాలము వ్యర్థపుచ్చని స్వభావముగల వాఁడగుటచేతను భోజనప్రీతి మిక్కిలి గలవాఁడగుటఁబట్టియు నీతని జీర్ణకో శముయొక్క విశేషము ప్రకటీకృతముగా నుండఁజేయుటకోయన నీతనికడుపు సామాన్యముగా మనమెఱిగిన పెద్దకడుపులకంటెఁ బెద్దదిగాఁ గనుపించకమాన దు. ఇతడు బంగారుచీరతోఁ గట్టఁబడిన సులోచనములను నల్లని పట్టుదార

మునగట్టి మెడలోవేసికొని యవసరమైనప్పుడును దనకుఁ దోఁచినప్పుడును ధరించుచుండెను. బూట్సు, రోజన్సు పెద్దకోటు తొడుగుకొని యింగ్లాండుదేశమునుండి వచ్చిన తరువాతఁ గొంతకాలమువఱకును దొరలటోపీ నిధరించి తన వారి నేకారణముచేతనో టోపీ వదలివేసి తలపాగాతోఁ దిరుగుచుండెను. ఎప్పుడు చూచినను దన వేషమును విడువక "తనవేషంబుఁ దనుదానఁ బొగడుకొనుట, నొప్పియును గినుకయు నిచ్చి పగవానికిఁ దనకెంత నమ్మకమున్న బలము దప్పనంతటి నడువడి యొప్పఁజేయు" అను భారతనీతియందలి యంతరార్థమును జక్కగా నెఱిఁగి సంచరించుచుండెను. మఱియు నితనికి స్వభావముచేత మాటలాడునప్పుడు తడుముగాఁ గొంచెము నత్తియున్నది. ఆనత్తివలనఁ దాను జెప్పదలఁచుకొన్న విషయమును మిక్కిలి యాలస్యముగాఁగాని చెప్పనేరకపోవుటయు వినువారికి విస్పష్టముగా దెలియునట్లు మాటలాడఁజాలకపోవుటయుఁ దటస్థించుచుండుటచే నితఁడు మాటలాడునప్పుడు వినువారికంత యాహ్లాదకరముగా నుండదని చెప్పుటకుమాత్ర మంతశీలుగానుండదు. కాని యితని హృదయధర్మమును బట్టి యితఁడాడు మాటలు విస్పష్టముగా నితరులకుఁ దెలిసినను దెలియకపోయినను నితఁడు సదుద్దేశములవాఁడని యందఱు గ్రహించుచుండిరి. ఇతఁడు స్నేహపాత్రుఁడగుటచే జనులకు సులభసాధ్యుఁడై తన పరిచితులమొదలను స్నేహితులమొదలను ననుకూలభావముతోఁ బ్రవర్తించుచుండెను. ఇతని స్నేహితులలోఁ గస్తూరిశెట్టిగారును రంగనాథపిళ్ళగారునుఁ దిరుమంగయూ స్వామినాయఁడుగారును ముఖ్యులు. ఈముగ్గురును మొదలియారుగారియందలిగౌరవ మింతింతని చెప్పవలసినదికాదు. మొదలియారుగారును వారియందత్యంత ప్రేమానురాగము కలిగి వారిని తనకు ముఖ్యులైన యాప్తులుగ గణించుచుండెను. ఇట్లు వీరు నలుగురును అన్యోన్యమయిన భక్తియు విశ్వాసమును గౌరవమును నమ్మకమును కలిగి ప్రవర్తించుచుఁ బ్రతిదినమును గలసికొని తమతమ యభిప్రాయములను తెంచి మాట్లాడుచు విశేషాంశములను చర్చించుచు నేకమనస్సుతో మెలఁగు

చుండెను. మొదలియారుగారికలె నాతనిస్నేహితులగు ముగ్గురకుండ దేశాభిమానమాననీయులై యేకబుద్ధితో సంచరించుచుఁ 'సమానశీలవ్యసనేషు సఖ్యం' మను న్యాయమును జగద్విదితముచేసిరి.

కస్తూరిశాస్త్రిగారు మిక్కిలి భాగ్యవంతుఁడు. ఈయనతండ్రిగారగు గోవిందశాస్త్రిగారు కొన్ని సంవత్సరములు దొరతనమువారి తరపున నొక గొప్పయుద్యోగముచేసి విశేషద్రవ్యమార్జించి యొక లంచపుకేసులో నుద్యోగభ్రష్టుఁడయ్యెను. గోవిందశాస్త్రిగారు వ్యవహారతంత్రమును చక్కఁగ నెఱింగిన ప్రయోజకుఁడు కావున నచిరకాలములోపలనే యొక గొప్పసంస్థానమునకు దివానుగా నియమింపఁబడెను. తరువాత నొక సంస్థానమును మాని మఱియొక సంస్థానమునకు దివానుగా నియమింపఁబడుచు నైదారుజమీందారీ సంస్థానములను బాగుచేసి కొన్నిగ్రామములను ననేకముగా భూములను విశేషముగా ధనమును సంపాదించెను. తనకుమారునకు విద్యనేర్పించి గొప్పపరీక్షలను ప్యాసుచేయించి గొప్పయుద్యోగమును చేయింపవలయునను కోర్కెతో నితనికి విశేషద్రవ్యమును కర్చుపెట్టి చెన్నపట్టణమున విద్యాభ్యాసము జేయించెను. కస్తూరిశాస్త్రి చిన్నతనమునుండియు సంగీతమునకుఁ జెవికోసుకొనువాఁడు. తన తండ్రి జమీందారీసంస్థానములలో నుద్యోగము సేయుచున్నప్పుడు కవీశ్వరుల యొక్కయుఁ బండితులయొక్కయు సంగీతపాటకులయొక్కయు పరిచయమితనికి నెక్కువగఁ గలుగుటకవకాశము కలిగె. యితనికి సంగీతమన్ననుఁ గవిత్వమన్నను వైద్యమన్నను సాహిత్యమన్నను మిక్కిలి ప్రీతికరముగా నుండెను. ఇట్లు నానాటికీతనికందు నభిరుచి మిక్కుటమై సహవాసమువల్లను బరిచయమువల్లను వానియందు నతనికిఁ గొంత శ్రుతపాండిత్యము చేకూరెను. కస్తూరిశాస్త్రికి వీనియందభిరుచి వృద్ధియైనకొలఁది చదువు సన్నగిల్లిపోయెను. సంగీతము వినుట కవులస్నేహము సంపాదించుట పండితులతో గోష్ఠిసలుపుట వైద్యుల సహవాసముసేయుట మొదలగు పనులలోఁ దనకాలమునందుఁ జాల భాగము గడుపుచు స్కూలుకుఁబోవుటకూడ క్రమక్రమముగ నశ్రద్ధచేయుచు

వచ్చెను. ఇట్లు కొంతకాలము గడచినతరువాత కస్తూరిశెట్టికి పదునెనిమిది సం వత్సరములు వచ్చునప్పటికతని తండ్రిగతించెను. తరువాత నతఁడు యింగ్లీషు విద్యాభ్యాసము ముగించెను. ఏసకేఁయుఁ బ్యాసుకాకపోయినను కస్తూరిశె ట్టి యింగ్లీషుమాత్రము ధారాళముగా మాట్లాడకలఁడు. తనకుగల యభిరుచి చే సంగీతమభ్యసించుచుఁ గవిత్వము చెప్పవలయునను నుత్సాహముతోఁ బద్యములు చెప్పఁ బ్రయత్నించుచు గాయకులతోడను కవులతోడను వైద్యు లతోడను సంతోషకరముగాఁ గాలము గడుపుచుండెను. ఇతఁడు 'వాణిజ్యేవ సతేలక్ష్మీః' యను వచనమును గ్రహించి వర్తకమారంభించి యందుఁ గొంత ద్రవ్యమును గోల్పోయి ధనికులకు వర్తకవ్యాపారము తగదని స్వానుభవము వలనఁ దెలిసికొని వ్యాపారము కట్టిపెట్టి చెన్నపట్టణములో యథేచ్ఛగాఁ గాలము గడుపుచుండెను. మొదలియారుగారి సహవాసమలవడినతరువాత యాతని కార్యశూరత్వమునకు సంతసించుచు వాతని యభిప్రాయములతో నేకీ భవించి సంచరించుచు నించుకేని వెనుదీయ కతనికిసహాయము సేయుచుండెను.

రంగనాథపిళ్ళగారు! మిక్కిలి గౌరవమైన వంశమున జన్మించినవాఁడు. ఇతనితండ్రిపేరు వైద్యనాథపిళ్ళ. ఈయన మదరాసు హైకోర్టులో న్యాయ వాదిగానుండి మిక్కిలి సమర్థుఁడని ప్రసిద్ధిగాంచెను. రంగనాథపిళ్ళ ఎఫ్. యే. క్లాసులోఁ జదువుచుండగా వైద్యనాథపిళ్ళ కాలధర్మమునొందెను. త రువాత నితఁడు చదువుమానివేసి తనతండ్రి సంపాదించిన ద్రవ్యమును కాపా డుకొనుచు ధనమార్జించుటకుఁ దాను విద్యాభ్యాసము చేయవలసిన యవసర ము లేదనియు సంతుష్టి సౌఖ్యదాయకము కావునఁ దనతండ్రి తనకిచ్చిపోయి న ద్రవ్యము తనకుఁ జాలును కావున తాను శ్రమపడి ధనము సంపాదించుట యావశ్యకమనియుఁ బ్రపంచానుభవమును వ్యవహారజ్ఞానమునకై కావలసినవిద్య యిదివఱకే సంపాదించితిననియుఁ దలఁచి స్వేచ్ఛగాఁ గాలముఁ గడుపుచుం డెను. ఇతఁడు మొదలియారుగారికిని శెట్టిగారికిని ముఖ్యస్నేహితుఁడు. ఈ యనకు సంగీతమందును నభినయశాస్త్రమందును మిక్కిలి యభిరుచికలదు.

తిరుమంగయాళ్వారు నాయుఁడుగా రొక గొప్పసచ్ఛూద్రకులమున జన్మించినవాఁడు. ఈయన తండ్రిపేరు సంపెంగ నాయుఁడుగారు. ఈయన దొరతనమువారి తరఫున గొప్పగొప్ప యుద్యోగములు సేసి మిక్కిలి గౌరవమును ధనమును సంపాదించెను. తిరుమంగయాళ్వారు నాయుఁడుగారు బి. యే. పరీక్ష ప్యాసుచేసినవారు. తనతండ్రి ప్రోత్సాహమున నుద్యోగములోఁ బ్రవేశించి యుద్యోగము చేయుట కిష్టము లేకపోయినను దనతండ్రి కాగ్రహము వచ్చునని తలఁచి కొంచెము కాలముఁ గడపి తరువాత కొంతకాలమునకుఁ దండ్రి కాలధర్మము నొందిన క్షణమందే యుద్యోగము మానుకొని చెన్నపట్టనముననే నివసించుచుండెను. ఈయన కిరువదియెనిమిది సంవత్సరముల వయసుండును. ఈయనకు గుఱ్ఱపుసవారీచేయుట, సాముచేయుట, క్రికెటు, టెన్నిసు, బిలియర్డ్సు ఆటలాడుట మొదలగు వ్యాయామ క్రీడలయందు మిక్కిలి యభిరుచి. ఈయన యాకారమునందుఁ గొంచెము పొడవుగాను నెఱ్ఱగను గనిపించును. ఈయన యుద్యోగమును మాని చెన్నపట్టణమునఁ బ్రవేశించిన కొంతకాలమునకు గుఱ్ఱమెక్కుట మొదలగు వ్యాయామక్రీడలయందుఁ గాలము వృథపుచ్చక శరీర మాయాసపెట్టుకొనకయే తనకు దానియందున్న యభిమానాభిరుచులను, గుఱ్ఱపుపందెములను నితరులు సల్పు వ్యాయామక్రీడలను చూచుటచేతనే సంతుష్టిపఱచుకొనుచుండెను. మఱియు నితనికి సౌందర్యవంతుఁడ ననుమనోగర్వము మాత్రము మిక్కిలిగా నుండెను. కాని విద్యాధికుఁడును బుద్ధిమంతుఁడును నగుటచే నామనోగర్వమును సాధ్యమగునంతవఱకు వ్యక్తపఱచకుండ సంచరించుటకుఁ బ్రయత్నము సల్పుచుండెను. ఆప్రయత్న మెంతవఱకుఁ గొనసాఁగుచుండెనో మనము చెప్పలేము. ఈయన కేండ్లు గడచినకొలఁది యౌవనదశ ప్రకటింపవలయునను కోర్కెయధికము కాఁజొచ్చెను. అందువలనఁ బ్రతిదినము మూఁడునాలుగుగంటలు మీసములకును జుట్టునకును రంగువేయుట మొగము దిద్దుకొనుట మొదలగు కార్యములయందుఁ గాలము గడుపుచుండెను. ఈయనకూడ మొదలియారుగారి

యెడల మిక్కిలి యభిమానమును గౌరవ విశ్వాసములును గలవాఁడు. ఈనలువురును గాలక్రమమున మిక్కిలి స్నేహానురాగములు గలిగి సంచరించుచు నొకరికొకరు సాహాయ్యముఁ జేసికొనుచు నొక్కమాటాడుచు నొకమార్గము నఁబోవుచు భిన్నాభిప్రాయము లించుకయు లేక యుండిరి. ఇందులో శెట్టిగారును నాయుఁడుగారును వైష్ణవమతస్థులును, మొదలియారుగారునుఁ బిళ్ళగారును శైవమతస్థులును, అయినను నొండొరులయెడ మతాభిమానము మతద్వేషము గూడ నించుకయేని లేక సంచరించుచుండిరి. వీరు దేశాభిమానమాననీయులనియుఁ బరోపకారదీక్షాపరతంత్రులనియుఁ గార్యశూరులనియు మఱల చెప్పనవసరములేదు. సహవాసమాహాత్మ్య మిట్టిదని చెప్ప నలవికాదు. సుగుణములేని దుర్గుణములేని సహవాసముననే కదా! పట్టుపడును. వేయేల! ఒకఁడు నవ్వుచున్నచోఁ జూచినవారికందఱికిఁ గాకపోయిననుఁ గొందఱికేని నవ్వురాకపోదు. ఒకఁడేడ్చుచుండ వినినవారిలోఁ గొందఱికైనను నదే విధమున విచారము పుట్టకమానదు. కావున జనులు వేఱువేఱుగానున్నను నందుఁ గొందఱైనను నంతరంగములు గలసినవారై యుందురు. ఆఱుమాసములు సహవాసముచేసిన నతఁ డితఁ డగునను లోకోక్తి మనము వినుచునే యున్నాము. కాఁబట్టి యీనలుగురును ప్రథమమునుండియు మిక్కిలి స్నేహభావముతో సంచరించుచుండుటచే నేకాభిప్రాయముకలవారై యుండిరి. సదుద్దేశముతో దేశాభివృద్ధికొఱకు పాటుపడి పనిచేయుచు వీరునలుగురును కార్యశూరులయి యుండిరి. దేశాభిమానులమని పేరుపెట్టుకొని పెద్దపెద్దమాటలు చెప్పుచుఁ గార్యమువచ్చినప్పుడు వెనుకకు దిరుగు మహానుభావులవలెను సభలలో నుద్ఘోషించి యుపన్యాసముల నిచ్చి ధర్మదేవతలమని చెప్పుకొని నటించు వేషధారులవలెను గాక నీనలుగురును యెట్టికష్టములకైన వెనుదీయకఁ దమ కార్యాచరణదీక్షయు దేశాభిమానపరతంత్రతయుఁ బనిచేసి జగద్విదితముచేయఁ గంకణముఁగట్టికొనిరి. మనదేశములో స్థాపింపఁబడి నామావశిష్టములైనట్టియు, జీర్ణించి ప్రాణావశిష్టములైనట్టియు, సజీవములై మిగిలియున్నట్టి

యు సమాజము లన్నియుఁ బ్రప్రథమమున సదుద్దేశముతోఁ గార్యాచరణదీ క్షాపరతంత్రతతో స్థాపింపఁబడి కార్యారంభముఁ జేసినను దుద కొక్కటియైన సంతుష్టికరముగను, తృప్తికరముగను బనిచేయఁగలిగినవి లేకపోవుటకు మొదలియారుగారును ఆయనస్నేహితులును వగచుచు నందులకుఁ గారణముఁ దెలిసికొనఁగోరి యాలోచించుచుఁ జర్చించుచుండిరని, వీరునలుగురును గలిసిచేసిన ఘనకార్యములను గూర్చి వీరువ్రాసికొనిన దినచర్యలను బట్టియు లాంతికాగితములనుబట్టియు మనము దెలసికొనఁగలిగినారము. ప్రపంచములోఁ బ్రతిపురుషుఁడును దాను మహాప్రజ్ఞావంతుఁడననియుఁ గార్యనిర్వాహకుఁడననియుఁ గొంచెము గర్వమంతరంగమున నొకప్పుడుగాకపోయిన మఱియొకప్పుడైన సంతసింపక మానఁడు. కాఁబట్టి యీమొదలియారుగారికిని వారిస్నేహితులకును దాము న్యాయమార్గానువర్తులమనియు, దేశోపకారదీక్షాపరతంత్రులమనియు సత్కార్యశూరులమనియు సద్వంశమున గౌరవకుటుంబములయందు జన్మించిన మర్యాదస్థులమనియు నంతరంగమున గర్వముగలిగియుండిరి. వీరునలువురును ధనవంతులని యిదివఱకే చెప్పియున్నాను. వీరు స్నేహపాత్రు లని గూడ చదువరులు గ్రహించియేయుందురు. వీరు చెన్నపట్టణమునఁ దమ చిన్నతనమునుండియు నివసించియుండుటచే నొండొరులను చిన్ననాటినుండియు నెఱుఁగియేయున్నారు. వీరు జాతిమతద్వేషములుగాని, తమవారు నన్యులునను భేదబుద్ధిగాని, అసూయ, మత్సరము, అసహనము మొదలగు దుర్గుణములు గాని లేనివారు. "ఆత్మవిజ్ఞానము, దమంబు, నాత్మగౌరవంబు నీగుణత్రితయంబుఁ బ్రాణికోటిఁ, దివ్యసామ్రాజ్యపదవి నందించు గాన, గడనసేయఁగదగు వానిఁగార్యమతులు" అని మహాభాగవతమునఁ జెప్పఁబడిన నీతివచనమును వీరు జక్కఁగా గ్రహించి తమతమ యాత్మగౌరవమును గాపాడుకొనవలయునను ముఖ్యోద్దేశము గలవారని వాస్తవముగాఁ జెప్పగలను. కాఁబట్టి వీరు దమగౌరవమును గాపాడుకొనుటయే ప్రధానకార్యముగా గణించి సర్వకార్యములయందును బ్రవర్తించుచుండిరి. తమపరువును మర్యాదను నిలుపుకొనుట కెంతధనమైనను

వెచ్చించుటకు గాని యెంతకష్టమునకైన లోనగుటకుగాని యించుకయైన సందేహింపకఁ గాలముఁ గడపుచుండిరి. వీరు దేశాభిమానులును, గార్యాచరణపేక్షాపరతంత్రులును, బరోపకారపారీణులును, నాడంబరశూన్యులును గావున స్వదేశాభివృద్ధికొఱకై యేమేమికార్యము లెట్లెట్లు చేసిన దమయుద్దేశములు నెఱవేఱునో యని యోచించుచుఁ జర్చించుచుండిరి. మనదేశమున సమాజములన్నియు సముద్దేశముతో దేశాభివృద్ధికొఱకును సంఘాభివృద్ధికొఱకును స్థాపింపఁబడియున్నను నభివృద్ధిలోనుండి చక్కఁగఁ జనామోదకరముగఁ బనిచేయకుండుటకుఁ గల మూలకారణము నన్వేషించి జగద్విదితము చేయవలయునను నొక గొప్పయుద్దేశమును దృఢనిశ్చయమును వీరికిఁ గలిగినది. ఈయభిప్రాయము మిక్కిలి శ్లాఘాపాత్రమైనదనియు శ్రేయోదాయకమైనదనియుఁ జెప్పుట కెంతమాత్రము సందియములేదు.

రెండవ ప్రకరణము.

కార్యశూరులు జనులుచేయు నిరుత్సాహములచేతనుఁ బ్రతికక్షులు తలఁపెట్టు నాటంకములవలనను జనసామాన్యులాడు నపవాదులవలనను దుర్మార్గులుచేయు వేళాకోళములవలనను స్వార్థపరాయణులు మాత్సర్యబుద్ధిచేతనుఁ గుత్సితమైన మనస్సుతోడనుఁ గల్పించి చెప్పు నీచకారణములవలనను నించుకైన నిరుత్సాహముఁ జెందక తాముతలపెట్టిన మహోద్యమమును మఱింత పట్టుదలతోఁ జేయుచుందురు. మహానుభావులగు వివేకులు జనుల శ్లాఘనల కుబ్బక పరుల నిందలకుఁ గినియక తాము బోవు న్యాయపథమును విడువక జనులేమన్నను నేమి చేసినను నించుకయైనఁ బాటింపక తాము తలపెట్టిన సత్కార్యములను నిర్వహింపు

చుందురు. "శ్రేయాంసి బహువిఘ్నాని" యను లోకోక్తినిబట్టి మంచికార్యముల కెప్పుడును విఘ్నములు తటస్థించుచుండును. కాని దృఢమైన కార్యాచరణ దీక్షయు మనోనిశ్చయమును నెట్టికార్యమునైన సానుకూలముగఁ జేసికొన సాఁగించి సఫలముగఁ జేయఁగలుగును గదా! దేహబలముకన్న బుద్ధిబలమును మనోబలమును శతాంశము లెక్కువ. మనోబలమువలనఁ నితరులమనములను స్వాధీనపఱచుకొనఁగలము. దీనినే ప్రకృతిశాస్త్రజ్ఞులు 'విల్‌ఫోర్సు' (Willforce) అందురు. దీనిమాహాత్మ్యము నిది చేయఁగలుగు కార్యములను మనము వార్తాపత్రికల మూలముగను గ్రంథములవలనను దెలిసికొనియే యున్నాము. మఱియు నీమనోబలమువలన నిర్వర్తింపఁబడిన యసాధ్యకార్యములను గూర్చి చిత్రకథల నేకములు మనము వినియున్నాము. మనవారు కొంతకాలముక్రిందట విశ్వాసము నమ్మకము లేనివారై మనశాస్త్రములందునుగూర్చి వ్రాసిన యంశములను నమ్మక తమ కన్నులతోఁ జూడనివన్నియు నభావములని నిశ్చయించి తమకుఁగల స్వల్పానుభవమే వాస్తవమయినదియు న్యాయమయినదియు నను నహంభావముతోడను గర్వముతోడను జనుల భక్తివిశ్వాసములను బాడుచేయఁ దలఁచిరి. అంత దివ్యజ్ఞానసమాజమువారవతరించి కొన్ని యసాధ్యకార్యములను చేసి జనుల విశ్వాసము నిలుపుకుండఁ బనిచేయ నారంభించిరి. హిందూజనసంఘమునందలి దురాచారములను బాఱఁద్రోలి సదాచారములను నెలకొలిపి క్రైస్తవకాన్వెంటులలోఁ బురుషులతో సమానముగు హక్కుగల స్త్రీల దుస్థితిఁ బాపి స్వదేశమునకు క్షేమమును నభివృద్ధియుఁ గలుగఁజేసి హిందూదేశముయొక్క దుస్థితుల కన్నిఁటికిని హిందూస్త్రీల దుస్థితియు హిందూజనసంఘములోనున్న దురాచారములును మూలకారణములని దృఢనిశ్చయబుద్ధితోఁ బనిచేయు సంఘసంస్కర్తలు సేయు కార్యములను వానిఫలములను మనమెఱుఁగియే యున్నాము. ఈమహామహులు నీతియు జ్ఞానమును సదాచారములనుఁ జిన్నతనమునుండియు నేర్పినఁగాని జనులు కలసిమెలసి చక్కఁగఁ గనిపెట్టి సంఘాభివృద్ధికి విఘ్నప్రాయముగానున్న జాతిమతద్వేషములను జనుల హృదయక్షేత్రములనుండి పాఱఁద్రోలఁగం

కంకణముకట్టుకొని జాతిభేదమించుకయు లేకుండ నందఱు కలసి భోజనము సేయుటయు నందఱుచేత విగ్రహారాధనము త్యజించి యేకేశ్వరారాధనము సేయుటయు స్కూలులోఁ జదువు చిన్నపిల్లలను సామదానభేదదండోపాయములచే నలవాటుసేసియు దేశానర్థహేతుభూతమయిన హిందూవితంతువుల దుస్థితి కార్యానుష్ఠానమున సంస్కరించియు నింకను ననేకకార్యములు తలపెట్టియు వానినిగురించి యుద్ఘోషించి జనులకుపదేశించియుఁ బాటుపడి పనిసేయుచున్నారు. కొందఱు హిందూసన్న్యాసులు బయలుదేఱి యందుఁ గొందఱు తమతోఁగలసి సహధర్మచారిణులుగఁ బనిసేయు సన్న్యాసినులనుఁ దమయుద్యమములకుఁ దోడుసేసికొని హిందూమతోత్కృష్టతను బోధించుచు మనదేశములోఁ గాకపోయినను నమెరికా మొదలగు నితరదేశములందైన హిందూమతవిశ్వాసమును గలుగఁజేయుచుఁ దన్మూలమున స్వదేశీయులగు మనకు వారి హితోపదేశములయందు గౌరవవిశ్వాసములు పుట్టించుచుఁ బనిసేయుచున్నారు. క్రీస్తుమతబోధకులు సంఘసంస్కర్తల ప్రయత్నములను శ్లాఘించుచు హిందూదేశమంతయుఁ దమమత మవలంబించునట్లు చేయవలయునని కంకణముకట్టుకొని వివాహములు కానివారికి వివాహములు చేయించియుఁ జేయించెదమని వాగ్దానముసేసియు గొప్పయుద్యోగముల నిప్పించెదమని చెప్పియు దరిద్రుల కన్నవస్త్రముల నిచ్చియు మొదలగు నుపాయములవలన హిందూదేశమును బాగుచేయుద మన విశ్వాసానర్హమయినట్టిదియు సర్వానర్థహేతుభూతమయినట్టిదియు నగు హిందూమతాభిమానమూఢతను నశింపఁజేయనిశ్చయించుకొని యున్నారు. ఈవిధమున దేశాభిమానులనేకు లనేకవిధములుగ ననేకమార్గములయందుఁ బట్టుదలతోఁ బనిసేయుచున్నారు. కాని వీరిలోవీరికిఁ బరస్పరవిరోధమును నసహిష్ణుతయు, నసూయయు, విద్వేషమును తమకార్యాచరణ [illegible]పరతంత్రతామూలమునఁ దాము తలపెట్టిన నుద్యమమొక్కటియు సర్వజనశ్రేయోదాయకమను నహంభావమును గల తమయంతరంగములను దిరస్కారభావమునఁ గొందఱును మాటలాడ మానివేసి కొందఱును

దమ యాగ్రహమూలమునఁ గొందఱును గార్యవిఫలత్వములు గల్పించి యిఁ
కకొందఱును నపకారమొనరించి కొందఱును దుర్భాషలాడి మఱికొందఱును
యపవాదలు ప్రకటించి మఱికొందఱును రాజద్రోహ ముపదేశించుచున్నార
ని చాడీలుచెప్పుచుఁ గొందఱునుఁ బ్రపంచమున జనులమోసపుచ్చి వంచించు
చున్నారని కొందఱును దాముతక్కఁ దక్కినవారు నశించిపోవలయు నని
కొందఱును సభలయందును నితరస్థలములయందునుఁ దమ స్నేహితులయొద్దను
నాకాశరామన్న యుత్తరములవలనను బ్రకటించి తమతమకార్యైకదీక్షాప
రతంత్రతను తమకుఁగల దృఢనిశ్చలబుద్ధిని బ్రకటించుచున్నారు. తాము చే
యఁదలపెట్టిన కార్యమునందలి విశ్వాసమునుబట్టియుఁ దమకార్యదీక్షనుబట్టి
యుఁ దాము విఫలమనోరథులగుటకుఁ గారణముఁ దాము దెలిసికొనఁజాలక
యన్యులు చెప్పిన మొదల వారిమాటలయందు విశ్వాసములేనివారై యితరులనుఁ
దూలనాడుచుఁ దాము సత్కార్యాచరణులని యేకగ్రీవముగా నందఱునుఁ
దమ్ము శిరసావహించి కొనియాడి యెదురాడకఁ దాముచెప్పినరీతిని నడుచుకొ
ని తమకార్యములను కొనసాగింపఁజేయఁగలుగు సహాయమును చేయకపోవుట
కాగ్రహాయత్తచిత్తులై తుదకుఁ దమ్ముఁ దామేమఱచిపోయి యుచితానుచి
తములను పాటించకఁ బ్రవర్తించుచున్నారు. ఇట్లు మనదేశములో స్థాపిం
పఁబడిన సమాజములన్నియు నన్యోన్యవిరోధభావము గలవిగా నున్నను నొకస
మాజమువారు మఱియొకసమాజమువారిని నిందించుచు గేలిసేయుచు దూషిం
చుచు నశ్రేయస్కరముగఁ బనిచేయుచున్నను నివియన్నియు దేశాభివృద్ధికొ
ఱకును సంఘాభివృద్ధికొఱకును నుద్దేశింపఁబడి స్థాపింపఁబడియుండుట కొంత
మాత్రమును సందియములేదు. ఒకప్పుడుచితమగు పని మఱియొకప్పుడనుచిత
ముగను నొకరికి శ్రేయోదాయకముగాఁదోచు కార్య మింకొకరికశ్రేయోదా
యకముగాను నొకరికి సులభసాధ్యమగున దింకొకరి కసాధ్యమనియుఁ దోచు
చుండును. కావున నందఱికని నన్నికాలములయందునుఁ బ్రీతికరముగాను వా
మోదకరముగాను సులభసాధ్యముగాను కాలానుసరణముగాను నుండునటుల

దేశక్షేమముకొఱకు పనిచేయుటకు నుద్దేశింపఁబడిన సమాజ మొకదానిని స్థాపించుట ముఖ్యకార్యమని మొదలియారుగారును వారి స్నేహితులును నిశ్చయించిరి. మొదలియారుగారు దూరాలోచనపరులుగావునఁ బ్రకృతమునందున్న సమాజములన్నియు చేయఁగలిగిన లాభమునకన్న నన్యోన్యకలహములకుఁ గారణభూతములై నష్టమునే కలుగఁజేయుచున్నవని దృఢనిశ్చయమైన యభిప్రాయము కలిగియుండెను. తనయభిప్రాయమును మొదలియారు తనస్నేహితులతోడనుఁ బరిచితులతోడనుఁ జెప్పెను కాని యందుఁ గొందఱట్టి సమాజమును స్థాపించుట సాధ్యముకాదనియు మఱికొందఱు కష్టసాధ్యమైన పనియనియు నింకఁ గొందఱట్టి సమాజమును స్థాపింపఁగలిగి పనిచేయఁగలిగినచో బాగుగ నుండకపోదనియుఁ బలువిధములఁ బలువురు తమయభిప్రాయమును జెప్పిరి. కాని శెట్టిగారునుఁ బిళ్ళగారును నాయుఁడుగారును మొదలియారుగారితో నేకీభవించి యట్టిసమాజమును స్థాపింపవలయుననియె నిశ్చయించిరి.

తరువాత కొన్నిమాసములకు మొదలియారుగారు కారణాంతరమునఁ జెన్నపట్టణమువిడిచి భేతాళపురమును ప్రవేశించిరి. వీరు భేతాళపురమును ప్రవేశించిన కొన్నిమాసములకుఁ దమ స్నేహితు లెడఁబాసి యుండఁజాలక పోవుటచేతనో మఱియేకారణముచేతనో మనకు వీరువ్రాసిన దినచర్యలవలన బోధపడలేదు కాని వారుమువ్వురు నాపురమునే చేరిరి. మొదలియారుగారును వారిస్నేహితులునుఁ బ్రసిద్ధపురుషులని వేరే చెప్పనవసరములేదు. వీరు భేతాళపురమును బ్రవేశించి యందు విశేషగౌరవముతో సంచరించుచు నాపురవాస్తవ్యుల గౌరవవిశ్వాసములకుఁ బాత్రులై కాలము గడపుచుండిరి. పరోపకారబుద్ధికల యీమహానుభావులు దేశక్షేమముకొఱకుఁ బనిచేయవలయునను పట్టుదలకలిగి యుండుటచే నాపురవాస్తవ్యులతోఁ దమ సదుద్దేశమును చెప్పి యొకసమాజమేర్పఱుప నిశ్చయించిరి. అట్టిసమాజము స్థాపించుట కొక విద్వజ్జన మహాజనసభ గావింప నవసరముగాఁ గనిపించుటచే నట్టిసభ చేయుటకుఁ బ్రయత్నించిరి. ఈసభ మిక్కిలి గొప్పదిగానుండవలెనని యెంచి స

భఁగావించుట కనువైన ప్రదేశమునుగూర్చి యాలోచించిరి. ఇట్టి మహాజనస భఁగావించుట కనువైన ప్రదేశము లింగనుఁబూర్ణమే స్థాపింపఁబడి పనిసే యుచున్న సమాజమువారి యిష్టమువైనకాని చేకూరునట్లు కనిపించలేదు. ఇ దివఱకు కొన్ని సమాజములుండి పనిసేయుచుండఁగా నిప్పుడు వేఱొక క్రొత్తస మాజమేర్పఱచుట కేమి యావశ్యకము కలిగెనని శంకించి యాసమాజములవలనఁ దే మ సమాజమునకుగంటి పోవునని భయపడి నిను ప్రయత్నమును విఫలము కావించునని యెంచి యేకపక్షాపేక్షితు లాంధ్రోద్యులను సహాయము చేయుట న టస్థింపవని తెలిసికొని యాప్రయత్నమును మానివేసిరి. పిమ్మట యాపురిజ నులలో నొక మహానుభావుఁడు దేవాలయములలోని ముఖమంటపము విస్తీర్ణ భలకేర్పడినదికావున నిమహాసభ యొకదేవాలయములోఁ గావించి యాశ్వా సన్నిధానమున నిట్టి సత్కార్యప్రారంభము చేసిన లాభముకూడ పొందవచ్చు ననెను.

అందుకనకెంకొక మహాజనుఁడు శివాలయములో సభ కావించిన వైష్ణవు లు రాఁజాలరనియు విష్ణ్వాలయములో సభజరిపిన శైవులు రారనియు నగుటు ట్లుండ శ్రీగ్రహారాధన మే పనికిరాదను బ్రహ్మసమాజికులు మొదలేరారనియు మహమ్మదీయులు క్రైస్తవులు మొదలగువారు వచ్చుటకు మొదలే వీలుపడదని యు మతద్వేషమిగతులకు తెమయూరఁ బ్రబలముగా నుండుటచే నీప్రయత్న మంతగా నుచితముగాఁ గనిపించదనియుఁ జెప్పెను. అటుపిమ్మట యింకొక మహాపురుషుఁడు నాపురమునఁగల గృహస్థుల యిండ్లలో నొకవిశాలమైన యిం ట సభగావించిన నుచితముగ నుండుననియెను. అందుకనకెంకొకఁడు రెపురా మున నాలుగైదువిధములైన పార్టీలు ప్రబలి యొకపార్టీవారింకొకపార్టీ వారితోఁ గలసి పనిచేయుట యున్నఁడును నేకీభవమందునుఁ దటస్థించకుం డుటచే నేగృహస్థులింట సభగావించినను బహుసాన్యులంవేలు రాగని స్ప ష్టముగఁ జెప్పెను. అంత నందఱును గలసి సర్వజనాపేక్షకరముగా నుండు నట్టుల స్థాపింపఁ బూనుకొన్న సమాజమునకుఁ బ్రథమమునందే యిట్టి

యాటంకములుకల ప్రదేశములయందు మహాజనసభఁ గావించు టనుచితమ ని నిశ్చయించి యాపురమునను న్న సంతదరిని నొక బహిరంగప్రదేశమున నొక 'యారుబైటసభ' గావించుటకు నిశ్చయించి ప్రచురపఱచి వార్తాపత్త్రికలకుఁ దంతి సమాచారములు పంపి యుచితప్రయత్నముల నన్నిఁటినిఁ జేసిరి.

అంతె నొకనాఁడు మధ్యాహ్నము నాలుగుగంటలకు సభప్రారంభింపఁ బడెను. ఆసభకు మొదలియారుగారినే యగ్రాసనాధిపతిగా నందఱు నేకగ్రీవముగ నియమించిరి. మొదలియారుగారికిఁ దా నగ్రాసనాధిపతిగా నుండుట కిష్టములేకపోయినను సభాసదులబలవంతముపై నొప్పుకొని యగ్రపీఠమలంకరించిరి. మొదలియారుగారికి నత్తియున్నదని యిదివఱకే తెలుపఁబడినది. ఆయన చెప్పఁబూనుకొన్న యంశములు చాలకలవు. తాను గొప్పవక్తనని యా యనకు మనోగర్వముకలదు. ఆయన సభలోఁ జెప్పినయంశములన్నియు సవిస్తరముగా నిందు వివరించుట కష్టసాధ్యమయినను అందులోఁ గొన్నిటిని యిందు వివరించెదను.

అగ్రాసనాధిపతి యుపన్యాసము.

మహాజనులారా! మీరు నన్నీసమయమున నీవిద్వజ్జనమహాజనసభ కగ్రాసనాధిపతిగా నేర్పఱచుటవలన మీరు ప్రకటించిన నాయందలి గౌరవవిశ్వాసములకు మిక్కిలి యానందించుచు మీకు నాయందుఁగల యనుగ్రహమునకుఁ గృతజ్ఞుఁడనై యున్నాను. దేశక్షేమమునకుఁ బాటుపడి త్రికరణశుద్ధిగాఁ బనిచేయుట మనకందఱకు విధాయకకృత్యము. (అందఱు చప్పట్లుగొట్టుదురు) మనుష్యసేవఁ జేయనివాఁడును దేశోపకారమొనరించి సంఘాభివృద్ధికిఁ దోడ్పడనివాఁడును మనుష్యుఁడని పిలువఁబడుట కర్హుఁడుగాఁడని నాతాత్పర్యము. ("నీతాత్పర్యమైతే నది కావచ్చునుగాని యది వాస్తవముకాదు" అని యొకకేక వినిపించును.) "లోకోభిన్నరుచిః" అను న్యాయమునుబట్టి యొక్కొక్కరి కొక్కొక్కవిషయము ముఖ్యముగాఁ గనిపించుటచేత మనదే

శమున ననేకసమాజములంకురించినవి. అవియన్నియు దేశక్షేమముకొఱకును సంఘాభివృద్ధికొఱకును నుద్దేశింపఁబడి స్థాపింపఁబడినవనుట కొంతమాత్రమును సందియములేదు. కాని యవి పరస్పరభేదములు గలవిగను విరుద్ధములుగను బనిచేయుచుండుట మిక్కిలి చింతాకరముగానున్నది. (ఆమాట వాస్తవముకాదు.) ఆసంగతటుండ మన ముఖ్యోద్దేశమైన దేశాభివృద్ధివిషయము మనము మఱచిపోక సర్వజనసమ్మతమైన యొకసమాజమును మనమిప్పుడు స్థాపింపవలయును. ("ఇదివఱకున్నవి చాలును యిప్పుడక్కఱలేదు" అని కొందఱును "వినండి వినండి" అనికొందఱును, "కొమోన్" అనికొందఱును కేకలువేతురు.) ఇందువిషయమై నేను చాలకాలమునుంచి దూరమాలోచించి మనమిప్పుడేర్పఱపఁబోవు సమాజముయొక్క యుద్దేశములను గొంతవఱకు నిశ్చయించినాను. ఆయంశముల నిప్పుడు మీతోఁ గస్తూరిశెట్టిగారు సవిస్తరముగా శెలవిచ్చెదరు.

కస్తూరి—అగ్రాసనాధిపా! సభాసదులారా!! నేను చెప్పఁబోవు విషయమును మీరు సావధానచిత్తులై వినఁగోరుచున్నాను. మనదేశమభివృద్ధిలోనికిఁ దెచ్చి సంఘదురాచారములనెల్ల రూపుమాపి సదాచారములనెలకొలిపి హిందూదేశము పురాతనౌన్నత్యదశకుఁ దీసికొనివచ్చుట మనకందఱకుఁ గర్తవ్యాంశము. ఇందువిషయమై అనేకులు అనేకవిధములఁ బనిచేయుచుఁ దమ దేశాభిమానమును బ్రకటించుచునేయున్నారు. చంద్రునికొక నూలుపోగన్నట్లు నామట్టుకు నేనుడతాభక్తితో నైదారుసంవత్సరములక్రిందట నొకవారపత్రికను దేశభాషయగు తెలుగునఁ బ్రచురించి స్వదేశాభిమానముతో దేశాభివృద్ధికొఱకుఁ బనిచేయ నిశ్చయించుకొంటిని. (అందఱు చప్పట్లుకొట్టుచున్నారు) నావారపత్రికఁ బ్రకటింప మొదలుపెట్టినతరువాతఁ గొన్నిమాసములకది క్రమక్రమముగాఁ జదువరుల యనాదరణచే క్షీణింప వారపత్రికను బక్షపత్రికగాను మాసపత్రికగాను మార్చి తుదకాపత్రికామూలమునఁ గార్యసాధనమేమియులేదని నిశ్చయించుకొని యాప్రయత్నమును మానుకొనవలసినవాడనైనాడను. దేశక్షేమముకొఱకును దేశాభివృ

కొఱకును స్థాపింపఁబడవలసిన సమాజములన్నియు సదుద్దేశములతో స్థాపింపఁబడినను నవియంత తృప్తికరముగాఁ బనిచేయుచుండుటలేదని చెప్పుటను నాకు మిక్కిలి విచారకరముగానున్నది. ("అన్నిసమాజములనుగురించి యథార్థముగా చెప్పఁగూడదు; ఆమాట నిజముకాదు; ఇతరులను ద్వేషించి మాటలాడుట సభలలోఁ దగదు; పఠించఁగూడదు" అను మొదలైనకేకలతోఁ జప్పట్లుగొట్టుదురు.) అన్నలారా! నేనన్నమాటకు మీరాగోపగించవద్దు. ఆసమాజములు తృప్తికరముగా బనిచేయకున్నవని చెప్పుటవలన నాయాసమాజములవారియందు నాకెంతమాత్రము నగౌరవములేదని నేను దైవసాక్షిగా [illegible] యీసభలోఁ బ్రమాణముచేయఁగలను. అయినను నాసమాజములు కారణాంతరములచేఁ బరస్పరవిరోధములుగాఁ బనిచేయుచు నవియన్నియుఁ బ్రజలయందలి నొక్కటిగా సమకూర్చుటను మాఱుగా వేఱుపఱచి యన్యోన్యకలహములకుఁ గారణభూతములైనవని నాయభిప్రాయము. ("సదుద్దేశముతో నితరులుచేయు సత్కార్యములకు విఘ్నములు గల్పించి తమశత్రువులను దూషించుట కేర్పఱుపఁబడిన సమాజములు బయలువెడలినతరువాత నిఁక నేమగును" అనియొకఁడు గట్టిగా కేకలువెట్టెను. అప్పుడు మఱియొకఁడు "అట్టిదురుద్దేశముతో స్థాపింపఁబడి పనిచేయుచున్న సమాజమేదో చెప్పవలెను" అంతఁ గొందఱులేచి యొక్కసారిగా మాటలాడుదురు. కొందఱు చప్పట్లుగొట్టి లేవిడీఅని కేకలువేతురు.) సభాసదులారా! నేను చెప్పఁబోవు నంశమునుగూర్చి సావధానచిత్తులై వినవలెను. ఈసంగతులన్నిటితో నిప్పుడు మనకుఁ బ్రసక్తి లేదు. దేశక్షేమముకొఱకును దేశాభివృద్ధికొఱకును బట్టుదలతోఁ బనిచేయుట కిప్పుడొకసమాజమును స్థాపింప మనమిప్పుడీసభ జరిపినాముగావున మనము వాగ్వాదముతో నిఁకఁ గాలహరణముఁ గావింపకఁ గార్యాచరణమునకుఁ బూనుకొనుటమంచిది. ("ఇదివఱకెన్ని సమాజములుండఁగా నిప్పుడింకొక సమాజముగూడ నెందుకు" "సమాజములతోఁ బ్రాణములు

విసుగుచున్నవి ; కంసాలిపొయ్యిలవలె నీసమాజములను విధివిరామములేకుండవుగాబోలు" అను మొదలైన కేకలతో నందఱు చప్పట్లుగొట్ట కొందఱు "వినండి, వినండి" అల్లరి చెయ్యవద్దు అందురు) ఇప్పుడు స్థాపింప నుద్దేశింపఁబడిన సమాజముయొక్క ముఖ్యోద్దేశములను మనవిచేయుచున్నాను. సావధానచిత్తులై నాతప్పులు క్షమించి నేను చెప్పుమాటలలోని పొరబాట్లను పాటింపక నాసదుద్దేశమును గ్రహించి నన్ను మన్నించి నాయందు దయతో వినుటకు మిమ్ములనందఱను జేతులుమోడ్చి నమస్కరించుచుఁ బ్రార్థించుచున్నాను.

ఇప్పుడు స్థాపింపఁబోవు సమాజముయొక్క ముఖ్యోద్దేశములు దేశక్షేమము సంపూర్ణాభివృద్ధియు నని నేను వేరే చెప్పనవసరములేదు. వానినే విశదీకరించి మీకిప్పుడు మనవిచేయుచున్నాను.

i ప్రజాదారిద్ర్యహేతువుచేతనుఁ బ్రజలకుఁ గలుగు నన్యాయకారణముచేతను బలవంతులవలన బలహీనులకును శిష్టులవలనదుష్టులకును సంభవించెడు కష్టములవలనను నింకనితరకారణములవలననుఁ బ్రజలకుఁ దటాస్థించు గేశాదృష్టములన్నిటిని మాన్పించుట ;

ii దేశములోనున్న దురాచారములన్నిటిని నిర్మూలముచేసి సదాచారముల నెలకొలిపి ప్రజలకందఱకు నైకమత్యము కలుగఁజేసి అందుమూలముగఁ బ్రపంచకమంతయు నొకకుటిగఁ జేయుట;

iii అన్యాయము, అధర్మము, అవినీతి, దురాగ్రహము, ధనలోపము, పరశ్రేయోసహనము, మాత్సర్యము, దురాశ మొదలగు దుర్గుణములు లేకుండ ప్రజలు సన్మార్గానువర్తులై సంచరించుచు స్త్రీపురుషులన్యోన్యగౌరవవిశ్వాసములతోడను భయభక్తులతో సంచరించుచు నేకపత్నీ, ఏకభర్తృన్యాయముతో సంచరించునట్లు చేయుట ;

iv ఏకార్యమును, నేయాచారమును, దేనిని నకారణముగ నిందిం-
చి దూషించక వాటిమూలకారణములను శ్రద్ధతోఁ గనిపెట్టి
కర్తవ్యమును చేయుట ;

v ఎవరిపనివారు చేసుకొనునట్లు చేయుట ;

vi ప్రజ లందఱకును సమ్మతముగా నుండునట్లు ప్రవర్తింపఁ
జేయుట ;

vii ప్రజలమౌఢ్యమును రూపుమాపుట ;

viii హిందూమతాచారధర్మములనుఁ గాపాడుట ;

ix జనులందఱు నొకటే భాషను నొకటే లిపిని నభ్యసించునట్లు
చేయుట ;

x స్త్రీ పురుషుల నందఱిని విద్యాధికులుగను వివేకులుగనుఁ
జేయుట ;

xi ఈశ్వరభక్తి, దేశాభిమానము, సత్యసంధత ప్రజలకుఁ గలు
గఁజేయుట ;

xii స్త్రీ పురుషులు యీశ్వరచోదితములై భగవదుద్దిష్టములై శా-
స్త్రానుసారముగఁ దమతమకార్యములను బట్టుదలతోఁ జేసుకొ-
నునట్లు చేయుట ;

xiii ఇంకను దేశమునకు క్షేమకరములును లాభకరములును శ్రే-
యోదాయకములును నభివృద్ధిహేతువులును నగుపరోపకారకా-
ర్యముల నన్నిఁటినిఁ జేయుట ;

xiv ప్రజలకు నాగరికతఁ గలుగఁజేసి యన్నివిద్యలను నభివృద్ధిప-
ఱచుట ;

xv ప్రపంచమండలి యధర్మములను బోఁగొట్టి ధర్మసంస్థాపనము
సేయుట.

ఈయుద్దేశములు దేశాభివృద్ధికరములును లోకోపకారకారణములును

పరోపకార హేతుభూతములును ననిచెప్పుట కెంతమాత్రము సందియము లేదు. కాఁబట్టి యిట్టిసర్వోత్కృష్టమైన సమాజమును స్థాపించి మనమందఱముఁ బట్టుదలతోఁ బనిచేయవలయునని మీకు విన్నవించుచు మిమ్ము ప్రార్థించుచున్నాను. (అందఱు చప్పట్లు గొట్టుచున్నారు.)

నాయుడు—ఇప్పుడు స్థాపింపఁబోవు సమాజముయొక్క యుద్దేశములు మీరెఱిఁగియే యున్నారు. ఇట్టి సమాజము ముఖ్యావశ్యక మని నేను వేఱే చెప్ప నవసరము లేదు. ఈసమాజమునకు "లోకోపకారసమాజ" మని పేరు బెట్టవలెనని నాయభిప్రాయము.

ఒకసభ్యుఁడు—ఈసమాజమునకు లోకోపకారసమాజమని పేరుపెట్టుట కంటె జనానుకూలసంఘ మని పేరుపెట్టు టుచితము.

మఱియొకసభ్యుఁడు—సంఘమనగా గుంపని యర్థమిచ్చును గాన నా పేరు పనికిరాదు.

ఇంకొకసభ్యుఁడు—ఈసమాజమునకుఁ బరోపకారకార్యనిర్వాహక సమాజ మనిపేరు పెట్టవలెనని నాతాత్పర్యము.

నాల్గవసభ్యుఁడు—ఇంత పెద్దపేరు పెట్టుటకంటె జనోపకారిణీసమాజ మనిపేరు పెట్టుట మంచిది.

అయిదవసభ్యుఁడు—ఈసమాజోద్దేశ ముపకారమాచరించుట కాదు కావున దీనిని లోకానుకూల సాధన సంప్రదాన సమాజ మనుట నాముఖ్యతాత్పర్యము.

ఆరవసభ్యుఁడు—దురాచారసంస్కరణసమాజ మని యీసమాజమును బిలుచుట సర్వజనసమ్మతముగా నుండునని నాయభిప్రాయము.

ఏడవసభ్యుఁడు—సంస్కరణపదమువలన నీసమాజము సంఘసంస్కరణసమాజమువంటిదని కొందఱనుమానింతురు గావున నాపేరు బొత్తిగాఁ బనికిరాదు.

ఎనిమిదవసభ్యుఁడు—ఈసమాజమునకు న్యాయాభివర్ధనీ దివ్యజ్ఞాన సమాజమని పేరుపెట్టినయెడల నేవిధమయినబాధ గలుగక సర్వజనసమ్మతముగా నుండును.

తొమ్మిదవవాఁడు—"దివ్యజ్ఞాన" అను పదమువలన మనసమాజము దివ్యజ్ఞానసమాజముతో సంబంధము గలదని కొందఱనుకొనుటకవకాశ మున్నది. అట్టి యవకాశము కలుగఁజేయుట మన సమాజాభివృద్ధికి భంగముగా నుండునుగాన దీనిని "సదాచారస్థాపన కార్యనిర్వాహక సాధన సమీకరణ సంప్రదాన సమాజ" మనుట మంచిది.

పదియవవాఁడు—ఈపేరువలన దురాచారనిర్మూలనము సమాజోద్దేశమైనట్లు గనుపించదు. కావున నీపేరుకంటె "దురాచారదూషణ సదాచారభూషణ పరమభాగవతోత్తమ దివ్యమంగళ సమాజ" మను పేరుత్కృష్టతరముగా నుండును.

పదకొండవవాఁడు—ఈపేరువలన వైష్ణవసంప్రదాయము గనుపించుచున్నది. సమాజముయొక్క యుద్దేశములన్నియు దానిపేరువలననే జనులకుఁ దెలియఁజేయుటవలన మిక్కిలి లాభమున్నది. అంతయుఁ బేరుతోనే యున్నది. కాఁబట్టి "లోకానుభవ జ్ఞానప్రకటనాదిసాధన ముఖ్యోద్దేశమూలక సర్వజనశ్రేయోభివర్ధనీన్యాయసంస్థాపనసమాజ'మని యీసమాజమునకుఁ బేరుపెట్టుట నాదృఢమైన ముఖ్యమైన వాస్తవమైన నిశ్చయమైన యభిప్రాయము.

పండ్రెండవవాఁడు—ఈపేరుఁ దప్పులేకుండఁ జెప్పఁగలవారు సామాజికులలోఁ జాలమంది యుండరని నానమ్మకము. కాఁబట్టి "దేశాభిమానపూర్వక ధర్మసంస్థాపనసమాజ" మని దీనికిఁ బేరుపెట్టి పిలుచుటుచితముగా నుండును.

పదమూడవవాడు—నేషనల్ ధర్మస్థాపన సమాజ మన్నఁజాలును. అందులో నింతయర్థము నున్నది.

పిళ్లె—ఆపేరు మొదలే పనికిరాదు. నేషనల్ అను పదప్రయోగమువలన మనసమాజమున కటుండ నిప్పుడీసభగూడిన మనకందఱకును గూడ ముప్పు వచ్చును. మనమందఱము రాజద్రోహుల మని శంకింపఁబడి శిక్షింపఁబడుదుము. తరువాత మనము చేయఁగలదేమియు లేదు, మన మాపేరే తలపెట్టఁగూడదు. మన మిప్పుడీసమాజమును స్థాపించుటవలన నిదివఱకు దేశములోనున్న సమాజములన్నియు నడుగంటిపోవుట నిశ్చయము. ఇందుకు భయంపడి కొన్నిసమాజములవా రిప్పుడే మనప్రయత్నములకు విఘ్నముఁ గావింప నిశ్చయించుకొని యీసమాజమే స్థాపింపఁబడకుండఁ జేయవలయునని యనేకవిధముల ననేకు లనేకపర్యాయములు మొదలియారుగారిని నాయనస్నేహితులను నిరుత్సాహులఁ జేసిరి. కొందఱిట్టిసమాజమును స్థాపింపఁబూనుకొనవద్దని యనేకవిధములఁ బ్రతిమాలుకొనిరి. ఇట్లు ప్రతికక్షులు సామదానభేదదండోపాయముల మూలమునఁ జేసిన ప్రయత్నము లిన్నిన్నియని నేనిప్పుడు చెప్పుటవలనఁ గాలహరణ మగును గావున నింతటితో విరమించి యీసమాజమునకు నేషనల్ అను పదసంపర్క మెంతమాత్రమును లేకుండ జేసి ప్రతికక్షులను నిరాయుధులనుగాఁ జేయుఁడని మిమ్ముఁ బ్రతిమాలుకొనుచు బ్రార్థించుచున్నాను.

తరువాత నీసమాజమున కేపేరుఁ బెట్టిన నుచితముగా నుండునని చాల దూరము చర్చ జరిగినది. ఆచర్చలో సభ్యులు దమకుఁగల వక్తృత్వమును, వాదప్రతివాదమువలనఁ బుట్టు నీర్ష్యాజనితములైన కేకలును నహంభావమువలనఁ గలిగిన దూషణవాక్యములును యథేచ్ఛముగా నుపయోగపఱచిరి. సామాజికులలో మఱికొందఱు దమతమ వి

ద్యాబలమును శరీరబలమును గన్పఱచ నారంభించిరి. అప్పుడు మొదలియారుగారు లేచి యీనూతనసమాజమును విశేషపదావిశిష్టముగా "ధర్మసంస్థాపనసమాజ" మని జెప్పుట సర్వజనసమ్మతముగాను శ్రేయోదాయకముగాను నుండునని చెప్పి సభవారి నూరడించి శాంతచిత్తులనుగాఁ జేసిరి. తరువాత నగ్రాసనాధిపతిగా రగుమొదలియారుగారీవిధముగా సభ్యుల కుపన్యసించిరి.

అగ్రాసనాధిపతి యుపన్యాసము.

"దేశాభిమాన మానసీయు లగు మహాజనులారా! సభికులారా!! నేను చెప్పఁబోవు విషయమును సావధానచిత్తులై వినఁగోరుచున్నాను. ఈవిషయమును గురించి మాటలాడుటకు నేనంతఁగాఁ దగినవాఁడను కాకపోయినను విద్యయందును బుద్ధిబలమునందును అనుభవమునందును వక్తృత్వమునందును వాక్నైపుణియందును నాకంటె ననేకవిధముల శతాంశ మెక్కు వగుమహనీయు లెందఱో యున్నను మీయందఱి యెదుట సాహసముగా నిలచి చెప్పఁబూనుకొనుటకు నాకే సిగ్గుగానున్నది. అయినను మీయనుగ్రహమూలమునను మీకు నాయందుఁగల గౌరవముచేతను మీసహిష్ణుత్వముచేతను నే నీకార్యమునకు సందేహింపక ధైర్యముతోఁ బూనుకొన్న నన్ను మన్నించి నాతప్పులను బాటింపక నేను చెప్పఁబోవు నీతులయందలి యంతరార్థమును నాసదుద్దేశమును నాకార్యశూరత్వమును నిప్పుడు స్థాపింపఁబడిన సమాజముయొక్క యుపయోగమును నుత్కృష్టతను మీచిత్తములయందుంచుకొని సావధానచిత్తులై వినఁగోరుచు నేఁజెప్పెడు మాటలలోని పొరపాట్లను బాటించక నన్ను మన్నించి వినఁ బ్రార్థించుచున్నాను. ఈ దినము గొప్పసుదినమని నాయభిప్రాయము. ఈపుణ్యదినమును దేశమంతయు జ్ఞాపకముంచుకొని యేఁటేఁట సంవత్సరోత్సవములతో మ

హావైభవముతో గౌరవింపవలయు నని నాముఖ్యతాత్పర్యము. మఱియు నీదినము దేశక్షేమమునకును సంఘాభివృద్ధికిని నారంభదినమని మనము దృఢవిశ్వాసము కలిగియుండవలసినదని నేను నొక్కి వక్కాణింపఁగలను. (అందఱు చప్పట్లుకొట్టుచున్నారు) నేఁడిట్టి యుత్తమోత్తమమయిన సమాజము స్థాపింపఁబడి నిర్వివాదంబును సర్వజనసమ్మతంబును నుచితమునగు నామకరణ మొసఁగఁబడుటచే మనమందఱము కృతకృత్యుల మైతిమని సంతోషింపక తప్పదు. (చప్పట్లుకొట్టుచున్నారు) మన మీసమాజమును స్థాపించిన విషయమును గురించి వార్తాపత్రిక లన్నిఁటిలోను బ్రచురించి వానికిప్పుడే తంత్రీసమాచారమును బంపుట మిక్కిలి యావశ్యకము. ఈసమాజము దేశమందున్న సమాజములన్నిఁటికి ననుకూలమయినదికాని, ప్రతికూలమైనది యెన్నఁడును కాదని నమ్మవలెను. దేశక్షేమము కొఱకును సంఘాభివృద్ధికొఱకును నెట్టివ్యయప్రయాసలకైన లోనై యెట్టికష్టములనైనఁ బాటింపక పరోపకారదీక్షాపరతంత్రతతోఁ బనిచేయ నేనును నాస్నేహితులగు శెట్టిగారును నాయెడమప్రక్కనుఁ గూర్చుండిన నాయుడుగారునుఁ బిళ్ళగారును దృఢనిశ్చయమైన మనస్సుకలిగి కంకణము కట్టుకొన్నార మని మీకు విన్నవించుటకు సాహసించుచున్నాను. (అందఱు గట్టిగ చప్పట్లు కొట్టుదురు) ఈమహాకార్యమును నెరవేర్పఁగలుగుటకు దైవమును మిమ్ములను నమ్మియున్నాము. కార్యశూరత్వమొక్కటి దక్క నాయందు దేవిశేషమును లేదని నేను నిశ్చయముగ నెఱుఁగుదును. అయినను నాకుఁ గల పరోపకారపరతంత్రత ననీకార్యమునకుఁ బురికొల్పినది. మనదేశములో స్థాపింపఁబడిన సమాజములందొక్కటియుఁ దృప్తికరముగఁ బనిచేయుచుండుట లేదు. ఇట్లు చెప్పుటకు నాకే మిక్కిలి విచారకరముగ నున్నది. అయినను వాస్తవము చెప్పక తీరదు. ఇందుకు మూలకారణము విచా

రింపవలసి యున్నది. జనులకు సమాజములన్న నిప్పుడు గౌరవమే పోయినది. సమాజములు స్థాపించి హానినిఁ జక్కఁగాఁ బని చేయింపఁ జాలకపోయినయెడల నట్టి సమాజములవలనఁ బ్రయోజన మేమున్నది. దురాచారమును మాన్పించుట కొకసమాజము నేర్పఱచి యాసమాజ మభివృద్ధిగా నుండవలయునని యుద్దేశించి తత్సామాజికులలో నందఱుఁ గొంచెముగనో గొప్పగనో దురాచారములు సేయుచున్నట్లు శంకించి కేవలము సమాజములఁ జేరుట మాత్రముననే సామాజికులు సదాచారసంపన్నులు కారని తెలిసికొని వారిచేఁ బ్రమాణములు సేయించి వ్రాతమూలములయిన కరారునామాలు వ్రాయించుకొని సమాజోద్దేశము నెరవేర్చుకొనఁ జూచుటకంటెఁ వెఱ్ఱితనము లేదని నాయభిప్రాయము. ('ఇతరులనుద్దేశించి మాటలాడుచున్నారు జాగ్రత్త' అని యొకఁడును అప్రస్తుతప్రశంసమానుము, అని మఱియొకఁడును కేకలువేయఁ గొందఱు చప్పట్లుగొట్టి యల్లరిచేయుచున్నారు) మనసమాజోద్దేశములను మీకు సవిస్తరముగ శెట్టిగారు మనవిచేసియెయున్నారు. కావున మీరందఱు నీసమాజమునఁ జేరి 'దేశోపకారమొనరించి జనులవిశ్వాసమునకును గృతజ్ఞతకును గౌరవమునకును శ్లాఘనలకును వందనములకును బాత్రులగుదురని నమ్ముచున్నాను. ప్రస్తుతము ఈసభయందుండువారందఱు నీసమాజమునఁ జేరినట్లే నేనూహించెదను. అయినను నీసమాజమును జేరఁ గోరువారు తమ చిరునామాలను సంతకములను వ్రాసి దరఖాస్తులు శెట్టిగారికిఁ బంపించుకొనఁ గోరుచున్నాను. ఈసమాజములో పంద్రెండేండ్లకుమీరిన స్త్రీ పురుషులందఱునుఁ జేరవచ్చును. సభలకుఁబోయినఁ జందాలకై పీడింతురని మీరు భయపడ నవసరము లేకుండ నీసమాజమునకుఁ బ్రస్తుతము నేనొక్క వేయిరూపాయిలు సమర్పించుకొనుచున్నాను. కావునఁ బ్రస్తుత మీసమాజమునఁ జేరు వారెవ్వరునుఁ జందా లీయ నక్కరలే

దు. నేఁడు మీరందఱు శ్రమపడి యిచ్చటకు దయచేసి యీమహాసభ నలంకరించి యీమహోద్యమమునకుఁ దోడై నేఁజెప్పినదాని సావధానచిత్తముతో వినినందులకు మీకందఱకుఁ గృతజ్ఞుఁడనై యనేకవందనము లాచరించి యింతట విరమించుచున్నాను.

తరువాత నొకసభికుఁడు లేచి దొరతనమువారికిని సభాపదులకును నగ్రాసనాధిపతిగారికిని యీసభ గావించుటకు సహాయము గావించిన మహాజనులకును సంతయిజారాదార్లకును కృతజ్ఞతాపూర్వకవందనములు గావింప సభ ముగింపఁబడెను.

ఈవిషయమును గురించి మొదలియారుగారు వార్తాపత్రికల కన్నిఁటికి తంతి సమాచారములపంపి వానిలోఁ బెద్దపెద్ద వ్యాసములను వ్రాసి ప్రచురింపించిరి. కాని యిందుఁ బ్రవేశించుటకెవ్వరును దరఖాస్తులను పంపుకొనరైరి. అంతటితో మొదలియారుగారు నిరుత్సాహులుగాక యాపురమునందుఁ గల ప్రతిగృహస్థు నింటికిఁ బోయి యీసమాజమునఁ జేరవలసినదని ప్రార్థించి కొందఱిని మాత్రము సామాజికులుగా నేర్పఱచుకొని పనిచేయ నారంభించిరి. కాని యీసమాజముయొక్క సభలకు మొదలియారుగారును వారిస్నేహితులు ముగ్గురును గ్రామములో నొకరిద్దరుమాత్రము వచ్చుచుండిరి. సంవత్సరోత్సవములునుఁ బలహారములతోఁ గూడిన విశేషసభలకును నాయూరివారందఱు నాఁబాలవృద్ధముగ దయచేసి సంవత్సరమున కొకపర్యాయమైనను నా సమాజమునందుఁ గల యభిమానమును బ్రకటించుచుండిరి. ఇట్లు నాలుగైదు సంవత్సరములు గడచెను.

తరువాత మొదలియారుగారును నాయనస్నేహితులును మీటింగులవలనఁ బ్రయోజనము లేదనియు నవి జనులకు వినోదకరములుగను హాస్యాస్పదములుగను నుత్సవములుగను బరిణమించుచున్నవని

గ్రహించిరి. అయినను వీరు చేయఁదలపెట్టిన కార్యమును మాత్రము విడిచిపెట్టలేదు. మూర్ఖులని యెందఱెన్నివిధముల దూషించిననుఁ గార్యదీక్షాపరతంత్రులు తమప్రయత్నములను విడువరు. ఇదిమహామహులలక్షణము. ఒకనాఁడు మొదలియారుగారును నాయనస్నేహితులును గూర్చుండి యాలోచించి జనులు తమసత్కార్యములకుఁ దోడ్పడకుండుటకు నిరుత్సాహులుగాక నీసమాజము నామావశిష్టమగుచుండినందులకు మిక్కిలి విచారించుచుఁ గార్యాచరణమువలన జనుల నాప్పించి వారికి జ్ఞానము గలుగఁజేసి యీసమాజముయొక్క యుత్కృష్టత వారి హృదయములకు నాటునట్లొనరించి యీసమాజము నభివృద్ధిలోనికిఁ దేవలయునని యూహించి పనిచేసి చూపవలయును కాని మాటలతోఁ బ్రసక్తి లేదని నిశ్చయించుకొనిరి.

జనుల సహాయము వడయుటకు వారియభిప్రాయములను గ్రహించుటకు దేశాటనము సేసి వారితో ముచ్చటించుట నత్యావశ్యకము. వారియభిప్రాయమును గ్రహించుటకు వారితోఁ గలసి మెలసి తిరుగుట ప్రధానము. వారితోఁ గలసి మెలసి తిరుగుటకు నతిశాంతముతోఁ బనిచేయుట ముఖ్యము. అని వీరు గ్రహించి జనులయభిప్రాయములను నాచారవ్యవహారములను చక్కఁగాఁ దెలిసికొనినఁ గాని యీ కార్యము నిర్వహించుటకు వలనుపడదని నిశ్చయించి తాముగ్రహించినదంతయుఁ దమ యనుభవముతోఁ గూర్చి వ్రాసి తమ జీవితకాలములోఁ జేయఁగలిగినంతఁ బనిచేసి తక్కినది తమతర్వాత కార్యశూరులకు మార్గదర్శనముఁ గల్పింప నిశ్చయించుకొనిరి.

మూఁడవ ప్రకరణము.

గుణదోషములు ప్రతిసంఘమందును గనుపించును. అన్ని దేశములయందును నన్ని జాతులయందును గుణము లెక్కువగనో దోషములెక్కువగనో గనుపించుచుండును గాని కేవలము గుణములుగాని దోషములుగాని యుండుట తటస్థించదు. కొన్ని సమాజములవారు గుణములను గ్రహింపఁజాలక దోషములనే పరిగణించి గోరంతలు కొండంతలుగాఁ జేసి వానినిఁ బోఁగొట్టుకొనుటకుఁ బ్రయత్నించి పనిసేయుచుందురు. మరికొన్ని సమాజములవారు దోషములను పాటించక గుణములనే పరిగణించి దోషములను బోఁగొట్టుకొనవలయునని చేయుప్రయత్నముల వలన గుణములకుఁ గూడ భంగము కలుగునని యూహించి భయపడి వేగిరపాటుతోఁ గర్తవ్యమాలోచింపకుండ పని చేయుట నష్టదాయకమని తలఁచుచుందురు. ఇప్పుడు దుష్టములుగను నష్టదాయకములుగను నిందాస్పదములుగను ననర్థహేతుభూతములుగను గనుపించు నాచారము లొకప్పుడు లాభకరములుగను శ్రేయోదాయకములుగను నుచితములుగను క్షేమకరములుగను నుండవచ్చును. సదుద్దేశముతో లాభముకొఱకును క్షేమముకొఱకును నేర్పరుపఁబడిన యాచారములు కాలక్రమమున నష్టదాయకములుగను నశ్రేయస్కరములుగనుఁ బరిణమించుచుండును. ఏయేకాలమునకు నేయేయవస్థకు నేయేయాచారములు లాభకరములో! యేవేవి నష్టకరములో! దూరాలోచనముతోఁ బరిశీలించి పనిసేయుట ముఖ్యము. మఱియు దోషములని కొన్నియాచారములను త్యజించుటవలన నాయాచారము లున్నప్పటికంటె నవి పోఁగొట్టుకొనినతరువాత మరియొకదురాచారము ప్రబలి పూర్వముకంటె నెక్కుడు నష్టము కలుగవచ్చును. ఒక జనసంఘముగాని యొక దేశముకాని దోషరహితమై గుణసమృద్ధితో నభివృ

ద్ధిలో నున్నదని మనము నిశ్చయింపఁగూడదు. దేశకాలపాత్రతలను బట్టి గుణదోషముల నెన్ని గ్రహింపవలసియున్నది. ఒక దేశమునకు ను నొక సంఘమునకును లాభకరముగాఁ గనిపించు నాచార మింకొక దేశమునకును సంఘమునకును లాభకరమని నిశ్చయించుటఁ దగదు. జనుల నాగరికతను బట్టియు స్థితినిఁబట్టియు ననుభవజ్ఞానమునుబట్టియు దేశముయొక్క యభివృద్ధినిఁబట్టియుఁ బూర్వనాగరికస్థితులనుబట్టియు స్వభావసిద్ధములైన యితరకారణములనుబట్టియు నేయేసంఘమున కేయేదేశమున కేయేయాచారములు లాభకరములో యేవి నష్టదాయకములో చక్కఁగా యోజించి గ్రహింపవలసియున్నది. ఇది యిట్లుండ జనుల యభిప్రాయములను గ్రహింపవలసిన యవసర మొకటి ప్రధానము. దేశాభివృద్ధి కలుగఁజేయవలయునను దృఢాభిప్రాయముతో దురాచారములను పాఱఁద్రోలి సదాచారములను స్థాపింపవలయునను నత్యాచరణపరతంత్రతాదీక్ష బూని తాము చేయు కార్యమువలన దేశమునకు నష్టముకలుగుచున్నదో లాభముకలుగుచున్నదో గ్రహింపఁజాలక తాముచేయుపని మంచిదియే యను నహంభావమున నొడలు మఱచి సంచరించుట దేశమునకు నష్టము కలుగఁజేయును. కాని లాభ మెన్నఁటికినిఁ గలుగఁజేయదు. మనదేశములో నిప్పుడు ప్రబలియున్న దురాచారము లొకప్పుడు సదాచారములుగనే యుండి యుండవచ్చుననియు నిప్పుడు దురాచారములుగాఁ బరిణమించిన యాచారములు మొదట సదుద్దేశములు లాభకరములునగు సదాచారములనియు దేశమునకు క్షేమకరములనియు నిశ్చయించి యేర్పరుపఁబడినవనియు మనము నమ్మవలసియున్నది. ఒకప్పుడు లాభకరములగాను సదాచారములుగను నున్న యాచారము లిప్పుడు దురాచారములుగాఁ బరిణమించుటవలన ప్రస్తుత మవి నష్టదాయకములే యయినను వానిని నిర్మూలము చేయుటవలన నష్టము కలుగునో లాభముకలుగునో పరిశీలన

బుద్ధితో దూర మాలోచింపవలసియున్నది. దేశానుభవమించుకయు లేక జనుల యభిప్రాయములను స్థితియు ననుభవమునుఁ బాత్రతయు వివేకమును నడవడియు జ్ఞానస్థితియు నించుకైనఁ దెలిసికొనక కూపమండూకములవలె నొకచోఁ గూర్చుండి కదలనేరక తమయనుభవమె వాస్తవమనియుఁ దాము చేయు కార్యములే సత్కార్యములనియుఁ దమప్రయత్నములే యుచితప్రయత్నములనియుఁ దా మామోదించిన యాచారములే ప్రపంచమంతయు సదాచారములుగ శిరసా వహింపవలయుననియు నహంభావముతో నుద్దేశించుట మూర్ఖలక్షణమని చెప్పవలసియున్నది. సదుద్దేశముతో నితరులు సేయు హితోపదేశములు తమ సత్ప్రయత్నములకు నీర్ష్యాభావముతోఁ గల్పించు నాటంకములని వానినిఁ బాటింపకుండ లాభనష్టములను గుర్తెఱుఁగక యొక మార్గముననేఁ గన్నులనుఁ జెవులను మూసికొని సంచరింప నిశ్చయించుకొనిన వానిని మూర్ఖుఁ డని పిలుచుటవలనఁ దప్పేమున్నది. ఆహా! మూర్ఖత్వమును నహంభావమును నెట్టెట్టి యాపదలకును నష్టములకునుఁ గారణభూతము లగుచుండునో కదా! అవియెట్టి యనుచితకార్యములను చేయించి జనుల నిందలకును హాస్యములకును నాస్పదము చేయునోకదా! మఱియు నీరెండును నవివేకముతోఁ గలసి గుణత్రయములై జనులచే నెట్టెట్టియకార్యములనైన నెట్టి నీతిబాహ్యములగు పనులనైనఁ జేయించి యెట్టెట్టిపాపమునకైనఁ బాలుసేయును. కావున నీగుణత్రితయముగల మహానుభావులందఱకు మీరు గార్యశూరులు కావలదని చేమోడ్చి నమస్కరించి ప్రార్థింపవలసియున్నది.

మొదలియారుగారికిని వారిస్నేహితులకును దేశక్షేమమును సంఘాభివృద్ధియుఁ గలుగఁజేయవలయునను దృఢనిశ్చయ మైనబుద్ధియుఁ గార్యశూరత్వమును బరోపకారదీక్షాపరతంత్రతయుఁ దక్క నీదుర్గుణత్రితయము వారికి లేదని నిశ్చయముగాఁ జెప్పక తప్పదు. తాము

నూతనముగా భేతాళపురమున స్థాపించిన సమాజము దమసదుద్దేశము
కనుగుణముగాఁ జక్కఁగఁ బనిచేయఁజాలక సర్వజనామోదకరము
గా నుండకపోవుటకు వగచుచు నందులకు మూలకారణమును దెలసి
కొని జనుల యాచారవ్యవహారములను దేశకాలపాత్రతలను జక్క
గా పరిశీలించి గ్రహించినఁగాని యుచితమగు గార్యాచరణమున కవ
కాశ ముండదనియు నట్టికార్యాచరణమునఁ గాని లాభము లేదనియు
నిశ్చయించుకొని భేతాళపురమునుండి బయనమై దేశాటనము చేసి జ
నుల యాచారవ్యవహారములను బరిశీలించి విమర్శనాబుద్ధితో దేశాచా
రముల యోగ్యాయోగ్యతలను దెలసికొని తమ యనుభవమంతయు
వ్రాసి తమకును దమ యనంతర మితరులకును దేశాభివృద్ధికరమగు
కార్యములను జేయుటకు మార్గ మేర్పఱుప నిశ్చయించుకొనిరి. వీ
రియుద్దేశము మిక్కిలి శ్లాఘాపాత్రమైనదని చెప్పుట కెంతమాత్రము
నందియము లేదు. వీరు స్వభావముచే నుత్తమోత్తములనియు నమా
యకవృత్తికలవారనియు నిష్కపటహృదయులనియు నిదివఱకే జె
ప్పఁబడినది. ఆత్మగౌరవమును గాపాడుకొనవలయునను గోర్కెయుఁ
దాము గౌరవపాత్రులమను నభిప్రాయమును మానధనులమను నుద్దేశ
మును బరోపకార మాచరించుచు లోకరంజకముగాఁ బ్రవర్తింపవల
యునను దృఢమైన యభిప్రాయమును వీరికిఁ గలవు. తమ యాత్మగౌ
రవమును మానమర్యాదలను గాపాడుకొనుట వీరు ముఖ్యకార్యముగా
నెంచుకొని యన్ని కార్యములయందును నన్ని వేళలయందును బ్రవర్తిం
చుచుందురు. వీరెన్నఁడును నేకార్యమందును బరులకు హానికలుగఁజే
యలేదనియు మనసునందైనఁ బరులకుహానిఁదలపెట్టని నవనీతమువంటి
హృదయముగలవారనియు బరులకష్టములను దుఃఖములను దమకష్టము
లుగను దుఃఖములుగను బరిగణించు చక్కనిహృదయధర్మము గలస
త్పురుషులనియుఁ జెప్పుట కెంతమాత్రము సందియము లేదు.

వీరు నలుగురును దేశాటనము చేయుటకు నిశ్చయించుకొని యొకనాఁడు బయనమగుట కేర్పఱచుకొని తమ దమ యిండ్లయొద్ద జేయవలసిన యేర్పాటుల నన్నిఁటినిఁ జేసికొనిరి. అంత నొకనాఁడు లోకనాథ మొదలియారుగారు ప్రయాణసన్నద్ధుఁడై యుదయ మూఁడుగంటలకు బయలువెడలి తన సామా నొక బండిపై వేయించుకొని తా నొక బండిపైఁ గూర్చుండి రైలుస్టేషను చేరిరి. వీరు చేరిన నాలుగైదునిమిషములకు శెట్టిగారును తరువాత నాయుఁడుగారునుఁ పిమ్మట పిళ్ళగారును వచ్చి చేరిరి. వీరు తమతో రాముఁ డను నొకవంటవానిని కుప్పసామి యనునొకసేవకుని దీసికొని పోవుటకు నిశ్చయించుకొనిరి. తరువాత వీరునల్వురు 2 వ తరగతి రైలుటికెట్లు తీసికొని తమసేవకులను సామానుతో మూఁడవతరగతిలోఁ గూర్చుండఁబెట్టి రైలుబండి యెక్కిరి. వీ రాదినము పవలును రాత్రియుఁ బ్రయాణముసేసి మరునాఁ డుదయము తొమ్మిదిగంటలకు రఘునాథపురమును జేరిరి. అక్కడ వారుదిగి యాయూర రెండుదినములుండుటకు నిశ్చయించుకొని తమసామానును సేవకులను నొకటి రెండు బండ్లలో నెక్కించి తాము రెండుబండ్లలో నెక్కి యాగ్రామమున నొకచోట బసకుదుర్చుకొని వంటచేయించుకొని భోజనముసేసి విశ్రమించిరి. ప్రయాణాయాసముచే నొడలుమరచి నిద్రపోయి సాయంత్రము నాలుగుగంటలకు మేలుకొనిరి. అప్పుడువారు తమదుస్తులను తొడిగికొని రాత్రి వంటకుఁ దగిన యేర్పాటులనుచేసి తమసేవకులకుఁ దమసామానంతయు నొప్పగించి యూరుఁజూడ షికారుపోయిరి. తాము బసదిగిన గృహస్థునివలన నాయూరఁగల గొప్పవారిని తెలిసికొని వారిపరిచయము సంపాదించుకొనుటకు వారిఁజూడ నిశ్చయించుకొనిరి. ఆసాయంత్రము కొందఱి పెద్దమనుష్యుల యిండ్లకుఁ బోయి వారి పరిచయము సంపాదించి తరువాత నాయూరనున్న క్లబ్బునకుఁ బోయిరి. ఆక్లబ్బువా రందఱు వీరిని సగౌరవముగ మన్నించి వారా

పత్రికలను చదువనందించియు టెన్నీసు, బిలియర్డ్సు మొదలగు వ్యాయామక్రీడలకు బిలిచియు ననేకవిషయములను గురించి మాటలాడియు సన్మానించిరి. టెన్నిసయినను బిలియర్డ్సయినను నాడమని యా క్లబ్బువారితోఁ గలిసి మొదలియారుగారును శెట్టిగారును నాయుఁడు గారినిఁ బ్రోత్సాహపఱచిరి. పిళ్ళగారు చతురంగ మాడనారంభించిరి. మొదలియారుగారును శెట్టిగారును మాత్రము సభ్యులతో మాటలాడుచుఁ బ్రస్తుతవ్యవహారములు గురించి చర్చించుచుఁ గాలముఁగడిపిరి. ఇట్లుసాయంత్ర మెనిమిదిగంటలవఱకు క్లబ్బులోనుండి తరువాత నక్కడి పెద్దమనుష్యులయొద్ద సెలవు తీసికొని బసకువచ్చి భోజనముచేసి బసదిగినయింటి యజమానునితోఁ గొంచెముప్రొద్దు ముచ్చటించి నిద్రపోయిరి.

మరునా డుదయమున వీరు నలుగురు వేకువ నిద్రలేచి తమతమ దుస్తులను తొడిగికొని నూతనపరిచితులగు స్నేహితులఁ జూడఁబోయి పదునొకొండు గంటలవఱకునుఁ జూడగలిగినంత మందినిజూచి వారి పరిచయము సంపాదించుకొని బసకు మరలివచ్చి భోజనముచేసి విశ్రాంతిఁజెంది తిరిగి మూఁడుగంటలకుఁ బ్రయాణమై రైలుదారుగంటల వఱకు నందఱినిఁ జూడ వారివారి యిండ్లకుఁబోయి క్లబ్బుచేరిరి. అక్కడనున్నవారిలోఁ బాఘజసారధియను నొకనూతనస్నేహితునివలన నాయూరికిఁ బదేనుమైళ్ళదూరమున నున్న సత్యవరమను గ్రామములో దేవుని కల్యాణమహోత్సవము జరుగుచున్నదనియు నాకల్యాణోత్సవమునకు ననేకప్రదేశములనుండి జను లనేకులు చూడవత్తురనియు సత్యవరము ప్రసిద్ధమయిన యొక గొప్పక్షేత్రమనియుఁ దెలిసికొనిరి. మఱియు నామరునాఁ డక్కడరథోత్సవము మహావైభవముతో జరుగుననియు నాయుత్సవమునకు డిప్యూటీకలెక్టరు, తహశ్శీలుదారు, పోలీసు డిప్యూటీసూపరింటెండెంటు మొదలగు యుద్యోగస్థు

లును గొప్పగృహస్థులును వెళ్ళుదురనియుఁ బార్థసారథి వీరిలోఁ జెప్పి తానుఁ గూడ బోయెద ననియెను. అప్పుడు మొదలియారుగా రట్టివంటోత్సవములం దప్పక చూడవలెననియు నాయుత్సవము తాముకూడఁ జూడఁదగినదే యనియుఁజెప్పెను. శెట్టిగారత్యుత్సాహముతో మనము తప్పక పోవలెననియెను. పిళ్ళగారు తాము సమయమునకు వచ్చితిమని సంతోషించిరి. నాయుఁడుగారు తామీక్షేత్రమునుగురించి యిదివఱకే వినియుంటిననియు నాక్షేత్రమున నున్న రథము మిక్కిలి గొప్పదనియు నట్టి గొప్పరథము ప్రపంచమున నెక్కడనులేదని వాఁడుకఁగఁ జెప్పుదురనియు నాయుత్సవమునకు మనము తప్పక పోవలయుననియుఁ జెప్పిరి. వీరునలుగురును తమతోఁ గలసి రమ్మని పార్థసారథిగారి నడిగిరి. ఆయన యంతకుఁ బూర్వమే పోనిశ్చయించుకొనినవాఁడు కావునఁ దానును వారితోఁ బయనమయి పోవుటకు నొప్పుకొని తానే యారాత్రి బండ్లను సిద్ధపఱచెదనని చెప్పి తెల్లవారుజామున నాలుగుగంటలకుఁ బయనము పోవుటకేర్పఱచెను. మొదలియారుగారును నాయనస్నేహితులును నింటికిఁ దిరిగివచ్చి భోజనముసేసి తమసామానంతయుఁ దమతోఁ దీసికొనిపోవుటకు నిశ్చయపఱచి నిద్రపోయిరి. పార్థసారథిగారు తెల్లవారుజామున మూఁడుగంటలకే లేచి మొదలియారుగారు బసదిగియున్న యింటికి వచ్చి వారినిఁ బ్రయాణముసేసి యందఱునుఁ గలిసి బండ్లెక్కి సత్యవరమునకు బయలువెడలిరి. వీరు మార్గమధ్యమునఁ బార్థసారథిగారితో ముచ్చటించుచు నాయూరి సమాచారమును నచటియుత్సవవిశేషమునుగురించి చెప్పుకొనుచు కాలముఁగడిపిరి. పార్థసారథిగా రొకసచ్ఛూద్రకుటుంబమున జన్మించినవారు. ఈతనితండ్రి పోలీసు ఇన్‌స్పెక్టరుపని సేసి విశేషద్రవ్యమార్జించి చనిపోయిరి. పార్థసారథి కొంతవఱకు విద్యనభ్యసించి తరువాత జదువు మానివేసి నాటకములయం దభిరుచిచే నొకనాటకకంపెనీ

నేర్పఱచి రఘునాథపురమున నున్న పెద్దమనుష్యులందఱితో స్నేహభావముతో సంచరించుచుఁ బ్రతికార్యమునందును దాను జోక్యముకలుగఁజేసికొనుచు మిక్కిలి పనియున్నవానివలెఁ దిరుగుచు గాలముఁ గడపుచుండెను.

ఇట్లు వీరందరు గలసి ఆయుదయ మెనిమిదిగంటలకు సత్యవర్ధగ్రామమును బ్రవేశించిరి. ఆయూరప్పుడు మిక్కిలి జనసమ్మర్దము గలిగియుండెను. ఎక్కడఁ జూచినను యాత్రావరులు గనుపించుచుండిరి. కొందఱు గృహస్థుల యిండ్లలోపలను, గొందఱు వీధియరుగులమీఁదను, గొందఱు చెట్లక్రిందను, గొందఱు గల్యాణోత్సవమునకు వేయఁబడిన పాకలలోను, పందెళ్ళలోను, గొందఱు సత్రమునందును బసదిగియుండిరి. ఊరంతయు జనులతో నిండియుండెను. దొమ్మరవాండ్రు, విప్రవినోదులు, పగటివేషగాండ్రు, బొబ్బిలిపాటపాడువారు, యాచకులు, వికలాంగులు, దొంగలు మొదలగువారు గుంపుగుంపులుగాఁ జేరి యాత్రాస్థులను బీడించుచు బాధించి నడచుటకు మార్గమైన లేకుండ గ్రామమంతయు నిండియుండిరి. పార్థసారథి సత్యవర్ధగ్రామమును జక్కగా నెరిగినవాడు గావునను నదివర కట్టికల్యాణోత్సవముల నెన్నిటినోజూచి యున్నవాడు గావునను నాయూర నొక పాతానులయింట నొక పెద్దసావడియు నొకవిశాలమైన గదియు బసయేర్పఱచి సామానంతయు నందుదింపి రాముని గుప్పసామిని వంటచేయుమని యాజ్ఞాపించి మొదలియారుగారిని శెట్టిగారిని బిళ్ళగారిని నాయుఁడుగారిని దీసికొని యాయుత్సవము జూడవచ్చిన గృహస్థుల బసలకుఁ బోయెను. మొదలియారుగారును ఆయనస్నేహితులును స్నేహపాత్రులును పెద్దగృహస్థుల పరిచయలాభమును గోరువారును గావున నప్పుడక్కడకు విచ్చేసియున్న డిప్యూటీకలెక్టరు, తహాశ్శీలుదారు, డిప్యూటీసూపరింటెండెంటు మొదలగు నుద్యోగస్థులను నితరగృహస్థు

లను జూడఁబోయిరి. వీరు మొదట తహశ్శీలుదారుగారిని పోలీసు డిప్యూటీసూపరింటెండెంటుగారిని జూచి వారి పరిచయము సంపాదించుకొని పిమ్మట డిప్యూటీకలెక్టరుగారి బసకుఁ బోయిరి. ఆడిప్యూటీకలెక్టరుగారిపేరు అరుణాచలము నాయుఁడుగారు. ఆయన యీకల్యాణోత్సవముఁ జక్కఁగా జరుగునట్లు చేయుటకును యాత్రాస్థలకుఁ దగిన సదుపాయముల నేర్పఱచి యుత్సవములు చక్కఁగా జరుగునట్లుచేయుటకును సత్యవరము వచ్చి వారముదినములనుండి యచ్చటయున్నారు. వీరు జనులకు మిక్కిలి యనుకూలమైన సదుపాయముల నేర్పఱచి తానును గొంతలాభమును బొందుచుండెను. అక్కడకు క్రయవిక్రయములు చేసికొని ధనమార్జించుకొనవచ్చిన వర్తకుల యొద్ద వస్తురూపముగాను పాకలు, పందిళ్ళు, వేయించిన కంట్రాక్టర్ల యొద్ద రొక్కరూపముగాను సమయోచితముగా వీలునుబట్టి తాము చేసిన యుపకారమునకుఁ బారితోషికములను నజరానాలను గ్రహించుచు వస్తువులనన్నిటిని రొక్కముగా మార్చుట కొకదుకాణమును బెట్టించి మిక్కిలి శ్రద్ధతో నాయుత్సవమున రాత్రిందివములు పాటుపడి పనిచేయుచుండిరి. ఈనాయుఁడుగారు మిక్కిలి సరసులును స్నేహపాత్రులును అని ధనికులందరు గౌరవింతురు. కాని కొందఱీయన సద్గుణములను సమయోచితప్రజ్ఞను గ్రహింపఁజాలక బోసిపులినాయుఁడుగారని యందురు. డిప్యూటీకలెక్టరుగారగు నరుణాచలము నాయుఁడుగారు పార్థసారధిగారినదివఱకే యెరిగినవారుగావున నాయనను గౌరవించి యాయనవలన మొదలియారుగారిని వారిస్నేహితులను దెలసికొని వారినందఱను గౌరవించి యుచితాసనములపై గూర్చుండబెట్టిరి. పార్థసారధిగారు డిప్యూటీకలెక్టరుగారిని గూర్చియు నాయన సద్గుణములను గూర్చియు నాయన యిట్టియుత్సవములలో భక్తిశ్రద్ధలతో చేయు పనులను గురించియు వారు రాత్రిందివములు పడుచున్న కష్టమును గూర్చి

యు జెప్పి వారిని శ్లాఘించెను. అప్పుడు మొదలియారుగారికిని ఆయన స్నేహితులకును డిప్యూటీకలెక్టరుగారితో నీవిధముగా గొంత సంభాషణము జరిగినది.

డిప్యూ—నేఁడు మిక్కిలి సుదినము. మీసంగతి నేనిదివఱకు వినియుండుటయే కాని మీదర్శనము నెన్నఁడు చేసియుండలేదు. మీలో తిరుమంగయాళ్వారు నాయుఁడుగారు మాకు మిక్కిలి యాప్తులు. వారు నన్నెరుఁగకపోయినను నేను వారినెరుఁగుదును. వారితండ్రిగారు మిక్కిలిదొడ్డవారు. వారిని నేనెన్నటికిని మఱువఁజాలను. నాకు ప్రథమమున వారే యుద్యోగము నిప్పించినారు. వారియొద్ద నేనొకసంవత్సరముపైగా పనిచేసినాను. తరువాత వారిని మఱియొక జిల్లాకు బదలాయించిరి. నాయుఁడుగారూ! మీదర్శనము నాకిన్నిదినములకు లభించినందులకు నాకు మిక్కిలి సంతోషముగానున్నది. నాకు మీతండ్రిగారియందుఁగల విశ్వాసముచేతను గృతజ్ఞతచేతను పరలోకగతులైనవారి దర్శనలాభము ప్రస్తుతము లభించకపోయినను మిమ్ములనైనఁ జూడవలయునని చాలకాలమునుండి నాకు గోర్కె గలదని ప్రమాణము చేయగలను. అయినను నట్టిలాభప్రాప్తి నాకు జిరకాలమునుండి తటస్థపడలేదు. నేటికి నాయదృష్టము మంచిదగుటచే నాచిరకాలాభీప్సితము దీరినది. డిప్యూటీకలెక్టర్లమగు మేము సాహసించి సెలవుదీసికొన్నచో మాసెలవు దినములైన తరువాతఁ దిరిగి పూర్వస్థానమునకు రాగలుగుట తటస్థింపదు. నే నీజిల్లాలో నైదారుసంవత్సరములనుంచి పనిచేయుచు నీజిల్లాలో గొన్ని సంబంధములు గూడ జేసినాను. నేను సెలవుపుచ్చుకొన్న యెడల నన్నే జిల్లాకు బదలాయింతురోయను భయముచేత నొకదినమైన సెలవుదీసికొనకుండఁ బనిచేయుచు మిమ్ములను జూచుట కవకాశము లేక నీశరీరమమ్ముకొని

యిట్లు పనిచేయుచున్నాను. నేఁడు మీయందఱిదర్శనము కేవల మలభ్యయోగ మనుట కెంతమాత్రమును సందేహము లేదు.

మొదలి—మీ యోగ్యతయంతయు నేను పార్థసారథిగారివలన విని మిమ్ములను జూచువఱకు నాప్రాణములు గొట్టుకొన నిక్కడకు వచ్చినాను. పార్థసారథిగారివలన మిమ్మునుగూర్చియు మీయోగ్యతనుగూర్చియు నేనిదివరలో వినినదానికిని నిప్పుడు చూచినదానికిని మిక్కిలిసంతోషముగా నున్నది. తిరుమంగయాళ్వారునాయుఁడుగారు మీకెట్టి యాప్తులో మాకును నట్టియాప్తులే గావున మీరు మాకు ముఖ్యమైన స్నేహితులు.

శెట్టి—అరుణాచలంనాయుఁడుగారు డిప్యూటీకలెక్టర్లందరిలోను మిక్కిలి మంచివారనియు నుత్తమోత్తములనియు నిదివఱకే వినియున్నాము. డిప్యూటీకలెక్టర్లందఱు నిట్టివారయినయెడల మనదేశము మిక్కిలి త్వరలోనే యభివృద్ధికి వచ్చుట కెంతమాత్రము సందేహము లేదు.

పిళ్ళె—మీదర్శనలాభ మీకల్యాణోత్సవము కంటె మిక్కిలి యెక్కువయని నాయభిప్రాయము. మీస్నేహము మాకీదినమున లభించుట మాపుణ్యముగాని మఱియొకటి కాదు. ఇది మాకు పార్థసారథిగారిమూలమునఁ బ్రాప్తించినది. వారి నెన్నటికి మఱువరాదు.

పార్థ—డిప్యూటీకలెక్టరుగారి యోగ్యతయు సుగుణసంపత్తియు వారితో స్నేహముచేసినవారికే గాని యితరులకు దెలియదు. వీరు సంపన్నగృహస్థులు. అయిదారులక్షల రూపాయీలు రొక్కము సంపాదించినారు. ఈనడుమ ఆర్బత్‌నాటుకంపెనీలో బోయిన ధనముగాక నిప్పు డయిదారులక్షలున్నవి. వీరు మిక్కిలి మర్యాదగలవారు. వీరు జనులందఱితోను దలలోనాలుకవలె సంచరించుచు వారి గౌరవవిశ్వాసములకుఁ బాత్రులయి యున్నారు.

డిప్యూ—మీ రిక్కడ నున్నంతవఱకు నిక్కడకే భోజనమునకు దయచేయవలెను. పార్థసారథీ! నీవుండికూడ వారిని వేరేస్థలమందు బసచేయించుట న్యాయముగాదు. మీరందఱు నిచ్చటికే వచ్చి యుండవలసినది.

మొదలి—ఈపూటకు మమ్ము మన్నించవలెను. మేము సాయంత్రము భోజనమున కిక్కడికే వచ్చెదము.

పార్థ—మీ రేతొందరపనిలో నుందురోయని యూహించి మీబసలో స్థలసదుపాయముండునో! లేదో! యని వారిని సాతాని సీనయ్యగారియింట బసకుదిర్చి యచ్చట నుండున ట్లేర్పఱచినాను. ఆయిల్లు మిక్కిలి సదుపాయముగా నున్నది. సీనయ్యయు నాతనికొమాళ్ళిద్దరును నుదయముమొదలు సాయంత్రమువఱకు నూరిలో దిరుగుచుందురు. ఆయింటిలో మిక్కిలి సదుపాయముగా బసకుదిరినది. మీసెలవుప్రకారమందఱము రాత్రి కిక్కడకే భోజనమునకు వత్తుము.

డిప్యూ—వారిని బసకుఁ దీసికొనిపోయి యక్కడవిడచి నీవయిన నిక్కడకు భోజనమునకు రాక తప్పదు.

పార్థ—చిత్తము. (అని అందఱు సెలవుదీసికొనిరి)

తరువాత వీరైదుగురును బసదిగిన యింటికిఁబోయిరి. పార్థసారథి వారి నచ్చటఁ దిగబెట్టి డిప్యూటీకలెక్టరుగారియింటికి భోజనమునకుఁ బోయెను. మొదలియారుగారును వారిస్నేహితులును భోజనము చేసి విశ్రమించిరి. పార్థసారథి డిప్యూటీకలెక్టరుగారితో భోజనముచేసి కొంతసేపు పేకాడుచుఁ గూరుచుండి తరువాత విశ్రమించెను. పిమ్మట సాయంత్రము నాలుగుగంటలకుఁ బార్థసారథి మొదలియారుగారి బసయింటికిఁబోయి వారితోఁగలసి కల్యాణోత్సవముఁ జూడనేగుదెంచిన పెద్దమనుష్యులలో గొప్పవారినిఁ గొందఱిని జూచి దేవాల

యమునకుఁ బోయెను. అచ్చటను నొకయరగంట దాదాపుగా నుండి దేవునిదర్శనము చేసి కొంతదూర ముత్సవములోఁ దిరిగి చీకటిపడుసమ యమున కింటికిఁ దిరిగివచ్చెను. డిప్యూటీకలెక్టరుగారు సాయంత్రమే డుగంటలకే భోజనము లగునుగావునఁ దమ్ము ద్వరలో దయచేయుమ న్నారని మీనలుగురితోఁ జెప్పుమనిరని పార్థసారథి వారితోఁ జెప్పి తాను వేరేపనిమీఁదఁ బోయెను. మొదలియారుగారును స్నేహితులు ను తమతమ దుస్తులను దీసివేసి ధోవతులను ధరించి డిప్యూటీకలెక్టరు గారియింటికి భోజనమునకుఁ బోయిరి. డిప్యూటీకలెక్టరుగారును వీరు వచ్చువఱకే వీరికొఱకెదురుచూచుచుండిరి. తరువాత నందఱుగలసి భోజనము చేసిరి. వీరి భోజనము లగునప్పటి కెనిమిదిగంటలయినది. పిమ్మట నొకపావుగంట తాంబూలములు వేసికొనుచు మాటలాడుచు గూరుచుండి తమ బసకుఁ బ్రయాణమయిరి. డిప్యూటీకలెక్టరుగారు పార్థసారథిని దీసికొని వేఱొకపనిమీఁదఁ బోయిరి. ఇట్లు మొదలియారు గారు మొదలగు నలుగురును బసకు వచ్చుచుండగా మార్గమున వీరికి నూతనపరిచితుఁడగు నొక పెద్దమనిషి గానుపించి యారాత్రి జరుగు "రథోత్సవముఁ జూడరా!" యని యడిగి "చాలఁ గొప్పయుత్సవము జరుగు" నని యాయుత్సవమును గూర్చి కొనియాడుచుఁ బలికెను. అంత మొదలియారుగారు బసలోనికింబోయి మరల నుత్సవము జూడ బయలువెడలెదమని చెప్పిరి. శెట్టిగారు దా మచ్చటకు వచ్చిన గారణ మన్నివినోదములును జూచుట దక్క మఱి యేమున్నదనిరి. పిళ్ళగారు తప్పక తామాయుత్సవమునకుఁ బోదగినదనియు నిక్కడిరథము మిక్కిలి గొప్పదని తామిదివఱకే వినియుంటిమనియు సెలవిచ్చిరి. నాయుఁడుగారు డిప్యూటీకలెక్టరుగా రుత్సవమునకు రారా? యని యడిగిరి. దాని కానూతనపరిచితుఁడు డిప్యూటీకలెక్టరుగారు బోగము మేళములు చూడరనియు వారు గొందఱుస్నేహితులకొఱకును నితర

కారణముల చేతను క్రొత్తగా "యాంటీనాచిగరల్ మువ్ మెంటులోఁ" జేరిరనియు బహిరంగముగా భోగము మేళములు జూడరుగాని రహస్యముగా సర్ క్యూటులో నున్న పుడెల్ల భోగము వాండ్రతోనే రాత్రులన్నియుఁ గడపుదురనియుఁ జెప్పి కలెక్టరుగారి చర్యలను గూర్చి కొంచెము పన్యసించెను. మొదలియారుగారును వారి స్నేహితులును దమ నూతనపరిచితునియుద్ద సెలవుగైకొని "యాంటీనాచిగరల్ మువ్ మెంటు"ను గూర్చి చర్చించుచు బసచేరి తమ దమ దుస్తులను దొడిగికొనిరి. అందరు ట్రౌజర్సు, బూట్సు, పెద్దకోట్లు దొడిగికొని తలపాగలను ధరించిరి. పురుషులకు వస్త్రాలంకారముకన్న వేఱెయలంకారము లేదనియుఁ బురుషులు దమకుచితమయిన వస్త్రములను ధరించినఁగాని సామాన్యజనుల వలన గౌరవమును బొందఁజాలరనియుఁ బురుషుల గౌరవమును వస్త్రాలంకారములం బట్టియే జనులు గ్రహింపఁగలుగుదురనియుఁ జక్కఁగా గ్రహించుటచే వీరందఱు దుస్తులను వేసికొని యలంకరించుకొని రథోత్సవమునకుఁ బోయిరి.

ఆనాడు రథోత్సవముఁ జూచుటకు జను లనేకులు వేనవేలుగా ననేకప్రదేశములనుండి వచ్చిరి. ఉత్సవమందలి జనసమ్మర్ద మింతింతని చెప్ప శక్యముగాదు. రథోత్సవము సాయంత్ర మూఁడుగంటలకే ప్రారంభింపఁబడెను. వీరుత్సవము జేరునప్పటికి తొమ్మిదిగంటలుపైగా నైనది. అప్పు డాజనసమ్మర్దములో రథమువద్దకుఁ బోవుటయే మిక్కిలి కష్టసాధ్యముగానున్నను దూరమున నెచ్చటనో గుంపులో గలసి యనామధేయులను సామాన్యులవలె నుత్సవముఁ జూచుట తమ యాత్మగౌరవమునకును నౌన్నత్యమునకును దగదని యెంచి విస్తారముగు నాజనసమ్మర్దములోఁబడి ముందుకు వెనుకకు నెంటఁబడుచు మోచేతిదెబ్బలు తినుచు, నిటునటు నీడ్వఁబడుచుఁ దలపాగలు గ్రిందబడకుండఁ గాపాడుకొనుచుఁ దిట్లుదినుచుఁ గాళ్ళు ద్రొక్కించుకొనుచు జుట్టల

నిప్పునఁ గాల్పఁబడుచు నతికష్టతరముగా రథముదగ్గర కీనలుగురుఁ బోయిరి. వీరునలుగురు నొండొరులను విడచినచోఁ దిరిగి తాము గలసికొనుట గష్టమనియెంచి యొకరిచేతినొకరు బట్టుకొని నడచుచుండుటచే జనులకు మఱింత యాటంకముగానుండి వారు వీరిననేకవిధములుగా బాధించిరి. దడిగట్టినట్లు వీరునలుగురు గలసి నడచుచుండుటచే వీరిని గొందఱు చేతులతోను జేతికఱ్ఱలతోను గొట్టుటఁగూడ సంభవించినది. ఉత్సవము సాంతముగాఁ జూడకయే బసకుఁ దిరిగిపోవుట పురుషలక్షణమును ధీరోదాత్తలక్షణమును గాదని వీరు చక్కఁగా గ్రహించినవారగుటచే నెట్టికష్టములకైనఁ బాలయి నెంతశ్రమకైన నోర్చి యొకటిరెండు పరియాయములు గాలు జారి మొదలియారుగారును శెట్టిగారును గ్రిందబడుట దటస్థించినను బట్టుదలతో నెట్టకేలకు రథమును సమీపించిరి. అక్కడ నొకఁడు నాయుఁడుగారిని వెనుకనుంచి త్రోయ, వారు రథచక్రముమీఁదఁ బడి కొద్దిగాయముతగిలి లేచిరి. అంతటఁ బిళ్లగారితలపాగ యిలాయిమంట నంటుకొని వేడియాముదము మొగముమీఁదఁ బడుటచే నాయన మొగముప్రక్కను గొంచెము కాలెను. ఎన్ని యాటంకములు గలిగినను నెన్నికష్టములు సంభవించినను ధీరులు దాముచేయ నిశ్చయించుకొనిన గార్యమును ద్యజింపరు. ఇట్లు వీరు నలుగురు నమితబాధలకుఁ బాలయి యెట్టకేల కతికష్టముగా రథము ముంద రాడుచున్న బోగముమేళ మెదుట నిలఁబడిరి. నాయుఁడుగారి మోకాలికి రథచక్రము మీఁదఁబడుటవలన సంభవించిన గాయమును బిళ్ళగారికి మొగము గాలుటవలన సంభవించిన గాయమును నెట్టిబాధ గలిగించుచున్నను వీరుఁ దమపట్టుదలను మానుకొనక గాయములు దగలనివారివలె బాధలనన్నిఁటిని దిగమ్రింగి మిక్కిలి యోరిమితో నుండిరి. మొదలియారుగారును శెట్టిగారును శ్రమచే నొగర్చుచు శరీరమంతయు చెమటలు గ్రమ్మఁ దాము గ్రిందఁబడుటచే దమదు

స్త్రులకంటుకొన్న దుమ్మును బురదను దుడిచికొనుచు నేమియుఁ దట
స్థించనివారివలె నటించుచుఁ దమయాపదల నెవ్వరైనఁ గనిపెట్టుదు
రేమో! యని మనసులో శంకించుచు నలుదిక్కులు జూచుచు నిలచి
రి. జను లెవ్వరైనఁ దమకు దటస్థమయిన పరాభవములను గ్రహించి
నచోఁ దాము పరిహాసాస్పదుల మగుదుమని మనసులో వీరికి సందేహ
మును భయమును లేకపోలేదు. అయినను దమ యాత్మగౌరవమును
నిలఁబెట్టుకొనుట కెన్నెన్ని యుపాయములనైనఁ బన్నుచుఁ దాముపడి
న యాయాసమునుఁ బ్రకటీకృతముఁ గాకుండఁ బ్రవర్తించుచుండిరి.
అప్పుడీనలుగురిని జూచి మేళములోని భోగమువాండ్రందఱు నతిపిన
యభయభక్తులతో సగౌరవముగా నొక్కొక్కరి కొక్కొక్కదండము
చొప్పున మందహాసముతో దండములు వెట్టిరి. మొదలియారుగారును
వారిస్నేహితులును దమకు భోగమువాండ్రు పెట్టిన దండమునందుకొ
ని యొండొరులతో మాటలాడుకొనుచుఁ దాము జెందిన పరాభవముల
ను గ్రహించి వారుమందహాసముచేసిరేమో! యని కొంచెము శంకిం
చి వా రవిగనిపెట్టుట కవకాశము లేదని యెంచి ధైర్యముఁ దెచ్చు
కొని మందహాసములు చేయుచు నిలచిరి. వీరినలుగురిలోఁ బిళ్ళగారికి
మొగముమీఁదఁ గొంచెము కాలియుండుటచే నాగాయమువలన నను
భవించుచున్న బాధ యెంతదుర్భరముగానున్నను దాని నితరులగం
డ్లబడకుండఁ దప్పిపెట్టుట కవకాశములే దనిగ్రహించి యించుకైన
బాధలేనివానివలె నటించవలెనన్న యభిప్రాయముచేతనో! తనకు
సంగీతమందును నభినయమునందును గల యభిరుచిని బ్రకటింపనెంచి
యో! లేకఁ దనకు వీనియందుగల యభినివేశ మా మేళములోని భో
గమువాండ్రకు దెలిపి వారివలన రసికాగ్రగణ్యుఁడనని గౌరవింపఁబ
డవలయునను నభీష్టముచేతనో! మనము స్పష్టముగాఁ జెప్పలేము గా
నితని యొద్ద వగర్చుచు నిలచియున్న సంగీతాభినయసముద్రుఁడగు శ

ట్టిగారు పెదవి గదల్పక యూరకున్నను బిళ్ళగారు మేళములోనున్న షిడేలువాయించువానిని మెల్లగాఁబిలచి యొకజావళీ నభినయించునట్లాయాటగత్తెతోఁ జెప్ప సెలవిచ్చిరి. ఆయాటగత్తె చిరునగవునవ్వుచు సిగ్గునభినయించి యాజావళీని నభినయింప మొదలువెట్టెను. తరువాత బిళ్ళగారు దనకభిముఖియై నిలచి యాడుచుఁ దనయాజ్ఞను శిరసా వహించి తనయందమితగౌరవమును భక్తిని జూపుచున్న యాయాటగత్తెవిషయములో రాయబారుల నంపుటనావశ్యమనియు ననుచితమనియుఁ గూడ నెంచి తానే స్వయముగా నేమేమో హస్తములను బట్టుమని చెప్పియుఁ గొన్నిజావళీలను బదములను నభినయించుమని పురమాయించియుఁ దనసంగీతాభినయశాస్త్రాభినివేశము నంతను విచ్చలవిడిగాఁ బ్రకటించి నాయకీనాయకభావములను గూర్చి యడుగుచుఁ దెలియనివెల్ల తాము సెలవిచ్చుచుఁ దనశృంగారశాస్త్రజ్ఞానమంతయు నామేళములోవారికిఁ దెలియఁజేసిరి. అంతనీరథోత్సవ మొక బహిరంగప్రదేశమునకు వచ్చెను. అక్కడ రథము నిలపి భాగవత మాడుటకు నేర్పఱుపఁబడినది. భాగవతము చూచుటకదివఱకే చాల మంది జనులు వచ్చి కూర్చుండియుండిరి. రథోత్సవముతోవచ్చిన వారందఱు నొకరికన్న నొకరుముందుగాఁ గూర్చుండవలయు నని తొందరగాఁ బరువులెత్తి యాప్రదేశమునఁ గ్రిక్కిఱిసికూర్చుండిరి. అప్పుడు మేళములోనున్న బోగమువాండ్రందఱు మొదలియారుగారికిని వారిస్నేహితులకును నందుముఖ్యముగాఁ బిళ్ళగారికిని దండములువెట్టి యింటికిఁబోవ సెలవిండని యడిగిరి. అప్పుడు పిళ్ళగారు "ఈమేళములోనున్న యాటకత్తెకేమియయిన బహుమానమిచ్చి పంపించుట యుచితము; కాని యీసంగతి మన నూతనస్నేహితులకును డిప్యూటీకలెక్టరుగారికిని దెలిసినచో బాగుగ నుండదు. వారు 'యాంటీనాచిగరల్ మువ్మెంటు'లోఁ జేరినవాఁడనికూడ తెలిసినది. బోగముమేళము

చూచుటయే కాక యందలియాటకత్తెకు బహుమానమిచ్చుట మరియొక గొప్పనేరముగా నీయన బరిగణింపక మానఁడు. కాని దాదాపు రెండుగంటలకాలము మన మిష్టమువచ్చినట్లెల్ల యాయాటకత్తెచే హస్తములువట్టించి పదములను జావళీలను నభినయింపఁ జేసి యిప్పుడేమియు నీయకయే పంపించుట నా గౌరవమునకుఁ దగదు. దీనికేమియైననిచ్చినచో 'యాంటీనాచిగరల్ మువ్మెంటు' వారికిఁ దెలియుటకు వీలుగనుపింపదు. ఒకవేళ యీమేళములో వాండ్రే గొప్పకొఱకు మాకుఁ బిళ్ళగారు బహుమానమిచ్చిరని చెప్పుదురేమో! యనిసందేహముతోఁ జుచున్నది. నీకు బహుమానమిచ్చిన సంగతి యితరులతోఁ జెప్పవలదన్నచోఁ మన పిఱికితనము వెల్లడియగును. అందువలనఁ గార్యము మఱింత పాడుగావచ్చును" అని కొంతసేపాలోచించి "యింతకు నాయాత్మగౌరవమును మరియాదయు నిలబెట్టుకొనుట ముఖ్యము. గౌరవమును నిలబెట్టుకొనుటకు నాస్వంతద్రవ్యములోనుండి సంతోషపూర్వకముగ నాలుగురూపాయీలిచ్చినచో నెవరికేమి నష్టమున్నది. ఈయాంటీనాచిగరల్‌మూవుమెంటువారి పుట్టియేమి మునిఁగినది. ఈయాంటీనాచిగరల్‌మూవుమెంటువారు జనులకు మహోపకారమును చేయుచున్నామను నహంభావముతో జనులస్వాతంత్ర్యమునకు నడ్డమువచ్చుచున్నారు. ఇదియెంతమాత్రమును నుచితము గాలేదు. ఈనడుమ నొకపెద్దమనుష్యుఁ డాడవారును మగవాండ్రునుఁ గలిసి యాడిన నాటకమును జూచి వారినాటకప్రయోగములు మిక్కిలి యాహ్లాదకరముగా నుండుటచే సంతోషపూర్వకముగ బహుమానమిచ్చెను. ఆస్వల్పవిషయమును నత్యధికముఁ జేసి యతని నిందించుచు బహిరంగముగా నాక్షేపించుచు వార్తాపత్రికలకుఁగూడ వ్రాసి యల్లరిచేసినారు. ఇదియంతయు నీయాంటీనాచిగరల్ మువ్మెంటువారే ప్రకటించి పాపమాగృహస్థుని నవమానపఱచిరి. ఈయాంటీనాచిగరల్ మువ్మెంటువారు దూరాలోచనను

లేనివారనినా తాత్పర్యము. భోగమువాండ్ర యాటపాటలకుఁ బ్రోత్సాహము చేయకపోయినచో వాండ్రు గర్హితమగు తమవృత్తినిఁ ద్యజింతురని యూహించుట యంత సహేతుకముగా నాకుఁ గన్పింపదు. భోగమువాండ్రు తమయాటపాటలవలన ధనమార్జించి జీవనము సేయకపోయినచోఁ దమకాలమంతయు వ్యభిచారవృత్తియందే కడపి దేశమునకు హాని కలుగఁజేయుదురు. కాఁబట్టి వాండ్రను నాటపాటలకుఁ బిలువక నిరుత్సాహపఱచుటకంటె వారి యాటపాటలకుఁ బ్రోత్సాహము కలుగఁజేయుచు వారికి హితోపదేశము సేసి, గర్హితమయిన వృత్తినివిడిచి వివాహములు చేసికొని ధర్మపత్నులై సుఖమున గౌరవముతోఁ గాలముఁ గడపునట్లు చేయుట మంచిది. ఈకారణమునుబట్టియు మరియు నీభోగమువాండ్రకు నీయుత్సవముల లభించు స్వల్పలాభము నెంచియు నింతియెకాక వీరియుత్సవసమయములో స్వల్పలాభమునకు నాశపడి బహుదూరమునుండి తమవారిని విడిచి యిక్కడకు వచ్చి యాడుమన్నప్పుడాడి పాడుమన్నప్పుడు పాడి వెట్టికిఁ దహసీల్దారుగారు పోలీసుద్యోగస్థులు మొదలగువారందఱియభీష్టములను దీర్చుచుఁ బాటుపడుచున్న వీరియందు జాలిచెందుట న్యాయముగాని యాగ్రహపడుట న్యాయముగా దనిదలఁచియు వారికి హితోపదేశముచేసి సన్మార్గమునకుఁ దేవలయునుగాని వారు గానాభినయవిద్యలను ద్యజించి మఱింతపాడై దేశమందుఁ బెనుభూతములవలె సంచరించుచు జనులను బాడుచేయునట్లు చేయుట ధర్మముగాద'' నుగారణమును బట్టియు పిళ్లగారాయాటగత్తెకు బహుమానమిచ్చుటకే నిశ్చయించుకొనిరి. మఱియుఁ బిళ్ళగారీపనికి సాహసించుటకింకొక రహస్యకారణము గలదు. బహిరంగముగా భోగమువాండ్ర యాటపాటలను గనియు వినియు వారికిఁ బ్రోత్సాహముఁ గలుగఁజేయక “యాంటీనాచిగరల్‌మూవ్‌మెంటు'' లోఁజేరి యుపన్యాసపీఠములనుండి

7

నీతు లుపదేశించుచు రహస్యముగా లంజల గుడిసెలలో దూరు వా క్నూరులగు మహానుభావుల నెందరినో యీయన యెఱుఁగుదురు. ఈ కారణము లటుండ నలువదయేండ్లకు లోపుండనివయసు గలిగి తమ గోమార్తెలకుఁగానిదమయక్క చెల్లెండ్ర కోమార్తెలకుఁగానిదముచెల్లెం డ్రకు మొదలగువారికిఁ గాని వివాహములు జేయువారును వివాహములు చేయఁదలపెట్టినవారును యాంటీనాచిగరల్ జాతిలో నెన్నఁబడక వా రి యిండ్ల జరుగువివాహోత్సవములకుఁ బోయి వారి నాదరించి గౌ రవించిన మహామహుల నెందరినో యీపిళ్ళగా రెఱుఁగుదురు. కాఁబ ట్టి యీబలమైనకారణములను బట్టి యేదోషము నెఱుఁగని యాపిళ్ళ గా రామేశమందలి యాటగత్తెకు బహుమాన మిచ్చుటకే నిశ్చయించు కొని కోటుజేబులో జేయిపెట్టి యందేమియు లేకపోవుటచే ధారాళ మైన మనస్సులో నించుకైన సందియముఁ బూనకఁ దనబస యానవా లు చెప్పి మరునాఁ డుదయమేడుగంటలకుఁ దన్నుఁజూడుమని యా యాటగత్తెతోఁ జెప్పెను. ఆయాటగత్తెయు జిత్తమని వినయగౌరవ ములతో దండము పెట్టి సెలవుదీసికొని పోయెను.

తరువాత నాప్రదేశమున భాగవతము జరుగునని వీరు నలుగురు దెలిసికొని యీభాగవతము గూడ గొంతచూడవలయునని నిశ్చయిం చుకొని తమయాత్మగౌరవమునకును దమమర్యాదకునుఁ దగినప్రదేశ మున ముందు గూర్చుండవలయు నని యూహించి తమతరువాత వచ్చు వారుఁగూడఁదమ ముందు గూర్చుండుట కవకాశములేకుండ భాగవత మాడుటకు మిగిలియున్న ప్రదేశములో సగము భాగ మాక్రమించు కొని స్వస్థచిత్తులై గూర్చుండిరి. తరువాతఁ గొంతసేపటికి భాగవత మా రంభించుటకు భాగవతులు వచ్చిరి; కాని భాగవత మాడుటకు రంగ స్థలము లేకపోవు టటుండ కాగడాలు వేయుటకైన నవకాశము గను పించలేదు. అప్పుడు భాగవతము చూడవచ్చిన జనులను నీనలుగురిని

వెనుకకు జరుగుఁడని కాగడాలతోను కర్రలతోను పెద్దపెద్దకేకలు పెట్టి చెప్పుచు వెనుకకుఁ దరిమిరి. అప్పుడు మొదలియారుగారును శెట్టిగారును వారిస్నేహితులిద్దరును దాము లేచినచోఁ దమ ముం దెవ్వారైన వచ్చి గూర్చుందురని శంకించి లేవకయే దమతమ శరీరలాఘవమునకు దగినంత తొందరగా వెనుకకు జరుగ నారంభించిరి. ఆసమయములో గొందఱు వీరి ముందుఁ గూర్చుండి వీరిని వెనుకకుఁ ద్రోయ నారంభించిరి. అట్లు వీరిముందుఁ గూర్చుండుట తటస్థించినవారు గదలఁగలిగినంత లాఘవముతో నీనలుగురును వెనుకకుఁ గదల జాలని కారణమును బట్టియుఁ బ్రక్కలనున్నవారు వీరిపై బడుటచే వీరు సులభముగా వారిని వారించుకొననేరని హేతువును బట్టియు శెట్టిగారి తలపాగ క్రిందబడుటయు మొదలియారుగారు వెల్లకిలఁబడుటయు నాయుఁడుగారును బిళ్ళగారును గుంపులోఁ గదలనేరకఁ జిక్కులుపడుటయు మొదలైనగొన్ని బాధలు వీరికిఁ దటస్థమగుట సంభవించినది. ఈనలుగురు నీవిధముగా శరీరాయాసమును బడుచుఁ దమ్మెఱిగినవారెవ్వరు దాము పడుచున్న కష్టములను జూచుట సంభవించకుండు టీయవస్థలో నొకగొప్పయదృష్టముగా నెంచుకొనుచుండిరి. అప్పుడు వెనుకనున్నగుంపులో నిద్దరు లేఁచి గట్టిగా మాట్లాడుకొనుచు నొండొరులను దూషించుకొనుచుఁ గయ్యమాడఁ జొచ్చిరి. ఆయల్లరి విని కొందఱు లేఁచి యలజడి గలుగఁజేసిరి. ఈసమయములో నొకప్రక్కనుండి "వెఱ్ఱికుక్క వెఱ్ఱికుక్క" యను నొక కేక వినిపింప నాప్రక్కఁ గూర్చున్నవారందఱు నొక్కసారిగా లేఁచి రెండవప్రక్కకుఁ బోసాగిరి. ఇట్లందఱు లేఁచి యల్లకల్లోలముగా సభలో నల్లరి చేయుచుండ మన కథానాయకులగు నీనలుగురు పెద్దమనుష్యులును దాము గూర్చుండియున్న ప్రదేశమునుండి సులభముగా త్వరితముగా లేవఁగలుగుటకుఁ దమశరీరస్థితులను బట్టియు నాసమయమునఁ దామున్న యవస్థలను బ

ట్టియు వీలు గలిగియుండక పోవుటచేఁ గొందఱు కాళ్ళక్రిందఁ బడ వలసిన యిఁకొక నూతనావస్థఁ గూడ వీరికి సంప్రాప్తమయ్యెను. ఈవిధముగా వీరు పలువిధములగు నవస్థలకుఁ బాలయి యెట్టకేలకు నేలఁజేతులానుకొని మెల్లగా లేఁచి నిలబడి తమనలుదిక్కులను లేఁచి యిట్టిట్టుకదలుచున్న జనులగుంపులోనుండి యావలకుఁ దప్పించుకొని పోఁగలుగుట మిక్కిలి దుర్ఘటముగాఁ గనుపింప "లేవవద్దు కూర్చోండి, కూర్చోండి" యని గొందఱు పోలీసుభటులచేతను మఱికొందఱిచేతను సత్యవరగ్రామమునసబు కరణములచేతనుఁ బెద్దపెద్దకేకలతోను చేతిబెత్తములతోను నదలింపఁబడిరి. తరువాత వీరతికష్టముమీఁద నీవలఁ బడి యాయుత్సవమునకుఁ దమ నూతనపరిచితులగు డిప్యూటీకలెక్టరుగారు మొదలగువారు వత్తురను నుద్దేశముతో వచ్చితిమి గాని లేనిచో రాఁదగినది కాదని తమలోఁదా మనుకొనుచుఁ దమయవస్థ నంతనుఁ దమ్మెఱిగినవా రెవ్వరును జూచి యుండకుండుటొకగొప్ప యదృష్టమని సంతోషించుచుఁ దాముఁ బడినశ్రమచే వగర్చుచుఁ దలపాగలను సవరించుకొనుచు "నేమియుఁ బోలేదుగదా" యని యొండొరుల నడిగి తెలిసికొనుచు మెల్లగా బసకుఁ దిరిగివచ్చిరి. వీరు బసకుఁ వచ్చువఱకు రాముఁడును గుప్పుసామియు వీథతలుపు తాళము వేసి యుత్సవముఁ జూడబోయిరి. ఇంటివారందఱు భాగవతముఁ జూడబోవుటచే నెన్నికేకలు పెట్టి పిలచినను నెవ్వరును బలుకలేదు. అప్పుడు తాము చేయఁదగినదేమియు లేక శ్రమదీర్చుకొనుచుఁ జల్లగాలిచేఁ దమతమ యాయాస ముపశమింపఁజేసికొనుచు వీథియరుగుపైఁ గూర్చుండిరి. పిళ్ళగారును నాయుఁడుగారును దమకు సంప్రాప్తమైన గాయములకుఁ దత్కాలచికిత్సలనైనఁ జేసికొని బాధ నుపశమింపఁజేసికొనుట కుపాయము గానకఁ దమతమ బాధలనుఁ దమగడుపులోనే యిముడ్చుకొనియు మొదలియారుగారును శెట్టిగారును దమతమదుస్తులు కొన్నిచో

ట్లఁ జిరిగిపోయి వానికి దుమ్మంటుకొని యుండఁ గాలిదెబ్బలచేతను మోఁచేతిపోట్లవలనను దమ సుకుమారశరీరముల కాయాసము గలుగఁ డా మింతటితో నింటికిఁ దిరిగి రాగలుగుటకు సంతోషించుచుఁ దమసేవకుల కెదురుచూచుచు దూరమున నెవ్వరుఁగానుపించినను దమసేవకులేయని భ్రమచే సంతోషించుచు వారు దమ్ముఁ జేరరాక దారిని బోవుచుండుటఁ గాంచి యాశాభంగముచే మనసు నొవ్వ నేసాధనమును గానక నిముస మొకసంవత్సరము గాఁ గడపుచుండిరి.

ఈవిధముగా వీరు రెండుమూడుగంటల కాలము గడపవలసివచ్చెను. తరువాత రాముఁడును గుప్పుసామియు వచ్చిరి. వారిమొగములు చూడఁ గలిగినప్పుడు వీరికొక గొప్పనిక్షేపము దొరకినట్లును దమకష్టమంతయు దీరినట్లును వీరికిఁగలిగిన సంతోష మింతింతని చెప్పనశక్యము. ఆసంతోష మీనలుగురు నుండవలసివచ్చిన యవస్థలో నుండి యనుభవించిన వారికేగాని యితరులకుఁ దెలియదు గదా!

వీరునలుగురు నరుగుమీఁదఁ గూర్చున్నప్పుడు పిళ్ళగారికి మేళములో నాడినభోగముది బహుమానముకొఱకుఁ దెల్లవారినతోడనే తమ బసకు వచ్చునన్న సంగతి జ్ఞాపకమునకు వచ్చి గుండెలలో ఱాయిపడినది. పెద్దమనుష్యులమని జెప్పుకొనుచు గౌరవముగా నాయూర డిప్యూటీకలెక్టరు మొదలగు గొప్పవారితో స్నేహముచేసి వారిసన్మానములనందుచున్న దమయింటికి బహిరంగముగాఁ బట్టపగలే [illegible]గంటలకిరువదియేండ్లవయసుగల భోగముదివచ్చు టందఱిగండ్లఁబడక తప్పదనియు భోగముది దారినిబోవునప్పుడే పదిమంది వెంటఁబడుచుందురు గాన నట్టియుత్సవసమయములో నెందఱు వెంటవత్తురోయనియు, నదియొంటరిగా రాకఁ దనతోనెవరెవ్వరిని దీసికొనివచ్చునో యనియు, నిదియంతయుఁ జూచిన వారు బహుమానమందుకొనుటకేవచ్చినదని నమ్ముటఁ దటస్థింపదనియు నీసంగతి డిప్యూటీకలెక్టరుగారికిఁ దెలిసిన

చో నాయన 'యాంటీనాచిగరల్ సమాజము'లోనివాఁడగుటచేఁ దను మానమర్యాదలకు భంగము గలుగుట నిశ్చయమనియుఁ దలఁచి యు దివఱకుఁ దటస్థమయిన యాపదలటుండ నీక్రొత్తయాపదగూడఁ దె ల్లవారినతోడనే తటస్థమగునని గుండెలలో బాయిపడ నాలోచించుఁ బిళ్ళగారు మతిపోయినవానివలె గూరుచుండెను. అంత నాతఁడు దన యాత్మగౌరవము నిలబెట్టుకొనుటకుఁ దానే తెల్లవారకపూర్వమే చీక టియుండగా నాభోగముదానియింటికిఁ బోయి దానికియ్య నిశ్చయిం చుకొని వాగ్దానముచేసిన బహుమానమును చేతఁదీసికొని దానికిచ్చి య ది తెల్లవారినతరువాత బసకు రాకుండఁ జేసి యప్రతిష్టకును నపవాద లకును బాలుగాకుండఁ దనమర్యాదను గాపాడుకొని తన వాగ్దానము ను నెఱవేర్చి యన్నమాట దప్పకుండ సంచరించుటవలనఁ దన యం తరాత్మకు సంతోషము గలుగఁజేసికొన నిశ్చయించుకొనెను. అట్లుగా క నాభోగముదానియింటికా చీకటిలో నడచిపోవుట శ్రమయని బ ద్ధకించి నిద్రబోయి మరునాడు వేకువతోడనే యేఁడుగంటలకుఁ బూర్వ మే వీథిలోనికిఁబోయి భోగముదంటికివచ్చు సమయమున కింటలేకుం డఁ దప్పించుకొందమన్నచోఁ దానిచ్చెదనన్న బహుమానమియ్యక దానిని దప్పించుకొని మొగముదాచికొన్నట్లుండుననియుఁ దా నప్పు డు దానికిఁ గనుపించకఁ దప్పించుకొనఁ గలిగినను నది దానాయూ రనున్నంతవఱకుఁ పిశాచమువలెఁ బీడించి యొకమాటికిమారుగా బ దిపర్యాయములు దనయింటిచుట్టును దిరిగి "బహుమానముకొఱకింటికి రమ్మని" రని యందఱితోఁ జెప్పి యల్లరిచేసి యందఱకుఁ దెలియున ట్లు చేయుటవలన మఱింత యల్లరియగుననియుఁ దా నట్లుచేయుటవ లన నిహపరములకు రెండిటికినిఁ గూడ హానిసంభవించుటయేగాకఁ దనగౌరవమునకువిశేషభంగముఁగూడదటస్థించుననియుఁ దెలిసికొనిరా ముఁడును గుప్పుసామియు వచ్చి తలుపుదీసినతోడనే నాలుగురూపాయీ

లు దీసికొని దానియింటికి వెళ్ళుటకు నిశ్చయించుకొని ప్రయాణోన్ముఖుఁడై వారికొఱ కెదురుచూచుచుండెను. ఒకవేళఁ గార్యావసరమెఱుఁగని యాయవివేకులుత్సవము జూచు వేడుకలోఁ దమయజమానులను మఱచిపోయి తెల్లవారువఱ కింటికి రాకపోవుట దటస్థించునేమో యన్న భయమీయనకు లేకపోలేదు. ఏది జరిగినను యీయనా సమయమునఁ జేయఁదగిన దేదియు లేదుగదా! ఇట్టిసమయములో దైవసహాయముకన్న నేమియు సాధనము లేదని చదువరులే గ్రహింపవలెను.

రాముఁడును గుప్పసామియు నుత్సవముఁ జూచి బసకుఁ దిరిగివచ్చి తలుపు తాళముఁ దీసి తమయజమానుల నింటఁ బ్రవేశపెట్టునప్పటికి దాదాపు మూడుగంటలు గావచ్చినది. తలుపు తెఱచినలోడనే పిళ్ళగారు లోపలకుఁ బోయి నాలుగురూపాయీలు జేబులో వేసికొని యిప్పుడే వత్తునని తనస్నేహితులతోఁ జెప్పి వీధిలోనికిఁ బోయెను. మొదలియారును శెట్టియు నాయఁడును దుస్తులను దీసివేసి తలుపు విగించక వెలుపలఁ దమసేవకులను బరుండుమని చెప్పి ఆయాసముచే నొడలెఱుఁగక నిద్రపోయిరి. ఇట్లు వీరు ముగ్గురును దమస్నేహితుఁడగు పిళ్ళగారు దనమొగమునకుఁ దగిలినగాయమునకుఁ జికిత్స చేసికొనుటకు బోయిరని యనుకొనిన ననుకొని యుండవచ్చును గాని వారావలకు బోయిన రహస్యకారణము మాత్రము వారెఱుఁగరు. వారికాసంగతి దెలసినను వారికామోదకరముగానే యుండును గాని తప్పులేదు. గాని పిళ్ళగారు దెల్లవారకపూర్వమే యీకార్యమంతయు సానుకూలము చేసి యింటికిఁ దిరిగి రావలయునని యావలకుఁ బోవు తొందరలో నేసంగతియుఁ దనస్నేహితులతోఁ జెప్పలేదు. మొదలియారుగారును, శెట్టిగారును, నాయఁడుగారును తమతమదుస్తులను దీసివేసి నిద్రపోవలయునన్న తొందరలో నెక్కడకుఁ బోవుచున్నావని గాని యెప్పుడు తిరిగి వత్తువని గాని పిళ్ళగారి నడుగలేదు. కాని తమ

స్నేహితుఁడు త్వరలో వచ్చునని మాత్రము నిశ్చయముగా నమ్మి తలుపు బిగించుకొనకయే నిద్రపోయిరి.

పిళ్ళగారు కొంతదూరము నడచి తాను దొడిగికొనియున్న దుస్తుతో బోగపువాండ్రు బసదగియున్న యింటికిఁ బోవుటవల్ల రహస్యముగాఁ జేయఁదలఁచిన కార్యము బహిరంగమై దానందఱి కండ్లబడుటయుఁ దనదుస్తునుబట్టి తన్నానవాలు పెట్టుట గూడఁ దటస్థమగునని యెంచి ధోవతిపైనఁ దాను ట్రౌజరు దొడిగికొన్న సంగతి జ్ఞాపకము దెచ్చుకొని దారిలో నొకచోట దన ట్రౌజరును దీసి తలపాగను ట్రౌజరును చంకలోఁ బెట్టుకొని తాను తొడిగికొనియున్న పెద్దకోటు ద్రిప్పి నెత్తికి ముసుగువేసికొనెను. ఇట్లు ముసుగువేసికొని కొంతదూరము నడిచి తాను గాళ్ళకుఁ దొడుగుకొన్న బూడ్సు చప్పుడగుచుండుటయు నవి మధ్యమధ్య గిట్టుపెట్టుచుండుటయుఁ దెలసికొనియట్టిచప్పుడుతో నీరహస్యవ్యాపారమునకు బోవుట మంచిదికాదని యెంచి వానినూడదీసి వానిని మేజోడును గూడ చంకఁ బెట్టుకొని నడువనారంభించెను. అట్లు కొంతదూరమేగిన తరువాత బోగమువాండ్రు బసచేసియున్నచోటుఁ దెలియక యెచ్చటికిబోవుటకును దెలియక నేమి చేయుటకును దోచక యెచ్చటికిఁబోవలయునో దెలియకుండ బయలు వెడలినందుకుఁ దన్ను తానే నిందించుకొనుచు నెవ్వరినైన నడిగినచో రహస్యము వెల్లడియగుననియు నారాత్రి బోగమువాండ్ర బసకు బోవుచున్న సంగతి దెలసి తన్నుగూర్చి యనుమానపడి యపవాదలాడుదురనియు నిట్టిసంగతులెంత రహస్యముగాఁ జేసినను వెల్లడికాకమానవనియు శంకించి యేమిచేయుటకును దోచక పిచ్చివానివలెఁ దిరుగనారంభించెను. తానింటికి దిరిగివచ్చినచోఁ దానుపడిన శ్రమయంతయు వృథాశ్రమయగుటయే గాకఁ గార్యసానుకూలము కానేరదని యెంచి పిళ్ళగారు వెనుకఁదిరుగుట కిష్టపడలేదు. అప్పటికించుమించుగా నాలు

సుగంటలైనది. భోగమువాళ్ళ బసకొఱకు వీథులవెంబడిఁ దిరుగుట వ
లనఁ గాలహరణమై తెల్లవారుటయుఁ దానాస్థితిలో నందఱికండ్లఁ బ
డుటయు గూడఁ దటస్థమగునని పిళ్ళగారు భయపడి తనకెదురుగావ
చ్చుచున్న నొకపురుషుని గాంచి యాతనినడిగి భోగమువాండ్ర బసదె
లిసికొందమని యూహించెను. కాని "భోగమువాండ్ర బసయెక్కడ"
నని యడిగినచో నాతఁడనుమానపడక మానఁడనియు నాతఁ డొకవే
ళ దనకుఁ దెలియదన్నచోఁ దనరహస్యమతనికిఁ జెప్పియు లాభములేక
యే పోవలసివచ్చుననియు నొకవేళ నాతఁడు బుద్ధిపూర్వకముగఁ గా
ని తెలియకగాని తప్పుత్రోవ చూపించినచో నెవరియింటికిఁ బోయి
భోగమువాండ్ర యిల్లనుకొని మఱింత కష్టమునకుఁ బాలౌదునో! యని
యు నితనికి సందేహము తోఁచెను. ఏమైననుఁ దెల్లవారులోపల యీ
భోగముదానికి బహుమానమియ్యక తీరదు కావున నాతఁడేమనుకొ
న్నను నేమిసేసినను సరియే యని దైవముమీఁద భారమువైచి యాత
ని మెల్లఁగాఁ జేరి సంభాషణములోనికి దింపి యాతనికిఁ దెలియకుండ
యుక్తియుక్తముగఁ దనగడుసుతనమును దెలివిని సంపూర్ణముగా వి
నియోగపఱచి భోగమువాండ్ర యిల్లుదెలిసికొన నిశ్చయించుకొని
యాతనితో నీక్రిందివిధమున మాటలాడెను.

పిళ్ళ—మీ రెచ్చటనుండి వచ్చుచున్నారు.

ఆమనిషి—ఉత్సవముచూడఁబోయి భాగవతము కొంత చూచి యింటి
కిఁ బోవుచున్నాను.

పిళ్ళ—ఈయుత్సవము బహుచక్కఁగా జరిగినదనుమండీ?

మని—ఈకళ్యాణోత్సవ మేటేట మిక్కిలి వైభవముతో జరుపఁబడు
ను. ఈసంవత్సరము కూడ యదేప్రకారము చక్కఁగానే జరిగినది.
మీ రెచ్చటినుండి వచ్చుచున్నారు.

పిళ్ళ—నేనును కళ్యాణము చూచి యింటికిఁ బోవుచున్నాను. యా

ర్త్రాస్థులకు మంచినదుపాయములు సేయఁబడియున్నవి సుమండీ!

మని—డిప్యూటీకలెక్టరుగారును తహసీలుదారుగారును వారమువది రోజులనుండి యిక్కడనే మకాము సేసి యీ సదుపాయములన్నిటినిఁ జేసినారు.

పిళ్ళె—ఈ రాత్రి యుత్సవములో నాఁడిన భోగముమేళ మెక్కడిదో కాని యందులో నభినయించిన భోగముమనిషి మిక్కిలి తెలివికలది సుమండీ!

మని—వాళ్ళు దీయూరు కాదండి నేఁడాడిన భోగముమనిషి చక్కఁగాఁ బాడకలదు. దానిపాట మీరు వినలేదని తోచుచున్నది. అదిమిక్కిలి తెలివికలది. దానినీచుట్టుపట్ల మేళములకుఁ దరుచుగ బిలుచుచుందురు.

పిళ్ళె—పాపము వాళ్లెక్కడ బసచేసినారండి ?

మని—వాళ్ళకు బసయనఁగనేమి ? ఏయింటి వీధిగదిలోనో బసచేసియుందురు. రాత్రివేళల డిప్యూటీకలెక్టరుగారింటికో తహసీలుదారుగారియింటికో మఱియే గృహస్థునియింటికో వచ్చువాండ్రందఱు పోయి యచ్చటనె బరుండుదురు. మేళములోనున్న ముసలిది మాత్రమొకతిరాసామాను భద్రముగాఁ జూచుకొనుచు నాబసలో నిద్రించును. తక్కినమగవాండ్రు తమయిష్టమువచ్చినచోటికిఁ బోయి యుందురు. వీండ్రకు బసయనఁగనేమి. భోగమువాండ్రకు రసికులయిండ్లన్నియు స్వగృహములే.

పిళ్ళె—ఈమేళ మెక్కడబసచేసినదండి ?

మని—ఆముందు గనిపించుచున్న యడ్డత్రోవను నెడమవైపునకుఁ బోనఁ గుడిచేరిపైపున నాల్గవదైన రౌత్తరఁగులయింటిలో వీధిగదిలో బసదిగినారు. (అనిచెప్పి) పిళ్ళెగారి వేషమును నాతఁడు తనతో మాటలాడినసందర్భములేని మాటలనుబట్టి యీతఁడు భోగము

వాఁడు బసకుఁ బోవుచున్నాఁడని గ్రహించి యాతఁడు కొంతదూరము పోయిన తరువాత యాతనికిఁ దెలియకుండ మెల్లఁగాఁ నాతనిఁ గనిపెట్టుచు నడువసాఁగెను. పిళ్ళ గారు చీకటిచాటున మెల్లఁగా నడచి యాకొత్తరఁగులయిల్లు సమీపించి గుమ్మములో నున్న మెట్లొకటి యొకటిగా మెల్లఁగ నెక్కి యరఁగుమీఁద ప్రవేశించి గదిగుమ్మముఁ జేరి మెల్లఁగాఁ దలుపుఁ గొట్టెను.

లోపలనుండి—ఎవరువారు?

పిళ్ళ—తలుపుతీయుము.

లోపల—మీరెవరో చెప్పినఁగాని తలుపుతీయుటకు వీలులేదు.

పిళ్ళ—నే నెవరో చెప్పెదను. ముందు తలుపుతీయుము.

లోపల—మీ రెవరో చెప్పనిదే యీరాత్రివేళ నేనెట్లు తలుపుతీయుదును! ఈయుత్సవములో దొంగలభయము విస్తారముగా నున్నది. మీరెవరో యెందుకు వచ్చినారో! చెప్పనిదె నేను తలుపు తీయను.

పిళ్ళ—నేను దొంగనుగాను, గొప్పవాఁడను, పెద్దమనిషిని నీవు సందేహింపవలదు. తలుపుతీయుము.

లోపల—ఈలాగున రాత్రివేళ వచ్చి తలుపు కొట్టడము పెద్దమనుష్యులకుఁ దగదు. మీరు పెద్దమనుష్యులమనిన నే నమ్మను. మీగౌరవము గీరవము నాకుఁ దెలియదు. నేను తలుపుతీయను.

పిళ్ళ—నామాట నమ్ము. నేను ప్రమాణముగాఁ జెప్పుచున్నాను. నే నొకమాట చెప్పి వెళ్లెదను. నీకులాభమున్నది. తలుపుతీయుము.

లోపల—మీప్రమాణములు సత్యములు నాకుఁ దెలియవు. నాకు లాభము గీభము నక్కఱలేదు, నాతో మీరు చెప్పవలసినమాటలు లేవు. నేను వినవలసిన యవసరమును లేదు.

పిళ్ళ—లోపల యింకనెవ్వరైన నున్నారా? ఎవరున్న నా కక్కఱ లే

దు. నేను లోపలకు రాను. తలుపు సగముతీసి నే జెప్పుమాట నొకటి విన్నచాలును.

లోపల—నేను తలుపు అసలే తీయను. లోపలెవరుండిన నీకేందుకు. అరగంటనుంచి నిద్రపోనీయకుండ తలుపుకొట్టుచున్నావు. వెళ్ళిపో యిక్కడెవ్వరు లేరు. నిద్రపోనీ! నీవేమిచెప్పినను నే తలుపు తీయుదానను కాను. (అనిమాటలాడక యూరకుండెను)

తరువాత పిళ్ళగారు గుమ్మమువద్ద నిలఁబడి యనేకవిధములఁ బ్రార్థించి బ్రతిమాలుకొని యేమేమో చెప్పసాఁగెను కాని లోపల నుండి యెవ్వరును పలుకరైరి. అంత నాతఁడు ప్రాణము విసిగి తలుపు కొంచెము గట్టిగఁ గొట్టనారంభించెను. అప్పుడు గదిలోఁ బరున్న భోగముది గట్టిగా "దొంగ! దొంగ!!" యని కేకలువేసెను. ఆకేకలు విని యింటిలోనున్న వారెల్ల భయపడి యులికిపడి లేచిరి. ఆసమయమునఁ బిళ్ళగారు కాళ్ళు గజగజవడఁక నేమిచేయుటకుఁ దోఁచక యరఁగెక్కినమార్గముననె దిగిపోయినచో నింటిలోనివారు వీధితలుపు తీసుకొనివచ్చి తన్నుఁ జూతురని యెంచి యరఁగుమీఁదినుండి క్రింద కు దుమికి పడి మోకాళ్ళకు దెబ్బలు తగల్చుకొని త్వరగా లేచి పరుగెత్తుకొని పోయినచో దొంగయని నిశ్చయించి వెంబడింతు రని మెల్లఁగాఁ జాటుచాటున నడచుచు దారివెంబడిని పోవుచుండెను. ఇట్లాతఁడు అయిదారుబారల దూర మేగిన తరువాత యితనికి దారిలోఁ గనిపించి భోగమువాండ్రబస గుఱ్తు చెప్పిన మనుష్యుఁడు కనిపించి "ఏమయ్యా! నీవెందులకో యడుగుచున్నావనుకొంటిని; ఈరాత్రివేళ నొంటరిగాఁ బోయి భోగమువాండ్రు బసదిగియున్న గదితలుపుఁ గొట్టుట యేమిపని. సరసమునకుఁ బోవుటకు మిక్కిలి చక్కనిసమయమును చక్కనిమార్గమును నాలోచించితివి. మీరెవ్వరోగాని మీరుచేసిన పని యంతయుఁజూచిన మిక్కిలి యాశ్చర్యకరముగానున్నది. చాలు! చాలు'! అనియెను.

పిళ్ళె—ప్రమాణముగా వాస్తవముగాఁ జెప్పుచున్నాను. నాకేమి యుద్దేశమును లేదు. నేను భోగమువాండ్ర యిండ్లకుఁ బోవువాఁడను కాను. నేను సరసమునకుఁ బోలేదు. ఉత్సవములో భోగముమేళము చూచి యందలి యాటకత్తెకు నేనైన బహుమాన మియ్యవలయునని యెంచి యుదయమెనిమిదిగంటలకు నేను బసదిగిన యింటికి రమ్మని చెప్పినాను. అది బహిరంగముగఁ బట్టపగలు జాబనకు వచ్చుటవలన నాగౌరవమునకు హానికలుగును. వట్టియపవాదములు పుట్టునని యెంచి నేను దానికీయనిశ్చయించుకొన్న బహుమానము నిరాత్రియే యిచ్చివేసి దానిని నాయింటికి రాకుండఁ జేయవలయునని వచ్చినాను. ఇది వాస్తవము. నామాట నమ్ముమని (రెండుచేతులు పట్టుకొని బ్రతిమాలుకొనుచు) ఈసంగతి మీరెవ్వరికినిఁ దెలియనీయవద్దు. అయినదేమో యయినది. నన్ను నలుగురిలోఁ బెట్టినందువల్ల మీకేమియు లాభములేదు. నన్నురక్షించి యీసంగతి యంతయుఁ గప్పునఁ బెట్టుకొనవలెను. అనిఅతివినయముగాఁ బ్రార్థించెను.

ఆమని—పెద్దమనుష్యులను నల్లరిచేయరాదనియు వారినిఁ గూర్చి యితరులతోఁ జెప్పఁగూడదనియు నాకు మీరు వేఱే చెప్పనక్కరలేదు. కాని మీపెద్దమనిషితరహా మాత్రము నాకు తెలియలేదు. మీచర్యలన్నియు చూచిన మిక్కిలి వింతగా నున్నవి. ఈమాట మీకు నాకు గనిపించినప్పుడే చెప్పినయెడల నేనాసైపునకే బోవుచున్నాను కావునను నేను వాళ్లమేళములోఁ జేరియుండుట చేతను మీకింతశ్రమ యక్కఱ లేకుండగనే నన్ను నమ్మి నాచేతి కాబహుమానమిచ్చినచో నేనది దానికిచ్చి దానిని మీయింటికి రాకుండునట్లు చేసియుందును గదా! ఇంతకు మీరింతగడుసుతనమునకుఁ బోయి యీయిరఁగుమీఁదనుంచి క్రిందఁబడి యింతశ్రమ పడవలసివచ్చినది. ఇదియంతయు మీరేచేసికొనినారు. నన్ను నమ్మి నాతోఁ జెప్పక

పోవుటచే నదియంతయు తటస్థించినది. పోనీయండి దానికేమి.

పిళ్ళె—(చేతులు రెండును బట్టుకొని) మిమ్ములను నమ్మి మీతో నీసంగతి చెప్పలేదని మీరేమియు ననుకోవద్దు. మీరెవరో అనుకున్నాను. మీసంగతి నాకుఁ దెలిసినది కాదు. క్షమించండి! ఇప్పుడే నాలుగు రూపాయీలు మీ చేతికిచ్చెదను. దానికిపి యిచ్చి నాకీయుపకారము చేయక తప్పదు. అని (బ్రతిమాలుకొనెను)

ఆమని—సరె, మీకునమ్మకముంటె అలాగుననే యిప్పించండి.

అప్పుడు పిళ్ళెగారు కోటుజేబులో జేయిపెట్టి రూపాయీలందులోఁ గానక తక్కిన జేబులన్నియు వెదకి కోటుతీసి త్రిప్పికప్పుకొన్నప్పుడు క్రిందఁ బడిపోయియుండునని నిశ్చయించుకొని, "రూపాయీలు క్రింద జారిపోయినట్లున్నవి. నాతో మీరు శ్రమయని యెంచక మా బసకుఁ రావలెను. రూపాయీలు యిచ్చెదను" అనెను.

అందు కామనుష్యుఁడు, మీరు రూపాయీలు లేకయె నాతో నట్లనుచున్నారనియు నేను మీబసవఱకు నడచి రాజాలననియు నాకు నిద్రగూర్కొని వచ్చుచుండుటచే నింటికిఁ బోయి నిద్రబోవలెననియుఁ జెప్పి నడువసాఁగెను. అప్పుడు పిళ్ళెగారాతనియొద్దకుఁ బోయి చేయి పట్టుకొని దానికిచ్చెడు బహుమానముగాక మరినాలుగు రూపాయీలు లాతనికిచ్చెదనని బ్రతిమాలుకొనెను. ఎట్టకేలకుఁ దానుబసకు వచ్చినందుకు నాలుగురూపాయీ లిచ్చెదనని పిళ్ళెగారిచే ననేక ఘోరప్రమాణములు చేయించి యతని వెంటబోయెను. పిళ్ళెగారు తమకార్యమునకెట్టి విఘ్నములు నడుమ సంప్రాప్తమయినను దుదకీవిధముగ ననుకూలముగఁ బనిజరుగుటకు మిక్కిలి సంతోషించి తనయదృష్టమును మెచ్చుకొనుచు బసచేరి మెల్లగాఁ దలుపుతెఱచి లోనికిఁ బోయి యలమారులో సంచిలోనున్న రూపాయీలలో నాలుగురూపాయీలు బహుమానముక్రిందను నాలుగురూపాయీ లామనుష్యునకీయీనాముక్రిం

దనుఁ జప్పుడు కాకుండఁ దీసి యీవలకు వచ్చియా యెనిమిది రూపాయీ లత
ని చేతిలోఁ బెట్టెను. అప్పు డాతఁ డా యెనిమిది రూపాయీలు లెక్కపెట్టక
యే తీసికొని కొంగున మూటకట్టి యొడిలో దోపుకొని "దానిరూపాయీ
లే" వనియడిగెను. అందుకుఁ బిళ్ళగారు బోగము దానికీయవలసిన బహు
మానము రూపాయీలున్ను మీరూపాయీలున్నుఁ గలిపియే యిచ్చితి
నెను. అందు కాతఁడు ఆరూపాయీలన్నియుఁ దనకిచ్చినవే యనియు
దానిరూపాయీలు గూడ యిచ్చినఁగాని యిచ్చటనుండి కదలననియుఁ
దన్నంతదూరము యీనపెట్టి తీసికొనివచ్చి యూరక బొమ్మనుటేమి పె
ద్దమనిషితనమనియు గట్టిగా మాటలాడ నారంభించెను. అప్పుడు అ
లాగే రూపాయీలిచ్చెదను గాని గట్టిగా మాటలాడవలదని బ్రతిమాలు
కొని తలుపు దెఱచి గదిలోనికి వచ్చి సంచిలోఁ గావలసిన రూపాయీ
లు లేకపోవుటచేఁ బెట్టెతీయవలసిన యవసరము కలిగి యక్కడ న
ద్దముగ బరుండియున్న తనస్నేహితులను మెల్లఁగాఁ దప్పించుకొని
మెల్లఁగాఁ బెట్టెతెరచి నాలుగురూపాయీలు తీసి చేతఁ బట్టికొని తిరిగి
పెట్టె వేయుటలోఁ గొంచెము చప్పుడై మొదలియారుగారికి మెలకువ
వచ్చి యేమిటని యడుగుట సంభవించెను. పిళ్ళగారు దానికి నేమి
యు లేదని సమాధానము చెప్పి, తనప్రక్కమీఁద బరుండి మొదలియా
రుగారు తిరిగి కనుమూసి నిద్రచెందువఱకుఁ దానుబరున్నట్లభినయిం
చి తరువాత నాతనికా రూపాయీలిచ్చి పంపివేయవలయునని యూ
హించి యట్లు చేసెను. కాని యింతలో గుమ్మమువద్ద వేచియున్న
నామనుష్యుఁడు తొందరపడి "దానిరూపాయీలీయకుండ లోపలికి వె
ళ్ళి దాగియుండి యింకను రావేమని" బిగ్గరగా కేకలు పెట్ట నారంభిం
చెను. ఆకేకలు తనస్నేహితులు విందురనియుఁ బైవారుఁగూడ విన్న
చో నప్రతిష్ఠాకరముగ నుండుననియు నెంచి పిళ్ళగారు లేచి తలుపు
తెరువ నాతఁడు వెలుపలనుండి తలుపు నెట్టుకొని లోపలకు రాఁబ

యత్నించెను. లోపలకు రావద్దని పిళ్ళగారాతని నష్టుకొనుటకుఁ దలుపు దగ్గఱగా వేసెను. అటు పిళ్ళగారు తలుపుమూసిన కొలఁది నాతఁడు వెలుపలనుండి గెంట నారంభించెను. ఇట్లుకొన్ని నిమిషములు అయిన తరువాత నామనుష్యుఁడు తలుపులు గెంటుకొని లోపలకు వచ్చెను. ఈసందడికి మొదలియారుగారును శెట్టిగారును నాయుఁడుగారును లేచిరి. తరువాత మొదలియారుగారు పిళ్ళగారివల్ల సంగతియంతయు విని తెలిసికొని ముష్కరుఁడైన యామనుష్యుని నేవిధముగనైనఁ బంపివేయుట యుచితమని యెంచి యాతనికిఁ బదేనురూపాయలిచ్చి ప్రతిమాలి యావలకుఁ బంపివేసెను.

అప్పటికయిదుగంటలాయెను. కాకులు నలుదిక్కులఁ గూయఁ దొడఁగెను. పక్షులు తమ కులాయకూటములను విడిచి యార్చుచుఁ బరువులెత్తసాఁగెను. దేవాలయములో నన్నాయివాండ్రు మేలుకొలుపులు పాడుచుండిరి. తాము బసదిగిన గృహస్థుండును నాతని కుమారులును ద్వాదశోర్ధ్వపుండ్రములను ధరించి స్వచ్ఛముగాఁ దోమఁబడిన యక్షయపాత్రలను చేతఁబూని భుజములకు జోలెలు దగల్చుకొని హరినామసంకీర్తనము సేయుచు వీథియరుగుపైఁ గూర్చుండిరి. రాముఁడు గుప్పుసామియు మాత్రము దారికడ్డముగా నొడలెఱుంగక బరుండి నిద్రించుచుండిరి. యాత్రస్థులు లేచి నడువసాగిరి. డప్పులు, జేగంటలు, భజనలు ధ్వనిసేయుచు దారివెంబడిఁ బోవుచుండెను.

నాల్గవ ప్రకరణము.

తరువాత నీనలుగురును దమతమదుస్తులను దొడిగికొని యాపినమేఁ బయలు వెడలిపోవుట కేర్పఱచుకొని తమ నూతనస్నేహితుఁడగు పార్థసారథిం గలుసుకొని ప్రయాణమునకుఁ దగినయేర్పాటులనుఁ జేసికొనుటకు డిప్యూటీకలెక్టరుగారింటికిఁ బోయిరి. వీరు డిప్యూటీకలెక్టరుగారితో మాటలాడుచుండఁగాఁ బార్థసారథి యచ్చటికి వచ్చెను. మొదలియారు తామాదినమే ప్రయాణమై పోనిశ్చయించుకొన్నామని పార్థసారథితోఁ జెప్పెను. పార్థసారథి తానుఁ గూడ వారితోఁ బయలువెడలుటకు సిద్ధముగా నున్నానని చెప్పెను. డిప్యూటీకలెక్టరుగారు మఱునాఁడుదయమునకుఁ దప్పక కలెక్టరునుఁ గలుసుకొనక తీరదుగనుక తానును వత్తుననిరి. డిప్యూటీకలెక్టరుగారి కొక గుఱ్ఱపుబండియు చిన్నగుఱ్ఱమును నున్నవి. ఆబండి స్వయముగాఁ దోలుకొనవలసిన 'డాకార్టు' (Dog Cart) ఆబండిలోఁ దనతో నిఁక ముగ్గురిని దెక్కించుకొని పోయెదనని చెప్పి డిప్యూటీసూపరింటెండెంటుగారి యొద్దకు వెంటనే పోయి వారి గుఱ్ఱముగాని బండిని గాని యడిగి తీసుకొని నీవును మఱియొకరును వచ్చుటకు నేర్పఱచవలసినదని పార్థసారథితోఁ జెప్పెను. పార్థసారథి డిప్యూటీకలెక్టరుగారి గుఱ్ఱపుబండిలోఁ దానుఁ దననలుగురిస్నేహితులలోనొకరును గూర్చుండిపోవచ్చునని యుద్దేశించెను. డిప్యూటీసూపరింటెండెంటుగారి కొక బండియు గుఱ్ఱమును నొక సవారిగుఱ్ఱమునుఁ గలవు. వారు గుఱ్ఱపుసవారిలో మిక్కిలి నేర్పరియనియు గుఱ్ఱమెక్కుటయే వారికి నిష్టమనియు డిప్యూటీకలెక్టరుగారునుఁ బార్థసారథియుఁ జెప్పుకొనుచు వారికి షికారునందును వేటయందును గల యభినివేశమునుఁ జెప్పుకొనుచు శ్లాఘింపఁ జొచ్చిరి. ఈమాట

లు విని శెట్టిగారు తమస్నేహితులగు తిరుమంగయాళ్వారు నాయఁడుగారుకూడ మిక్కిలి నేర్పుతో గుఱ్ఱపుసవారీచేయఁగలవారనియు నెట్టి గుఱ్ఱమునైన నెక్కి స్వాధీనముచేసికొనఁగలరనియు గుఱ్ఱపుఁబందెములు కూడ వేయఁగలరనియు నిదివఱకనేకపందెములు వేసి గెల్చినారనియుఁ జెప్పిరి. మొదలియారుగారు తిరుమంగయాళ్వారునాయఁడుగారి పేరుసెప్పిన గుఱ్ఱములు నీళ్లేత్రావవనియు నశ్వశాస్త్రములో నంతటిప్రవీణుఁడుసాధారణముగా హిందువులలో లేనేలేఁడనియుఁ జెప్పిరి. పిళ్ళగారు నకులునికన్న నెక్కువవాఁడనియు గుఱ్ఱము లీయన మొగము చూచినతోడనే గజగజవడఁకుననియు శ్లాఘించిరి. తిరుమంగయాళ్వారు నాయఁడుగారు మందహాసముసేయుచుఁ దా ననేకగుఱ్ఱములు సవారీచేసితిననియుఁ వెనుక నొకబెదురుగల దుష్టజాతి పొగరుబోతుగుఱ్ఱమును గుఱ్ఱపువర్తకులు తీసికొనివచ్చి దాని నెవ్వరును గొనుటకు సాహసింపకఁ బోవుటచేఁ దానాగుఱ్ఱమును మిక్కిలి చవుకగాఁ గొని దానిని నారుదినములలోఁ గుక్కవలెఁ జేసితిననియు గుఱ్ఱపుసవారీలో నున్నరహస్యములన్నియుఁ దనకుఁ దెలియుటయేకాక అశ్వశాస్త్రమును నశ్వచికిత్సయుఁ గూడఁ దా నెఱుఁగుదుననియుఁ జెప్పిరి. అంతఁ బార్థసారథి యిప్పుడేవత్తు నని చెప్పి డిప్యూటీసూపరింటెండెంటుగారి యింటికిఁబోయి వారిని గుఱ్ఱపు బండి నెరువిమ్మని యడిగెను. డిప్యూటీసూపరింటెండెంటుగారు తా నొకకేసులో సాక్ష్యమిచ్చుటకు రాయవరగ్రామములో మరునా డుదయమునకు సిద్ధముగానుండవలయును గానఁ దానాసాయంత్రమువఱకు సత్యవరములోనే యుండవలసియున్నదనియుఁ దాను చీఁకటిలో గుఱ్ఱమెక్కిపోఁజాలననియు సాయంత్రము భోజనముసేసి బండిపైనఁ బోవుట కేర్పఱచుకొంటిననియు సవారిగుఱ్ఱము కావలసిన యెడల నిచ్చెదననియుఁ జెప్పిరి. అందుపైనఁ దిరుమంగయాళ్వారునాయఁడుగారు గుఱ్ఱపుసవారీలోఁ బ్రవీణుఁడు కా

పుసవారికి గుఱ్ఱమిచ్చి డిప్యూటీకలెక్టరుగారి బండితోఁ బంపివేసి తానాసాయంత్రము వఱకచటనే యుండి డిప్యూటీసూపరింటెండెంటుగారితో వారి బండిపై వెళ్లుటకు నిశ్చయించుకొని చేయవలసిన యేర్పాటులన్నియుఁ జేసి డిప్యూటీకలెక్టరుగారి యింటికిఁ దరిగివచ్చి తాను చేసిన యేర్పాటులన్నియుఁ జెప్పెను. డిప్యూటీకలెక్టరుగా రాయేర్పాటులకు మిక్కిలిసంతోషించి తిరుమంగయాళ్వారు నాయుఁడుగారు తప్పక గుఱ్ఱమెక్కి తమబండితో వచ్చుటయె మంచిదనియు నట్లు వచ్చుటవలన నీస్నేహితులు నలుగురిలో నొకరు ముందును నొకరు వెనుకనుఁ బోయి యొకరికొకరు వేఁచి యుండవలసినయవసరముండదనియుఁ దాము భోజనముచేసి మధ్యాహ్నము రెండుగంటలకు బయలుదేరి సులభముగ రాత్రి భోజనమునకుఁ బోవచ్చుననియుఁ జెప్పిరి. పార్థసారథి తిరుమంగయాళ్వారునాయుఁడుగారికి గుఱ్ఱపుసవారీచేయు నదృష్టమును నవకాశమునుఁ గలుగచేయఁగలిగినందులకుఁ దనకు మిక్కిలి సంతోషకరముగా నున్నదనియెను. మొదలియారుగారును శాస్త్రిగారునుఁ బిళ్ళగారునుఁ దమస్నేహితుని గుఱ్ఱమెక్కి రమ్మని ప్రోత్సాహము చేసిరి.

తిరుమంగయాళ్వారునాయుఁడుగా రంతకుఁ బూర్వము పదిపదేనుసంవత్సరములనుండి గుఱ్ఱమెక్కి యెఱుఁగఁడు. గుఱ్ఱపుసవారి బొత్తిగా వీరు మరచిపోయియే యుండవచ్చును. ఒకవేళఁ బూర్వపరిచయముచే గుఱ్ఱపుసవారీ కొంచెము జ్ఞాపకమున్నను వారు రాత్రి గళ్యాణోత్సవములో రథచక్రముమీఁదఁ బడినప్పుడు మోకాలికిఁ దగిలిన గాయమువలన గుఱ్ఱమెక్కుటకుఁ దగిన స్థితిలో బొత్తిగా లేరని చెప్పవచ్చును. కాని గుఱ్ఱమెక్కలేనన్నచోఁ దనయాత్మగౌరవమునకునుఁ దన యశ్వశిక్షానైపుణ్యమునకును భంగము కలుగునని యెంచి మాటలాడక యూరకొనిరి. తనస్నేహితులందఱుఁ దిరుమంగయా

ళ్వారు నాయుఁడుగారి చుట్టు చేరి గుఱ్ఱమెక్కుమని మరిమరి ప్రోత్సాహము చేయుచుండుటచే గుఱ్ఱమెక్క లేనని చెప్పుటకు సిగ్గును నభిమానమును గుఱ్ఱమెక్కినచోఁ దనకేమి హానిచేకూరునోయను భయమును గుఱ్ఱమెక్కుట కిష్టము లేదన్నచోఁ దన్నుఁగూర్చి తనస్నేహితులటుండ డిప్యూటీకలెక్టరుగారును బాఘశారధియు నేమనుకొందురో యనుసంశయమునుఁ దిరుమంగయాళ్వారు నాయుఁడుగారినిఁ బీడింప వారిహృదయ మల్లకల్లోలమై యుండెను. జంతువులకుఁ బ్రాణభయమునకన్న మరియొక యెక్కువ భయమేదియు లేదుకద! గుఱ్ఱమెక్కుటలవాటులేక దా నిప్పుడెక్కఁబోవు గుఱ్ఱమునుఁ దా నిదివఱకుఁ గన్నులతోనైనఁ జూచియుండక తనమోకాలునకుఁ దలిగిన గాయమువలన గుఱ్ఱముపైఁ గూర్చుండుటకయినఁ దగియుండని యీనాయుఁడుగారికి గుఱ్ఱమెక్కవలసి వచ్చినందుల కప్పుడు గలిగిన భయమునుఁ బ్రాణములతోఁ దిరిగి తనభార్యాపుత్రులనుఁ జూడఁగలుగుదునో లేదో! యనుసందేహమును మిక్కుటముగాఁ గలిగెను. కానియేమైనను దైవముమీఁద భారము వైచి తనయాత్మగౌరవముఁ దక్కించుకొనుటకు గుఱ్ఱమెక్కక తప్పదని నాయుఁడుగారు నిశ్చయించుకొని దైవానుగ్రహమువలనఁ దనకాయుర్దాయమున్నచో భయముండఁగూడదని కొంచెము ధైర్యముఁ దెచ్చికొని గుఱ్ఱమెక్కెదనని నోటితోఁ జెప్పుటకు ధైర్యము లేకపోయినను దలయూచి యొప్పుకొనెను. తా నెక్కఁబోవు గుఱ్ఱ మల్లరిచేయునేమో! యను భయమునుఁ బొగరుమోతుదేమో, యను సంశయమును వీరికి లేకపోలేదు. ఏమైనను వీరు గుఱ్ఱము నెక్కిపోవుట తప్పినదికాదు. తరువాత గొంతసేపాలోచించి నాయుఁడుగారా గుఱ్ఱము పొగరుబోతుతనమును బెదురును లేనిదియే కదా! యని యడిగిరి. అందుకుఁ బాఘశారధియు డిప్యూటీకలెక్టరును నది మిక్కిలి సాధుస్వభావము కలదియే యనియు నాగుఱ్ఱమును డిప్యూటీ సూ

పరింటెండెంటుగారి పిల్లలుకూడ సవారిచేయుచుండ నెన్నియో పర్యాయములు చూచితిమనియుఁ జెప్పిరి. తిరుమంగయాళ్వారునాయుఁడుగారు తాను గుఱ్ఱమెక్కవలసివచ్చెనని దిగులుపడి తానాదినము లేచిన వేళమంచిదికాదని యాలోచించుచు దైవముమీఁద భారమువైచి గుఱ్ఱమెక్కి బండితోఁ బోవుట కొప్పుకొనెను. తరువాత వీరందఱుఁ గలసి దేవాలయములోనికిఁ బోయి యక్కడ దేవుని దర్శించి డిప్యూటీకలెక్టరుగారి బసకువచ్చి యందఱుఁ గలసి భోజనముచేసిరి.

భోజనమైన తరువాత మొదలియారుగారును వారిస్నేహితులునుఁ దమబసకువచ్చి తమసామానంతయు సర్దుకొని రెండుబండ్లపైన వేసి రాముని గుప్పుసామిని నాసామాను బండ్లతో రాయవరము రమ్మని చెప్పి ప్రయాణోన్ముఖులై డిప్యూటీకలెక్టరుగారియింటికిఁ దిరిగివచ్చిరి. ప్రయాణమాసన్నమైనకొలఁదిఁ దిరుమంగయాళ్వారునాయుఁడుగారికి భయమభివృద్ధియై గుండెలలో రాయిపడెను. డిప్యూటీకలెక్టరుగారితో వీరు కొంచెముసేపు ముచ్చటించి రెండుగంటలకుఁ ఫలహారముసేసి బండికట్టించిరి. తిరుమంగయాళ్వారునాయుఁడుగారు తనకుఁ దటస్థమయిన యవస్థకుఁ జింతించుచు దారిలోఁ దనకు రాఁబోవు నాపదలనెల్ల నూహించుకొనుచు మతిపోయి ఫలహారమైనఁ దిన్నఁగాఁ జేయలేదు.

తరువాత డిప్యూటీకలెక్టరుగారును మొదలియారుగారును ముందువైపునను బిళ్ళయశెట్టిగారును వెనుకవైపునను నాడాకార్ట్లుపైఁ గూర్చుండ డిప్యూటీకలెక్టరుగారు బండితోలుచుండిరి. పార్థసారథి గుఱ్ఱమునకు జీనుకట్టి సిద్ధముగా నుంచ మని డిప్యూటీసూపరింటెండెంటుగారికి వర్తమానమంపి నాయుఁడుగారినిఁ దీసుకొని పోయెను. తిరుమంగయాళ్వారునాయుఁడుగారు కాళ్ళీడ్చుకొనుచు మనసులో నేమేమియో యాలోచించుచు బలవంతముగాఁ బోయినట్లు డి

ఫ్యాటీసూపరింటెండెంటుగారి యింటికిఁ బోయెను. అప్పుడు గుఱ్ఱమును సిద్ధపఱచి సూపరింటెండెంటుగారు వీరికై యెదురు చూచుచుండిరి. వీరిని చూచినతోడనే సగౌరవముగా వీరిని మన్నించి జీనుకట్టి గుఱ్ఱము సిద్ధముగానున్నదని చెప్పి గుఱ్ఱమును దీసుకొనిరమ్మని గుఱ్ఱపువానికాజ్ఞాపించెను. గుఱ్ఱమును దీసికొనివచ్చినతోడనే దానినిఁ జూచితిరుమంగయాళ్వారునాయఁడుగారు శరీరమంతయు వడఁక లేనిధైర్యమును దెచ్చికొని దైవమునకు మ్రొక్కికొని యాగుఱ్ఱము మిక్కిలి యెత్తైనదియుఁ జురుకైనదియు నగుటచేఁ బలవంతముగఁ గాళ్ళు వెనుకకు లాగ మెల్లగానడుగులిడుచుఁ బోయి దానిని సమీపించి గుఱ్ఱపువాఁడును మఱియొకఁడును దన్నుఁ బైకిఁ ద్రోయ నెట్టెటులో నతికష్టముమీఁద గోడ నెగఁబ్రాకునటు లాగుఱ్ఱముపై నెక్కి కూర్చుండి కళ్లెములు చేతఁ బట్టుకొని యప్పటికొకగండము తీరినదని సంతోషించుచు మెల్లఁగా నడువసాఁగెను. అట్లుకొంతదూరమేఁగినతరువాత పెద్దపెద్దకరతాళములు వాయించుకొనుచు దీపపుశమ్యానొకఁడుపట్టుకొనఁ గొందఱు నెమలికుచ్చులను పట్టుకొని పాడుచుఁ గాళ్ళకు గజ్జెలుకట్టుకొని యాడుచు భజనచేయుచున్నవారు కొందఱును వారితో నావేడుకలను చూచుటకుఁ జట్టుగా గుంపుకట్టియున్న మఱికొందఱునుఁ గలసి నడచుటకైన నవకాశము గలుగకుండ మార్గమంతయు నాక్రమించుకొని నాయఁడుగారికెదురుగా వచ్చుట తటస్థమాయెను. తాళములధ్వనికిని వారు బిగ్గరగాఁ బాడుచున్న పాటలకును నెమలికుచ్చులకును నాయఁడుగారెక్కినగుఱ్ఱము కొంచెము బెదరనారంభింప నెమ్మదిగ నాజనుల నందఱినిఁ దప్పించుకొని గుఱ్ఱము వడివడిగా నడుచుచు నల్లరిఁజేయ జీనునుఁ గళ్లెమును గట్టిగాఁబట్టుకొని ప్రాణములను బిగపట్టుకొని కొంత దూరము పోయెను. అప్పటికి సాయంత్రము మూడుగంటలైనది. తరువాత కొంతదూరము గుఱ్ఱమును నెమ్మదిగా నడిపించుకొనుచు నూరు దాఁటి తన

స్నేహితులను డిప్యూటీకలెక్టరుగారిని గలసికొనెను. డిప్యూటీకలెక్టరుగారిబండిలో గుఱ్ఱపువాఁడుకూడ నుండ స్థలములేకపోయినందున వారు నలుగురు మాత్రమే కూర్చుండిరి. అట్లు వీరు నెమ్మదిగా బండిని గుఱ్ఱమును నడిపించుకొని పోవుచు మాటలాడుకొనుచుఁ గొంతదూర మేగిరి. తిరుమంగయాళ్వారునాయుఁడుగారు గుఱ్ఱము బెదరకుండ బ్రతిమాలుకొనుచుఁ దానుఁ గ్రిందఁబడకుండ జీనును గట్టిగాఁ బట్టుకొని మొగమంతయుఁ జెమ్మటలుఁగ్రమ్మ వగర్చుచు బండిలోనివారాడిన పదిమాటలకొకమాట జవాబుచెప్పుచుఁ బోవుచుండెను. ఇట్లు కొంతదూరము పోయినపిమ్మట డిప్యూటీకలెక్టరుగారి చేతిలోని కొరడా క్రిందపడిపోయెను. ఆబండిలోఁ గూర్చుండియున్న మొదలియారుగారు శాస్త్రిగారు డిప్యూటీకలెక్టరుగారు పిళ్ళగారుఁ గలసి తమవంటి గౌరవప్రపత్తులుగల తామునలుగురునుఁ గూర్చుండియున్న బండి నాబక్కగుఱ్ఱమీడ్వఁగలుగుటకు దానికిగొరడా సహాయమత్యావశ్యకముగాఁ గావలెను కావున డిప్యూటీకలెక్టరుగారు కొంచెము ముందుకు బండినడిపింప క్రిందపడిన కొరడాను దయచేసి యందియ్యుఁడని నాయుఁడుగారిని మొదలియారుగారు కోరిరి. అప్పుడు నాయుఁడుగారు తాను గుఱ్ఱముదిగినచోఁ దరిగ దానినెక్కలేనని భయపడియును శత్రునకైనఁ జేతియాయుధము క్రిందఁబడిపోయినప్పుడది యందిచ్చుట వీరపురుషలక్షణమనియు ధీరోత్తలక్షణమనియు శాస్త్రములు ఘోషింపుచుండఁ దాను సత్యవరగ్రామములోఁ గల్యాణోత్సవముఁ జూడనున్న స్వల్పకాలములోఁ దనకునుఁ దనస్నేహితులకును మిక్కిలి యాప్తుఁడై దనతండ్రియొద్దఁబనిచేసినడిప్యూటీకలెక్టరుగారివంటి స్నేహబాంధవుని యంతటివానికి నీస్వల్పసహాయము చేయకుండుటయు నదియటుండ తనకు బాల్యస్నేహితుఁడై పరమమిత్రుఁడుగానున్న మొదలియారుగారివంటియాప్తునిమాటత్రోసివేసి మిత్రద్రోహియగుటకును బండిలోనెక్కిన తనస్నే

హీంతులు నలుగురు త్వరితముగాఁ దనతో గమ్యస్థానమును చేరఁగలుగఁ జేసి తనకు మార్గమధ్యమునఁ దటస్థించు కష్టములకు వారు దాపున నేయుండితనకు సహాయమొనఁగుటకు దగ్గరనుండఁ గలుగునట్లు చేసి కొనుటకును ముఖ్యాధారభూతమగు నాకొరడా నందిచ్చుటకు సంశయించుటకన్న వెఱ్ఱితనము లేదని యూహింపవలసిన యాసమయమున నాతని హృదయమల్లకల్లోలముగఁ బరితపింప క్షోభించినదనుట కేమి సందియమున్నది. అప్పుడు 'ఏమైన నగుఁగాక' యని మతిపోయి నవానివలెఁ గ్రిందదుమికి డిప్యూటీకలెక్టరునకాకొరడా నందిచ్చి వారు సాఁగిపోవుచుండఁ దనగుఱ్ఱమును చేరి దానినెక్కఁ బ్రయత్నించుచుండ నది దనచుట్టును మండలాకృతిగా గిరగిర తిరఁగనారంభించెను. అప్పుడు కళ్లెముపట్టుకొని నాయుఁడుగారు ముందుకును గుఱ్ఱము వెనుకకును లాగుటకారంభించిరి. నాయుఁడుగారు గుఱ్ఱమునకుఁ "జెప్పినట్టు విని బుద్ధికలిగి నడచుకొమ్మ" ని మాటలతోఁ జెప్పిచూతమని యశ్వభాషకాఁబోలు మనకర్థముకాని యొకకేకతో దానికిఁ జెప్పెను. అశ్వశాస్త్రమెఱుఁగుదుననియు నశ్వశిక్షానిపుణుఁడననియు దంభములుకొట్టిన నీవంటి నిర్భాగ్యుఁడగు పిరికివానిని నింతవఱకు నామీఁద నెక్కించుకొని మోసుకొనివచ్చుటయేఁగాక నిప్పుడు నీవలన బెదరింపులుకూడ బడుదాననా యని యాతనిలక్ష్యపెట్టక నాతనిప్రక్కకు లాఁగనారంభించి కయ్యమునకుఁ గాలుద్రువ్వినట్లు తన వెనుకకాలొకటి యాతనివైపు దువ్వుచు నీబెదరింపులకా నేను బెదరుదానను నన్ను బెదరింప నీవెవ్వఁడవు; ఛీ పొమ్మని, నిర్లక్ష్యభావముతో ధిక్కరించినటులాతని రెండుమూఁడు పర్యాయములు వెనుకకును ముందుకును గెంటనారంభించెను. అప్పుడు డిప్యూటీకలెక్టరుగారు నాయుఁడుగారియవస్థను వెనుకఁ దిరిగి చూచి బండిమాపి మొదలియారుగారిచేతికిఁ గళ్లెములందచ్చి తాను కొరడా చేతఁబట్టుకొని క్రిందదిగి నా

యుఁడుగారివైపు తొందరగా నడచిరి. అదిచూచి తన్నుఁ గొట్టుటకుఁ గాఁబోలును గొరడాతో వచ్చుచున్నాడని యాగుఱ్ఱము బెదరెను. నాయుఁడుగారా గుఱ్ఱమును లొంగదీసికొనకపోయినయెడల తన కప్రతిష్ఠాకరముగ నుండుననియెంచి దానిదుష్ప్రయత్నమును లక్ష్యముచేయకఁ బట్టుదలతో దానికళ్లెములఁ బట్టుకొని విడువక, దానికిఁ గొంచెముసేపునకైన బుద్ధిరాకపోదని దానిచిత్తమువచ్చినట్లెగరనిచ్చి తనమోకాళ్ళను పాదములనుఁ గొట్టుకొని పోవునట్లు దానితోఁగూడఁ గొంతదూరముపోయి, ఛీ! దీనికిఁక బుద్ధిరాదని యెంచి, విడచిపెట్టుటచే యథేచ్ఛముగా నాగుఱ్ఱము నాయుఁడుగారిని రోడ్డునకుఁ బ్రక్కనున్న ముండ్లకంపలోఁ గొంతదూరమునఁ దిగవిడిచి పాఱిపోయెను. అప్పుడు మొదలియారుగా రూరకుండనోపక కళ్లెముల నిటు నటు గదల్చుటచేతనో, నాయుఁడుగారి యవస్థను బ్రక్కకుఁదిరిగి చూచుచు నప్రయత్నమున నొకప్రక్కకుఁ గళ్లెములు బిగియునట్లు వెనుకకు దిరుగుటచేతనో, జాత్యభిమానముచే నాగుఱ్ఱమొంటరిగాఁ బోవుచుండుట చూచుచుఁ గొంతదూరమైన శక్త్యనుసారముగఁ బోకుండుట ధర్మముకాదని యెంచియో, తమకు జాతిశత్రువులుగా నుండి తమ్ము బీడించుకొని తినుచున్న నీమనుష్యజాతిలో నొకనినోడించి గెలిచితినన్న సంతోషముతోఁ బరుగెత్తుచున్న స్వజాతిలోనిదగు నాగుఱ్ఱమటు పరువిడుచుండ దాని వైభవము నేత్రపర్వముగఁ జూచి యానందింపవలయునను గోరికచేతనో, గాని యాబండిగుఱ్ఱముగూడ నిటునటుబండినీడ్చి రెండుమార్లు వెనుకకాళ్ళఝాడించి పోలుగఱ్ఱలలో నొకదానిని విఱుగఁగొట్టి తొట్రుపాటు కలుగఁజేయ నారంభించెను. అప్పుడు కొరడాను క్రిందపాఱవైచి డిప్యూటీకలెక్టరుగారు బండియొద్దకుఁ బరుగెత్తుకొనివచ్చి హార్నెస్సు (Harness)కొంతయూడదీసి తక్కినదికోసివేసి గుఱ్ఱమునీవలకుఁదీసి చేతితోఁబట్టుకొనినిలఁబడెను. మొదలియారుగారును శెట్టిగారునునెమ్మదిగా

క్రిందదిగిరి. తరువాత మొదలియారుగారును శెట్టిగారును నాయుఁడుగారున్న స్థలమునకుఁ బోయి వారిని నెమ్మదిగా లేవఁదీసి చెరియొక చేయిపట్టుకొని మెల్లగా బండియొద్దకుఁ దీసుకొనివచ్చి యక్కడ కూర్చుండఁబెట్టిరి. అప్పటికి సాయంత్రమారుగంటలైనది. బండిని గుఱ్ఱమును దీసుకొనివచ్చుటకు నప్పుడు మనుష్యులక్కడి కెనిమిది మైళ్ళదూరములోనున్న లోకలుఫండు సత్రమువద్దకాని దొరకరని డిప్యూటీకలెక్టరుగారెఱుఁగుదురు. ఆసంగతి మొదలియారుగారును శెట్టిగారును విని పిళ్ళగారిని డిప్యూటీకలెక్టరుగారికిని నాయుఁడుగారికిని బండికిని సహాయముగా నక్కడ దిగవిడచి లోకలుఫండు సత్రమునకుఁ బోయి యచ్చట కూలీలను నొకరెద్దుబండిని దీసుకొని వత్తుమని బయలువెడల "మీకాసత్రము దెలియదుగనుక నేనేవెళ్ళి యచ్చట గుఱ్ఱమునుకట్టివేసి బండినిఁ గూలీలను తీసుకొని బండి విరిగిపోయిన స్థలమునకు వచ్చి నాయుఁడుగారిని నెద్దుబండిలోఁ గూర్చుండబెట్టి మనము నలుగురు విరిగిపోయిన బండిపైనెక్కి కూలీలచే బండిలాగించుకొని యారాత్రి యాసత్రమునఁ గడుపుద"మని డిప్యూటీకలెక్టరుగారు చెప్పుచుఁ దాను గుఱ్ఱమును దీసికొని నడువ; మొదలియారుగారు గూడ వారితోఁ బోయిరి. వీరు లోకలుఫండుసత్రముఁ జేరునప్పటికి రాత్రి తొమ్మిదిగంటలాయెను. ఆసత్రమువద్ద యిళ్ళు లేవు. గ్రామమక్కడకొక మైలు దూరమునకుఁ దక్కువ లేదు. ఆసత్రమునకొక ప్రక్కనున్న పూరింటిలో నొక కాపువాఁడును వానికొమార్తెలిద్దఱును వానిభార్య గతించినందునఁ దానియక్క యొకతెయుఁ గాపురముండి, నాలుగుబండ్లను, నైదారావులును, కొన్నిగేదెలను, పెట్టుకొని కొలఁదిగా వ్యవసాయము చేయుచుండిరి. సత్రములో నిద్దఱు ముసలివాండ్రును నేండ్లు గడచిన యిద్దఱు బ్రాహ్మణవితంతువులును పండ్రెండేండ్లు వయసుగల నొక చిన్నవాఁడును నొక వంటబ్రాహ్మణుఁడును కాపురముండిరి. ఇంతలోఁ

దక్కఁ నక్కఁడ రాత్రి చీకటిపడినతరువాత యీచుట్టుపట్ల మార్గస్థులు తప్పమరెవ్వరునుండరు. ఆనాటి రాత్రి వంటబ్రాహ్మణుఁడు కల్యాణోత్సవములో వంట చేయుటకుఁ బోయి యుండుటచే నతఁడక్కఁడ లేకపోవుటయుఁ గాపువాఁడు తాఁ దాక చేరికిఁ బోయియుండుటచే నాఁడును లేకుండుటయుఁ దటస్థమాయెను. అప్పుడు డిప్యూటీకలెక్టరుగారు సత్రముగెయొద్దకుఁబోయి దాపుననున్న కాపువానినిఁ బిలిచెను. అంతట తలుపు తెఱచి ముసలిది కాఁపువాఁడు లేడని చెప్పెను. వంటబ్రాహ్మణుఁడు నాఁడా? యని యడిగి యాతఁడు గూడ లేడని తెలిసికొనెను. అప్పుడు గుఱ్ఱమునక్కఁడ కట్టివేసి, తాను వెనుకకుఁ బోయి నాయుఁడుగారిని మాత్రము బండిమీఁదఁ గూర్చుండఁబెట్టి తాము నలుగురును బండిలాగుకొని వచ్చుట, యింకొక మైలు దూరము నడిచి గ్రామములోనికిఁబోయి యక్కడ కూలీలను బండ్లను సమకూర్చి పంపించుటకంటె మంచిదనియు, నా గ్రామమునకు పోయినను నక్కడకుఁ బోవునప్పటికిఁ బదిగంటలగుటచే నా రాత్రివేళ బండియుఁగూలీలను సమకూర్పఁగలుగుటకూడ కష్టమేయనియు, నూహించి యీగుఱ్ఱమునక్కడ కట్టిపెట్టెదమనియు, దానినిఁ జూచుచుండవలసినదనియు, దానినక్కడగట్టినందుకొక యర్ధరూపాయియీనామిత్తమనియు, నాకాపుదానితోఁ జెప్పిరి. అందుకాయాఁడుది దనకేమిచ్చినను గుఱ్ఱమును దమయింటగట్టుటకు వప్పుకొనననియు, నంతకుఁ నైదారునెలలకుఁ బూర్వమొకఁడొక నాటి సాయంత్రము రెండెడ్లను గిసికొనివచ్చి తనకొక రూపాయినిచ్చి కొంచెము గడ్డికొని తమయింటియొద్ద సావడిలోఁ గట్టిపెట్టి దాపుననున్న గ్రామమునకుఁ బోయి భోజనముచేసివచ్చి వాటినిఁ దెల్లవారుజామునఁ దోలుకొనిపోదునని చెప్పి యతఁడావలకుఁ బోయిన పదినిమిషములలో నిద్దరు పోలీసుబంట్రోతులనుఁ దీసికొనివచ్చి యింకొకఁడా యెడ్లు తనవని వానినిదోలుకొని పోలీసుస్టేషనుకుఁ బోయి నాలుగుమాసములు దన్నును దన మరదిని

కచేరీచుట్టు ద్రిప్పిరనియుఁ, బణ్యానునకుఁబోయినఁ బాపమెగురయినదనియు, జెప్పి యాగుఱ్ఱముక్రింద గట్టుటకు వీలులేదని స్పష్టముగాఁ జెప్పివేసెను. అప్పుడు మొదలియారుగారును డిప్యూటీకలెక్టరుగారును నా కాపుదానినెంత బ్రతిమాలుకొనినను, నేమేమిచ్చెదమన్నను, నది గుఱ్ఱమును గట్టుటకు నొప్పుకొనలేదు. అప్పు డేయుపాయమును దోచక యక్కడ దామాలస్యముచేసినచోఁ దెల్లవారులోపల దాము బండినీడ్చుకొని వచ్చుటకవకాశముండదనియుఁ దమ స్నేహితులను మార్గమధ్యమునఁ జీకటిలో విడచిపెట్టుట మిత్రద్రోహ మనియుఁ దలఁచి గుఱ్ఱమును గూడ వెనుకకుఁ దీసికొనిపోయి, యొకరు గుఱ్ఱమునుఁ దీసికొనివచ్చుచుండ దక్కినముగ్గురే బండిలాగుకొని వచ్చుట యుచితమని నిశ్చయించి, గుఱ్ఱమునుదీసికొని దమ స్నేహితులను గలసికొన వెనుకకు వడిగా నడువ నారంభించిరి.

డిప్యూటీకలెక్టరుగారి నాకాపుదియెఱుఁగదు. ఆయన నెఱిఁగిన కాపువాడింటలేడు. మఱియు నీకాపుదానికి రేజీకటియు గొప్ప జెవుడునుగూడ నుండుటచే నారాత్రివేళఁ దాను డిప్యూటీకలెక్టరునని బిగ్గరగా కేకలువేసియెంత చెప్పినను వినిపించనిదానివలె నటించెను. వాస్తవముదానికి వినిపించకుండుటచే నట్లు నటించెనో, లేక నాగుఱ్ఱమువల్ల దమకుఁ జిక్కు దటస్థించునని భయపడ మొగవాడింట లేనప్పుడు దాని విషయములో నించుకయినఁ దలయూచి యొప్పుకొనుట మంచిదకాదనియూహించి యట్లు వినిపించనిదానివలె నటించెనో, మనము స్పష్టముగాఁ జెప్పలేము. దానికి విస్తారము చెముడున్నదని మాత్రము చెప్పక దప్పదు.

తరువాత మొదలియారుగారునుగుఱ్ఱమును దీసికొని డిప్యూటీకలెక్టరుగారును దమస్నేహితులునుబండియు నున్నస్థలమునకా రాత్రియొంటిగంటయగునప్పటికి వచ్చిరి. నాయుఁడుగారిని నెమ్మదిగా బండిమీఁ

దఁ గూర్చుండఁబెట్టి డిప్యూటీకలెక్టరుగారు గుఱ్ఱమును బట్టుకొని నడచుచుండ మొదలియారుగారును శెట్టిగారును బిళ్ళగారును బండిలాగ మొదలుపెట్టిరి. త్వరగా గమ్యస్థానమును జేరగలుగుదుమను నాశతో గుఱ్ఱపుబండిని గుఱ్ఱమును యెక్కి ప్రయాణమైన వీరు గుఱ్ఱమును బండిని మోసికొనిపోఁ దటస్థమగుట కేవలము దైవయోగముగాని వేరొకటి కాదుగదా! పాపమారాత్రి వీరుపడిన శ్రమ చెప్పనలవికాదు. తాము పడుచున్న కష్టములటుండఁ దెల్లవారులోపల నూరుల కంట్లఁబడకుండ సత్రమును జేరలేకపోయినచోఁ దమ గౌరవమునకు మిక్కిలి హానికరముగా నుండునని యెంతగష్టములకైన బాలయి నాలుగున్నర గంటలగునప్పటికి బండిని గుఱ్ఱమును దీసికొని సత్రముఁ బ్రవేశించిరి. అట్లు వీరు సత్రము చేరిన యొకగంటలో తెల్లవారినది. తరువాతఁ గొంతసేపటికిఁ గాఁపువాఁడింటికివచ్చెను. ఇతఁడు డిప్యూటీకలెక్టరుగారిని బాగుగా నెఱిఁగినవాఁడగుటచే నాయనకును ఆయన స్నేహితులకును గావలసిన సదుపాయములనెల్లఁ జేసెను.

అప్పుడు డిప్యూటీకలెక్టరుగారు తమస్నేహితులొకటిరెండు దినములాసత్రమున నుందురుగాన వారికిఁ దగిన సదుపాయములనెల్లఁ జేయుమని చెప్పి తనగుఱ్ఱమును బండిని దీసికొనివచ్చుటకు గూలీలను సిద్ధముచేసి తానొక యెద్దుబండినెక్కి మొదలియారుగారు మొదలగువారి నచ్చట విడచిపెట్టి పోయిరి. తరువాత మొదలియారుగారును నాతనిస్నేహితులును ఆసత్రమునఁ గొన్నిదినములుండి నాయుఁడుగారును బిళ్ళగారును దమగాయములను మాన్పుకొనఁ గలిగినతరువాత నక్కడనుండి ప్రయాణమగుటకు నిశ్చయించుకొనిరి. రాముఁడును గుప్పసామియు రాయవరగ్రామమున కాదారినే బోవలయును గాన నొకటిరెండు గంటలలోఁ దమసామానంతయుఁ దీసికొని వచ్చుచుండుట గాంచి వారినిఁ గూడ దమయొద్ద నక్కడనే యుండునట్లాపివేసిరి. ఇట్లు వీరరదఱు

నాసత్రములోఁ గొన్ని దినములు బసదిగియుండిరి. డిప్యూటీకలెక్టరుగారు చెప్పినారని యీకాపువాఁడు మొదలియారుగారికిని వారిస్నేహితులకును గావలసిన సదుపాయముల నెల్లఁ జేయుచుండెను.

మొదలియారుగారును నాతని స్నేహితులును స్వస్థచిత్తులై యచ్చటనుండి కాపువాని సత్కారముల నందుచుండిరి. ఆతఁడుదయమున జల్దియన్నమును దిని పొలమునకుఁ బోయి సాయంత్రమింటికి వచ్చుచుండెను. తానింటలేనప్పుడు కాపువాని వదినెయు గొమాతెఁగాలును వీరికన్నము వండిపెట్టి గుమ్మసామిచే వారికి బంపి మిక్కిలి యాదరముతో వారిని గౌరవించుచు నాయుఁడుగారికిఁ దగిలిన గాయములకు గట్టుకట్టుచు వారికిఁ గావలసిన సదుపాయములనెల్లఁ జేయుచుండిరి. కాపువాఁడు సాయంత్రమింటికివచ్చిన తరువాత వీరియొద్ద గూర్చుండి, తన సంసారస్థితినిగూర్చియు, వ్యవసాయమునుగురించియు, నితరవిషయములనుగురించియు, మాటలాడుచు రాత్రి కొంతకాలము వారితోఁ గాలము గడపుచుండెను.

ఈకాపువాని వదినె పేరు ముత్యాలమ్మ. ఈమెభర్తయీమె చిన్నతనములోనే మృతినొందెను. తరువాతఁ దన చెల్లెలింటఁ జేరి, తనచెల్లెలిని మరదియగు నీకాపువానిని గనిపెట్టుకొని కొన్నిసంవత్సరములుండి, తరువాతఁ దనచెల్లెలు గతించినను నామె కుమాతెగాల నిద్దరిని బెంచుచుఁ దనకెవ్వరును గావలసినవారు లేకపోవుటచే నచ్చటనేయుండెను. ఈమెకిప్పటికి నలుబదియైదు సంవత్సరముల వయసుండును. ఈమెకుఁ జిన్నతనమునుండియు మిక్కిలి చెవుడుగలదు. రాత్రులయందు దృష్టిగూడ నంతబాగుగాఁ గనిపించకుండెను. కొంచెము పొట్టిగాను స్థూలముగాను నల్లగాను గనుపించుచు మొగమంతయు స్ఫోటకపుమచ్చలతో నిండియుండి తలవెంట్రుకలు చాలభాగము నెరసియుండుటచే వానికి కాటుకరాని తన యంగవైకల్యమును

నుసలిపినను గనపడకుండ సాధ్యమగునంతవఱకుఁ గప్పుకొనుచుం
డెను. ఈమెకు తాను వయసులోనున్నదాననియుఁ, దనచెల్లెలు కు
మార్తెలయొక్కయుఁ దనమరదియొక్కయు క్షేమమాలోచించి తిరి
గి వివాహముచేసికొనక వారిని గనిపెట్టుకొని వారికి సహోపకారము
ను జేయుచుంటిననియు, నభిప్రాయము కలదు. కాపువానికిద్దరు
గొమార్తెలుగలరని యిదివఱకే చెప్పఁబడినది. ఆయిద్దరిలోఁ బెద్ద
దానిపేరు సుబ్బమ్మ; రెండవదానిపేరు లక్ష్మి. పెద్దదానికప్పటికి వ
దునైదుసంవత్సరములును, జిన్నదానికిపదునాలుగు సంవత్సరములును,
వయసుండును. ముత్యాలమ్మదగ్గర బంగారమును రొక్కమును గలసి
మూఁడువేలరూపాయీలకుఁ బైగా నాస్తియుండుటచే దాను ధనవంతు
రాలనన్న మనోగర్వముగూడ నీమెకులేకపోలేదు. కాపువాఁడుదనకొ
మార్తెలకిద్దరకిని వివాహములుచేసి యల్లుళ్ళను దమయింటనే యిల్లరికె
ముంచుకొనవలయుననియు నావివాహములకుఁ దనవదినెగారి సహాయ
మవశ్యముగాఁ గావలయుననియుఁ దలఁచుచుఁ, దనవదినెగారితో మం
చిమాటలాడుచు దానితోఁ దనకుమార్తెలు పోరాడునప్పుడు వారిని
చీవాట్లుపెట్టి దానిని బ్రతిమాలుకొనుచుఁ గాలము గడపుచుండెను.
కాపువాని కుమార్తెలలో లక్ష్మియనునది తనపెత్తల్లినిఁ జూచి యు
ప్పుడప్పుడు నవ్వుచు నది పడుచుదానివలె గనుపింపవలయునని పడు
చున్నపాట్లకాక్షేపించుచుండుటచే దానికి మనసులో దానియందు కో
పముగలదు. ఆకోపము తరుచుగా దిట్లతోను నప్పుడప్పుడు బుగ్గపోట్ల
తోను దీర్చుకొనుచుండును. సుబ్బమ్మయు లక్ష్మియు నేమేమిమాట్లాడుకొను
చున్నను దన్నుగూర్చియే మాట్లాడుకొనుచున్నారని యనుమానపడి
వారాడుమాటలేమని యడిగి వారెంత బిగ్గరగా నరచిచెప్పినను దన
కు వినిపించకపోవుటచే మఱింత మండిపడి ముత్యాలమ్మ గేకలువే
యుచు నిల్లంతయు నల్లకల్లోలముగాచేసి తనమరది యింటికివచ్చినప్పటి

కిఁ దానిల్లువిడచి యొక్కఁడికైనఁ బోవుటకు సిద్ధముగాఁ బ్రయాణము గుచుఁ, గాఁపువాఁడును నాతని గొమాతెఁలను బ్రతిమాలుకొనఁ దిరి గీయింటిలోనికిఁబోయియొప్పటివలెనక్కఁడనేయుండుచుండుటయుఁదను చుగాఁ వటస్థమగుచుండెను. లక్ష్మి స్వభావముచే మాటలాడునప్పుడు నవ్వుచుండును. అది నవ్వుచున్నప్పుడెల్లఁ దన్నుఁజూచియే నవ్వుచున్నదని ముత్యాలమ్మ యనుమానపడి దానినిదిట్టుచుండును. అందువలన ముత్యాలమ్మకు లక్ష్మియన్న నెంతమాత్రమును యిష్టములేదు; కాని దానియందుఁ బ్రేమ లేకపోలేదు. లక్ష్మి తల్లి చనిపోవునప్పటికిఁ దానికి రెండేండ్ల వయసుండును. అప్పటినుండియు దానిని, దాని యక్క సుబ్బమ్మను ముత్యాలమ్మే పెంచెను. ఈయిద్దరిలో లక్ష్మిని ముత్యాలమ్మ దనపెంపుడుకూతురుగా భావించి దానికిఁ గొన్ని నగలను బెట్టెనుగాని యది పెద్దదైనతరువాత దానిమీఁదఁ గోపముచే సుబ్బమ్మనే కూఁతురుగా నెంచి దానికేమయిన గొనిపెట్టుచునుండెను. ముత్యాలమ్మకు దైవికముగాఁ గలిగిన చెముడును, ముసలితనమువల్లను చిన్నతనములో స్ఫోటకము బడుటవలనను గలిగిన యంగవైకల్యమును, గొంచెము ముక్కోపితనమును, దక్క నేదుర్గుణములును లేవు. సంసారము గడపుటలో నీమె మిక్కిలి నేర్పుగలది. ఆవులకును గేదెలకును దొడ్లకును సాయంత్రము నుదయమును చిట్టు, తవుడు, గుగ్గిళ్ళు మొదలగునవి దాను స్వయముగా బెట్టి సుబ్బమ్మను లక్ష్మిని గనిపెట్టుకొని మిక్కిలి జాగరూకతతో సంసారమంతయుఁ గడపుచుండెను. నాయఁడుగారికిఁ దల్లివలె సంరక్షణచేయుచు నాయనకుఁ దగిలిన గాయములకు గట్లను గట్టుచు మొదలియారుగారికిని శెట్టిగారికిని బిళ్ళగారికిని మిక్కిలి వినయ భయభక్తులతోఁ గావలసిన సదుపాయములనెల్లఁ జేయుచుండెను. రాముఁడును గుప్పుసామియుఁ బనియున్నను లేకపోయినను సుబ్బమ్మతోను లక్ష్మితోను నేదోయొకటి గల్పించుకొని మాట

లాడుచుఁ దమ దేశమందలి విచిత్రములను దమ యజమానుల గొప్పతనమును జెప్పుచుండిరి. మొదలియారుగారికిని శెట్టిగారికిని బిళ్ళగారికిని ముత్యాలమ్మ తమకుఁ జేయు గౌరవమును బట్టియు సదుపాయములను బట్టియు నామెయందు మిక్కిలి మంచియభిప్రాయముగలిగి, యామెవంటితెలివిగలది లేదని, దలఁచుచుండిరి. నాయుఁడుగారికి ముత్యాలమ్మయందుఁ గలవిశ్వాసము జెప్ప శక్యమే కాదు. తనకుఁ జేయుచున్న చికిత్సలకును, సదుపాయములకును ముత్యాలమ్మయందు నాయుఁడుగారికి మంచియభిప్రాయమును, విశ్వాసమును, గౌరవమును, తరువాత నభిమానపూర్వకమైన ప్రేమయుఁ, గ్రమక్రమముగా హృదయస్థమగు ననురాగమునుగూడగలిగినది. ఈ కారణముచే నాయుఁడుగారును, నాయుఁడుగారి యభిప్రాయమును బట్టి దక్కినవారును, నక్కడఁ దాముండవలసినదినములకన్న నెక్కువదినము లుండిరి.

ఇట్లు వారక్కడ బనచేసియున్న దినములలో సంవత్సరాదిపండుగ వచ్చినది. ఆపండుగకు మొదలియారుగారును శెట్టిగారును బిళ్ళగారును దాపుననున్న గ్రామమందలి సంతలోఁ గొన్నిబట్టలను గొని తీసికొనివచ్చి కాపువానికిని, ముత్యాలమ్మకును, సుబ్బమ్మకును, లక్ష్మికిని నిచ్చిరి. నాయుఁడుగా రొకపెద్దచీర కొని ముత్యాలమ్మ కిచ్చెను. రాముఁడును గుప్పుసామియు సుబ్బమ్మకును లక్ష్మికిని జెరియొకరైకగుడ్డను రూపాయియు నిచ్చిరి. నాయుఁడుగారు, దనకిచ్చిన చీరకు ముత్యాలమ్మ కప్పుడుగలిగిన సంతోషమింతింతని చెప్ప నలవి కాదు. తరువాత ముత్యాలమ్మకును నాయుఁడుగారికిని నొండొరులయం దభిమానమును స్నేహమును నమ్మకమును నభివృద్ధియగుటవలన ముత్యాలమ్మ దనగృహచ్ఛిద్రములనుగూర్చియు, లక్ష్మికిగల పొగరుబోతుతనమును గూర్చియు, నాయుఁడుగారితోఁ జెప్పుచుండెను. నాయుఁడుగారు, ముత్యాలమ్మ చెప్పిన మాటలు వినకున్నచో నామె కేమి కోప

ము వచ్చునో యని సందేహించి యాకొట్టుచుండెను.

అంత నొకనాఁడాసమీపమందున్న గ్రామములో గ్రామదేవత యగు బోలేరమ్మ యుత్సవము జరుగుచుండెను. ఆయుత్సవమునకుఁ గాపువాఁడు ప్రయాణమయ్యెను. మొదలియారుగారును, శెట్టిగారును బిళ్ళగారును గూడఁ బ్రయాణమైరి. తనకొమాతెలల నిద్దరి నొకబండిలో నెక్కించి మఱియొకబండిలో దాను దన నూతనస్నేహితులను ముగ్గురను గూర్చుండబెట్టుకొని పోయెను. వారాదినము సాయంత్రము వఱ కుత్సవముజూచి యారాత్రి యొకచోట బసచేసిరి. ఆయుత్సవములో సుబ్బమ్మయు లక్ష్మియు వేడుకలన్నియుఁ జూచి యానందించి, ఆనాఁటికైన ముత్యాలమ్మవల్ల లేనిపోనిమాటలను, దిట్లను, బడుట దప్పెనని సంతోషముతో నుండిరి. పిళ్ళగారాకాపుకన్యకల కిద్దరికిఁ జెరియొకచీరెయు, రైకయుఁ, గొన్నిసామానులను గొనిపెట్టెను. అప్పుడు కాపువాని పూర్వస్నేహితుఁ డొకఁడాతనికి గనుపించి యాతని బిల్లలకు మంచిసంబంధము లున్నవని చెప్ప నాతఁడు మిక్కిలి సంతోషించి యాతనిఁ దనయింటికి రమ్మని బ్రతిమాలి దీసికొనివచ్చుటకు నిశ్చయించెను. మొదలియారుగారును, శెట్టిగారును, బిళ్ళగారును దమ్మును దమస్నేహితుఁడగు నాయుఁడుగారిని మిక్కిలి వినయభయభక్తులతో నాదరించి సన్మానించుచున్న యాకాపువాని కొమాతెలను దమకొమాతెలనుగా నెంచి వారిపెండ్లిండ్లు త్వరలో నమకూరినయెడల నావివాహములు రెండును చేయించియె యచ్చటనుండి పోవలయునని యాలోచించిరి. ఆరాత్రి కాగ్రామమున బరుండి మరునాడు తెలవజామునఁ బండ్లుగట్టించుకొని యిల్లుచేరిరి. సుబ్బమ్మకును లక్ష్మికిని సంబంధములు గుదర్చెదనన్నవాఁడుగూడ వీరితోఁ గలసి వచ్చెను. అతనిపేరు వెంకన్న. కాపువాడిల్లుచేరినతోడనే వెంకన్న దనకుమాతెలకు సంబంధములు గుదుర్చుటకును ఆసంగతిని గూర్చి మాటలాడు

టకును వచ్చెనని ముత్యాలమ్మతోను నాయుఁడుగారితోను జెప్పెను. పిళ్ళగారు సుబ్బమ్మకును లక్ష్మికిని గొనిపెట్టిన చీరెలను రైకలను నితరవస్త్రములను జూచి తనకెవ్వరు నేమియుఁ గొని తీసికొనిరాకపోవుటచే నోర్వలేక మటమట మండిపడుచుఁ బెండ్లిమాటలాడునప్పుడు దనకేమియు సంబంధములేనిదానివలె నటించుచుండెను. అంత నొక నాఁడు సాయంత్రము నాలుగుగంటలవేళఁ గాపువాఁడు పొలమునకుఁ బోయిన సమయమున ముత్యాలమ్మ పశువులకు మేతబెట్టుచున్నప్పుడు నాయుఁడుగారు దనకామె యుపచారముచేసిన సంగతి యెఱిఁగి దానామెకు సహాయముచేయుట ధర్మమని యెంచి యామెను గూర్చుండుమని చెప్పి దానే స్వయముగాఁ బశువులకు మేతవెట్టి వానిని గట్టివేసెను. అప్పుడు ముత్యాలమ్మ నాయుఁడుగారి స్నేహభావమును గ్రహించి యాతనిఁ బరమాప్తునిగా దలఁచి తన కష్టసుఖములన్నియు నాతనితోఁ జెప్పనారంభించి, పిళ్ళగారు లక్ష్మికిని సుబ్బమ్మకును బట్టలుకొని తనకేమియుఁ దీసికొనిరాకపోవుటయు లక్ష్మి దన్నుఁ జూచి వెక్కిరించుచుఁ దనమనసు నొవ్వఁజేయుచుండుటయుఁ దనయొద్దనున్న ద్రవ్యమంతయు దీసికొని తన్నావలకుఁ ద్రోలివేయ నిశ్చయించుకొని కాపువాఁడు దన్ను మంచిమాటలతో బుజ్జగించుచుండుటయుఁ దాను తిరిగి వివాహము చేసికొనకఁ జాలకాలమునుండి సుబ్బమ్మను లక్ష్మిని బెంచుచుఁ గాపురమంతయుఁ గడపుచుఁ దనమఱఁదియగు కాపువానిని గనిపెట్టుకొని యుండుటయు మొదలగు గృహచ్ఛిద్రముల నన్నిటిని గన్నీటితో సవిస్తరముగాఁ జెప్పెను. నాయుఁడుగారితో నీసంగతులన్నియు ముత్యాలమ్మ చెప్పుటకుఁ గారణము పిళ్ళగారు సుబ్బమ్మకును లక్ష్మికిని బట్టలను గొని యిచ్చుటయొక్కటి దప్ప మరియొకటి లేదని మనము గ్రహింపవచ్చును. అయినను ఆడవాండ్రేకారణముచేతనైనఁ దమకష్టములను గూర్చి యితరులతోఁ జెప్పుకొనునప్పుడున్నవియు లే

నివియుఁ గూడ జెప్పుచుందురు. కావున నాసమయమున ముత్యాలమ్మ నాయుఁడుగారితోఁ దాను నరకబాధ పడుచున్నట్లు జెప్పసాగెను.

ఇట్లు నాయుఁడుగారును ముత్యాలమ్మయు పశువులపాకలో మాట్లాడుచుండుట గ్రహించి రాముఁడు గడ్డిమేటిచాటునఁ గనబడకుండ దాగి వారిమాటలనెల్ల వినుచు నాయుఁడుగారు ముత్యాలమ్మను మోహించె నని యూహించి యీసంగతి తక్షణమే సుబ్బమ్మతోను లక్ష్మితోను వెంకన్నతోను జెప్పెను. లక్ష్మియు సుబ్బమ్మయు యథాప్రకారను ముత్యాలమ్మను ప్రేమించి గౌరవించుచున్నను నామెమాత్రము వారితోఁ దిన్నగా మాటలాడక నేమేమో నోటిలో గొణుగుకొనుచుఁ గారణము లేకుండఁ గోపించి వారిని దిట్టుచుండెను. వెంకన్న, ముత్యాలమ్మను నాయుఁడుగారు మోహించిరన్న మాట నమ్మలేదుగాని రాముని యొద్ద మాత్రము నమ్మినట్లు నటించి "ముత్యాలమ్మ త్వరలోఁ దన బ్రతుకుదెఱవు జూచుకొనుట మంచిదిరో" యనియుఁ దానినిఁ గాపువాఁడు దనకొమాతెల వివాహమైనతక్షణమే సొత్తంతయుఁ దీసికొని యిల్లువెడలగొట్టి తాను దిరుగ వివాహమాడి దనకొమాతెలతోను అల్లుండ్రతోను గలసి కాలము గడపనిశ్చయించుకొన్నాడనియుఁ జెప్పెను. వీరు మాటలాడుకొన్నమాటలు దనకు వినిపించకపోయినను యీసంగతంతయుఁ గండ్లతోఁ జూచుచుండుటచే ముత్యాలమ్మ యీరాత్రి రాముని దూరముగా దీసికొనిపోయి వెంకన్నచెప్పినమాట లేమని యడిగి, యంతయు నాతఁడు దనచెవిలో బిగ్గరగాఁ జెప్పుచుండ విని తెలిసికొనెను. ఈమాటలు విననప్పటినుండియు ముత్యాలమ్మ గుండెల్లోఁ రాయిపడ దాను దనసొత్తంతయుఁ దీసికొని కాపువానియిల్లువిడచి పోవలయు నని నిశ్చయించుకొని వెంకన్న నడిగి యంతయుఁ దెలిసికొనవలెనని యాతని నాశ్రయించి యాతనితో మంచిమాటలాడ నారంభించెను. కొందఱు ధ్యానము చూచుచుండగా నిద్ద ఱేమైనరహస్యముగా

మాటలాడుకొనుచుండ వారు మాటలాడుకొన్నమాట లేవియో తమ కుఁ దెలియునంతవఱకు నేమియుఁ దోఁచక మిక్కిలి యాతురతతో నుందురు. కొందరు యెదుటఁ దమకుఁ దెలియకుండ నేమైన మాట లాడుకొన్నచోఁ దమ్ముగూర్చియే మాటలాడుకొనుచున్నారని లేనిపో ని యనుమానమును మనసులోఁ బెట్టుకొని లేనిబాధ దెచ్చుకొందురు. ఈగుణములు పురుషులకంటె స్త్రీలలో నెక్కువయనియు నందులోఁ జ విటివారిలో నీగుణము మిక్కిలి యెక్కువగా గానిపించుననియుఁ జ దువరులే యెఱుఁగుదురు. అది మొదలెవ్వరిద్ద రేమి మాట్లాడుకొ న్నను ముత్యాలమ్మ కనుమానమెక్కువగాఁ జొచ్చి తా నాయిల్లెప్పుడు విడచిపోదునా, యని యాలోచించుచుండెను. ఒకనాఁడు రాత్రి మ ఱెండుగంటలవేళ నందరు నిద్రపోయిన తరువాత ముత్యాలమ్మయు వెంకన్నయు దూరముగాఁ బోయి చాలసేపు మాట్లాడుకొని యామరు నాఁడు రాత్రి యిద్దరును గలసి భీమునిపట్నము పోయి యచ్చట స్టీము రెక్కి రంగము (రంగూన్) వెళ్ళుటకు నిశ్చయించుకొనిరి. మఱునా డు వెంకన్న గాపువాని గొమార్తెల వివాహవిషయమై కాపువాని తో నాలోచించి, త్వరలోఁ బోయి వరులనిద్దఱను దీసికొనివచ్చుటకుఁ బ్రయత్నములు చేయుచున్నట్లు నటించెను. వెంకన్నకుఁ గ్రొత్తబట్టల నుబహుమానమిచ్చి కాపువాఁడాతనికి విందుగూడఁ జేసెను. ముత్యాల మ్మదనయొద్దనున్న బంగారమును రొక్కము రూపాయీలును మూటగ ట్టి సిద్ధముగానుండెను. కాపువానికిఁ బొలములోఁ బనియుండుటచేఁ దా నారాత్రి ప్రొద్దుపోయివచ్చెదనని చెప్పి వెంకన్నతోఁ దనకొమా ర్తెల సంబంధముల విషయమై తిరిగి చెప్పి యావలకుఁ బోయెను. తరువాతఁ గొంతసేపు వెంకన్న నాయుఁడుగారితోను బిళ్ళగారితోను మొదలియారుగారితోను శెట్టిగారితోను మాటలాడుచు గాలముగడపి కాపువాఁడు తనకు మాగాణపుఖర్చులక్రింద నేమియు నియ్యక మఱచి

పోయి తొందరగాఁ బోయెననియు దనకుఁ బదిరూపాయీలు బదులు పూర్వకముగా నిచ్చినచోఁ దిరిగి తాను త్వరలోనే యిత్తుననియుఁ బిళ్ళగారితోఁ జెప్పెను. కాపువానియందును నాతనికొమాళ్ళయందును దాముందఱు మిక్కిలి ప్రేమగలిగియుండుటచే బిళ్ళగా రాతనికి వెంటనే పదిరూపాయీల నిచ్చి త్వరలోఁ గాపువాని యల్లుళ్ళను దీసికొనిరమ్మని మరిమరి చెప్పిరి. పిళ్ళగారు లక్ష్మియందును శెట్టిగారు సుబ్బమ్మయందును మిక్కిలి యభిమానమును బ్రేమను జూపించుచుండిరి. కాని వీరునలుగురు నీకన్నకలను దమకొమాళ్ళవలెఁ గారవించుచుండిరి. ముత్యాలమ్మవంటి యోగ్యురాలును, తెలివియు నేర్పును గలదియు, లేదని మొదలియారుగా రామెయందు మిక్కిలి యభిమానమును గౌరవమును గలిగి యామె యమాయికస్వభావమునకుఁ దోడా మెకు బధిరత్వముగూడ సంప్రాప్తమైనందులకును దైవ మామెకాలోవ మొక్కటి దెచ్చిపెట్టినందులకును విచారించుచు నామెవంటి యుత్తమోత్తమురా లాగాపువానికిఁ బుణ్యవశమునఁ దటస్థమైనదని దలఁచుచుండెను. నాయఁడుగారు దన కీమె చేయుచున్న యుపచారమున కామెయందు విశ్వాసముగలిగి, యామెను మెచ్చుకొనుచుండెను. వెంకన్న మంచివడిగా నడువగల యెద్దులగట్టినబండి నొకదానిని సిద్ధముచేసి యారాత్రి భోజనముచేసినతోడనే ముత్యాలమ్మను దీసికొని ప్రయాణమై పోయెను.

ఇట్లు వీరిద్దరును బ్రయాణమై పోయిన రెండుగంటలకుఁ గాపువాఁ డింటికివచ్చెను. ముత్యాలమ్మ కనుపించుట లేదనియు, నామెపెట్టెగూడ లేదనియు, సుబ్బమ్మయు లక్ష్మియుఁ దండ్రితోఁ జెప్ప నాతఁడామెను వెంకన్న దీసికొనిపోయియుండవచ్చునని యనుమానపడి మొదలియారుగారితోనీసంగతి చెప్పెను. తరువాత శెట్టిగారును, నాయఁడుగారును, బిళ్ళగారును గలసి యాదుర్మార్గుణఁ దీయుకార్యమును దప్ప

కచేసెననినిశ్చయించిరి. వెంకన్న యిట్టిదుష్కార్యమును దలపెట్టి చేయు
టయేగాకఁ దనయొద్ద దారిఖర్చులక్రిందఁ బదిరూపాయీ "లప్పు" ని
చెప్పి దీసికొనినసంగతిచెప్పి యాతఁడు దనకంటఁ బడినచోఁ జంపవ
లెనన్నంత కోపముగలిగి యుండెను. సుబ్బమ్మయు లక్ష్మియు ముసలిదా
నికీపనిచేయఁదగదనియు నామెకీవయసున నిట్టిదుర్బుద్ధిపుట్టుట మిక్కిలి
యాశ్చర్యకరముగా నున్నదనియుఁ జెప్పిరి. నాయఁడుగారు సుబ్బమ్మకు
ను లక్ష్మికిని బెండ్లిళ్ళుచేయఁదలపెట్టి వెంకన్నయింటికివచ్చి పెండ్లిమా
టలాడనారంభించినది మొదలుగా నీమెకు మాత్సర్యమును నోర్వలే
నితనమును నంకురించినదనియుఁ దన్ను మోసముచేసి తనసొత్తంత
యుఁ దీసికొని యావలకుఁ బంపివేతురను సందేహముగూడ దృఢము
గాఁ గలిగినదనియుఁ జెప్పెను. ముత్యాలమ్మయు వెంకన్నయుఁ గలసి
భీమునిపట్నముపోవు మార్గమున బండినెక్కిపోవుచుండిరని చూచిన
వారు గొందరు చెప్పిరి. ఈమాటవినినతోడనే గాపువాఁడును, మొద
లియారుగారును, బిళ్ళగారును, నొకబండినెక్కి వారిని బట్టుకొనుటకు
బయలువెడలిరి. అట్లు వీరారాత్రియంతయు బండియెడ్లను బరిగెత్తిం
చి మరునాడుదయ మెనిమిదిగంటలకు భీమునిపట్నము చేరిరి.

వెంకన్న ముత్యాలమ్మను దీసికొని యారాత్రి మూడుగంటలకే
భీమునిపట్నము చేరి యొకయింట బసదిగి యామరునాడే స్టీమరొక
టి రంగమునకుఁ బ్రయాణమయి పోవునని విని తెల్లవారినతోడనే స్టీ
మరు టిక్కెట్లను దీసికొని పోవుటకు నిశ్చయించుకొనెను. తరువాతఁ
దెల్లవారినతోడనే వెంకన్న వీధిలోనికిఁ బోయి "కొప్పుల వెంకన్న,
వెంకన్నభార్య ముత్యాలమ్మ" యని వ్రాయఁబడిన రెండుటిక్కెట్లు
ను కొని బజారులోఁ గొంతసామానును గొనుక్కొని యింటికివచ్చెను.
ఇతఁడింటికి వచ్చులోపలఁ గాపువాఁడును, మొదలియారుగారును, బి
ళ్ళగారును, బండ్లవాండ్ర నడిగి, ముత్యాలమ్మయు, వెంకన్నయు, బ

సదిగినయిల్లు దెలిసికొని యక్కడకువచ్చిరి. అప్పుడు ముత్యాలమ్మ యొంటరిగానుండుటచే నామెను సమీపించి యేమేమో నామెతో మాటలాడుచుండ వెంకన్న వచ్చెను. అప్పుడు మొదలియారుగారు నీవిట్లు నమ్మించి కాపువానిని మోసముచేయుటఁ దగదనియు, నిన్ను ఖైదులోఁ బెట్టింతుమనియు, మిక్కిలి యాగ్రహముతోఁ బలికిరి. పిళ్ళగారాతనిఁదిట్టనారంభించిరి. కాపువాడును వెంకన్న చేసిన యకార్యమున కాతని నేమేమో దిట్టనారంభించెను. ముత్యాలమ్మ దన్ను వీరు పట్టుకొన్నందుకు విచారించుచుఁ దన్ను దిరిగి యింటికిఁ దీసికొని పోదురని భయపడుచుఁ దనకు వారాడుమాటలు స్పష్టముగాఁ దెలియకపోయినను, మతిపోయిన దానివలె నోటమాటలేక యూరకుండెను. వెంకన్న చిఱునగవునవ్వుచు ముత్యాలమ్మ దనభార్యయనియు నామెను గడచినరాత్రి పెండ్లాడితిననియుఁ దానినింటికి రమ్మని బలవంతపెట్టుటకు మీరెవ్వరనియు బదులుచెప్పి స్టీమరు టిక్కెట్టులోఁ గూడ ముత్యాలమ్మ దన భార్యయని వ్రాయఁబడియున్నదని చూపించెను. పిళ్ళగారు కోపము బట్టలేకఁ దనచేతికఱ్ఱతో వెంకన్న నొకదెబ్బకొట్టిరి. ముత్యాలమ్మ బిగ్గరగా కేకలుపెట్టుచు నేడ్వ మొదలుపెట్టెఁ, గాపువాఁడామె చెంపపైఁ జేతితోఁ గొట్టెను. వెంకన్నను బోలీసువారికప్పగించి కొట్లో బెట్టించెదనని మొదలియారుగారాగ్రహముతోఁ బలికిరి. వెంకన్న పిళ్ళగారిని గొట్టి మొదలియారుగారిని గొంతుకపట్టుకొని క్రిందఁ బడవైచి "నాభార్యను గొట్టుటకు నీవెవ్వఁడ" వని కాపువానితోఁ బోరాడ మొదలుపెట్టెను. ముత్యాలమ్మ భయపడుచు మాటలాడనేరకూరకుండెను. ఇట్లు కాపువాఁడును వెంకన్నయుఁ బిళ్ళగారును గొంతసేపు పోరాడి తిట్టుకొనుచు గొట్టుకొనుచుండ మొదలియారుగారు దెప్పిరిలి క్రిందబడిలేచి వెంకన్నతోఁ బోట్లాడుటవలన లాభములేదనియు ముత్యాలమ్మ దాదాపు ఏబదిసంవత్సరముల వయసుగలదగుట

చే మైనరని చెప్పుట కెంతమాత్రము వీలులేదనియు వెంకన్న ముత్యాలమ్మను బెండ్లిచేసికొన్నట్లు చెప్పుచు నామె దనభార్యయని టికెట్టులో గూడ వ్రాయించియుండుటచే యది నిజముకాదని రుజువు చేయగలుగుట మిక్కిలి గష్టమనియు ముత్యాలమ్మ యిల్లువిడచి యింతదూరము వచ్చినతరువాతఁ దాను వెంకన్న మాటాడును గాని నిజము చెప్పదనియు నిట్టి వ్యవహారములో వీధులెక్కి ఫిర్యాదుచేసి యల్లరి పడుటకంటె రాజీని ఫైసలు చేసికొనుట మంచిదనియు నూహించి న్యాయశాస్త్రపండితుఁడగుటచే శాంతము దెచ్చుకొని వెంకన్న దన గొంతు పిసికి నేలఁబడవేసినను నాతనిపై గోపమించుకయు లేకఁ గార్యవాదుల కాగ్రహమనుచితమని గ్రహించి యాతని జేయిపట్టుకొని యావలకుఁ దీసికొనిపోయి "నీకేమైనఁ గావువానిచే నిప్పించెదను గాన ముత్యాలమ్మనింటికిబంపివేయు" మని బ్రతిమాలుకొనెను. వెంకన్న దనకు ముత్యాలమ్మయందుఁ గల మోహముచే నామెను వివాహమాడవలయునని యిల్లువెడలదీసి తీసికొనిరాకపోవుటచేతను నామె నాతఁడు వాస్తవముగాఁ బెండ్లాడియుండకపోవుటచేతనుఁ గొంతసేపు దానామెను విడువఁజాలననియు నామెయందుఁ దనకు మోహముగలిగి చిరకాలమునుండి యామెను వివాహమాడగోరి దైవానుగ్రహమున గడచినరాత్రియే నామెను వివాహమాడగలిగితిననియు రాత్రి వివాహమాడి యుదయమున భార్యను విడచిపెట్టుటకుఁ దన కెంతమాత్రము నిష్టము లేదనియు మొదలియారుగారితోఁ జెప్పి యామెను విడచిపెట్టుట కెంతమాత్రము సమ్మతించలేదు. కాని మొదలియారుగారాతని ననేకవిధముల బ్రతిమాలి "నీవుకోరినంత సొమ్మిప్పించెద" నని చెప్పెను. వెంకన్న చాలసేపు మొదలియారుగారిమాటకు సమ్మతింపక ద్రవ్యాశచే స్వభార్యనమ్ముకొనునట్లగుమగాన తనభార్యయగుముత్యాలమ్మ నెంత ధనమిచ్చినను విడువననెను. మొదలియారుగారు బ్రతిమాలినకొలఁది

వెంకన్న సమ్మతించనని చెప్పుచు, వెంకన్న సమ్మతించనని తన హితోపదేశమును నిరాకరించినకొలఁది మొదలియారుగారాతని బ్రతిమాలుకొనుచునొకగంటకాలము గడపినతరువాతదుదకు ముత్యాలమ్మ దనభార్య గావున నామెయొద్దనున్న సొత్తంతయుఁ దనకిచ్చివేసినచో నామెను విడచిపెట్టెదనని యాతఁడు చెప్పెను. కానియామెను విడచిపెట్టినంతమాత్రమున కాతని కంతసొమ్మిచ్చుటకు మొదలియారుగారి కెంతమాత్రము నిష్టములేదు. ముత్యాలమ్మ తాను వెంకన్నతోఁ బారిపోవుట కవకాశము లేకుండ నీవిధముగాఁ బట్టుబడి తిరిగి యింటికిఁ బోవలసివచ్చుటకైన నిష్టపడునుగాని దనసొత్తులో నేమియు వెంకన్నకిచ్చుట కెంతమాత్రము నిష్టపడదని మొదలియారుగారికి నిశ్చయముగా దెలియును. అది యటుండ ముత్యాలమ్మ ప్రథమకోపముప్పటికిఁ గొంచెము తగ్గి తిరిగి యింటికిఁ బోవుట కిష్టముగలిగియే యున్నదనియు మొదలియారుగారి కొకధైర్యముగూడఁ గలిగెను. వెంకన్న "నాభార్య" యని తన్ననుటవలనను దన్ను వివాహమాడకయె యట్లనుటయేగాకఁ దనసొత్తంతయు "నాదే" యని చెప్పుచుండుటచేతను నాతనియందుఁ గొంత విరక్తియు ననిష్టమును గూడ నీమె హృదయమం దంకురించినసంగతిగూడ మొదలియారుగారు గ్రహించెను. కాపువాఁడుముత్యాలమ్మకొఱ కంత ద్రవ్యము వెంకన్న కిచ్చుట కిష్టపడడనియు నాతఁ డంతధనము గలవాఁడు గాడనియు మొదలియారెఱుఁగుటయే గాకఁ దాను స్వయముగా నంతసొమ్మిచ్చుటకు బొత్తుగా నిష్టములేనివాఁడై యుండి, వెంకన్న నేవిధముననైన నొకటిరెండువందలరూపాయీలతో సమాధానపఱచి యొప్పించి ముత్యాలమ్మ నింటికిఁ దీసికొనిపోవలయునని యాతనితో బేరమాడ నారంభించెను. అంతనాయింటికిసమీపమున నున్న యొకఁ డీసంగతంతయు గ్రహించి తన స్నేహితుఁడగు నాయూరిపోలీసు సబ్ యినస్పెక్టరుతోఁ జెప్పెను. ఆతఁడు మంచివ్యవహా

రము దొఱకినదని సంతోషించుచుఁ దనయదృష్టమునకు మనసులో సానందించి యొకనిముసమైన వృథబుచ్చక ముత్యాలమ్మయు వెంకన్నయు మొదలగువా రున్నయింటికిఁ బరుగెత్తుకొనివచ్చి సంగతంతయు మొదలియారుగారివలనను గాపువానివలనను బిళ్ళగారివలనను వెంకన్నవలనను విని తెలిసికొని కాపువాని వాఙ్మూలమును వెంకన్న వాఙ్మూలమును, దీసికొని తన కీవ్యవహారము మిక్కిలి యనుమానాస్పదముగా నున్నదనియు, నిది యొక గొప్పకేసనియు, నిది దనపైయధికారులకుఁ దెలియపఱచి దీనిపరియవసానమంతయుఁ దేల్చినపిమ్మటఁగాని వారిని వదలిపెట్టుటకు వీలులేదనియు, నంతవఱకు ముత్యాలమ్మను వెంకన్నను దక్కిన యీముగ్గురిని వదలిపెట్టుటకు వీలులేదనియుఁ, జెప్పెను. మొదలియారుగా రాపోలీసు సబ్ యినస్పెక్టరుతో ననేకవిధముల న్యాయశాస్త్రానుసారముగా వాదించి ప్రతిమాలుకొన్నను నాపోలీసుద్యోగస్థుఁడు గేసుచేయక మాననియు, మీ రైదుగురిని విడచిపెట్టననియుఁ జెప్పెను. ఆపోలీసుద్యోగస్థున కీవ్యవహారములో విశేషముగా ధనము దొఱకునన్న యాసయొకటి దృఢముగా నుండుటచే నెవ్వరేమిచెప్పినను ముత్యాలమ్మ స్వయముగా దాను వెంకన్నను బెండ్లాడలేదని యొన్నెన్ని ఘోరప్రమాణములు చేసినను వెంకన్నగూడఁ దానాడుమాటలలోఁ దడబడుచు వివాహము జరిగినదని యొకమాటును నప్పటికి జరుగలేదుగాని వివాహము చేసికొనుట కేర్పఱచుకొంటిమని యువ్యవధి చాలక పోవుటచే వివాహమాడలేదుగాని యాదినము తప్పక వివాహము చేసికొన నిశ్చయించుకొంటిమనియు మఱియొకమాటును ననేకవిధములుగాఁ జెప్పుచున్నను, సబ్ యినస్పెక్టరు "నిజము చెప్పుము" ని గట్టిగా బెదరించుచు ముత్యాలమ్మను దాను వివాహమాడలేదన్నప్పుడెల్ల ముండిపడి పళ్ళుగొఱుకుచుఁ గండ్లెఱ్ఱఁ జేసిచూచి వెంకన్నను బెదరించుచు, వివాహము చేసికొంటినని చెప్పినప్పుడెల్ల "నరే ఆలా నిజము చెప్పుము"

ని శాంతముతో మాటలాడుచు నకారణముగాఁ గాపువానిపైఁ గోపగించుచు "యీ కేసు నేను విడచిపెట్టుటకు వీలులే" దని చెప్పుచుండెను. మొదలియారుగారు దమ న్యాయశాస్త్రపాండిత్య మంతయు వినియోగపఱచి యాతనితో నేమేమిచెప్పినను యెంతెంత వాదించినను గాపువాఁడెంతెంత బ్రతిమాలుకొనినను బిళ్ళగారెన్ని విధములఁ బ్రమాణము చేసి వాస్తవముచెప్పినను యాతఁడు దనపట్టుదలను విడువక వారిమాటల నిందుకైనఁ జెవిని బెట్టలేదు. ముత్యాలమ్మ పోలీసుద్యోగస్థునిఁ జూచి దాను గచేరీలెక్కవలసివచ్చునని భయపడుచు మతిపోయినదానివలె దనపెట్టెను మూటను జాగ్రత్తగాఁ జూచుకొనుచు నొకమూలఁ గూరుచుండెను. పోలీసు సబుయినస్పెక్టరుతో నిది నేరమెన్నటికిఁ గాదనియు ముత్యాలమ్మ వివాహము చేసికొనలేదని స్పష్టముగాఁ జెప్పుచుండుటచే నీనేరములో వెంకన్నయే ముద్దాయియనియు, నది యటుండ నీ నేరములోఁ బోలీసువారెంతమాత్రము జోక్యము గలుగఁజేసికొన గూడదనియు, నెన్నివిధముల నెట్లెట్లు వాదించి చెప్పినను వాతఁడు చెవిని బెట్టక నీవ్యవహారమాస్త్రితో గూడినదిగనుక పీనల్ కోడ్ 379-403 శెక్షన్ల ననుసరించి తాను జోక్యముగలుగఁజేసికొని కేసుచేయక మానననియుఁ, దరువాత మేజస్ట్రీటుగారియొద్దఁ గేసు కొట్టివేయించుకొనఁగలిగిన యెడల గొట్టివేయించుకొనవచ్చును గాని తానప్పుడు కేసుచేయకపోయినచోఁ! దనయుద్యోగమునకు భంగముగలుగును గావున వారిని విడచిపెట్టననియుఁ, జెప్పి వెంకన్న నావలకు దూరముగాఁ దీసికొనిపోయి ముత్యాలమ్మను వివాహము చేసికొనలేదని యెంతమాత్రము చెప్పవద్దనియు, నట్లు చెప్పకపోయినచోఁ దమకిద్దఱకుఁగూడ లాభమున్నదనియు, దానట్లుచెప్పకపోయినచో నాస్త్రితో ముత్యాలమ్మను దీసికొనివచ్చి నట్లాతనిపై నేరము మోపుదలచేసి శిక్షింపఁబడునట్లు చేతుననియుఁ, వాతనేరస్థుఁడవగుటచేఁగఠినముగా శిక్షవిధింపఁబడక మాన

వనియుఁ జెప్పి యాతనిభయపెట్టెను. తాను నేరస్థుఁడుగాకుండఁ జెరసాలలో నుండవలసిన యాపద దప్పించుకొనగలుగుటయే గాక నీవ్యవహారములోఁ గొంతద్రవ్యము సంపాదించుకొనుట కవకాశముగూడ గలిగియుండుటకు వెంకన్న సంతోషించి యాతనిసలహా నంగీకరించి ముత్యాలమ్మ తప్పకఁ దనభార్యయే నని చెప్పనారంభించెను. పోలీసు సబ్ యినస్పెక్టరు వెంకన్న వాఙ్మూలమును, కాపువాని వాఙ్మూలమును బిళ్ళగారివాఙ్మూలమును మొదలియారుగారి సాక్ష్యమును వ్రాసికొని వీరందఱను ముత్యాలమ్మతో స్టేషనుకుఁ దీసికొనిపోదునని బెదరించి, నూరురూపాయీలు వారియొద్దఁ బుచ్చుకొని జామీనుమీఁద వారిని విడచిపెట్టి, వెంకన్న వీరితోఁగలసితన లాభమును బోగొట్టునని భయపడి యాతనిమాత్రము దనతోఁ దీసికొనిపోయెను.

తరువాత మొదలియారుగారును గాపువాఁడును బిళ్ళగారును ముత్యాలమ్మయు నాబసలోనె నేమియుఁదోచక గూరుచుండి కర్తవ్యమాలోచించుకొనుచు నీవ్యవహారమీవిధముగాఁ బరిణమించినందుకు విచారించుచుండిరి. ఇదంతయుఁ గేసుచేయఁబడి తనవదినెగారితో మేజిస్ట్రేటుకచేరీకిఁ బోవలసివచ్చుటచే సంభవించుప్రతిష్ఠకును నవమానమునకు నందువలనఁ దనకొమారితలకు మంచిసంబంధములు చేకూరకపోవునను భయముచేవిచారించుచు ముత్యాలమ్మచేసినదానికామెపైఁ దనకెంతకోపమువచ్చినను యామె నేమైన నన్నచోఁ గార్యము చెడిపోవునని దనకోపమంతయు దిగమ్రింగి తనహృదయములో నిముడ్చుకొని, వెంకన్నపైఁ దనకెంతయాగ్రహమున్నను నేమియుఁ జేయలేక నాపత్సముద్రములోఁ బడి తనగ్రహచారదినములు మంచివిగావని దలఁచుచు మతిపోయినవానివలెఁ దనలో దానాలోచించుచు నొకచోటఁ గూరుచుండెను. ముత్యాలమ్మయు దాను దప్పక కచేరీకిఁ బోయి నలుగురికండ్ల బడవలసివచ్చుననియుఁ, దన కవమానము వచ్చునని

యు, నింకనేమైన యాపదఁగూడ తటస్థించిన, దటస్థించవలసివచ్చునని యు భయపడి కండ్ల నీరుఁగార్చుచు నొకమూలనుండెను. మొదలియారుగారును బిళ్ళగారును, వెంకన్నను నేరస్థునిగా రుజువుచేసి యాతనికి శిక్ష వేయించవలెననియు, నాతని నేమిచేసినను జేయదగినదేయనియుఁ, జెప్పుచుఁ గోపము పట్టఁజాలక పండ్లు పటపటఁగొఱుకుచు, వెంకన్న దమయెదుటనున్నట్లును నాతనిగొట్టుచున్నట్లును గోడలను స్థంభములనుఁ జేతులతో గుద్దుచుఁ గాళ్ళతో దన్నుచు నటునిటు దిరుగుచుఁ బోలీసు యినస్పెక్టరుమీఁద ఫిర్యాదుచేసి యాతని యుద్యోగమూడఁబెరికించెదమనియు, నీవ్యవహారమును గూర్చి నాలుగుదినములైనను నెన్నిదినములైనను నక్కడనుందుమనియు, నీవిషయమై యెంతధనమైనను గర్చుపఱచెదమనియుఁ, జెప్పుచుండిరి. కాపువాఁడు దనవ్యవహారమును బశువులను విడచి పెండ్లిగాని తనకొమార్తెల నొంటరిగా నింటదిగవిడచి యచ్చట నెన్నిదినములుండవలసివచ్చునో! యని భయపడుచుండెను. మొదలియారుగారును బిళ్ళగారును దమస్నేహితులగు నాయుఁడుగారిని శెట్టిగారిని విడచి కొన్నిదినములక్కడ నేయున్నచో వారికిఁ దమసంగతి దెలియక నేమేమిదొట్రుపాటుపడుచుందురో యని మనసులో సందేహించుచు వెంకన్నపై కోపముపట్టఁజాలక నేమియుఁ జేయగలసాధనములేకఁ జీకాకుపడుచుండిరి. కాపువాని యొద్దగాని మొదలియారుగారియొద్దగాని నొకదమ్మిడీయైనను లేదు. పిళ్ళగారి జేబులో నాలుగురూపాయీలు మాత్రముండెను. ఆరూపాయీలను దీసికొని తమరెక్కివచ్చిన బలిడిరెడ్లకు గొంత గడ్డికొనివేసి వానినొకచోటగట్టి మొదలియారుగారిని బిళ్ళగారిని ముత్యాలమ్మయొద్దఁగా నుంచి యాకాపువా డొకవంటపూటియింటికిఁ బోయి దానుభోజనము చేసి వారిద్దరికిని నన్నముదీసికొనివచ్చి పెట్టెను. వీరు భోజనము చేయునప్పటికి మధ్యాహ్నము బండ్రెండుగంటలైనది. అప్పటికి

మొదలియారుగారికిఁ గొంచెము కోపము తగ్గి శాంతమువచ్చినది.

తరువాత మొదలియారుగారి కేసు పర్యవసానమేమయినను నామీవిషయమై పడవలసినశ్రమయంతయు నాలోచించి ముత్యాలమ్మ వెంకన్నను పెండ్లిచేసికొనలేదని రుజువుచేయవలసిన బాధ్యత కొంతవఱకైన దమకుదప్పదనియు, నామెయుఁ గాపువాఁడును నీకేసులో నప్రతిష్ఠకుఁబాలగుట విధాయకమనియు, నీవ్యవహారము త్వరలో తేలకపోవుటచే దాము దమస్నేహితులను సేవకులను విడచి కట్టుకొనుటకు బట్టలైన లేక యక్కడగొన్నిదినములుండక దప్పదనియు, నీకేసుమూలమునఁ గాపువానియొక్కయు ముత్యాలమ్మయొక్కయు గౌరవహాని యటుండ, నిరపరాధులగు నాతనికొమార్తెలకిద్దఱకును వివాహములు గాకపోవుటగూడఁ దటస్థమగుననియు, గ్రహించి యీసంగతంతయు బిళ్ళెగారితోఁ జెప్పి యీకేసేవిధముగానైన బోలీసువారిని సమాధానపఱచి దప్పిపోవునట్లు చేసికొనుట మంచిదని నిశ్చయించుకొని యీసంగతంతయుఁ గాపువానితోఁ జెప్పి యాతనిగూడ నందుకొప్పించెను. ఇట్లీ ముగ్గురా కేసు పైకిరాకుండఁ జేసికొనుటకు నిశ్చయించుకొని మధ్యాహ్నము మూడుగంటలకు మొదలియారుగారు సబ్ యినస్పెక్టరుతోఁ గలసి మాట్లాడుటకుఁ బోలీసుస్టేషనుకుఁ బోయెను. సబ్ యినస్పెక్టరు మొదలియారుగారిని జూచి కూర్చుండుమని చెప్పి యేమేమో పనియున్నవానివలె నటించుచు గొంతసేపు మాటలాడక తరువాత నాతని దీసికొని యావలకుఁబోయి మొదలియారుగారుచెప్పినదంతయు విని కార్యము మించినదనియుఁ, దానదివఱకే వాఙ్మూలములు దీసికొన్నట్టు రికార్డు చేసితిననియుఁ, జెప్పెను. మొదలియారుగారాపై నాతని ననేకవిధముల బ్రతిమాలి వెంకన్నకును నినస్పెక్టరుకును గలపి వెయ్యి రూపాయీలిచ్చుటకును, కేసు చెయ్యకుండ నావ్యవహారమును సవరణ చేయుటకును, నాతని నొప్పించి సాయంత్రము మూడుగంటలకు బసయొద్ద

కుఁ దిరిగివచ్చి కాపువానిని గలసికొని సంగతంతయు నాతనితోను బి
ళ్ళగారితోనుఁ జెప్పెను. కాపువానియొద్ద నేమియు లేకపోవుటచే నా
తడప్పు డంతసొమ్మియ్యలేననియుఁ, దనకెవ్వరైన నాయాపత్సమయ
మున నీసొమ్మిచ్చి సహాయముచేసినచోఁ దానింటికిఁ బోయినతోడనే
యప్పైనఁ జేసి యాసొమ్మిచ్చివేతుననియుఁ, జెప్పెను. ముత్యాలమ్మ నా
నసమయములో సొమ్మడిగినచోఁ గార్యము చెడుటయే గాకఁ దమతో
రాదని వీరు భయపడిరి. అప్పుడుచేయఁదగిన దేమియు గానుపించక
పోవుటచే దయాసముద్రుఁడును నాపద్బాంధవుఁడును నగు నామొద
లియారుగారు దనవజ్రముల దన్మెట్లను బంగారపువాచీని బొత్తాముల
ను గొదువపెట్టి సొమ్ముదెచ్చి పోలీసువారికిని వెంకన్నకును యిచ్చివే
యుటకు నిశ్చయించుకొనెను. కాని యావస్తువులు గొదువపట్టి నె
య్యిరూపాయీ లాయూరనెవ్వరు నియ్యకపోవుటచే వాని నమ్ముట కి
ష్టములేకఁ దనయింటికిఁ దంతిసమాచారమంపి పదియేనువందలరూ
పాయీలా మరునాటికిఁ దెప్పించి పోలీసు సబ్ యినస్పెక్టరుకును వెం
కన్నకును యిచ్చి సాయింత్రమగుటచే నారాత్రి చీకటిలోఁ బ్రయాణ
మై పోవుట కిష్టములేక మరునాడు బయలుదేరుట కేర్పఱచుకొనిరి.
ఇట్లు వారునలుగురు భీమునిపట్నములో రెండుమూడుదినములీ వ్యవ
హారమునఁ దగులుకొని యుండవలసివచ్చెను.

ఈవిధముగా మొదలియారుగారును బిళ్ళగారును గాపువాఁ
డును ముత్యాలమ్మయు భీమునిపట్నమున నీవ్యవహారములో దగుల్కొ
ని యచ్చట శ్రమనొందుచుండ, నాయుఁడుగారును శెట్టిగారును లోక
లుఫండుసత్రముదగ్గిరనున్న కాపువానియింటనే యుండి దమస్నేహి
తులు గాపువాని కొమార్తెలకు సంబంధములు నిశ్చయముచేసి వరుల
తో నింటికి వత్తురనియు, నందువలన వారింటికిఁ దిరిగివచ్చుట కాలస్య
మైనదనియుఁ దలఁచుచుండిరి. కాని ముత్యాలమ్మొకవేళఁ దిరిగివచ్చు

ట కిష్టపడకపోయి యుండవచ్చుననియు నామె వీరికి గనుపించకనే యుండియుండవచ్చుననియు వీరికనుమానము లేకపోలేదు. సుబ్బమ్మయు లక్ష్మియు మాత్రము ముత్యాలమ్మవిషయమై యంతగా నాలోచించి యామెదిరిగివచ్చునో లేదో యని సందేహించకఁ దమ్ముఁ బెండ్లాడువరులను గూర్చియు దమవివాహములను గూర్చియు మనసులో నాలోచించుకొనుచు నత్యుత్సాహముతో నుండిరి. నాయుఁడుగారికి వీరిరువురు నతివినయభయభక్తులతో నుపచారము చేయుచు శెట్టిగారుపాడు సంగీతమును, జదువుపద్యములను, చెప్పెడికథలను వినుచు వీరిద్దరిని మిక్కిలి గారవించుచుండిరి. స్వభావముచే లక్ష్మి మాటలాడుచున్నప్పుడు నవ్వుచుండునని యిదివఱకే చెప్పఁబడియున్నది. నాయుఁడుగారితో లక్ష్మి మాటలాడునప్పుడెల్ల నవ్వుచు మాటలాడుచు నాయనయొద్దఁ దరుచుగా గూరుచుండుటయు సుబ్బమ్మ శెట్టిగారి పాటను, కథలను వినుచుండుటయు వీరి సేవకులగు రామునికిని గుప్పసామికిని మనసులో గొంచెమునుమానమంకురింపఁజేయ, వారిరువురు నొకరితో నొకరు గుసగుసలాడుచు, నేమేమో మాటలాడుకొనుచుండిరి. అంతసత్రములోనున్న వంటబ్రాహ్మణుఁడు సత్యవరమునుండి తిరిగివచ్చెను. ఇతఁడు నలువదిసంవత్సరములు వయసు గలిగి కొంచెము పొడుగుగ బలమైన శరీరముతో నుండెను. ఇతని చేతులకు బంగారు మురుగులు గలవు. పదిరూపాయీల జీతమున కాసత్రములో నైదాఱుసంవత్సరములనుండి పనిచేయుచు నక్కడనే గాపురముండి వివాహముగానివాఁడుగావున రాత్రులందక్కడకు సమీపముననున్న గ్రామమునకుఁ బోయి యుదయమునఁ దిరిగి యాసత్రమునకు వచ్చి పనిచేయుచు నితఁడు గాలము గడపుచుండెను. ఇతఁడు దరుచుగా ముత్యాలమ్మ యనుగ్రహమునకుఁ బాత్రుఁడై సత్రములోనున్న యూరగాయలు, బచ్చళ్ళు, గూరలు మొదలగువానిని నామెకిచ్చుచు నామెయొద్దఁ దనకుఁ గావలసివచ్చినప్పుడు స్వల్పమొత్తములుగా సొమ్ము

బదులుపుచ్చుకొనుచుండెను. కాపువాని గొమార్తెలమీఁద నీతఁడు గన్నువైచి వారిని స్వాధీనపఱచుకొనవలయునను నభిప్రాయమంతరంగమున దృఢముగా గలిగియుండెను గాని ముత్యాలమ్మకును గాపువానికిని మిక్కిలి భయపడుచుఁ దన దురుద్దేశమును బ్రకటించి తన యభీష్టముకొఱకుఁ బ్రయత్నించుటకు మిక్కిలి భయపడుచుండెను. ముత్యాలమ్మయుఁ గాపువాఁడును యింటలేనిసమయ మీతనికింతకుఁ బూర్వమెన్నఁడును దటస్థముగాక యిప్పుడు తటస్థమగుటయు నట్టిమంచిసమయము దటస్థమైనప్పుడీనాయుఁడుగారును శెట్టిగారును దనకడ్డముగానుండుటయు, సుబ్బమ్మయు లక్ష్మియు నీయిద్దరితో మిక్కిలి చనవుతో నవ్వుచు మాటలాడుచుండుటయు నీతనిమనసును వేధించుచుండ తనపుట్టంతయు మునిగిపోయినట్లు దుఃఖించుచు నోర్వజాలనివానివలె నమితబాధలఁబడుచు రాముఁడు గుప్పుసామియు రహస్యముగా గుసగుసలాడుచు, మాటలాడుచుండుటఁ జూచి వారిస్నేహము చేసి వారితోఁ గలసి తానును రహస్యముగా మాటలాడుచుండెను. అంత నొకనాఁడు సాయంత్రము లక్ష్మి దమపెరటిగుమ్మము దగ్గరఁ గాలుజారిపడెను. ఆమె పడుటఁజూచి శెట్టిగారు లేవదీసిరి. దెబ్బతగులక పోవుటచే లక్ష్మి పకపకనవ్వుచు లేవ శెట్టిగారామెను జూచినవ్వుచుఁ "బెండ్లికొమార్తెకేమియు దెబ్బదగులకపోవుట మిక్కిలి సంతోషకరముగానున్నది" అని "బెండ్లికొమాళుఁ డింటికివచ్చుసమయమునకుఁ బెండ్లికొమార్తె గుంటుచు నడచుచుండవలసిన యవస్థ దప్పినది" అని గేలిచేసిరి. ఇదంతయు రాముఁడు దడియావల నుండి తొంగిచూచి "లక్ష్మిని శెట్టిగారాలింగనముచేసికొని గేలిసేయుచు ముద్దాడి" రని యాతక్షణమే పోయి కుప్పుసామితోను సత్రములోనున్న వంటబ్రాహ్మణునితోను నక్రూడఁ దనకగుపించిన యితరులందఱితోను జెప్పెను. ఈసంగతి వినినతరువాత నాబ్రాహ్మణునకసలే మతిపోయినది. అతఁడు దనపని

కూడ మానివేసి రాత్రివేళ నక్కుడనే యుండి సుబ్బమ్మను లక్ష్మిని గనిపెట్టి చూచుచుఁ గాచుకొని తిరుగుచుండెను. సుబ్బమ్మయు లక్ష్మియు నమాయక స్వభావముతో నెప్పటియట్లు నాయఁడుగారితోను శెట్టిగారితోను జనువుగా నవ్వుచు మాటలాడుచుండిరి. శెట్టిగారును నాయఁడుగారును దమయందు వీరికిఁ గల గౌరవభయభక్తులనుబట్టియుఁ వారు దమకుచేయు నుపచారములనుబట్టియు వారిని మిక్కిలి ప్రేమతోఁ దమ గొమార్తెలవలె గారవించుచుండిరి. రాముఁడును వంటబ్రాహ్మణుఁడును దమయిష్టమువచ్చినట్లు కథలుగల్పించి వీరిని గురించి యపవాదలాడుచు లక్ష్మికిని సుబ్బమ్మకును నాయఁడుగారితోను శెట్టిగారితోను సంబంధము గలదనియుఁ దాము స్వయముగాఁ జూచితిమనియు నెన్నెన్నియో గల్పించి యందఱితోఁజెప్పిరి. మఱియు శెట్టిగారు గొన్నిదినముల క్రిందట వీరికి బట్టలను రైకలను గొన్నివస్తువులను గొనిపెట్టిన యంశ మీయపవాదను బలపఱిచెను. సుబ్బమ్మయు లక్ష్మియు శెట్టిగారితోను నాయఁడుగారితోను నేమిమాట్లాడినను వీరు వారిరువురతో నేమి చెప్పినను వీరేమేమి చేసినను నంతయు శృంగారచేష్టలుగాను నాయికానాయకభావ ప్రకటనలుగాను నర్థముచేసికొని రాముఁడును గుప్పసామియు వంటబ్రాహ్మణుఁడును లేనివన్నియుఁ గల్పించి యందఱితోఁ జెప్పుచుండిరి. రాముఁడు మిక్కిలి భోజనప్రియత్వము గలవాఁడు. నిద్రలో నీతఁడు గలియుగకుంభకర్ణుఁడనుట కెంతమాత్రము సందియములేదు. వీనికి వంటబ్రాహ్మణుని స్నేహము లభించిన తరువాతఁ దనయంతరంగమంతయు నాతనికిందుకయిన దాచక బయలుపెట్టుచు నాతనికిఁ బ్రాణమిత్రుఁడై సత్రమున నీతఁడు వండినదంతయు స్వేచ్ఛగాఁ గడుపునిండ దినుచు నెప్పటియట్లు కాపువాని యింట భోజనము చేయుచుండెను.

అంత నొకనాఁడుదయమునఁ దొమ్మిదిగంటలకు భోజనముచేసి

ముత్యాలమ్మయు మొదలియారుగారును బిళ్ళగారును బండిలోఁ గూర్చుండి యుండ కాపువాఁడా బండి దోలుచు నింటికిఁ బ్రయాణమాయెను. వీరు దారిలో వెంకన్నపై దమకుఁ గల యాగ్రహమంతయు యథేచ్ఛముగాఁ బ్రకటించుచు విచ్చలవిడిగాఁ దమనోటికి వచ్చినట్లాతనిఁ దిట్టుచుఁ బోవుచుండిరి. వెంకన్న దుర్మార్గుఁడనియుఁ దన్ను మోసము చేసి తనసొత్తంతయుఁ దీసికొనిపోవుటకాతఁడు దన్ను వివాహము చేసుకొనువానివలె నటించి యిన్ని కష్టములకును, నప్రతిష్ఠకును బాలు చేసెననియు ముత్యాలమ్మ కప్పటికిఁ దోచి యామెఁగూడ నాతనిఁ దిట్టనారంభించెను. కాపువాఁడు దనకు మొదలియారుగారు చేసిన సహాయమునకును నుపకారమునకును "మీరు చేసిన మేలు మఱువజాల" నని యాయనను శ్లాఘించుచు నర్థసహాయములేక నట్టికార్యములు సాధింపఁబడవని చెప్పఁ బిళ్ళగారట్టి విషయములలో నర్థబలము కన్న నంగబలమే ముఖ్యముగాఁ గావలయుననిరి. ఇట్లు కొంతదూర మీవిధముగా మాటలాడుకొనుచుఁ బోయినతరువాత మొదలియారుగారు గాపువానినిఁ జూచి ముత్యాలమ్మ నింక నసహాయురాలినిగా వెంకన్నవంటి దుర్మార్గులు చేయు మోసకృత్యములకుఁ బాలగునట్లొంటరిగానుంచుట మంచిదిగాదనియు "స్త్రీలచిత్తములు దురవగాహములును నస్థిరములును నమ్మనర్హములుగానివియు న" ని శాస్త్రములు ఘోషించుచుండుటచే నికముందైన జాగ్రతపడకుండుట హానికరముగావున "నేండ్లకామె కన్నఁ జిన్నవాఁడవైనను సంసారము క్షేమమును గుటుంబస్వాస్థ్యమును నెంచి యామె నించుకయిన నాలస్యము చేయక నింటికిఁబోయినతోడనే వివాహము చేసికొమ్మ" ని హితము చెప్పెను. పిళ్ళగా రాపని యత్యుత్కృష్టమైనదిగావున నించుకయిన సందేహింపక యారాత్రిగాని మరునాఁడుగాని ముత్యాలమ్మను వివాహము చేసికొనవలసినదే యనియు, నందువల్ల గాపువాని కమితలాభమున్నదనియు, నాతని సంసారస్థితి

యంతయు మిక్కిలి జక్కగా నుండుననియు, నాతనికిఁ బుత్రసంతాన ముగూడఁ ద్వరలో గలుగుట కెంతమాత్రము సందియములేదనియు, నీవివాహము స్వయముగాఁ జేయించినతరువాతనే దామచ్చటనుండి పోవచ్చుననియుఁ, జెప్పెను. ముత్యాలమ్మ కీమాటలన్నియు స్పష్టముగా వినిపించకపోయినను దనమురిదిని దన్ను వివాహము చేసికొమ్మని చెప్పుదున్నారని గ్రహించి మునిమునినవ్వులు నవ్వుచు సిగ్గుగనబరచుచుఁ దల యొంచుకొని చెవిటిరామచిలుకవలె వీరాడుమాటలను జెవియొగ్గి వినుచుండెను. కాపువానికి మాత్ర మీమెను వివాహమాడుట కెంత మాత్రము నిష్టము లేదు. ముత్యాలమ్మకప్పుడు నలువదిరైదేండ్లకుఁ దక్కువవయసుండకపోయిననుఁ జూచుటకు ముప్పదియేండ్లకు లోపువయసుగలదిగా గనుపించుటచేతను నామెకంతకుఁ బూర్వము చిన్నతనములో వివాహమైనను భర్తతోఁ గాపురముచేసియుండని గారణమును బట్టియు వివాహయోగ్యతగల కన్యయే ననియు మొదలియారుగారు సెలవియ్యఁ బిళ్ళగా "రట్టి యోగ్యతగల పెండ్లిగూఁతురు దట స్థమగుట గాపువాని పూర్వపుణ్యము" ని శ్లాఘించిరి. అప్పుడు ముత్యాలమ్మ దనసిగ్గును గొంచెమావలకుఁ దోచి యట్టిసమయమున సిగ్గుపడి యూరకుండుట రసహీనమనియుఁ గార్యసాధనమునకుఁ దగనిదనియు జక్కగా గ్రహింపఁగల యుచితజ్ఞురాలు గావున సమయోచితముగా నప్పటి కర్హమైన శృంగారమును బ్రకటింపుచు స్త్రీయోచితములగు రసభావములచే శక్త్యానుసారముగా నుత్కలికలను విలసిల్లఁజేసి తల యొంచుకొని తనపెండ్లికొమాతికాతనమున కత్యావశ్యమైన ముగ్ధాలక్షణముల నభినయించుచుఁ దనకు నలువదియేండ్లు వయసులేదనియుఁ, జిన్నతనములోఁ దాను స్ఫోటకము పడుటవలన మొగముమీఁద గంట్లును జెముడును నొకగంటఁ గొంచెము పువ్వునుమాత్రము దటస్థమైన వనియు, నైనను వానియడ్డ మెంతమాత్రము లేకుండఁ దనకుఁ జక్క

గా మాటలు వినిపించుచుననియు, రాత్రివేళ నల్లపూస గూడ గనుపించ కపోదనియుఁ, జెప్పి పైట సవరించుకొని తనయందమునకుఁ దానే యానందించుచుండెను. అప్పుడు పిళ్ళగారు సంసారస్త్రీలకును వివాహమాడుస్త్రీలకును సౌందర్య మనావశ్యకమనియు, శీలమును, స్వభావమును, గుణములును, మాత్రమే ముఖ్యమనియు, ముత్యాలమ్మ నల్లగానున్నను గురూపికాదనియు, నామెశరీరమున లావణ్యముగూడ స్పష్టముగా గండ్లు మిరుమిట్లుగొలుపఁ గనుపించుచున్నదనియుఁ జెప్ప, మొదలియారుగారు ముత్యాలమ్మనుఁ జూచినదాది దనవంటిపిల్లలుగలవానికేఁ దిరిగి యామెను వివాహమాడి యదివఱకే చిరకాలము క్రిందట మఱచిపోయిన తనయౌవనస్థితియందలి శృంగారరసభావములన్నియు నొక్కసారిగా వివేకమంతయు ముంచివేయ, నిశ్చలమైన మనసుగలవాఁడగుటచేఁ దనవివేకమంతయు సంపూర్ణముగాఁ గొట్టికొనిపోకుండఁ గొంతగాకపోయినఁ గొంతయైనను గాపాడుకొనఁగలిగితిననియుఁ, జెప్పి; కావువానికి సర్వవిధములచేతను నట్టియుచితమైన వధువు దొరకుట కేవలముఁ బూర్వకర్మపరిపాకమాహాత్మ్య మనియెన్నో విధములుగాఁ దననోటికివచ్చినట్లెల్ల శ్లాఘించెను. ముత్యాలమ్మ మందహాసముచేయుచు గవ్వలగుత్తులవంటి తనదంతముల శోభ గొంచెముగాఁ గానుపింప, మొదలియారుగారు దన్నుగూర్చి యాడిన మాటల కాయనపై ముగ్ధోచితమును శృంగారరససమన్వితమును నగు గోపమును వీక్షణమాత్రమున గనఁబరచి నవ్వి తలవంచుకొని పైటసవరించుచు, నాతని శరీరముఁ దనకుఁ దగులకుండ వావలకు మెల్లగా జరిగి, తాను చిన్నతనములో స్ఫోటకముపడినప్పుడు దలంతయు గంట్లుపడుటచే శిరోజములు మిక్కిలి పొట్టిగాను పలచగాను నుండుటయు, నవి చాలనెఱుపుచేతఁ బండియుండుటయుఁ దటస్థమయినదనియు, నది లక్ష్మికి హాస్యాస్పదముగాఁ దోచుచున్నదనియుఁ, దానొక

వారము దినములు శ్రద్ధతోఁ బనిచేసిన యెడల జాడవీలుగాకుండఁ జేయగలననియు, "మొగుడు లేని దానికి శృంగారమేల" యనియుఁ దన శృంగారము జూచి యానందించువా రెవ్వరనియు, నదివఱకు విరక్తితో నశ్రద్ధ చేసితిననియుఁ, జెప్పి తనకీనాటికి గన్నె చెఱ వదలిపోవుటకుఁ గల్యాణ కాలము వచ్చినదని సంతోషింపసాగెను. కాని యా గాపువాని కామెను వివాహము చేసికొనుట కెంతమాత్రము నిష్టము లేకున్నను దనకమితోపకారమాచరించి ద్రవ్యసహాయముగూడఁ జేసి యాపద్బాంధవుఁడుగానున్న మొదలియారుగారి యొక్కయుఁ, బిళ్ళగారి యొక్కయు, మాటలకెదురాడ నోరురాక మాటలాడ కూరకుండెను. అంత ముత్యాలమ్మ దన తలకు నాగరమును, జెవులకు జూకాలునుఁ, జేతులకు వంకీలును, మురిడీగొలుసులును; మెడలోనికిఁ గాసుల పేరును, గాళ్ళకుఁ బాంజేబులును, నడుమునకు మువ్వల వడ్డాణమును, ముక్కుకు మంచి బులాకీయుఁ జేయించుకొన్నచో బాగుగా నుండునాయనియుఁ దనకేరంగు బనారసు చీరఁ దగియుండునో జెప్పుమనియు, సిగ్గుతో మెల్లగాఁ బలికి, ప్రకృతిమధురముగల తన స్వభావసౌందర్యమునకు వేషరచన లావణ్యకములయినను భావిశోభన వ్యాపారోచితముగాఁ దన పెండ్లికొమార్తెతనమున కాభరణములు ముఖ్యములని గ్రహించి, తానీవస్తువులను మఱికొన్ని చిన్న వస్తువులను గూడ వెంటనే చేయించుకొనుటకు నిశ్చయించుకొంటినని, తన యంతరంగమందలి యభిప్రాయమంతయుఁ బ్రకటించి, తన భర్తయగు నా గాపువాఁడును దానును వివాహమాడి చేయు శృంగారచేష్టలన్నిఁటిని మనసులోఁ దలచుకొని సిగ్గుపడుచుఁ బెండ్లికొమార్తెవలెఁ దనమరిది దనవైపు జూచునప్పుడెల్ల సిగ్గుపడి మొగము వంచుకొనుచు యౌవనమప్పుడే యంకురించినట్లు నవోఢాభావములో నుండెను. తరువాతఁ బిళ్ళగారును మొదలియారుగారును ముత్యాలమ్మ వివాహమునకుఁ జేయవలసిన యేర్పాటులన్నిఁటిని గురిం

చియుఁ జర్చించుచుఁ గాపువానిసమాధానముతో నవసరములేకయే నాయిరువురకు వివాహము రహితమయి ప్రధానముగూడ నయినట్లానం దించుచుండిరి. ఇట్లు వీరుమాటలాడుకొనుచు ముత్యాలమ్మ వివాహము దాముస్వయముగానుండి సత్వరముగా మహావైభవముతోఁ జరిగింప నిశ్చ యించుకొని, మొదలియారుగారును బిళ్ళగారును దామీశుభకార్యమును జేయు దటస్థమైనందుల కానందసముద్రములో నోలలాడుచుఁ దాముపడి న మాగాఢాయాసమంతయు మఱచిపోయిరి. ముత్యాలమ్మ గాపువాని యిల్లు సమీపించినకొలది భర్తృగృహము సమీపించు ముగ్ధాంగనవలె సంచరించుచు బండిలోనుండి మొదలియారుగారును బిళ్ళగారును జేతు లుపట్టుకొని దింపువఱకుఁ దిగక గర్భాదానమందిరము జేరు గన్యవ లెఁ దన్ను సుబ్బమ్మయు లక్ష్మియు లోపలికిఁ దీసికొనిపో మెల్లగా న డుగులిడుచు గాని యిల్లుచేరకపోయెను. ఉదయమైదుగంటలు మొద లుకొని యెక్కడఁజూచినను దానే గనిపించుచు లక్ష్మినో సుబ్బమ్మనో ఆ వులనో యెడ్లనోదిట్టుచుఁ, బోరాడుచు, బిగ్గరగా మాటలాడుచు దిరుగుచు న్న యీమె, యీవిధముగా మారిపోవుటఁజూచి యక్కడివారందఱు ను నాయుఁడుగారును శెట్టిగారును గూడ, నీమె యింటికిఁ దిరిగివచ్చుట కిష్టములేకఁ దనకు జరిగిన యవమానమునకుఁ జింతించుచు బలవంత ముమీఁదఁ దిరిగి యింటికి రాగలుగుటవలన మొగముచెల్లక సిగ్గుపడు చుండెనని యూహించిరి. కాని యీమెమాత్రము దనగన్నెచెఱ వద లుటకు గల్యాణకాలము దటస్థమగుటచేతనే వెంకన్నకీబుద్ధి పుట్టుట యుఁ, దానాతనితోఁ గలసి రంగముదాకఁ గాకపోయినను భీమునిప ట్నమువఱకైనఁ బోగలుగుటయుఁ బ్రాప్తమైనదని మనసులో సంతోషిం చుచు, వెంకన్నమూలమునఁ దన గన్నెచెఱ వదలి దానెక్కడకును బో వలసిన యవసరములేకయే స్వస్థానమునఁ దనవారందఱుఁ జూచుచుం డఁ బెండ్లిపీటపై గూర్చుండు నదృష్టము సంభవించెనని మహానందముగు

రాలయి నెవ్వరేమి మాటలాడినను మారుబలుకక తన యానందమును తానే యనుభవించుచు నొకచోటఁ గూర్చుండెను.

కాపువాఁడు బండియెడ్లకు మేఁతఁబెట్టి వానిని గట్టివేసెను. శెట్టిగారును నాయుఁడుగారును ముత్యాలమ్మ నింటికిఁ దీసికొనిరాఁగలిగినందుకు మిక్కిలి సంతోషించిరి. మొదలియారుగారును బిళ్ళయు ముత్యాలమ్మను గాపువాఁడు వివాహమాడుట కేర్పఱుపఁబడినదనియు, నావివాహము త్వరలోనే మిక్కిలి వైభవముతోఁ దామందఱు గలసి చేయించవలయుననియు, నాయుఁడుగారితోను శెట్టిగారితోనుఁ జెప్పిరి. రాముఁడీమాటలు విని పరుగెత్తుకొని పోయి సుబ్బమ్మతోను లక్ష్మితోను సత్రములోనున్న వంటబ్రాహ్మణునితోను జెప్పెను. ఈమాట విని సుబ్బమ్మయు లక్ష్మియు నీమునలిదానికీవయసున నీబుద్ధిపుట్టుటకును దమతండ్రి దమకు వివాహములు చేయుఁదలపెట్టి తుదకుఁ దానే వివాహమాడుటకు నిశ్చయించుకొన్నందుకును నత్యాశ్చర్యము నందుచుఁ దమపెత్తల్లియగు ముత్యాలమ్మ యికముందు దమకు సవతితల్లికూడ యగుననియుఁ దమ్ముఁ బూర్వముకన్న నెక్కువబాధలను బెట్టుననియు భయపడుచుండిరి. ముత్యాలమ్మ మాత్రము తా ననుభవింపఁబోవు శృంగారమును సౌఖ్యమును మనసులోఁ దలచుకొనుచుఁ, దాను చేయించుకొనవలసిన యాభరణములను గూర్చి యాలోచించుచు మిక్కిలి సంతోషముతో నుండెను. శెట్టిగారును నాయుఁడుగారును ముత్యాలమ్మను కాపువాఁడు వివాహమాడుట కేర్పఱుపఁబడి నిశ్చయింపఁబడినదని వినినతోడనే కొంచె మాశ్చర్యముగాఁ దలచినను మొదలియారుగారునుఁ బిళ్ళగారును జెప్పినకారణములనుఁ బట్టి యావివాహ మత్యుత్కృష్టమనియే నిశ్చయించిరి.

తరువాత రాముఁడును గుప్పుసామియు సత్రపు వంటబ్రాహ్మణుఁడును ముత్యాలమ్మ వివాహమును గూర్చి మాటలాడుకొనుచు నామె

యంగవైకల్యమును గూర్చియు ముసలితనమును గూర్చియుఁ జెప్పుకొని నవ్వుకొనుచు, ముత్యాలమ్మ కీవయసున నిట్టి బుద్ధిపుట్టుటకును కాపువాఁడామెను వివాహమాడఁదలచినచో నిన్నాళ్ళూరకుండి యిప్పుడీ కార్యమును దలపెట్టినందులకును నాశ్చర్యమందుచుండిరి. సత్రపువంటబ్రాహ్మణుఁ డీసంగతంతయు దూరమాలోచించి యావివాహము దమస్నేహితులగు శెట్టిగారును నాయుఁడుగారును సుబ్బమ్మను లక్ష్మిని దీసికొని పారిపోఁగలుగుటకు మొదలియారుగారును బిళ్ళగారును కపటోద్దేశముతోఁ బన్నినతంత్రమని నిశ్చయించుకొని, ముత్యాలమ్మను కాపువానికిఁ గట్టబెట్టి యాతని కొమార్తెలను దీసికొనిపోదురని రామునితోను గువ్వసామితోను చెప్పెను. రాముఁడును గువ్వసామియు నాగాపుకన్యక లిద్దరుఁ దమతో వత్తురని యానందించిరి. కాని సత్రపువంటబ్రాహ్మణునకు మాత్రమిదియంతయు మఱింత మనోవ్యాకులమునకును దుఃఖమునకును కారణమయి యాతఁడు మతిపోయినవానివలె సంచరించుచుండెను. రాత్రి భోజనమైన తరువాతఁ గాపువాఁడును మొదలియారుగారును బిళ్ళగారును మార్గాయాసమున బండుకొని నిద్రపోయినతరువాత సత్రపువంటబ్రాహ్మణుఁడు ముత్యాలమ్మనేమో పనియున్నవానివలె నీవలకుఁ బిలచి "నీవు పెండ్లాడబోవుదువని విని మిక్కిలి సంతోషించితి" ననిచెప్పి "వివాహముగాని కన్యలను నాయుఁడుగారియొద్దను శెట్టిగారియొద్దను దిగవిడచిపోవుట, మిక్కిలి యప్రతిష్ఠకు కారణమైనదనుమా" యనెను. ఆమాటవినినతోడనే ముత్యాలమ్మ వంటబ్రాహ్మణుని దూరముగాఁదీసికొనిపోయి యాసంగతి గ్రుచ్చిగ్రుచ్చి యడుగ నారంభింపఁగా వంటబ్రాహ్మణుఁడు "నాయుఁడుగారికిని శెట్టిగారికిని సుబ్బమ్మతోను లక్ష్మితోను సంబంధముగలిగినది; నీవింటలేని యీరెండు మూఁడుదినములుమ యిల్లంతయు నీనలుగురును గలసి యల్లకల్లోలముగాఁ జేసిరి; ఈసంగతి యందఱకుఁ దెలిసినది; ఆకన్యలకింక వివాహములు

గావుఁ ఇదియంతయు వారిసేవకులగు రాముఁడును గుప్పసామియు దమ గండ్లారఁ జూచి'' రనియున్నవియు లేనివియుఁ గల్పించి బిగ్గరగా జెప్పెను. ఈమాటలు వినినతోడనే ముత్యాలమ్మకుఁ దనవివాహవిషయమైన సంతోషముటుండ సుబ్బమ్మయు లక్ష్మియు నిట్టిపనిచేసిరని విచారమును వారిపైఁ బట్టరాని యసహిష్ణుత్వమును గలిగినది. తాను కాపువానిని వివాహమాడి పూర్వముకన్న నెక్కువ స్వతంత్రముతో సుబ్బమ్మను లక్ష్మిని సవతితల్లి ప్రేమతో దనయధికారమున నుందుకొని లక్ష్మిమీఁదఁ దనకుఁగల కోపమంతయుఁ దీర్చుకొనగలుగుట కవకాశము గలుగదని యెంచియో, యాకన్యకలకు నాయుఁడుగారు శెట్టిగార్లవంటి మంచి భర్తలు దొరికిరని దలచి వారియదృష్టమున కోర్వజాలని హేతువును బట్టియో, దమకుటుంబమున కప్రతిష్టాకరమగున ట్లీదుష్కార్యము జరిగినదను గారణమును బట్టియో, మనముస్పష్టముగాఁ జెప్పలేము గాని, ముత్యాలమ్మ మాటవినినప్పటినుండియు మతిలేనిదానివలెఁ బట్టరాని యాగ్రహముతో నింటిలోనికిఁ బోయి నిద్రపోవుచున్న సుబ్బమ్మను లక్ష్మిని దిట్టుచు దనవివాహము సంగతంతయు మఱచిపోయి నిద్రపోఁజాలక యింటిలోనికిఁ బోవుచు నీవలకువచ్చి కొంత సేపరుగుమీఁదఁ గూర్చుండుచు నటునిటు దిరుగుచు నారాత్రియంతయు దయ్యముపట్టిన దానివలె గడపెను. మొదలియారుగారును పిళ్ళగారునుఁ గాపువాఁడును శెట్టిగారును నాయుఁడుగారును యేపాపమెఱుఁగని సుబ్బమ్మయు లక్ష్మియు నొడలెఱుంగక స్వస్థచిత్తులై నిద్రపోయిరి. ముత్యాలమ్మ రామునితో మాటలాడి యాతఁడు చూచినదంతయు సవిస్తరముగాఁ దెలిసికొనవలెనని యాతఁడు పరున్నచోటికిఁ బోయి యాతని ననేకపర్యాయము లెన్నెన్ని విధములనో గట్టిగాఁ గేకలు పెట్టియు, గిల్లియుఁ, గొట్టియు, లేపఁ బ్రయత్నించెనుగాని యామెప్రయత్నములన్నియు నిష్ఫలములగుటయే గాక, నామెనాతఁడు దనగాఢనిద్రలో కాళ్ళతోఁ దన్ను

టయుఁ జేతులతో గొట్టుటయు గూడఁ దటస్థమయ్యెను. రామునితో మాటలాడి యాతఁడు దనకన్నులారఁ జూచిన సంగతంతయుఁ దెలిసికొనుదాఁక ముత్యాలమ్మ కేమియు దోచకుండెను. ముత్యాలమ్మ రాముని నిదనుండి లేపుటకుఁ జేసిన సాధనములును బ్రయత్నములును నన్నియు వృథయయ్యెను. ఇట్లా రాత్రి యంతయు ముత్యాలమ్మ దయ్యమువలె మేలుకొని గడపి తెల్లవారక బూర్వమె పెద్దపెద్ద కేకలు పెట్టుచుఁ దన చేతిలోని చీపురుగట్టతో సుబ్బమ్మను లక్ష్మిని లేపి తననోటికివచ్చినట్లెల్ల వారిని తిట్టనారంభించెను. ఈ కేకలు విని యింటిలోనివారందఱు లేచిరి. ఇట్లు ముత్యాలమ్మ దన నూతనవధూత్వమున కుచితమైన ముగ్ధత్వమును, దానంతకుఁ బూర్వము కొన్నిగంటలక్రిందటఁ బ్రకటించుచుండిన నవోఢాభావములను, హఠాత్తుగా నొక్కసారిగాఁ ద్యజించి కోపినియై గయ్యాళిగాఁ బరిణమించుట మొదలియారుగారికిని వారిస్నేహితులకును మిక్కిలి యాశ్చర్యకరముగాఁ గనుపించెను. కాని దీనికిఁ గారణము మాత్రము వారూహింపఁ జాలరైరి. సాయంత్రమింటికి వచ్చినప్పుడు దమకు దమ పెత్తల్లియగు ముత్యాలమ్మ గనఁబఱచిన ముగ్ధత్వము తెల్లవారులోపల గయ్యాళితనముగా మారిపోవుటకుఁ గారణము దెలియక సుబ్బమ్మయు లక్ష్మియుఁ దమలో తామాశ్చర్యపడుచుఁ దమతండ్రిని బెండ్లాడకుఁ బూర్వమే నీమె దనసవతితల్లి యధికారమంతయుఁ జూపించుచున్నదనియు వివాహమైన తరువాత నింకనెంత యధికారము జేయునో తమపాట్లేమగునోయనియు భయపడుచుండిరి. కాపువాఁడామె గయ్యాళితనమంతయుఁ జూచి యామెకుఁ దయ్యముపట్టినదనుకొనెను. దాపున సత్రములో నున్నవారందఱు నామె దిరిగి వివాహము చేసికొన నిశ్చయించుకొన్న కారణమును బట్టి యామె చిన్నతనములోఁ జిరకాలము క్రిందటనే మృతినొందిన యామె భర్త యామెను బట్టుకొనెనని నిశ్చయించి త్వరలో సమర్థుఁడగు భూతవై

ద్యునిచే మంత్రసాధనములు జేయించు టత్యావశ్యకమని జెప్పిరి. కా
ని యీమె యీవిధముగా నల్లరిచేయుటకుఁ గలరహస్యకారణ మాన
త్రవు వంటబ్రాహ్మణునకొకనికే దప్ప నితరుల కెవ్వరికిని తెలి
యలేదు. ఒకవేళ నీకారణము రామునకుఁ గూడఁ దెలసినఁ దెలసి
యుండవచ్చునేమో యని మనమనుకొనుట కాతఁ డంతదూర మాలో
చింపఁగల బుద్ధిలేనివాఁడును, రాత్రిభోజనమగుటఁ దడవుగా నొడలె
ఱుంగక నెందరెన్ని కేకలు పెట్టికొట్టినను నించుకయినఁ గదలక య
భేద్యముగా గాఢనిద్ర జెందుస్వభావము గలవాఁడునగుటంబట్టి, రా
త్రి ముత్యాలమ్మతో వంటబ్రాహ్మణుఁడొకఁడు నిముసమైన నాలస్యము
చేయక సుబ్బమ్మనుగూర్చియు లక్ష్మినిగూర్చియుఁ దాను వినినదంత
యుఁ జెప్పివేసి యీచిత్రకథ నంతయుఁ స్వయముగా నడపి యీమె
యనుగ్రహమునకును నీసంగతంతయుఁ గనిపెట్టఁగలిగిన ప్రతిష్ఠకును
పాత్రుఁడుగాకుండఁ జేయఁగల సమయోచితప్రజ్ఞ యీవంటబ్రాహ్మ
ణునకు లేదని నిశ్చయించుకొనఁ గలుగునంతటి యాలోచనగలవాఁ
డును గావున మనమీవిషయమును గూర్చి రాముడేమియు నెఱుఁగఁడని
స్పష్టముగా నొప్పుకొనకఁదీరదు.

ఇట్లు ముత్యాలమ్మ చర్యలను గూర్చి పలువురు పలువిధములు
గాఁ జెప్పుకొనుచు నాశ్చర్యపడుచుండిరి. కావువాఁ డీమెకు భూతవై
ద్యము చేయించవలసిన యవసరముగలిగెనని యొకమారును యీమె
రాత్రంతయుఁ దన్నుఁ ద్వరలో వివాహమాడఁగలుగుదునన్న వెఱ్ఱి
నమ్మకము చేత తనయింటి కధికార మప్పుడే వచ్చినట్లు భావించుకొని
తనసవతితల్లి యధికారమును గృహిణీత్వ వైభవమును దలచికొని
యొడలెఱుంగకఁ దనకొమార్తెల మీఁదను నందరిమీఁదను కేకలు
చేయుచున్నదని యొకమారును, ముప్పదిసంవత్సరములకుఁ బైగా వి
తంతువుగానుండి భర్తతో నొకదినమైనఁ గాపురము చేయఁగలుగు

భాగ్యము నంది యెఱుఁగక వయసువచ్చినదాదిగాఁ దనయింటనే పడియుండి సంసారసుఖమన్న నెట్టిదోఁ గలలో నైన ననుభవించి యుండని దానికొకదినములో హఠాత్తుగా వివాహమగు నన్నసంతోషమును ఆనందమును మతిభ్రమ గలుగఁజేసియుండవచ్చునని యొకమారునుఁ, దన్నువివాహమాడి తనతో ననుభవింపఁబోవు సంసారసుఖములను శృంగారమును రాత్రియంతయు మనసులో నువ్విళులూరుచుఁ దలచుకొనుచుండి యుండుటచే మదపిచ్చ పట్టి యుండునని యొకమారును, దలచుచు నేమిచేయుటకునుఁ దోచకఁ దొట్రుపాటు నొందుచుండెను. ఈవిధముగా నందఱు ననేకవిధములుగా ముత్యాలమ్మచర్యలకు మనసులోఁ గారణములను గల్పించుకొని యనేకవిధములగు యనుమానములు గలహృదయముతోఁ జాలకాలము బాధపడుచు దమమనస్సుల నాయాసపెట్టుకొనవలసిన యవసరము లేకుండ ముత్యాలమ్మ రాముఁడు నిద్రలేచినవెంటనే పక్కమీఁదనుండి యాతని నావలకుఁ దీసికొనిపోయి యాతఁడు చూచినదంతయుఁ జెప్పుమని యాతని నెన్నోవిధముల బుజ్జగించియు, శ్లాఘించియు, మంచిమాటలాడియు, నాసపెట్టియు, లంచమిచ్చియుఁ, బ్రేమగనుపఱచియు, లాలించియు, దయఁజూపియు, నెన్నెన్నియో ప్రమాణములు చేయించియుఁ దానెవ్వరితోను జెప్పనని ఘోరప్రమాణములు చేసియు, నడిగి తెలిసికొనినతరువాత నామెకు శెట్టి పట్టపగటివేళ నెవ్వరైనఁజూతురన్న సందియమైనను భయమైనను తుదకు సిగ్గైనను నించుకైనలేకఁ దనస్వభార్యగానెంచి యాలింగనముచేసికొని ముద్దాడిపకపకనవ్వుచు హాస్యమాడుట మిక్కిలి దుస్సహముగానుండెను. శెట్టిచేసిన యీఘోరపుపనియటుండ మంచిచెడ్డలు తెలిసి యేండ్లుగడపిన తనయంతటివివేకమును జ్ఞానమును, బ్రపంచానుభవమును గలదానికే వివాహము దలపెట్టినంత మాత్రముననే యనివార్యముగాఁ బ్రకటీకృతమగు నట్లంతరంగమున కల్యా

ణోచితమగు లజ్జయు ముగ్ధాభావమును నంకురింపఁగా నిన్నగాక మొన్నఁ గండ్లు దెఱచి యొకచెంప గొట్టిన నీళ్ళును రెండవచెంపఁగొట్టినఁ బాలును గారునట్టి పిన్నవయసుగలిగి వివాహమన్నను భర్తయన్నను నించుకయిన నూహింపనైన నూహింపఁజాలిన జ్ఞానమును, ప్రపంచానుభవమును, నించుకైన లేక, నాటపాటలలో దిరుగుచున్న లక్ష్మి దనవయస్సునకు స్వభావోచితమగు ముగ్ధాలక్షణములలోఁ బ్రధానమగు సిగ్గును గొంచెమైన లేకఁ బచ్చిలంజవలెఁ బకపకనవ్వుచు నాశెట్టి దనపైఁ బడిచేసిన దానినెల్ల సంతోషముతో భరించుచు నిందఱుమగవాళ్ళుఁ దనచుట్టునుండి దన్నుఁ జూచుచున్నారన్న సందేహమును భయమును గూడ నించుకయినఁ బొందక నిర్భయముగా దొమ్మరదానివలె సంచరించినవిధమంతకన్న మిక్కిలి ఘోరముగా నామె కప్పుడు దోఁచెను. ఇది యటుండఁ దనతో రాత్రింబగళ్ళు దిరుగుచుఁ దన్నెనమయమందైన విడువక సంచరించుచున్న సుబ్బమ్మ యెక్కడ జూచునో యేమనుకొనునో, తక్కినమగవాళ్ళటుండ, నాయఁడు గండ్లబడుటచే నాతఁ డేమనుమానపడునో, తరువాత నతనికేబుద్ధిబుట్టి యేమి చేయునో, యను యనుమానమును, భయమును, సిగ్గును లక్ష్మికి లేకపోవుటయుఁ, దనస్నేహితుఁ డేమనుకొనునో, సుబ్బమ్మ యేమనునో, యెవరితోఁ జెప్పునో, యందువలన నేమి సంభవించునో, యనుభయమును సందేహమును శెట్టికి లేకపోవుటయు, దనమనసులోఁ దలచుకొని వీరు నలుగురు తోడుదొంగలై యభేదముగాఁ దనకును వాండ్రతండ్రికిని గాకపోయినను, లోకమునకైన నించుక వెఱువక సంచరించిరని ముత్యాలమ్మ నిశ్చయించుకొనెను. తరువాత నీమె, దూరాలోచనగలిగి యనుభవముతో యుక్తాయుక్తములెఱిగిన యోగ్యత గలిగి, నిజానిజములను గ్రహించగల సామర్థ్యమును వివేకముగలదిగావున మొదలియారును డిప్యూటీ కలెక్టరుగారును బ్రప్రథమమున నారాత్రి చీకటివేళ

గుఱ్ఱమును దీసికొనివచ్చిన దాదియప్పటివఱకు జరిగినదంతయు సంపూర్ణముగా మనసులో జ్ఞాపకమునకుఁ దెచ్చుకొని యిదియంతయు డిప్యూటీకలెక్టరుగారి సలహామీఁద నీవలుగురు నాలోచించుకొని లక్ష్మిని సుబ్బమ్మను దీసికొనిపోవుటకుఁ జేసిన కార్యమని స్పష్టముగా నూహించి నమ్మి,నిశ్చయమని యెంచి,సిద్ధాంతము చేసికొనెను. సుబ్బమ్మ శెట్టిగారిసంగీతమువినుచు నాతనియొద్దనే కూర్చుండి కథలువినుటయు, లక్ష్మి నాయుఁగారి కత్యంతవినయముతో నుపచారము చేయుచుండుటయు, రాముఁడు చిత్రవిచిత్రమైన కథలుగాఁ గల్పించి తానేమి చెప్పెనో దనకే దెలియకుండ నిద్రగండ్లతోఁ జెప్పినదంతయు నీమెకీనలుగురు గలసి యీదుష్కార్యమును నిశ్చయముగాఁ జేసిరన్న యభిప్రాయము మఱింత దృఢమగునట్లు చేసెను. మఱియుఁ దమకుఁ బెండ్లికావలసియున్నదనియుఁ, దమకు వివాహములు చేయుటకు సంబంధముల కొఱకుఁ దమతండ్రి ప్రయత్నించుచున్నాఁడనియుఁ, దాము సంసారబిడ్డలమనిఁ దెలసియుండియుఁ, దమగౌరవమును దమకుటుంబగౌరవమును దమతండ్రిని బంధువులను కులమువారిని యాలోచించి, తమకుఁ బెండ్లిగాక చెడిపోదుమని భయమైన లవలేశమును, లేక, నిర్భయముగా నిట్టిపని చేసిన యీసుబ్బమ్మయు లక్ష్మియు నెంతకైన సాహసురాండ్రేయనియు, నేమిచేయుటకైన వెనుదీయని స్వభావము గలవారేయనియు, ముత్యాలమ్మ నిశ్చయముగా నమ్మెను. తరువాత శెట్టియు నాయుఁడును గలసి తమకుఁజేసిన యుపకారమున కించుకయినఁ గృతజ్ఞతఁ జూపకుండుటయుండఁ దమయింటఁ జేరి యిట్టిసంసారఘాతకూడఁ జేసినందుకు ముత్యాలమ్మ వారిపై నింతింతనరాని కోపముతో నుండెను.

ఇట్లు ముత్యాలమ్మ తనవివాహము సంగతంతయు మఱచిపోయి లక్ష్మిమీఁదఁ గోపముచేతను తనచెల్లెలు గొమాళిలిట్టి యవమానకరమగు పనిని జేసినారన్న యభిమానముచేతను నొషలెఱుంగకఁ బడు

గుపరుగున బరుగెత్తుకొనివచ్చి తనమఱదియగు కాపువానితో నంత యుఁ జెప్పెను. కాపు వాఁడామె చెప్పినదంతయు వాస్తవమయినను గాకపోయినను దనకప్రతిష్ఠాకరముగా నున్నదనియుఁ, దనకొమార్తెలకు వివాహములు గాకపోవుటకుఁ గారణమగుననియుఁ, దలచి, ముత్యాలమ్మను శాంతపఱుప ననేకవిధములఁ బ్రయత్నించెను గాని యాతఁడామెను శాంతపఱచినకొలఁది యామె మఱింత బిగ్గరగాఁ గేకలు పెట్టుచు, సుబ్బమ్మను లక్ష్మిని శెట్టిని నాయుఁడుగారిని యటుండ మొదలియారును బిల్చును దనమఱదియగు కాపువానిని గూడఁ దిట్టనారంభించెను. ఇదంతయుఁ జూచి శెట్టియు నాయుఁడును దామేపాపమెఱుఁగమనియుఁ దామాకన్యకలను దమకొమార్తెలవలెఁ దలచుకొనుచున్నామనియు, నెన్నెన్నో ఘోరప్రమాణములు చేసిరి. సుబ్బమ్మయు లక్ష్మియుఁ దామేపాపమెఱుఁగమని యేడ్వసాగిరి. ముత్యాలమ్మ దనకోపము పట్టఁజాలక రాముఁడీదుర్వ్యాపారమంత స్వయముగాఁ దనకన్నులతోఁ జూచినాఁడనియుఁ, దనతోఁ జెప్పెననియుఁ, దనకేకలలో ననెను. ఆసంగతి మొదలియారుగారు విని, రాముని బిలచి, యాతనివలన నాతఁడుజూచినదంతయుఁ దెలిసికొని, లక్ష్మి కాలుజారి పడినందున శెట్టి యామెను లేవదీసెను గాని యేమియుఁ జేయలేదని నిజము గ్రహించి కాపువానితో నాతని కొమార్తెలును దనస్నేహితులును నిష్కపటముగు హృదయములు గలవారనియు, వారేదుష్కార్యమును జేయలేదనియు, వారిని గూర్చి యట్లనుమానపడి యుచితానుచితము లెఱుఁగని రాముఁడేమో చెప్పినాఁడన్న మాత్రమున నాగన్నెలకును, దనస్నేహితులకును, నప్రతిష్ఠవచ్చునట్లల్లరిచేయుట మంచిదికాదనియు, నెన్నెన్నో విధములఁ జెప్పెను. కాపువాఁ డూరకున్నను ముత్యాలమ్మ మాత్రమూరకుండకఁ దననోటికి వచ్చినట్లు కేకలు వేయుచునేయుండెను. ఈ సంగతంతయు విని అక్కడనున్నవారిలోఁ గొందఱు రాముఁడు చె

ప్పినదంతయు వాస్తవమే ననియు, నాకన్యలను శెట్టియు నాయుఁడును బాడుచేసిరనియుఁ, గొందఱాసంగతంతయు వాస్తవమైనను గాకపోయినను నవివాహితలగు నాకన్యలను బూర్వపరిచయ మించుకయు లేని వారిరువురకు నొప్పగించుటఁ గాపువాని దేతప్పనియు, మఱికొందఱు మొదలియారు దనస్నేహితుల మాటాడును గాని నిజమేల చెప్పుననియు, ననేకవిధముల దమతమ యభిప్రాయముల నెల్ల నయాచితముగాఁ దమంతటతామే చెప్పనారంభించిరి. నక్షత్రమువంటి బ్రాహ్మణుఁడు మాత్రము నీసంగతంతయు వాస్తవమని స్పష్టముగా నెవ్వరితోను జెప్పకపోయినను, రహస్యముగా నక్కడివారందఱితోను వాస్తవమేయనియుఁ, గాపువాఁడాదినమింటికి రాకపోయినయెడల సుబ్బమ్మయు లక్ష్మియు తమయిల్లు విడచి లేచిపోదురనియు, నర్థము వచ్చునట్లు మాటలాడ నారంభించెను. తామే పాపమెఱుఁగక నిష్కపటమగు హృదయములతో నాకాపువాని సత్కారముల నందుకు నాతనికిఁ గృతజ్ఞులై యాతనికే ప్రత్యుపకారమాచరించి యాతనిఋణము దీర్చుకొందుమా ? యని, యాలోచించుచున్న నాశెట్టియు నాయుఁడును దమహృదయములు క్షోభింప మిక్కిలి విచారించి యికనాయింటనుండుట దమకనుచితమని నిశ్చయించుకొనిరి. కాపువాని కుపకారబుద్ధితో వాస్తవమైన కృతజ్ఞతగల యంతఃకరణముతో నిష్కపటమగు హృదయముతోఁ జేసిన సహాయమును నాతనికొఱకుఁ దాను బిళ్ళయుఁ బడిన శరీరాయాసమును నటుండ, నాపత్సమయములో వెయ్యిరూపాయిలాతనికిచ్చినసంగతంతయుఁ దలచికొని "పుణ్యమునకుఁ బోయినఁ బాపమెదురయ్యె" నని దుఃఖించుచుఁ, దామాగాపుకన్యకలనుదమకొమార్తెలనుగా దలచుకొని వారివివాహములు చేయించి కన్నులారఁ జూచి యానందింప నిశ్చయించుకొనియుండఁ దమ సదుద్దేశమంతయు నీరీతిగాఁ బరిణమించినందుకుఁ దమగ్రహచారదినములను దూరుచు, నాయిల్లువిడచి

యాక్షణమే నావలకుఁ బ్రయాణమై పోవుటకు మొదలియారును విశ్చయు నిశ్చయించుకొనిరి. ఇట్లీనలుగురు దమసామానంతయు నొకబండిలో వేసి తామెక్కుట కాసత్రమువద్ద బళ్ళుదొరకకపోవుటచే దాపున నున్నగ్రామమువఱకుఁ దమసేవకులతో నడిచి పోయిరి. మొదలియారుగారు గాపువాఁడు దనకియ్యవలసిన వెయ్యిరూపాయిలనైన నడుగలేదు. ఆయుదయము పదిగంటలకు వీరాగ్రామముఁ జేరి భోజనముచేసి సాయంత్రమువఱకక్కడనే యుండి, రాత్రి భోజనమయిన తరువాత బళ్ళుగట్టించుకొని మఱునాఁడుదయము పదకొండుగంటలకుఁ గళ్యాణపురముఁ బ్రవేశించిరి.

ఆహా! కాలవైపరీత్యమెంతాశ్చర్య మేమని చెప్పవలెను. బుద్ధిహీనతచే యుచితానుచితము లాలోచించక, దానుజూచినదియుఁ జూడనిదియు గూడఁ దననోటికివచ్చినట్లెల్ల బ్రేలుటచే రాముఁడును, గపటోద్దేశ్యముతోఁ బాపమున కించుకైన వెనుదీయక లేనినేరములను గల్పించిచెప్పిన యాసత్రపు వంటబ్రాహ్మణుని దుష్టస్వభావమును, నమాయకస్వభావముతోఁ బ్రవర్తించుచున్న యాకాపుకన్యకలను, మనదేశోపకారపరతంత్రులగు మొదలియారు మొదలగు నీనలుగురు పెద్దమనుష్యులను, రొట్టెట్టి యాపదలకును నెట్టియపవాదలకును బాలుచేసెనో గద! "పుణ్యమునకుఁబోయినఁ బాపమెదురయ్యె"నను లోకోక్తి వాస్తవమనుట కింతకన్న నేమినిదర్శనము గావలెను. ఉదయమున నిద్రనుండి మేల్కొనినది మొదలుకొని సాయంత్రమువఱకుఁ దనపొలమున వ్యవసాయపు బనులుచేసికొని పాపభీతిగలిగి స్వకాయకష్టమున జీవించుచు నేవ్యవహారమునందును నేవిధమైన జోక్యమును గలుగఁజేసికొనక దైవభక్తిగలిగి తనశక్త్యానుసారముగా నితరులకు సహాయముచేయుచుఁ, దనసంసారమును జాగరూకతతో నడుపుకొనుచుఁ, దనమరదలగు ముత్యాలమ్మతోను దనకొమార్తెలతోను, సుఖముగాఁ గాలముగడ

పుకొనుచు, న్యాయమార్గమున సంచరించుచున్న యాగాపువాఁడీనవసరముగా నిట్టిదురవస్థకుఁ బాలగుటఁ గాలవైపరీత్యముగాని మఱియొకటిగాదుగద! అయ్యో! పాపమీతఁడాసమయము నెట్లెట్లు దుఃఖించెనో యాతనిహృదయ మెంతక్షోభించెనో గద! ప్రాతఃకాలమున లేచి గృహకృత్యముల నెల్ల శ్రద్ధతో నెమరకఁ జేసికొని తమకు భగవంతుఁడనుగ్రహించి దయచేసిన దానితోఁ దృప్తినొంది, యమాయికవృత్తితోఁ జరియించుచు నెవ్వరికిని యేవిధమైన యపకారమును గాని హానిని గాని జేయక, లోకజ్ఞానమించుకయు లేకఁ, దమయింటనే బడియుండి, రాత్రి దమతండ్రి యింటికెప్పుడు వచ్చునా యని యాతనికెదురుచూచుచు, నాతనిఁ జూచినతోడనే యత్యుత్సాహముతో నాతని నాదరించి యాతఁడు పొలమునుండి దెచ్చిన తృణమునైన గొప్పవస్తువుగా మిక్కిలి యానందముతోఁ బరిగణించుచుఁ, బాపమన్న గజగజవణకుచు, దైవభక్తి గలిగి తమతండ్రినే తల్లిగను దండ్రిగను భావించి గౌరవించుచు దమ పెత్తల్లి దమ్మెంతదిట్టినను గొట్టినను మాటలాడక సంచరించుచున్న యాగాపుగన్యక లాదినమున నెట్లెట్లు దుఃఖించిరో గద! నిష్కారణముగా నిట్టియాపదలకుఁ బాలయిన యీసుబ్బమ్మకును లక్ష్మికిని దైవము దప్ప మఱియెవరు దిక్కుగలరు? తనగ్రామస్థులకు మంచిసంబంధములు చేసి, తన యల్లుళ్ళనే కొమాళ్ళనుగా నెంచి తనయింట నుంచుకొని తన వ్యవసాయపు బనులన్నియుఁ దనయల్లుళ్ళ కొప్పగించి, తనవార్ధక్యమును సుఖముగాఁ గడపుకొననెంచుకొని, తనగ్రామస్థుల క్షేమమాలోచించి, యేదుర్వ్యాపారములకును బోనొల్లని స్వభావముగలిగి మంచివాఁడగుటచేఁ దనకు దైవమిచ్చిన దానితోఁ దృప్తినొంది, బీదవాఁడగుటచేఁ దిరిగి వివాహమాడుటఁగూడ మానుకొని, గురువులన్నను దైవమన్నను మిక్కిలి భక్తిగలిగి యెవ్వరికిని యేవిధమయిన యపకారమును దాని హానిని గాని యెన్నఁడును, జేసి యెఱుఁగని యీగాపు

వాఁ డెట్టివనో వ్యాకులతకు నిష్కారణముగాఁ బాలుగావలసివచ్చిన దో గదా! న్యాయమైన ధనవ్యాపారమును దాను జేసికొనుచుఁ, దన స్వకాయకష్టమునఁ దాను సంపాదించుకొన్న స్వల్పలాభముతోఁ దృప్తి నొంది తనయింటఁ దాను సుఖముగాఁ జీవింపకుండఁ ఎన్నెగష్టములకుఁ బాలుసేతురో, యను భయముచే నధికారులన్న నతివినయభక్తులతో వారికి భృత్యునివలె సంచరించుచుఁ, నా పూరియింట గాపురము చేయుచున్న యాగాపువాఁడు డిప్యూటీకలెక్టరుగారు చెప్పినారన్న గారణమాత్రమున గృహస్థధర్మమునకు మొదలియారుగారిని వారి స్నేహితులను తనయింటనుండనిచ్చి, వారి నత్యాదరముతో గౌరవించి, వారికిఁ దన శక్త్యానుసారముగా సహాయము చేసినందుకా తని కెట్టియాపదయు నపకీర్తియుఁ దటస్థమయ్యెనో గదా! కపటోద్దేశ్యముతో స్వలాభముకొఱకుగాని పరశ్రేయస్సహనములేక నసహిష్ణుత్వము చేగాని, దుర్మార్గులగు నీచులు సన్మార్గానువర్తనులగు సాధుజనుల కెట్టియాపదలనైనఁ దెచ్చిపెట్టగలరనుట కింతకన్న నేమి నిదర్శనముగావలయును! దుర్మార్గులగు ఘాతుకుల వలన నెట్టియాపదలకుఁ బాలగుటఁ దటస్థమయినను సాధుజనులు దమ న్యాయపథము నెంచుకైనఁ ద్యజింపకఁ, బాపకార్యములాచరింపకఁ, గాలమునగడపుచుండ దైవ మెప్పటికైన వారికష్టములను దొలగింపక మానఁడని మనము నిశ్చయముగా నమ్మ యుపాయకస్వభావముగల యాగాపువానియొక్కయు, నే పాపకార్యమును నెన్నడును జేసియుండని నసహాయులగు నాతని కొమార్తెల యొక్కయు, నాపదలనెల్ల నివారించి, వారి హృదయములకు శాంతియు మనస్సుల కానందమును, నొసగ రక్షకుఁడగు జగదీశ్వరుఁడైన యాభగవంతుని మనఃప్రార్థించి, వారి సాధువృత్తియు, ధర్మాచరణత్వమును వారికమితశ్రేయోలాభము గలుగఁజేయ, హృదయపూర్వకముగా నాశీర్వదించుటకన్న వారి కెవ్వరేసమయమున నేమి చేయగలరు! రాము

ని నోటిపట్టి మటుండ దుర్మార్గశీలుఁడగు నాకుచ్ఛితవ్యాపారముగల సత్రపువంటబ్రాహ్మణుఁడు చేసిన పాపకార్యమున కాతని నేమనవలయునో చదువరులే గ్రహించుకొనవలయును. దైవ మాగాపువానికి యాతనిగొమాతెల్లకును మనశ్శాంతిని సౌఖ్యమును ననుగ్రహించునుగాక!

అపూర్వప్రతిభ.

ఐదవప్రకరణము.

కల్యాణపురమున వీరొక వంటపూటయింట భోజనముచేసి కొంచెము విశ్రమించి సదుపాయమగు నొకబసకొఱకుఁ బ్రయత్నముచేసిరి. ఆసమయమున నాయూర ననేకవివాహములు జరుగుటఁ దటస్థమగుటచే నూరంతయు మంగళవాద్యములతోడను, భోగముమేళములతోడను, గాయకులతోడను, నిండియుండెను. సుప్రసిద్ధులును ధనవంతులును నగు నలుగురు గొప్పగృహస్థుల యిండ్ల వివాహములొకసారిగా జరుగుచుండుటచే నానలుగురు గృహస్థుల యిండ్లయెదుటను, వారి వియ్యాలవారు విడిదిదిగిన యిండ్లయెదుటను, నతిమనోహరముగా నలంకరింపఁబడిన గొప్పగొప్ప పందెళ్ళు వేయఁబడి, రాత్రిందివములు నృత్యగీతాదిమంగళధ్వనులతోడను, వారివారి బంధువులతోడను, స్నేహితులతోడను, పురజనులతోడను నతిమనోహరముగా నుండెను. అప్పుడా నలుగురు గృహస్థులును వారివియ్యాలవారును, నొకరికన్న నొకరెక్కువ శోభస్కరముగాను గొప్పగను పెండ్లిచేయవలయుననుకోరెక్కతో ధన

వ్యయమున కించుకయిన వెనుదీయక మిక్కిలి యౌదార్యముతోఁ గార్యములు చేయుచుండిరి. ప్రసిద్ధములగు భోగముమేళములును, నాయకులును, విద్వాంసులును, నగు గాయకులును, నప్పుడా పురమునకాహ్వానింపఁబడిరి. వారి నృత్తగీతములను, వివాహవినోదములను, బాణసంచాలను జూచువేడుకతో నక్కడకు దాపుననున్న గ్రామములనుండి గుంపుగుంపులుగా ననేకులువచ్చిరి. భూరిసంభావనలపేక్షించి బ్రాహ్మణులును, భట్టురాజులును వచ్చి వీధులలో మిక్కిలి సందడితో దిరుగుచు పురజనులను యాచించి బీడించుకొని దినుచుండిరి. పురజనులలో రసికాగ్రగణ్యులగు సరసులు వివాహములు జరుగుచున్న గృహములయందలి సభల నలంకరించుచు, మేళకత్తెల నాదరించుచు, నత్యుత్సాహముతో నుండిరి.

మొదలియారుగారు విశేషప్రయత్నముచేసి శ్రమనొందవలసిన యవసరములేకయే నాయూర నొకవీధిలో నొక శిష్టుగరణముల యింటిలో బసగుదిర్చికొని యాసాయంత్ర మందుఁబ్రవేశించి తమస్నేహితులగు శెట్టిగారితోను బిళ్ళగారితోను నాయుఁడుగారితోను సుఖముగా నుండిరి. ఆయింటి యజమానిపేరు గాంతయ్య. ఇతనిని గాంతయ్యపాత్రుఁడనియు, గాంతయ్యపంతులనియు, గాంతయ్యమేష్టరనియుఁ గూడ బిలతురు. కాంతయ్య తండ్రి దొరతనమువారి యుద్యోగము చేసి కొంత ధనమార్జించెనుగాని, యాధనమంతయుఁ గాంతయ్య చిన్నతనములోనే యాతని తల్లి కర్చుపఱచెను. అప్పటికిఁ గాంతయ్య కాతనితండ్రి యుద్యోగములో నున్నకాలములో గట్టించిన యా మేడయిల్లును సంవత్సరమునకు రెండువందల రూపాయిలాదాయము వచ్చు నొకభూమియు మాత్రము మిగిలియుండెను. అతఁడు విద్యాధికుఁడుగాడు. తన స్వభాషయగు తెలుగుమాత్రము చక్కగ జదువను వ్రాయను నేర్చి కొంచెమింగ్లీషుభాషాపరిచయముగలిగి, యేయుద్యోగము చేయుటకు

ను దగ్గుయుండకపోవుటచే, నొక చిన్న పాఠశాలను స్థాపించి, యందు బాలురకును, బాలికలకును, మొదటితరగతివఱకుఁ జదువుచెప్పుచు, నందువలనఁ దాను గడించుకొనఁగలిగిన స్వల్పాదాయముతోఁ గాలముగడుపుచుండెను. ఇతనికి దాదాపు నలువదియైదేండ్లు వయసుండును. కొంచెము పొడవుగాఁ గృశించిన శరీరముతోఁ జామనచాయరంగుగలిగి పెద్దమీసములతోను గిరజాలతోను నాపురమున నితఁడు గాపురము చేయుచుండెను. మఱియు నితఁడొక దలపాగను ధరించి తెల్లని పెద్దకోటొకటిఁ దొడగికొని చేతిలోనొక గొడుగుపట్టుకొని తిరుగుచుఁ, బెద్దమనుష్యుల స్నేహము చేయుచు, నాపురవాస్తవ్యులలోఁ దానొక ప్రాముఖ్యునివలె సంచరించుచుఁ, గాలము గడుపుచుండెను. ఇతనికేడేండ్ల వయసుగల యొక కొమారుఁడును, భార్యయు మాత్రముఁ గలరు. ఇతని భార్యపేరు బాయమ్మ. ఈమె దాదాపు ముప్పదియైదు సంవత్సరముల వయసుగలదియైనను జూచుటకిరువదియైదేండ్ల వయసుగలదిగాఁ గనుపించుచుండును. ఈమె యుజ్జ్వలశరీరఛాయయు, విశాలములయిన నేత్రములునుఁ గలిగి, యాపురవాస్తవ్యులచే చందకత్తెగాఁ బరిగణింపఁబడుచుండెను. స్వభాషయగు తెనుఁగుభాష నీమె చక్కఁగా నేర్చుకొని కవిత్వముఁగూడ చేయఁగలిగిన విదుషీమణియని యీమెనందఱుఁ బరిగణించుచుండిరి. ఈమె కొంచెమింగ్లీషుఁగూడ నభ్యసించెను కాని, యాభాషయందీమెకుఁ దనభర్తకంటె నెక్కువ పరిచయము లేదని చెప్పవలయును. తెనుఁగుభాషయందీమె కొంతయ్యపాత్రునికన్న పెక్కురెట్లెక్కువ జ్ఞానముకలదని వాస్తవముగా నొప్పుకొనక తీరదు. ఈమె చక్కగా శ్రావ్యమగు కంఠముతోఁ బాడనేర్చి కొంచెము ఫిడేలుకూడ వాయింపఁగలదు. ఈమె స్త్రీవిద్యాభిమానియనియు, స్త్రీలస్వాతంత్ర్యమునకుఁ బాటుపడి పనిచేయు నాగరికాగ్రగణ్యయనియు, సంఘసంస్కారప్రియురాలనియుఁ బ్రసిద్ధికలదు. ప్రతిదినము తనయింటఁ గొం

కలస్త్రీలను జేర్చి, వారితో ముచ్చటించుచు, నాపురమునందొక సమాజ మేర్పఱచి, యందుపన్యాసములిచ్చుచుఁ, దానురచించిన పాటలు, పద్యములు, ఉపన్యాసములు, మొదలగునవి నచ్చువేయించి చదువరుల కమితాహ్లాదమునుఁ గల్పించుచు, స్వదేశస్త్రీలకు మహోపకారమునుఁ జేయుచుండెను. మఱియు నీమె యాపురమునను న్న పెద్దమనుష్యుల భార్యలను నక్కచెల్లెండ్రను బకక్కఁగా నెఱిఁగి వారి స్నేహము సంపాదించెను. తాను మిక్కిలి యందకత్తె ననియు, విదుషీరత్నమ నియు, ప్రౌఢ్యముగాఁ బాడ నేర్చినదాననియుఁ, దెలివికలదాననియు మనోగర్వమీమెకు మిక్కుటముగాఁ గలిగియుండెను. ఈమె కాళ్ళకు జోడుతొడఁగికొని యొకగొడుగుచేతధరించి తన స్నేహితుల యిండ్లకు బోవుచు నప్పుడు సూరంతయుఁ దిరుగుచుండును. ఈమె స్నేహితులలో నలుగురైదుగురు పురుషులు గూడఁ గలరు. శరీర సౌష్ఠవమును, సౌందర్యమును, యౌవనమును, విద్యాపరిచయమును, మనోబలమును, ధైర్యసాహసములును, కార్యశూరత్వమును, బెట్టిదలయుఁ గలిగి తనవిరోధులగు పూర్వాచారపరాయణులు దన్నుఁ గూర్చి యేమనుకొన్నను నించుకయిన లక్ష్యము చేయక హిందూసుందరులనెల్ల నుద్ధరించి, వారి నంధకారబంధురమునుండి తొలఁగించి, వారిని జ్ఞానవంతులనుగాఁ జేయనవతరించిన ధర్మదేవతనను సహంభావముతో మెలఁగుచు, నైహికాముష్మిక సౌఖ్యముల ననుభవించుటకుఁ బురుషులతో సమానమగు హక్కును స్వాతంత్ర్యమును గల స్త్రీల దుస్థితుల నెల్లఁ బోగొట్టవలయునని గంకణముకట్టుకొని పరోపకార దీక్షాపరతంత్రురాలయి యుండెను. సంఘసంస్కారులకీమె ముఖ్యాధారమనియు, నూతగట్టియనియుఁ, జెప్పుటకెంతమాత్రము సందియము లేదు. మనదేశమున జరుగు మహాసభలనెల్ల నీమె యలంకరించుచు, నాయాసభలయందు జరుగు విషయములన్నియుఁ దనకుఁ దెలియకపోయినను దెలిసినదానివలె నటించుచుఁ,

బశ్చిమఖండవాస్తవ్యులగు స్త్రీలకన్నఁ దానెక్కువ నాగరికవైభవము
తోఁ దులదూగుచున్నట్లానందించుచుండును. ఈమెభర్తయగు గాంత
య్యపాత్రునికన్న నీమెయెక్కువవిద్య నేర్చినదని మనమొప్పుకొన
క తీరదు. కాంతయ్యయందీమె కెట్టిగౌరవమున్నను నాతని నెట్టి
గౌరవముతోఁ దనయింట నాదరించి గౌరవించుచున్నను యితరుల
లో మాత్రమాతఁడు విద్యాధికుఁడుగాడనియు, ధనమార్జింపఁగల ప్ర
యోజకత్వములేనివాఁడనియు, వగచుచుఁ జెప్పుకొనుచు నమాయికస్వ
భావముగలవాఁగుటఁ బట్టి తన సత్కార్యాచరణకడ్డము గల్గింపకఁ
దనదారిని దాను బోవుచుండుటచేఁ దానదృష్టవంతురాలనే యనియు,
నాతఁడెట్టివాఁడైనను భర్తయను గౌరవము దాను జూపకతప్పదని
యుఁ, జెప్పుచుండును. కాని తనవంటి యందకత్తెయగు విదుషీరత్న
మునకాతఁడు భర్తయగుటకీమె కంతరంగమున విచారమును, సిగ్గు
ను, నభిమానమును, లేకపోలేదు. భర్తకుఁ దగినభార్యయు భార్యకుఁ
దగినభర్తయు సమకూరుట స్త్రీపురుషుల పూర్వపుణ్యముకాని వేఱొ
కటికాదుగదా! అందులో మనదేశమున స్త్రీపురుషులొండొరులను దా
ము స్వయముగా నెన్నుకొని ప్రేమించి తమ యిష్టానుసారముగా
వివాహముచేసికొనఁ గలుగుటకు మనదేశాచారములును, నతిబాల్యవి
వాహములును, బొత్తుగా నవకాశము గలుగఁజేయకపోవుటఁ బట్టియుఁ,
దల్లిదండ్రులు దమ గొమార్తెలను దమ యిష్టమువచ్చినట్లు దమకుఁ
దోచినవారికి గట్టిపెట్టుటచేతను, మనదేశమున భార్యాభర్తలొండొ
రుల యందన్యోన్య ప్రేమానురాగములతో నుండఁగలుగుటఁ దటస్థ
ము గాకున్నదని బాయమ్మ చక్కఁగా గ్రహించెను. కాఁబట్టి బాయ
మ్మగారు సంఘదురాచారమునెల్ల రూపుమాపుట సంఘాభివృద్ధికత్యా
వశ్యకమని దృఢముగా నమ్మి సంఘసంస్కారశూరులగు పురుషుల
తోఁ గలసి దాను పట్టుదలతోఁ బనిచేయుచుండెను. పరోపకారదీక్షా

పరతంత్రులును సంఘసంస్కారశూరులును నగు బుధవరత్నము లుపన్యాసపీఠములనుండి యుపన్యాసము లొనర్చియు, వాగ్దానములు చేయించుకొనియు, ఖరారునామాలు వ్రాయించుకొని సంతకములు చేయించుకొనియు, ననేకవిధములుగా ననేకోపాయములచే సంఘాభివృద్ధి కత్యావశ్యకమగు గార్యములను జేయుచుండ హిందూసుందరులకీ విషయములనుగూర్చి యుపన్యాసములిచ్చి బోధించి చెప్పఁగలుగు విదుషీమణులుగూడ నున్నగాని దేశోపకారసాధనముగాదని బాయమ్మ నిశ్చయించుకొని యెవ్వరేమి తన్నన్నను, దన సత్ప్రయత్నముల కెవ్వరెట్టి యాటంకములు గల్పించుచున్నను, నిరుత్సాహురాలు గాకయుండెను. తానురచించిన పద్యములను, బాటలను, సమాజములయందుఁ దానిచ్చిన యుపన్యాసములను, దెలుగువార్తాపత్రికలయందు బ్రకటించుచు, నావార్తాపత్రికలను దనస్నేహితులయొద్ద జదివి వారిశ్లాఘనల నందుచు, గ్రంథరచనాపేక్షతోఁ గొన్నిగ్రంథములను ముద్రింపించి ప్రకటించుచు, నుదయమున లేచినదాదిగా నత్యుత్సాహముతో మిక్కిలి శ్రద్ధగాఁ బాటుపడుచుండెను. ఇట్టీమె చేయుచున్న సత్ప్రయత్నములయందెల్లఁ గొందఱు పరోపకారపారీణులగు పురుషశిఖామణులు గూడ నీమెకమితోత్సాహమును సహాయమునుగూడఁ జేయుచు నామెరచించినట్లు ప్రచురించినవాటిలో గొన్నిటిని దామే వ్రాసి రహస్యముగా నామెకిచ్చు నంతరంగస్నేహితులు గూడ నీమెకు గొందఱుగలరు. వారు బాయమ్మయం దత్యంతప్రేమగలిగి యామెను శ్లాఘించుచు, నామెను దరుచుగాఁ గలసికొని మాటలాడుచుఁ, దమయిండ్లకుఁ దీసికొనిపోయి యాదరించుచు, నామెకు ముఖ్యమగు నాప్తులైయుండిరి. బాయమ్మ ప్రతిదినమును దనస్నేహితుల యిండ్లకుఁబోయి తన యిష్టము వచ్చినట్లూ పురమంతయు యథేచ్ఛముగాఁ దిరుగుచుఁ, దనస్నేహితులతోఁ గలసి నాటకములు పాటకచేరీలు మొదలగు

వినోదముల నెల్లఁ జూడ నేగుచు, నాగరికాగ్రగణ్యురాలై సంచరించుచుం డుటఁ గాంచి కొందఱీమెను గూర్చి యనేకములుగా నపవాదలను గల్పించిరి. కాని యీమె వానినించుకయిన బాటింపకఁ దనవిరోధులకు సిగ్గుపడునట్లు మఱింతపట్టుదలతో విచ్చలవిడిగాఁ బ్రవర్తించుచుండెను. ఇట్టియీమె పూర్వాచారములను దిరస్కరించుచు, నెవ్వరేమనుకొన్నను లక్ష్యము చేయక, మిక్కిలి ధైర్యసాహసములతోఁ దనబుద్ధికి దోచినట్లును, దనయంతరాత్మ దనకుఁ బ్రబోధించినట్లును, విచ్చలవిడిగాఁ బ్రవర్తించుచుండఁగలుగుట కీమె భర్తయగు కాంతయ్య మిక్కిలి మంచిస్వభావముగలిగి తనకనువర్తియై సంచరించుచుండుట ముఖ్యకారణమని చెప్పవలసియున్నది. కాంతయ్యపాత్రుని సత్స్వభావమును, నమాయకత్వమును, నహింసాత్వమును, సౌగ్ర్యయు, సముచితజ్ఞానమును, సందర్భానుకూలవర్తనమును, నభిమానశూన్యతయు, క్షమయు, నెంతెంతని శ్లాఘింపవలవి కాదుగదా! ఇట్టిసద్గుణసంపత్తిగల కాంతయ్యవంటి భర్త యీమెకు లభ్యమగుటవలననేకదా యీమె యీవిధముగ నిరాటంకముగ యథేచ్ఛముగఁ బ్రవర్తింపఁగలిగి పరోపకారమొనరించుచుఁ బనిచేయఁగలుగుచుండుటకుఁ గారణమైనది! కాంతయ్య విద్యాధికుఁడు కాకపోయినను, విశేషానుభవము లేనివాఁడయినను, సుచితజ్ఞుఁడని యాతని నెఱిఁగినవారందఱు నొప్పుకొనకతీరదు. తన భార్య యేమిచేసినను, నేమన్నను, నెప్పుడెప్పుడెక్కడికిఁబోయి యెప్పుడింటికి వచ్చినను, నేమేమిపనిచేసినను, నించుకయిన నెదురాడక తాను భర్తననియు, దనభార్య తనయాజ్ఞకు లోఁబడియుండవలెననియు నించుకైన నహంభావమును గలిగి యుండక తనపని తాను చేసికొనుచుఁ దనదారికిఁ దాఁబోవుచు నాపట్టణమునందుఁ దన్నెవరేమన్నను, దన్నుగురించి యేమేమిపరిహాసాస్పదముగ మాటలాడుకొన్నను, మర్మచ్ఛేదమగునట్లు తనగౌరవమునకు హానికరముగ నేమేమి యుప

వాదులాడినను, తలవంచుకొని మిక్కిలి సహనవృత్తితో నతిశాంతుఁడై కాలము గడుపుచుండెను. కొందఱు కాంతయ్య భార్య యాతఁడు చెప్పినట్లు వినక నిర్లక్ష్యభావముతో నాతనిఁ బరిగణించుచుండుటచేఁ బ్రాణము విసివి యీ మొత్తుఁ గలహమాడి నలుగురిలోఁ బరిహాసాస్పదుఁడగుటకన్న నూరకుండుట యుచితమని యట్లు ప్రవర్తించుచున్నాఁడనియు, మఱికొందఱు నాతఁడు స్వభావముచేఁ బిఱికితనమును, మాటకెదురాడజాలని మొగమోటమును గలవాఁడగుటచే భార్యాజితుఁడయ్యెననియు, మఱికొందఱితఁడు తనయసమర్థతను దక్కఁగా నెఱిఁగి యేమి సేయుటకును దోఁచక "నా పూర్వకర్మపరిపాకమిట్టిదియే" యని యెంచి, తనస్థితియంతయుఁ దలఁచుకొని యూరకుండెననియు, నిఁకఁ గొందఱు బాయమ్మ మొగముచూచినతోడనె మిక్కిలి భయముతో నేమి చేయుటకును దోఁచక సమ్మోహనవిద్యచేఁ గట్టుబడి వశ్యుఁడగువానివలెఁ దనచిత్తమును దానె మఱచిపోయి సంపూర్ణముగ నామె యాజ్ఞకు లోఁబడియుండుననియు, మఱికొందఱితఁడు వివిధోపాయములచేఁ దనవిద్యయు నేర్పును బ్రయోజకత్వమును వినియోగపఱచి స్వాధీనము చేసికొని బాయమ్మ యాతని సంరక్షించుచుండెననియు బలువురు పలువిధములుగఁ గారణములను గల్పించి కాంతయ్య [illegible]మును గురించి చిత్రచిత్రకథలుగా నాపురమున స్త్రీపురుషులు చెప్పుకొనుచుండిరు కాని, బాయమ్మ విదుషీమణి శివరావుగారి దీక్షాపరతంత్రతతో సంఘాభివృద్ధికిఁ బాటుపడి ని చేయుచున్న విషయమును గ్రహించి యామె సత్కార్యాచరణమునకుఁ దోడై తనశక్తికొలఁది నామెకు సహాయము చేయుచున్న యాతని సదుద్దేశమును గ్రహింపఁగల యుచితజ్ఞులగు సత్పురుషులా పురమున సంఘసంస్కర్తలలోను బాయమ్మగారి స్నేహితులలోను దక్క నితరులలో లేరని చెప్పుటకు విచారకరముగా నున్నది. అహా! గుణములెన్ని దోషములుగను; దోషములను గుణములుగను బరిగణింతు

చుఁడు జనుల మూర్ఖత్వమును నవివేకమును నేమనిచెప్పవలయును! కాంతయ్య సుగుణములన్నియు దుర్గుణములుగా నెంచి నిందాస్పదముగాఁ జేయుటకు జనుల దుస్స్వభావమొక్కటియే కారణమని చెప్పుటకేమిసందియమున్నది? బాయమ్మచేయు కార్యములత్యుత్కృష్టములనియుఁ, బరోపకారకారణములనియుఁ, జెప్పకతప్పదుకదా! అట్టిసత్కార్యాచరణమునకుఁ గాంతయ్య తోడుపడుచు దేశాభివృద్ధికలుగఁ జేయుచున్న యంశమాలోచించి యాతని జనులందరు మిక్కిలి గౌరవించి సంఘసంస్కారులలో నగ్రగణ్యునిగాఁ బరిగణించి పూజించుట-మనదేశమందలి జనులందఱకుఁ గర్తవ్యమని చెప్పకతప్పదు. తాను స్వయముగా సత్కార్యమును చేయనేరకపోయినను సత్కార్యములు చేయువారికిఁ దోడై తనశక్తికొలఁది పనిచేయఁగలుగుట సత్పురుషుల లక్షణమని చెప్పుటకేమిసందియమున్నది! విద్యయందును, తెలివియందును, ప్రయోజకత్వమునందును, కార్యాచరణనైపుణ్యమునందును, జనాకర్షణకు తగినసాధనసంపత్తియందును, వాగ్నైపుణ్యమునందును, ధైర్యసాహసములందును, దనకంటె సహస్రాంశములత్యధికురాలగు తనభార్యయగు బాయమ్మవంటి చక్కఁగాఁ బాడనేర్చిన యౌవనమధ్యస్థయగు పరోపకారదీక్షాపరతంత్రురాలికిఁ దనశక్తికొలది సహాయముచేయుటకన్న కాంతయ్య చేయగల దేశోపకారమేమున్నది! (1) ఆమెను వివాహమాడినతరువాత కొంతకాలమువఱకు నామెవంటి సౌందర్యవతియు, విదుషీమణియు నగు స్త్రీరత్నమునకు దాను భర్తయగునట్టి యత్యంతానందకరమగు మహావైభవము తనకుఁ జేకూరి తనజన్మపావనమయ్యెనని మహానందాబ్ధిని నోలలాడుచుఁ బ్రపంచజ్ఞానసూన్యుఁడై ప్రమత్తుడైయుండుట. (2) తరువాత తనభార్యవిదుషీమణియనియుఁ,గవియనియుఁ,సంఘసంస్కారనిర్వాహకయనియు,నజ్ఞానాంధకారమునుండితప్పించుకొనగలిగియావలఁబడిజ్ఞానజ్యోతిఃప్రకాశమునఁ

గన్నులు తెఱచి సంచరింపఁగల వివేకముగల నవనాగరికాగ్రగణ్యయనియు, దేశమునఁగలుగుసభలకన్నిటికినిఁబోయి యుపన్యాసములిచ్చి కీర్తిగాంచిన గుణవంతురాలనియుఁ,బ్రసిద్ధిగాంచినబాయమ్మకుఁ దానుమగఁడగుటవలన నప్రయత్నముగాఁ దనకులభించిన కీర్తిప్రతిష్ఠలకు సంతోషించుచు నట్టియలభ్యయోగమగు భాగ్యమును బోగొట్టుకొనకుండ గాపాడుకొనఁగలుగునటుల జాగరూకతతో సందర్భమెఱిఁగి ప్రవర్తించుచుండుట. (3) తరుచుగ దనయింటికి వచ్చుచుండునట్టియుఁ దాను బోవుచుండునట్టియు తనభార్య దనస్నేహితులయిండ్లకుఁబంపు వర్తమానములను జాబులను జాగరూకతతో నందిచ్చు సందర్భమున నట్టి స్నేహితులలో స్త్రీలను తాను స్వయముగాఁజూచి మాటలాడుటకుఁ దన కవకాశము లేకపోవుటఁబట్టి నామాటలును జాబులును నందిచ్చుటకు వారిభర్తలయొద్దకును, నట్లుగాక బురుషులైనచో వారియొద్దకును తాను స్వయముగాఁ బోగలుగుట కవకాశము గలుగఁజేసి, నెలకుఁ బదేనురూపాయీలు జీతము తెచ్చికొనుచున్న యొక చిన్నయుపాధ్యాయుఁడగు తనవంటి సామాన్యునకు నాపట్టణమందలి గొప్పవారితోఁ దఱచుగ మాటలాడునట్టి యదృష్టమునకుఁ గారణభూతమై తానట్టివారిచే నాప్తబంధువునిగఁ బరిగణింపఁబడుచున్న మహాభాగ్యమును కాపాడుకొనఁగలుగుటకుఁ దనశక్తివంచన లేకుండ తానుకూడ పనిచేయుట. (4) తనభార్యవిదుషీమణియనియు, వ్యాకరణవేత్త్రియనియు, సంస్కృతజ్ఞానముకూడకలపండితయనియు, నాటకకవియనియు, నుపన్యాసవేత్త్రియనియు, నెన్నియోగ్రంథములనురచించినబహుగ్రంథకర్త్రియనియుఁ, జక్కగాఁ బాడనేర్చిన గాయనీమణియనియు, ఫిడేలుగూడ వాయించగల సంగీతసరస్వతియనియు, మంచినేర్పరియనియు, రసికురాలనియుఁ, గార్యదీక్షాపరతంత్రురాలనియు, నెవరేమనిన నించుకయుఁ జంకక పనిచేయునట్టిధీరయనియు సంఘాభివృద్ధికొఱకు నెడతెగక పనిచే

యయుండును దేశోపకారియనియు ననేకవిషయముల నెన్నెన్నియో వర్ణించిచెప్పుడు నందకర్త్రియనియు సుకుమారియనియు దానికిఁ దగిన ప్రోత్సాహమును, నదిసంఘాభివృద్ధికిఁ దలపెట్టిన యీమహాప్రయత్నమునకుఁదగినసహాయమును, దానికిలభింపకుండుటకు విచారించుచు నూరంతటనుప్రచురించి కాంతయ్య స్వయముగాఁ జెప్పుకొనుచుండఁ గలుగునదృష్టముఁ గలిగియుండుట. (5) తనప్రక్కలోఁ బిలిచినవారిలో ననేకులచే బాయమ్మ మొగుడని బిలువఁబడుచుండుట. (6) తనభార్యనుగూర్చి వ్రాయఁబడిన సందర్భమునఁ దనపేరుఁగూడ వార్తాపత్రికలలో నచ్చుపడుచుండుట ; (7) తన యింటికనేకులు తన భార్యకొఱకు సర్వదా వచ్చుచుండుట ; (8) ఏదేశాభిమానసమ్మాననీయుని సహాయప్రేరణముచేతనో మన దేశమునందలి గొప్పపట్టణములందు జరుగు మహాసభలకుఁ బోఁగలిగిన తనభార్యతోఁ దానును బోయి తనజన్మమునకును దనస్థితికిని దుర్లభమగువాటినెల్ల చూచి యానందింపఁగలుగు భాగ్యమునకుఁ గారణభూతమగు దానికిఁ దాను భర్తయగుట, ననునీయహైశ్వర్యములనుఁ దనజన్మసాఫల్యమగునటుల తనయింటిచేతిలో నుండఁగలుగునట్లు ప్రసాదించిన యాబాయమ్మను కాంతయ్య దనభాగ్యలక్ష్మిగను నదృష్టలక్ష్మిగను, గృహదేవతగను, గౌరవించి భక్తివిశ్వాసములతోఁబూజించి యారాధించుటకన్న పత్నీవ్రతదీక్షయుం దితఁడు చేయవలసిన కార్యమేమున్నది! మఱియుఁ దనభార్యను సంతోషపెట్టుటకును నామెయభీప్సితములను దీర్చుటకును జేయవలసిన కార్యములన్నిటినిఁ గాంతయ్య యెంతటికష్టములకైననోర్చి యించుకైన వెనుదీయకఁ దక్షణమే చేయుచు దేశోపకారమునకు సహాయము చేయుచుండెను.

కాంతయ్య యుదయము పదిగంటలకుఁ బాఠశాలకుఁ బోవలసినవాఁడగుటచే దానావేళకుఁ బాఠశాలకుఁ బోయి తనయుద్యోగమును గాపాడుకొనగలుగుటకుఁ దనభార్య యింటికివచ్చి తనకు వంట

చేసి తనకన్నము పెట్టువఱకుఁ గనిపెట్టుకొనియుండుట కవకాశములేద
ని గ్రహించి యామె చేయు సత్కార్యముల కాటంకము గలిగించిన
ఘోరపాతకమును మెడకట్టుకొన నిష్టములేనివాఁడగుటచే నామె కిం
చుకయినఁ నాటంకము గలిగింపకుండుట కెంచి తానే స్వయముగా
వంటచేసికొని తాను తిని యామెకన్నము సిద్ధపఱచి తనదారినిఁ బో
యి తనభార్య యింటికివచ్చినతరువాత వంటచేసికొనుటవలన నించు
కయినఁ గాలహరణము గాకుండ పరోపకారమును చేయుచుండునట్లా
మెకు సహాయపడుచుండును. ఒకొక్కప్పుడు తనభార్య రాత్రి ప్రొద్దుపో
వువఱకింటికిఁ దిరిగిరాకపోవుటచేఁ జీకటిలోఁ నొంటరిగాఁ దనయింట
వాకిలిలోఁ గూర్చుండి యామెకొఱకు నిరీక్షించుచు నిద్రమేలుకొని వేఁ
చియుండి యామె సత్కార్యాచరణదీక్షకు విఘ్నము గలుగకుండఁ జే
యుచుండును. తాను గడించి తెచ్చిన జీతమంతయుఁ దనభార్యకిచ్చి
యామె కొనిపెట్టిన బట్టలతోను నామె తనకప్పుడప్పుడు బలవంతము
మీఁద నిచ్చుచుండు స్వల్పపుమొత్తములతోను సంతృప్తినొంది సుఖిం
చుచుండును. బాయమ్మ చీరెలను రైకలను దుస్తులను నుతుకు చాకలి
వానికిని పనికత్తెకును గలిపి నెలకైదురూపాయీలు జీతమియ్యవలసిన
యవసరముండుటచేఁ గాంతయ్యభార్యకుఁ దాను స్వయముగాఁ గడించి
తెచ్చుకొనినద్రవ్యమంతయు నామె నగలక్రిందను బట్టలక్రిందను తప్ప
సంసారముకొఱకొకగవ్వయైనఁ గర్చుపెట్టుటకవకాశముకలుగకుండుట
చేఁ సంసారమంతయుఁ బదిరూపాయీలతోఁ గడుపుకొనవలసి
వచ్చినదయ్యెను. బాయమ్మ యప్పుడప్పుడు సొమ్ముకై తన్నుఁ బీ
డించుచుండుటచే నామె యభీప్సితము తీర్చుటకంటెఁ దాను చేయఁదగి
న కార్యములేదని యెంచి చేబదులు మూలముగను ప్రామిసరీనోట్లు
వ్రాసియుఁ దనఖాపత్రములు వ్రాసియుఁ గాంతయ్య గొంతఋణముకూ
డ చేయవలసివచ్చెను. దన స్నేహితులయిండ్లకుఁ బోవుటకుదూరమున

డువవలసినయవసరము లేకుండ నొకబండిని సంపాదించవలయునని బాయమ్మ చెప్పుచుండెనుగాని కాంతయ్యా దనస్థితినిబట్టి ఋణముచేసి యైన నొకరెద్దుబండిని గొనఁగల సమర్థతగల వాఁడయ్యును నేకారణము చేతనో బండిని మాత్రము కొనలేదు. కాని యీమె దూరము పోవలసివచ్చినప్పుడెల్ల నొక బండిమీఁదనే పోవుచు దగ్గిర యిండ్లకు మాత్రము గొడుగువేసికొని నడిచి పోవుచుఁ దాను చేయని శ్చయించుకొనిన కార్యములనెల్లఁ జేయుచుండెను. వీరికుమారున కొని మిదినంవత్సరముల వయసున్నను నాతని విద్యాబుద్ధులను గురించి బాయమ్మగాని కాంతయ్యగాని యెంతమాత్రము శ్రద్ధవహించిరని చె ప్పవలనుపడదు. ఆపిల్లవానిని బడిలోవేసిరిగాని యతఁడెన్నడును బ డికిఁ బోయి విద్యనేర్చుకొనక విచ్చలవిడిగా నూరంతయుఁ దిరుగుచు నాటపాటలలోఁ గాలము వృథపుచ్చుచు నల్లరిపనులు చేయుచు స్వల్ప వస్తువులను దన హస్తలాఘవనైపుణ్యమున గనుపడకుండఁ జేయుచు నెక్కడఁజూచినను దానయై యాతతాయివలె దిరుగుచుండెను. తమ కొమారుని విషయమై తల్లియగు బాయమ్మగాని తండ్రియగు కాంత య్యగాని తగిన జాగ్రతపుచ్చుకొని యాతనికి విద్యాబుద్ధులు నే ర్పలేదు.

సంఘసంస్కారవిషయములన్నిటియందు నీబాయమ్మ సంస్కార కూరుల యభిప్రాయములతో నేకీభవించి వారియుద్దేశములనెల్ల నా మోదించి శక్తివంచనలేకుండఁ బనిచేయుచు సంసారుల యిండ్ల జరు గు వివాహాదిశుభకార్యములయం దాటపాటలకు వేశ్యలను రప్పించి వారినాదరించుటకన్న వేశ్యలవలనఁ గలుగఁజేసికొనఁ గలిగిన నృ త్యగీతాది వినోదములనెల్లఁ గులాంగనలవలననే జరుపుకొనఁగలుగుట కు వారికి గాంధర్వవిద్యగూడ నేర్పింపవలయునను యుద్దేశము గలిగి యుండెను. పరోపకారదీక్షాపరతంత్రురాలును దేశాభిమానమానమా

నసీయయు నగు బాయమ్మవంటి విదుషీమణికి భర్తగానుండుటవలనఁ దనకు లభించిన గౌరవముచేతను బ్రఖ్యాతిచేతను గొప్పవారి స్నేహలాభప్రాప్తిచేతనుఁ గాంతయ్య యైహికసుఖలాభముల నెల్ల జూరగొన్నవానివలె మిక్కిలి యానందించుచు సౌఖ్యమునఁ గాలము గడపుచున్నను నాముష్మిక సౌఖ్యమునుగూర్చి మఱచిపోకఁ దాను వైష్ణవమతస్థుఁడగుటచే నాపురముననున్న యాదికేశవస్వామియం దతిభక్తి గలిగి ప్రతిదినము నాదేవుని యాలయమునకుఁ బోయి స్వామిదర్శనము చేయుచుండెను. బాయమ్మ విగ్రహారాధనము మహాధజనాదరణీయమని జక్కఁగాఁ దెలసికొన్న బ్రహ్మజ్ఞానిని యగుటచే నేకేశ్వరోపాసనమునే జేయుచుఁ బ్రార్థనాసమాజములకుఁ బోయి యచట ఫిడేలు వాయించి పాడుచు భక్తులను రంజింపఁజేయుచుండెను. కాని యామె నోములు వ్రతములు మాత్రము మానక నట్లతద్ది యుండ్రాళ్ళతద్ది మొదలుగాగల యన్ని పండుగులయందును నోములను వ్రతములను జేయుచుఁ దనభర్తచే ఋణముచేయించి క్రొత్తచీరెలను గాసులను గొని ధరించుచు హిందూమతసంబంధమగు పండుగులనెల్ల మహావైభవముతో నత్యుత్సాహముగాఁ గడపుచుండఁ గాంతయ్య నృసింహజయంతి, కృష్ణాష్టమి, వైష్ణవైకాదశి మొదలుగాగల వానియందెల్ల నుపవాసవ్రతములాచరించి తన దైవభక్తినిఁ బ్రకటించుకొనుచుండెను. ఇట్లు కాంతయ్య దనగార్హస్థ్యసౌఖ్యమును మహానందముతో ననుభవించుచుఁ గల్యాణపురవాస్తవ్యులగు ప్రముఖులలో తన్నొకనిఁగా భావించుకొని కాలము గడపుచుఁ దనకేండ్లుగడచి శరీరబలము క్షీణించి నకొలది వార్ధక్యధర్మమును బట్టియో, తన భార్య యభీప్సితములను దీర్పఁగలుగుటకుఁ దానుజేసిన ఋణముల వలనఁ దటస్థమైన బాధలను బట్టియో, గృహకృత్యములను జేసికొనుట కోపికలేకపోవుటచేతనో, మరి యేకారణముచేతనో, మనము స్పష్టముగాఁ జెప్పలేముగాని యితని

కాముష్మిక సౌఖ్యమును సంపాదించుకొనఁగలుగు సాధనములను సమకూర్చుకొనవలయుననుకోర్కి గలిగియుంట జేయుగృత్యముల నీశ్వరసన్నిధానమున నాయాదికేశవస్వామి యాలయములోనే జేయుచు నాదివ్యస్థలమునఁ దనకులభించు ప్రసాదముతోఁ దృప్తినొంది యచ్చటనే దినములు గడపవలయునను నుద్దేశమీతని కప్పుడప్పుడు గలుగుచుండెను గాని యిరుగుపొరుగువారును దనభార్యయు నామె స్నేహితులును నాతని యుద్దేశమును మఱలించి "నీవింకను నీభార్యచేయుచున్న కార్యాచరణమునకుఁ దోడై కీర్తిప్రతిష్ఠలను గాంచవలసియున్న" దని యాతని కెన్నెన్నో విధముల బోధించి యైహికసుఖాభిలాషిగాఁ జేయుచుండిరి.

కాంతయ్యయు నాతని భార్యయు గాపురమున్న యిల్లాతని దండ్రి యుద్యోగము చేయుచున్న గాలమున గట్టించిన యొక విశాలభవనమని యిదివఱకే జెప్పఁబడినది. లోకనాథమొదలియారు గారును వారి స్నేహితులును నాయింటనే బసచేసిరని గూడ నిదివఱకే చెప్పబడెను. ఆయింటఁ గాంతయ్యయు నాతని భార్యయు గొమారుఁడును దక్క నింకెవ్వరును లేకపోవుటచే మొదలియారుగారికిని వారి స్నేహితులకును విశాలమగు నొకభాగమంతయుఁ బ్రత్యేకముగా లభించినను వారాయింటఁ బ్రవేశించిన యొకటిరెండు దినములలోపుననే నాదంపతులచే నాప్తులుగా గణింపఁబడి యిల్లంతయు యథేచ్ఛముగా నుపయోగపఱచుకొనఁ గలుగుచుండిరి. ఆయమ్మ విద్యాధిక్యమును, గానమును దేశోపకారబుద్ధియు, సంఘసంస్కారప్రియత్వమునుఁ, గార్యశూరత్వమును, నాగరికతయు, బుద్ధికౌశల్యమును, స్నేహాభిలాషకతయు వీరు గ్రహించి యామెయందు మిక్కిలి గౌరవమును సదభిప్రాయమును గలిగి యామెను శ్లాఘించుచు నట్టి విదుషీమణి భార్యగాలభించిన కారణమువలనఁ గాంతయ్య పాత్రునకు గలిగిన యదృష్టమునకాతని భాగ్యవైభవ మింతింతని చెప్పనలవికాదని యాతని స్తోత్ర

ము చేయుచుఁ దమవలెనే దేశక్షేమమునకుఁ బాటుపడి పనిచేయుచున్న యామెవలనఁ దెలిసికొని గ్రహించుకొనవలసిన విషయములనేకములుండుననని నమ్మి నారాపట్టణమునఁ గొన్నిదినము లుండనిశ్చయించుకొనిరి. మొదలియారుగారీమె యపరసరస్వతియనియు నాధునికలీలావతియనియు హిందూస్త్రీల నజ్ఞానాంధకారమునుండి తొలఁగింప నవతరించిన స్త్రీలపాలిటి ధర్మదేవతయనియు నమ్మి యీమెను శ్లాఘించుచు గౌరవించుచుండిరి. సంగీతసాహిత్యములయందును గవిత్వమందును గృహిణీత్వధర్మవర్తనమందును నద్వితీయయని శెట్టిగారును, గానవిద్యాకౌశల్యమునందును, సౌందర్యవైభవమందును, సుచిత్రప్రవర్తనమందును, రసికత్వమందును, జాణయని నాయఁడుగారును బిళ్ళెయు నీమెను శ్లాఘించుచు హిందూసుందరులకు శిరోభూషణమని నిశ్చయించిరి. ఇట్లీనలుగురు నామె గార్యశూరత్వమును గూర్చియుఁ, బరోపకారదీక్షాపరతంత్రతను గూర్చియు, సంస్కారప్రియత్వమును గూర్చియు, మాటలాడుకొనుచుఁ గ్రమక్రమముగా బాయమ్మగారి స్నేహకోటిలోఁని వారుగాఁ బరిగణింపఁబడుచు నాలుగైదుదినములలో నామె ముఖ్యస్నేహితులైరి. కాంతయ్య మొదలియారుగారియందును, వారి స్నేహితులయెడలను మిక్కిలి వినయభయభక్తులుగలిగి సగౌరవముగాఁ బ్రవర్తించుచు నాపురమునగల విశేషములనెల్లఁ జెప్పుచుండెను. మొదలియారుగారికి బాయమ్మయెడల గౌరవమభివృద్ధియై యామెవంటి స్త్రీరత్నముతో స్నేహలాభము దొరకినందులకుఁ దనయదృష్టమునకు మిక్కిలి సంతోషించుచుండెను. శెట్టిగారామె గుణసంపత్తిని గూర్చి కొనియాడుచు నామెరచించిన పద్యములను గ్రంథములను వార్తాపత్రికలయందామె ప్రకటించిన వ్యాసములను మిక్కిలి శ్రద్ధతో జదువుచు నామె పాటనువినుచు "తనపాండిత్యము నవ్వులనొయించి గాంధర్వమువనికిఁ దెచ్చిన హంసయాన" యని యీమెను శ్లాఘించుటయేగాక

నామెపైఁ గొన్ని పద్యములుగూడ నల్లి చదువసాగెను. నాయుఁడుగారి కినిఁ బిళ్ళగారికి నీమె "యతనుసమ్మోహనవిద్య" గా బరిణమించుటచే వారామెను జూచినదాది యామె సౌందర్యగుణాతిశయముల కత్యాశ్చర్యము నొందుచు నట్టిస్త్రీరత్నమును భార్యగాఁ జేసికొనఁగలిగిన కాంతయ్య భాగ్యమున కత్యాశ్చర్యము నొందుచుఁ దమకట్టి యదృష్టము గలిగినయెడల దమజన్మలు పావనములగునని యంతరంగమునఁ దలఁచుకొనుచుఁ దమ ధనమును గౌరవమునుగూడ నామె పాదములకు ధారవోసి యామె స్నేహలాభమును బొంది యామెను గన్నులారఁ జూచుచుండగలిగిన యదృష్టమైన లభించినఁ జాలునని యెంచుకొనుచుండిరి. కాయమ్మ వీరిని దన ముఖ్యస్నేహితులనుగా నెంచి వారిని గౌరవించుచుఁ దనవిద్యానైపుణ్యముచేతను, గవిత్వప్రౌఢిమచేతను, రసజ్ఞతచేతను, వాగ్నైపుణ్యముచేతను, సరససంభాషణాచతురత్వముచేతను, గాంధర్వవిద్యాకౌశలముచేతను, రసికత్వవైభవముచేతను, కార్యదీక్షాపరతంత్రతచేతను, ధైర్యసాహసాదిగుణసంపత్తిచేతను, మహానందవార్ధిలో ముంచివేసెను.

కాంతయ్య దనభార్య యోగ్యత వీరితోఁ జెప్పి యామెను శ్లాఘించుచు, మాటలాడుచుఁ, దనభార్య నాపట్టణమునందేగాక దేశమందంతటను గల గొప్పవారందఱు చక్కగా నెఱుగుదురనియు, మహానీయులందఱితో నామెకుఁ గార్యసంబంధముగలదనియుఁ దరుచుగా నాపురమందలి గొప్పవారినందఱిఁ గలసికొనుచుందుననియు నామె సంగతంతయు వార్తాపత్రికలమూలమున జగద్విదితమేయనియుఁ జెప్పి యానందించుచు వీరికానందము గలిగించుచుండెను.

ఇట్లు వీరు నలుగురు గల్యాణపురము బ్రవేశించినతరువాత రెండుమూడుదినములలోఁ గాంతయ్యమూలమునను, కాయమ్మమూలమునను, నాపట్టణమందలి గొప్పవారినెల్లఁ జూచి వారిలోఁ గొందఱి స్నే

హూలాభమును గూడఁ బొందగలిగిరి. కొందఱు మాత్రము వీరు గాంతయ్యయింట బసచేసినందుకు వీరిని నర్మగర్భమైన మాటలతో నాక్షేపించుచుఁ గాంతయ్యవంటి స్నేహితుఁడు లభించినతరువాత నాతనివిడచి వీరచ్చటనుండి పోవుట కిష్టములేకఁ గొన్నిమాసములైన నచ్చటనే యుండకమానరనియు బాపమ్మ పరోపకారకార్యనిర్వాహకత్వమునకు దోడై పనిచేయఁగల దేశాభిమానమానసీయులిప్పటికిఁ దటస్థమైరనియుఁ జెప్పుకొనుచుండిరి. మొదలియారుగారిని, శెట్టిగారిని, నాయుఁడుగారిని, బిళ్ళగారిని జూచుటకై పురవాస్తవ్యులలో గొప్పవారందఱు నను దినము నచ్చటికి వచ్చుచుండిరి. ఈనలుగురు నాపట్టణమున నున్నదినములలో నుదయమునఁ గాంతయ్యతోఁ గలసి తమ స్నేహితులయిండ్లకుఁ బోయి వారితో ముచ్చటించుచుఁ దమయభిప్రాయముల నెల్ల వారికిఁ జెప్పుచు సాయంకాలమున క్లబ్బునకును, ప్రార్థనాసమాజమునకునుఁ బోవుచు నాయూరగల గొప్పవారందఱిపరిచయమును సంపాదించుచుండిరి. కాని కొందఱకుమాత్రము వీరు గాంతయ్యయింట బసదిగియుండుటయు, బాపమ్మ విద్యాధిక్యతను గూర్చియు, సద్గుణసంపత్తినిగూర్చియు, శ్లాఘించుచుండుటయు నంతగా నామోదకరముగా నుండకుండెను. బాపమ్మయింటికిఁ దరుచుగా వచ్చుచుండెడి యామెయాప్తులలో నాకరిద్దరికి వీరాయింట బసదిగియుండుట ప్రథమమున దుస్సహముగా నున్నను దర్వాత వీరి యమాయిక వ్యాపారమును బట్టియు నితరుల వ్యవహారములయందించుకైన జోక్యము గలుగఁజేసికొనకుండ సంచరించుచుండు యుచితజ్ఞతను బట్టియుఁ ద్వరలోనే వారిని దమకాప్తులనుగాఁ జేసికొని బాపమ్మ యోగ్యతనుగూర్చి వారితోఁ జెప్పి యానందించుచుండిరి. మొదలియారుగారును, శెట్టిగారును బాపమ్మ గోమారుని ముద్దాడుచు నాతనికి ఫలహారములును నాటవస్తువులను గొనిపెట్టుచు నాతఁడు గొప్పవాడై విశేషకీర్తిని బొందగల యదృష్టశా

లియని యాతనిఁగూర్చి చెప్పుచుండిరి.

ఇట్లీ నలుగురు స్నేహితులును గల్యాణపురమునఁ గొన్నిదినములు గాంతయ్యపాత్రుని యింట స్వస్థమానసులై బసచేసియుండి బాయమ్మగారి విదుషీత్వవైభవమునకును, ప్రయోజకత్వమునకును మిక్కిలి సంతసించుచు నామెయందపరిమితగౌరవముతో నంచరించుచుండిరి. గుణగ్రహణపారీణులగు నీసత్పురుషులకు బాయమ్మ మిక్కిలి గౌరవాస్పదమగు స్త్రీరత్నముగాఁ దోఁచుటొక వింతగాదు. మఱియు నీనలురుగును బాయమ్మగారి కొమారునియందమితమగు వాత్సల్యము గలిగి నాతని ప్రేమించుచు నాతనికాటవస్తువులను దుస్తులను గొని యిచ్చుచు దమతో షికారు దీసికొనిపోవుచుండిరి. చిన్నపిల్లలను గారవించి దయతో ప్రేమించి వాత్సల్యము గలిగియుండుట వారితల్లులకు సంతోషదాయకముగా నుండుట ప్రపంచధర్మమని చదువరులే గ్రహింపగలరు. ఎంతకురూపియు, బుద్ధిహీనుఁడును, నాతతాయియు దుశ్చేష్టితుఁడును నైన పిల్లవానినైనను సౌందర్యవంతునిగా బరిగణించి బుద్ధిశాలియని చెప్పుచు నాతనిగుణములకు మెచ్చుకొని యాడుచున్నప్పుడా పిల్లవానితల్లికి మిక్కిలి యానందకరముగా నుండుటయు నట్లు తనపుత్రుని గారవించినవారియందధికభక్తి విశ్వాసములు గలిగియుండుటయు ప్రపంచధర్మము, కావునఁ దనకొమారుని గారవించుచున్న మొదలియారుగారు మొదలగు నీనలుగురియందును బాయమ్మగారికి గౌరవమును భక్తియు విశ్వాసమును ప్రేమయు దినక్రమముగా నభివృద్ధియయ్యెను.

బాయమ్మగారి కొమారునిపేరు శ్రీనివాసము. ఇతడాతతాయియనియు విద్యయందించుకైన నిష్టములేకఁ బాఠశాలకు బోవునట్లు నటించి వీథులవెంబడి దుర్మార్గులగు హీనజాతులవారి పిల్లలతోఁ దిరుగుచు లేనిపోనిపనులలోఁ జోక్యము గలుగజేసికొని నాతతాయిలలో నాతతాయియని ప్రసిద్ధిగాంచి గల్యాణపురమున నెక్కడజూచినను దానే

గనుపించుచుండెను. ఇతఁడేండ్లకుఁ జిన్నవాఁడయ్యును దనవయసున కును, ప్రపంచానుభవమునకును, ననేకాంశములెక్కువగాఁ బళ్యాలో హారణవిద్యయందును, హాస్తలాఘవక్రియా చతురత్వమందును, స హజనిపుణత్వమును బాండిత్యమును జూపించుచు నాయూరివారందఱిచే తను దెబ్బలుదినుచుఁ దనశరీరము గట్టిపఱచుకొనుచు దిరుగుచుండెను.

దంటమాటలాడుటయందును, దౌష్ట్యమందును, నాతతాయితన మందును నద్వితీయుఁడయి శ్రీనివాసము దన్నుఁ బ్రేమాస్పదముగా గా రవించుచున్న మొదలియారుగారు మొదలగు సీనలుగురికిని నప్పుడ ప్పుడు మిక్కిలి యాయాసము గలిగించుచు వారిని బాధపెట్టుచునేయుం డెను. కాని యాతఁడు దమ్మెంత బాధపెట్టుచుఁ దమమనసుల కెట్టియా యాసమును గలిగించినను శాంతస్వభావులును, దయామయులును క్షమా న్వితులును నగునీమహామహులు తమకుబాయమ్మగారియందుగల గౌరవ మునుబట్టి మిక్కిలియోరిమితో నూరకుండిరి. ఇతఁడొకనాఁడు బంగారు తోఁగట్టబడిన మొదలియారుగారి సులోచనములు మిఠాయియంగడి వానికిచ్చి తానును దనస్నేహితులును నత్యుత్సాహముతో విందారగిం చిరి. మఱియొకదినమున నీతఁడు నాయుఁడుగారి పెట్టి మారుతాళము తోఁ దెఱచి యందున్న వాచీయును గొలుసును దీసి తన స్నేహితునికొక నికి బహుమానమొసఁగెను. ఇంకొకనాఁడు శెట్టిగారి దుస్తులను దీసి యొక రహస్యస్థలమున దాచెను. ఈవిధముగా శ్రీనివాసము దమ్మెం త బాధించుచున్నను వీరుమాత్ర మాతడుచితానుచితములు గ్రహింపఁజా లని జ్ఞానమెఱుఁగని పిల్లవాఁడనియు, జిన్నతనపుచేష్టలుగా విలాసార్థ ము చేసిన నేరములనియు, నిశ్చయించుకొని యాతని నేమియు ననక మిక్కిలి గారాబముతో బ్రేమించుచునే యుండిరి.

ఇట్లు వీరు గల్యాణపురమునను న్న సమయమున రాయవరగ్రా మములో వీరిస్నేహము చేసి వీరిని సత్యవరమందు జరిగిన కల్యాణోత్స

వమునకుఁ దీసికొనిపోయి యచ్చట డిప్యూటీకలెక్టరు మొదలగువారి స్నేహలాభమును వీరికి గలుగఁజేసిన పార్థసారధి తననాటకసమాజమును దీసికొని నాటకములాడించి తన ప్రయోజకత్వమును నాటకప్రయోగకౌశల్యమును గల్యాణపురవాస్తవ్యులకుఁ బ్రకటీకృతముచేసి ప్రఖ్యాతివడయవలయునను యుద్దేశముతో నక్కడకు వచ్చి యొక పెద్దపాకనువేయించి నాటకములాడ నారంభించెను. మొదలియారుగారును, శెట్టిగారును, నాయుఁడుగారును, బిళ్ళగారును, గల్యాణపురమందుగల పెద్దమనుష్యులందఱి యిండ్లకుఁబోయి వారిస్నేహమాచరించి వారాపట్టణము బ్రవేశించిన రెండు మూఁడు దినములలోపలనే యాపురవాస్తవ్యులందఱి పరిచయమును సంపాదించిరి. ఆసమయమునఁ దమ పూర్వస్నేహితుఁడగు పార్థసారధి వీరికి గనుపించుట మిక్కిలి సంతోషాస్పదముగా నుండెననుట కెంతమాత్రమును సందియము లేదు. పార్థసారధిగూడ వీరి నలుగురిని నొకనాఁడు సాయంకాలమునఁ గ్లబ్బులోఁ గలిసికొని యలభ్యయోగముగాఁ దన పూర్వస్నేహితులను జూడఁగలిగిన భాగ్యమునకు మిక్కిలి సంతోషించి, తాను నాటకసమాజములో నాపట్టణమునకువచ్చిన సంగతియుఁ, దానక్కడ గొన్ని నాటకములాడ నిశ్చయించుకొన్న విషయమును, వారితోఁ జెప్పి తన నాటకసమాజముయొక్క యుత్కృష్టతయు, నాటకములాడుటకు దాను విశేషవ్యయప్రయాసలకోర్చి సంపాదించిన నాటకపరికరముల యొక్క విశేషమును, జాలదూరము కొనియాడి వారితోఁ జెప్పి తన నాటకసమాజమాడు నాటకములన్నియు నాపట్టణమునఁ గొన్నిదినములుండిరైనఁ జూచి యానందింపకఁ దప్పదని చెప్పి తాను బసదిగియున్న యింటికి రమ్మని బిలచెను. పార్థసారధికాపట్టణమున బొమ్మగంటి సోమన్నగారను నొక స్నేహితుఁడు గలడు. ఈసోమన్నగారిని వీరు నలుగురు నింతకుబూర్వమే యెఱిగియున్నను నాయనతో వీరి

కంతగా స్నేహములేదు. కాని వీరు పార్థసారధిగారిని క్లబ్బులో గలసికొన్నప్పుడీ సోమన్నగూడ నక్రీడసేయుండుట తటస్థమయిన కారణమును బట్టియుఁ బార్థసారధి, మొదలియారు, మొదలగు నీనలుగురికిని సోమన్నకొను గూడ పరమాప్తుడుగా నున్న హేతువునుబట్టియు నతిస్వల్పకాలములో వారికి స్నేహముగలిగిన వారైదుగురును బరమాప్తులుగా సంచరించ నారంభించిరి. పార్థసారధి గల్యాణపురమున నాటకములాడించుటకుఁ గావలసిన ప్రయత్నసాధనములన్నియు నీ సోమన్నరే చేయుచుండెను. సోమన్న పార్థసారధికి పూర్వస్నేహితుఁడగుట బట్టి యాతని నాటకప్రయోగములకుఁ గావలసిన యత్నములన్నియుఁ దన స్వకార్యములుగా మిక్కిలి శ్రద్ధతో నత్యుత్సాహముతోఁ జేయుచు నానాటకసమాజము దనదిగానే భావించుకొనుచుఁ దిరుగుచుండెను. మొదలియారు మొదలగు నీనలుగురు స్నేహితులును సోమన్నయు నుదయమును సాయంత్రమును పార్థసారధి బసదిగియున్న యింట గలసికొని మిక్కిలి స్నేహభావముతోఁ బ్రవర్తించుచుండిరి. శెట్టిగారు గవితాలోలుఁడును సంగీతసాహిత్య విశారదుఁడును గావున నానాటకసంఘములో వారు చదువుపద్యములను పాడుగీతములను గర్ణానందముగా విని సంతోషించుచు, వారిపాండిత్యమునకును నేర్పునకును వారిని గొనియాడుచు, నాటకులకందఱకు మిక్కిలి యాప్తుఁడుగాను గౌరవాస్పదుఁడుగాను నుండెను. పిళ్ళగారును నాయుఁడుగారును గూడ నాటకులకు మిక్కిలి స్నేహితులుగను గౌరవాస్పదులుగను నుండి వారికిఁ గావలసిన సహాయమంతయుఁ జేయుచుండిరి. ఈవిధమునఁ గొలది దినముల లోపలనే యీనలుగురికిని సోమన్నతో దృఢమైన స్నేహసంబంధ మేర్పడినది. సోమన్న బ్రాహ్మణుఁడును, మొదలియారు మొదలగు నీనలుగురును శూద్రులును, అయినను వీరాప్తబంధువులవలె నన్యోన్య స్నేహ భావముతోడను, గౌరవ వి

శ్వాసములతోడను, సంచరించుచుండిరి. మొదలియారును నాతని స్నేహితులు ముగ్గురును గపట కల్మషము లెఱుగని యమాయికులని చదువరుల కిదివఱకే తెలిసియున్నది. సోమన్న మాయోపాయముల యందద్వితీయుఁడైన సంపూర్ణపాండిత్యముగల నేర్పఱియుఁ గుత్సితుఁడును గుచోద్యుఁడును గావున వీరునలుగురు మిక్కిలి యమాయకులనియుఁ, బ్రపంచజ్ఞానము లేనివారనియు, నిష్కపటులనియు, నిముషములోఁ గ్రహించి వారిని మఱింత స్నేహభావముతో గౌరవించి శ్లాఘించుచు వారిని దరుచుగాఁ దనయింటికిఁ దీసికొనిపోయి విందులు పాటకచేరీలు మొదలగునవి చేయించుచు సంతోషపెట్ట నారంభించెను. శెట్టిగారును బిళ్ళగారును సోమన్న స్నేహపాత్రతకును సరసత్వమునకు మిక్కిలి యానందించుచు నాతనిగొనియాడుచుండిరి. మొదలియారుగారు సోమన్న వ్యవహారజ్ఞానమునకును గార్య సాధనతకును, నాయకుఁడుగా నాతని ప్రయోజకత్వమునకును, ధైర్యసాహసములకును, నాశ్చర్యమందుచు నాతని శ్లాఘించుచుండిరి.

సోమన్న యొక వైదిక బ్రాహ్మణుఁడు. ఇతఁడు విద్యాధికుఁడు గాకపోయినను వ్యవహారజ్ఞానము గలిగి నాయూరి జరుగు నన్ని వ్యవహారములయందును సంబంధము గలుగఁ జేసికొని యాపట్టణమందున్న న్యాయవాదులందఱకుఁ బరమాప్తుఁడై వారి తలలో నాలుకవలె సంచరించుచు దన ప్రజ్ఞాబలముచేతను, గార్యసాధనానిపుణత్వముచేతను నెంతటి న్యాయమూర్తులనైన వంచించి మోసముచేయ సమర్థత గలిగి యొక గొప్పగృహస్థునివలెను, ననేక వ్యవహారసంబంధములు గలవాఁడుగను, సంచరించుచుఁ గాలము గడపుచుండెను. ఇతఁడు జనులను వంచించుచు లేనిపోని వ్యవహారములను గల్పించి మాయోపాయములను బన్ని స్వహస్తనైపుణ్యముచే నెట్టివ్రాతలైనను లిఖితములైనను నిముసములో నించుకయిన భేదము గనుపింపకుండ వ్రాయగల సమర్థ

తగలిగి యెంతటి న్యాయమూర్తులనైన వంచించి మోసముచేయఁగలుగునట్లు సాక్ష్యులను సమకూర్పగల ప్రయోజకత్వముతో గ్రామమునసబుకోర్టు మొదలు హైకోర్టువఱకు ననేకవ్యాజ్యములలో సంబంధముగలిగి సంచరించుచుఁ, దాను న్యాయవాదిగాకపోయినను బ్రజ్ఞానిధులును న్యాయశాస్త్రపండితులును నగు న్యాయవాదులకన్న సహస్రాంశమెక్కుడు సామర్థ్యము గలవానివలె నటించుచు, న్యాయవాదుల యిండ్లకుఁబోయి వారికి వ్యవహారవిషయమునను గూర్చి బోధించి చెప్పుచు, ననుదినమును రాత్రిందివములు నిద్రాహారములకైన తీరికలేకుండఁ గాలము గడపుచుండెను. ఇతఁడు కల్యాణపురమునకు గ్రామపురోహితుఁడగుటచే నితని కాపట్టణమందలి జనులందఱితోను వైదికసంబంధమును, దాను జోక్యము గలుగఁజేసికొనని వ్యవహారము లేకపోవుటచే లౌకికసంబంధమును, గలిగి వైదికలౌకికముల యందద్వితీయమగు నసమానమైన ప్రజ్ఞావైపుణ్యముగలిగి యుభయధర్మవేత్తయై ప్రవర్తించుచుండెను. వ్యవహారసంబంధములను బట్టియు వ్యాజ్యములయందు వాదులపక్షముననో ప్రతివాదులపక్షముననో పనిచేయుచుఁ దమకు సహాయము చేయుచుండుట బట్టి న్యాయవాదులును, నపకారమాచరించి హాని చేయునను భయముచే గొందఱును, లంచములు మాటలాడి తమకు ధనముదొరకునట్లు చేయగలుగునను విశ్వాసముచేతను, నమ్మకముచేతను నుద్యోగస్థులును, దమ్ము వంచించి యెట్టియాపదలకుఁ బాలుసేయునోయని గొందఱును, నాపట్టణమున గలవారందఱు సోమన్నగారినిఁ దమ స్నేహితునిగా జూచుచుండిరి. మఱియు నితఁడు మంత్రశాస్త్రము దెలిసినవాఁడ ననియు వైద్యుఁడననియుఁ జెప్పుకొనుచు నాపట్టణమున భూతవైద్యమును జేయుచు నడిగినవారికెల్ల మంత్రోదకమును, విభూతియు యంత్రములను నొసఁగుచు వ్యాధులకుఁ జికిత్సలనుగూడఁ జేయుచుండుటచే నాతని ననేకులాశ్రయించుచు ననుదినమాతని యింటికనేకు

లు బోవుచుండిరి. కొందఱుమాత్ర మితఁడు దాంభికుఁడనియు, నట్టి దుష్కార్యమును జేయుటకైన నించుకైన వెనుదీయనివాఁడనియు, నిండ్లకు గన్నములు వేయించి దొంగతనములుగూడఁ జేయించుననియుఁ, బాపమునకించుకైన వెనుదీయక నట్టి ఘోరకార్యమునైనఁ జేయగలవాఁడనియుఁ, జెప్పుచు నీతని నొక విషసర్పమువలెఁ జూచుచుందురు. కాని యీతఁడతిశాంతముతో నెవ్వరేమన్నను నెవ్వరెంతదూషించినను గేలిచేసినను నించుకైన నాగ్రహము జెందక మందహాసముతో మిక్కిలి యణకువగలిగి సంచరించుచుండును.

మొదలియారు మిక్కిలి యోగ్యుఁడనియు నమాయకుఁడనియు, కట్టి సంగీతసాహిత్యాభిలాషియనియుఁ, బిళ్ళయి నాయుఁడుగారును రసికశిఖాగ్రగణ్యులనియు, నిమునములో సోమన్న గ్రహించి వారితో మిక్కిలి స్నేహసంబంధము గలిగి వర్తించుచుండెను. ఇతనికి బాయమ్మగారి యందాంతరంగికమైన నీర్ష్యయు, గోపమును గలదు; కాని తన యంతరంగద్వేషమును మాత్రమించుకైనఁ బ్రకటీకృతము చేయక సంచరించుచుఁ బూర్వాచారపరాయణత్వముచే నామె విద్యనేర్చి విద్యావతియైయుండుట కిష్టములేనివానివలె మాత్ర మప్పుడప్పుడు తనస్నేహితులతోఁ జెప్పుచుండెను. కల్యాణపురమునకు సమీపముననున్న దనతోటలోఁ బార్థసారథికిని మొదలియారు మొదలగు నీనలుగురికిని సోమన్న విందుచేయుటకు నిశ్చయించి వారినిఁ బిలిచెను. ఒక నాఁడుదయ మెనిమిదిగంటలకు సోమన్న రెండు గుఱ్ఱపుబండ్లు సిద్ధముచేసి పార్థసారథియుఁ దానును గలసి మొదలియారు మొదలగు నీనలుగురు బసదిగియున్న కాంతయ్యపాత్రునింటికివచ్చి తన నూతన స్నేహితులను దీసికొని తన యారామమునకుఁ బోయెను. కాంతయ్యయు బాయమ్మయు మాత్రము వారితో విందునకాహ్వానింపఁ బడకపోవుటచేఁ దమయింటనే యుండిరి. వీరు సోమన్నగారి తోట ప్రవేశిం

చునప్పటి కించుమించుగా పదిగంటలు కావచ్చినది. అదివఱకే రెండెడ్లబండిలో నెక్కిన నలుగురు భోగమువాండ్రచ్చటకు వచ్చియుండిరి. పార్థసారథి యావేశ్యలను జూచినతోడనే యంతకుఁబూర్వమే వారితోఁ బరిచయముగలవానివలె నటించుచు వారియోగక్షేమముల నడిగి తెలిసికొని మొదలియారుగారిని, శెట్టిగారిని, బిళ్ళగారిని, నాయుఁడుగారిని వారియొద్దకుఁ దీసికొనిపోయి వారినిగూర్చి యావేశ్యలతో ననేకవిధములుగా శ్లాఘించి శెట్టిగారు సంగీత సాహిత్య చక్రవర్తియనియు, బిళ్లగారును నాయుఁడుగారును సంగీతాభినయ శాస్త్రపారంగతులనియు, మొదలియారుగారు ప్రసిద్ధివడసిన బారిష్టరనియుఁ, జెప్పెను. ఆవేశ్యలు వారినిఁజూచి సిగ్గునభినయించుచు నంతఃపురాంగనలవలె మొగములు ద్రిప్పుకొని మందహాసములు చేయుచు నూరకుండిరి. సోమన్నగారు భోజనప్రయత్న మెంతవఱకుఁ జరిగినదోఁ దెలసికొనవలయునని వంటశాలలోనికిఁ బోయి యైదునిమిషములలో నీవేశ్యలును మొదలియారు మొదలగువారును నున్నప్రదేశమునకు వచ్చి వారందఱు దనయాప్తస్నేహితులు గావున వారిని జూచి సిగ్గుపడవలసిన యవసరము లేదని వేశ్యలతోను వారు వేశ్యావృత్తిని ద్యజించి చిన్నతనమునుండియు సంసారస్త్రీలవలె గౌరవముగాఁ గాలము గడపుచుండుటచే నట్లు సిగ్గుపడుచున్నారని మొదలియారు మొదలగువారితోను జెప్పి యొక మామిడిచెట్టుక్రింద తివాచీవేయించి దానిపై వారినందఱిని గూర్చుండబెట్టి "ఇప్పుడేవత్తు" నని యావలకుఁ బోయెను. పార్థసారథి పూర్వపరిచితుఁడగుటచే నావేశ్యలతోఁ జనువున మాటలాడుచుండెను. ఆవేశ్యలలో నొకతెకు నలువదిసంవత్సరములును, నింకొకతెకు ముప్పదిసంవత్సరములును, మూడవదానికి పదునెనిమిది సంవత్సరములును, నాల్గవదానికి పదునారుసంవత్సరములును వయసుగలదు. నలువది సంవత్సరములు వయసుగలది సోమన్న

గారి యర్ధాంగి యనియు, ముప్పదిసంవత్సరముల వయసుగలది దాని చెల్లెలనియుఁ, దక్కిన వాండ్రిద్దఱును సోమన్నగారి కోమాటెకాలనియు వాండ్రు వేశ్యాజాతియందు జన్మించినను కులాంగనల కంటె నెక్కువ గౌరవప్రతిష్ఠలతోఁ గాలము గడుపు చున్నారనియుఁ జక్కగా పాడనేర్తురనియు భోగము మేళములకుఁ బోనివారనియు ననేకవిధములుగా వారినిగూర్చి పార్థసారథి మొదలియారుగారితోను వారిస్నేహితులతోను ననేకవిధములుగా శ్లాఘించి చెప్పెను. కాని యీనలుగురివేశ్యలతోఁ గలసి యచట గూర్చుండియున్న మొదలియారు మొదలగు నీనలుగురికిని దమ్మెవ్వరైన జూతురన్న భయము మాత్రము లేకపోలేదు. సంగీతశాస్త్రాభిమానముచే శెట్టిగారును బిళ్ళగారును మాత్రము మనసులలోఁ దమకెట్టిభయమును సందియమును నున్నను పైకిమాత్రము మందహాసము చేయుచు నావేశ్యలతో ముచ్చటించుచునేయుండిరి. ఇట్లొకగంటకాలము గడపినతరువాత సోమన్నవచ్చి మొదలియారుగారిని, వారి స్నేహితులను, పార్థసారథిని భోజనమునకుఁ దీసికొనిపోయి వనభోజనము చేయునప్పుడు 'జాతినియమమనావశ్యక' మని ధర్మశాస్త్రములు చెప్పుచున్నవని చెప్పి యందరును గలసి భోజనమునకుఁ గూర్చుని ముచ్చటలాడుకొనుచుఁ దనకోమాటెకాలనుగూర్చియు వారిసౌందర్యమునుగూర్చియు వారి యుచితజ్ఞతనుగూర్చియు వారిసంగీతాభినివేశమునుగూర్చియు నున్నవియు లేనివియుగల్పించి చెప్పుచు విందారగించిరి. తరువాతఁ దాంబూలములు వేసికొని యొకచెట్టుక్రింద విశ్రమించియున్న కొంతసేపటికి శెట్టిగారును, బిళ్ళగారును, వారిసంగీతము వినవలయునని సోమన్నగారితో జెప్పిరి. సోమన్నగారు దనకోమాటెకాలప్పుడు సంగీతము పాడుటకు యంత్రసాధనములతో వచ్చియుండకపోవుటచే నప్పుడు వీలుగానుండదనియు మఱియొకనాఁడు దప్పక సంగీతము పాడింతుననియు జెప్పి యప్పటికా వేశ్యలు

సంకేతము పాపసంఘఁ దప్పించెను. తరువాత వీరందఱు గలసి యొక్కొక్క రూపాయి మేజుపెట్టి పేకయాడుటకారంభముచేసి మొదలియారుగారిని శెట్టిగారిని నాటకుఁ బురికొల్పిరి. మొదలియారదివఱకెన్నఁడును జూదమాడి యెఱుఁగనివాఁడగుటఁ బట్టియు శెట్టిగారు పేకాటయందంత సమర్థుఁడుకాకపోవుటచేతను నాయాటకించుకయు సమ్మతించలేదు. కాని నాయుఁడుగారును, బిళ్ళగారును, వినోదార్థము పేకాడుట దోషముకాదనియుఁ, బేకాడుట చేతకాదన్నచోఁ దమరసికత్వమునకు భంగముకలుగుననియుఁ, దలఁచి యొప్పుకొనిరి. అంత నావేశ్యలలో ముగ్గురును, శెట్టిగారును, బిళ్ళగారును, బేకాడుటకారంభముచేసిరి. సోమన్నగారొద్ద కూర్చుండి పిళ్ళగారికిని నాయుఁడుగారికిని నాటలో సలహాలిచ్చుచుండెను. పార్థసారథి యావేశ్యలతోఁ గలసి నవ్వుచు నర్మగర్భముగా మాటలాడుచు నానందించుచుండెను. మొదలియారును సోమన్న యర్ధాంగియగు నావేశ్యమాతయుఁ గొంచెముసేపు మాపులతో నేమేమియో మాటలాడుకొని యొకరినిఁ జూచి యొకరు మందహాసముచేసికొనుచు గూరుచుండిరి. పిళ్ళగారియొద్దను నాయుఁడుగారియొద్దను నప్పుడు సొమ్ములేకపోవుటచే సోమన్న వారికిఁ బెట్టుబడిపెట్టి పేక యాడించెను. శెట్టిగారు మాత్రము నొకచెట్టుక్రింద గూర్చుండి యథేచ్ఛముగా నిద్రపోవుచుండిరి. రాముఁడు వంటసావడిలోఁ జేరి యథేచ్ఛముగా భోజనముచేయుచు వంటచేసిన పదార్థములనెల్ల ఖర్చుపఱచెను. ఇట్లు సాయంత్రము నాలుగుగంటలవఱకు పేకాడుకొని శెట్టిగారునుఁ, బిళ్ళగారునుఁ, గలసి నూఱురూపాయీలవఱకు నావేశ్యలకర్పణముచేసికొని తరువాత బండ్లెక్కి యింటికి తిరిగివచ్చుటకుఁ బ్రయాణమైరి. సోమన్న తనకుఁ బనియున్నదని చెప్పి ముందుగా వారిని విడిచిపోయెను. పార్థసారథియు, వేశ్యలును, మొదలియారుగారును మొదలగు మనకథానాయకులునుఁ బండ్లెక్కి యింటికి దిరిగివచ్చిరి.

మఱునాఁడుదయమునఁ బార్థసారథి మొదలియారుగారికినిఁ, బిళ్ళగారికని, శెట్టిగారికని, నాయుఁడుగారికినిఁ, గాంతయ్యకును, బాయమ్మగారికి

ని, వారి సేవకులకును, శ్రీనివాసమునకును, నాటకమున కాహ్వానపత్రికలను టికెట్లును పంపెను. ఆరాత్రి సీతాకళ్యాణనాటకమాడుటకు నిశ్చయింపఁబడినది. పార్థసారథి సోమన్నతోఁ గలసి యాపట్టణమునందున్న పెద్దమనుష్యులనెల్లఁ జూచి నాటకమునకు రమ్మని పిలిచెను. నాటకము చూడఁబోవుట కుచితమయిన వస్త్రములను సిద్ధముచేసికొని మొదలియారుగారు మొదలగువారు సిద్ధముగానుండిరి. బాయమ్మ చక్కగా నలంకరించుకొని తనభర్తయగు కాంతయ్యను నింటికిఁ గాపుంచి శ్రీనివాసమును దీసికొని నాటకమునకుఁ బోవ సిద్ధముగానుండెను. రాత్రి భోజనమయినతరువాత వీరందఱు బండ్లెక్కి నాటకశాలకుఁ బోయిరి. బాయమ్మ స్త్రీలుకూర్చుండుటకేర్పడిన ప్రదేశమునఁ గూర్చుండెను. మొదలియారుగారును, శెట్టిగారును, నాయుఁడుగారునుఁ, బిళ్ళగారును ముందుకుర్చీలపైఁ గూర్చుండిరి. శ్రీనివాసమునకు స్థలములేకపోవుటచే వీరు నలుగురు కొంతసేపు శ్రీనివాసమును తమతొడలపైఁ గూర్చుండఁబెట్టుకొని నాటకమును చూచుచుండిరి. బాయమ్మగారు కూర్చున్నప్రదేశమున సోమన్నగారి వేశ్యాకుటుంబము కూడ గూర్చుండియుండెను. అంత నాటకమారంభమై రెండంకములు సమాప్తమయినతరువాత మొదలియారుగారు శ్రీనివాసమును తీసికొని యావలకుఁ బోయిరి. శ్రీనివాసము దాపుననున్న మిఠాయియంగడిలోఁ గొంతమిఠాయి కొనిపెట్టుమని మొదలియారుగారిని నడిగెను. శ్రీనివాసముపై మొదలియారుగారికి మిక్కిలి వాత్సల్యముకలిగి యుండుటచే నాతనికిఁ గావలసినవన్నియుఁ గొనిపెట్టి యాయన చల్లగాలికటునిటు తిరుగుచుండెను. అప్పుడు శ్రీనివాసము నాటకపుపాకదగ్గర నిలచి వేడుక చూచుచున్న యొకమనుష్యుని మొలలో వ్రేలాడుచున్న వెండిగొలుసునుఁ ద్రెంపుకొని నాటకపుశాలలోనికిఁ బాఱిపోయెను. ఆమనుష్యుఁడు తనగొలుసు పోయినదని పోలీసువారితోఁ జెప్పి యొక కుఱ్ఱవాఁడు దానినపహరించి నాటకపుపాకలోనికిఁ బోయెనని ఫిర్యాదుచేసెను. మొదలియారుగారిది యంతయుఁ జూచుచుండుటచే శ్రీనివాసము చిన్నతనముచే నీపనిఁ జేసినాఁడని గ్రహించి తానా

గొలుసు నిప్పించెదనని నతని నొప్పించి నాటకపుపాకలోనికిఁ బోయి శ్రీనివాసమునుఁ బిలచి యాగొలుసాతనికిచ్చివేయమని చెప్పెను. కాని శ్రీనివాసమా గొలుసియ్యఁగనని పెద్దపెద్దకేకలుపెట్టి యేడ్చుచుఁ దనతల్లియొద్దకుఁ బోయి యేమేమో చెప్పుటకుఁ బ్రయత్నించెను. కాని శ్రీనివాసము స్త్రీలకేర్పఱుపఁబడిన స్థలమునకుఁ బోకుండ నడ్డగింపఁబడుటచే నిదియంతయు బాయమ్మ దూరమునుండి చూచి యీవలకు వచ్చి మొదలియారుగారివలన సంగతియంతయుఁ దెలిసికొని తనకుమారుఁడు చేసినపనివలనఁ దనకుఁ దటస్థమయిన యవమానమునకు మిక్కిలి విచారించుచు నాటకము చూడనొల్లక శ్రీనివాసమును తీసుకొని యింటికిఁ బోవుటకాయత్తపడెను. రాత్రివేళ నామె నొంటరిగా నింటికిఁ బంపించుటుచితముకాదని యూహించి తానుగూడ నామెతో నింటికిఁబోయి యామెను శ్రీనివాసమును నింట దిగవిడిచి తనస్నేహితులనుఁ గలసికొనుటకుఁ దిరిగి నాటకపుపాకకు రానిశ్చయించుకొని మొదలియారామెతోఁ బోయెను.

తరువాత మరునాఁడు తనకుఁ బనియున్నదని చెప్పి సోమన్న పార్థసారథియొద్ద సెలవుపుచ్చుకొని శెట్టిగారితోను, నాయుఁడుగారితోను, బిళ్ళెగారితోనుఁ జెప్పి యింటికిఁ బ్రయాణమాయెను. తమ స్నేహితుఁడగు మొదలియారుగారు బాయమ్మతో నింటికిఁ బోయినసంగతి వీరెఱుఁగుదురు గావునఁ దామును సోమన్నతోఁ గలసి కొంతదూరము వచ్చెదమని ప్రయాణమై పార్థసారథితోఁ జెప్పిపోయిరి. ఇట్లు వీరు ముగ్గురును సోమన్నయు నాతని నలుగురు వేశ్యలును బండ్లెక్కి కొంతదూరము పోయినతరువాత సోమన్న వారినిఁ దమయింటనే యారాత్రి బరుండి మరునాఁడుదయము వేకువతో నింటికిఁ బోవచ్చునని చెప్పి తనవేశ్య యింటికిఁ దీసికొనిపోయి వారినచ్చట బరుండఁబెట్టెను. సోమన్న చేసిన సదుపాయమునకు మిక్కిలి సంతసించుచు నావేశ్యల యాదరణమునకు నానందించి యచ్చటనే పరుండి నిద్రపోయిరి. అంత మొదలియారు బాయమ్మను, శ్రీనివాసమును నింట దిగవిడచి తనస్నేహితులకొఱకు నాటకపుపాకకడకు వచ్చెను. అప్పటికి నాటకము పూర్తియాయెను. నాటకు

లందఱు దీపములు లీసివేసి తమ బసలకుఁ బోయిరి. మొదలియారు నాటకము ముగింపఁబడినదని తెలుసుకొని తనస్నేహితుల కొఱకటునిటు దిరిగి చూచి వారినెచ్చటను గమనింపలేకపోవుటచే నింటికిఁ దిరిగిపోవుచుండెను. అప్పుడు రాత్రి యించుమించుగా రెండుగంటలు కావచ్చినది. ఆకసమంతయు మేఘములచే దట్టముగాఁ గ్రమ్మఁబడి యేవంకఁ జూచినను నంధకారబంధురముగా నుండెను. దూరమున నక్కడక్కడ మిణుకుమిణుకు మని దీపములకాంతిమాత్రము గొంచెముగాఁ గానుపించుచుండెను. చోరులును విటులును దక్క నక్కడవారెవ్వరును సంచరింపకుండెడి యాసమయమున మన మొదలియారొక్కడు మెల్లగా నడచుచు దారినిబోవుచుండ నాతనికొక యెద్దుబండి యెదురయ్యెను. అప్పుడా బండిలోనుండి యేబది సంవత్సరముల వయసుగల యొకపురుషుఁడు క్రిందికి దిగి తనకారాత్రి బరుండుట కెచ్చటనైన బసదొరకునా యని యడిగి తాను రాత్రిభోజనము చేసి బండికట్టించుకొని బయలుదేరుపఱకే ప్రొద్దుపోయినదనియు నాపట్టణము వద్ద సమయములోఁ బ్రవేశించుట కిష్టములేక నూరువెలుపల గాటీపాకయొద్ద బండినిలిపి యప్పుడే వచ్చితిననియుఁ దాను దనయన్నగారి కొమార్తెకు వివాహముచేయనెంచి వరాన్వేషణమున కక్కడికి వచ్చితిననియుఁ జెప్పెను. మొదలియారుపకారబుద్ధి గలవాఁడును శరణాగతరక్షకుఁడును గావునఁ దనబసలో నారాత్రి నిద్రపోయి యుదయమున బోవచ్చునని చెప్పెను. అంతనాతఁ డపరిమితానందమును బొంది మొదలియారుతో నాతఁడు బసదిగియున్న బాయమ్మగారి యింటికిఁ బోయి వీధిలో బండినాపి యందులో గూర్చునియున్న ముప్పదియేండ్లవయసుగల సకేశి యగు నొక వితంతువును పదకొండు సంవత్సరముల ప్రాయముగల యొకచిన్నదానిని క్రిందకు దింపెను. మొదలియారు వీధితలుపు గొట్టి రాముని బిగ్గరగా గేకలుపెట్టి పిలువ నాతఁడు పలుకలేదుగాని కుప్పుసామిమాత్రము గండ్లునలుపుకొనుచు వచ్చి తలుపు తెఱచెను. తరువాత బండివాఁడును నాబండితో వచ్చిన పెద్దమనిషియు నొక కావడిపెట్టెను నొకమూటను నొక గోనెసంచిమూట

ను బండిలోనుండి క్రిందికి దింపి మెల్లగా నింటిలోపలికి దీసికొనిపోయి యొక వాకిటిలో నుంచిరి. తరువాత నాపెద్దమనిషి యావితంతువును "వదినా" యని బిలుచుచు నామెను నాపిల్లను లోపలకుఁ దీసికొనిపోయి తమ సామానంతయు నుంచఁబడిన వాకిటిలో బరుండిరి. మొదలియారుగారు దమ గదిలోనికిఁ బోయి తాను దొడిగికొనియున్న దుస్తును దీసి శెట్టిగారు మొదలగువారింకను రాలేదాయని యడిగి వారు ముప్పురును, రాముఁడును, సోమన్నగారితో వారియింటికిఁ బోయిరనియు, వారారాత్రికక్కడనే నిద్రపోయి మరునాఁడు వేకువతో వచ్చెదరనియుఁ, గుప్పుసామివలనఁ దెలిసికొని వీధితలుపు బిగించమని తన సేవకునితోఁ జెప్పి పరుండి నిద్రపోయెను.

శెట్టిగారును, నాయుఁడుగారును, బిళ్ళగారును, సోమన్నగారి వేశ్యయింటఁ జెరియొకమంచముమీఁదను బరుండి నిద్రపోవుచుండిరి. రాముఁడు వీధిచావడిలో నొక చాపమీఁద యొడలెఱుంగక యెందరెంత కొట్టిపిలచి లేపినను నించుకైనఁ గదలక నిద్రపోవుచుండెను. కాని యాయింటనున్న వేశ్యలు నలుగురును, సోమన్నగారును మాత్రము నిద్రపోక నేమేమో మెల్లగా మాటలాడుకొనుచు, నవ్వుకొనుచు నారాత్రియంతయు మేలుకొనియే యుండిరి. ఆవేశ్యలలో పెద్దదానిపేరు శ్రీహరి. దానిచెల్లెలుపేరు శోభనాచలము. సోమన్నగారి పెద్దకొమార్తెపేరు మాణిక్యము. ఆయన చిన్నకొమార్తెపేరు సుందరి. సోమన్నగారేవిధముగానైనఁ దనకొమార్తెల నిద్దరను బిళ్ళగారికిని, నాయుఁడుగారికినిఁ, దన మరదలిని శెట్టిగారికిని, గట్టిపెట్టి వారి ముప్పురను మొదలియారుగారిని గూడఁ దనవలలో వేసికొనవలయునని యాలోచించుచు నారాత్రియంతయుఁ దన కార్యమును నెరవేర్చుకొనుటకుపాయముల నన్వేషించుచు నావేశ్యలతోఁ దనయభిప్రాయమును జెప్పి చర్చించుచు నించుకైన నిద్రజెందక మేలుకొనియుండెను. శెట్టిగారు నిద్రపోవుచున్నవానివలె గంట్లుమూసికొని మంచముపై బరుండియున్నను నిద్రపట్టకపోవుటచే నేమేమో నాలోచించుచు గంటలు లెక్కపెట్టుచుండెను. అంతకుఁ బూర్వము

సోమన్నగారితోటలోని వేశ్యలను జూచిన యంశమును వాండ్రసరససంభాషణమును, వినయవిధేయతలును, ఉచితప్రవర్తనమును, యోగ్యతయు సౌందర్యమును దలచుచు, వారిసంగీతమును వినవలయునని యుత్సాహముతో నేమేమో మనసులో నాలోచించుకొనుచు, సోమన్నగారి స్నేహభావమునకును, రసికత్వమునకును, వ్యవహారనైపుణ్యమునకును, కార్యాచరణచతురత్వమునకును, సంతసించుచుఁ దెల్లవారులోపలఁ దామితరులకంటఁబడకుండ నచ్చటనుండియింటికి బోకుండినచోఁ దమ్మెక్కువారైనఁ జూతురను సందియముచే భయపడుచుఁ, దమ ప్రాణమిత్రుఁడగుమొదలియారేమిచేయుచున్నాడో యనిమనసులోఁ దలచుకొనుచు బాయమ్మ విద్యానైపుణ్యమును సంగీతజ్ఞానమును సౌందర్యమునుగూర్చియాలోచించుచు శెట్టిగారాత్రియంతయు నిద్రపోలేదు. అంతనాలుగుగంటలయిన సంగతి దెలిసికొని శెట్టి మంచముపైనుండి లేచినాయుడుగారిని బిళ్ళగారి నిలేపి సోమన్నగారితోఁ జెప్పి యాయనయు నావేశ్యలును దెల్లవారినతరువాత నచ్చటనే దంతధావనాది కాలోచితములు దీర్చికొని కాఫీపుచ్చుకొని బసకుఁ బోవచ్చునని యెంతచెప్పినను వినకఁ బ్రయాణమై బసకుచనిరి. వీధిసావడిలో నొడలెఱుంగక నిద్రపోవుచున్న రామునిలేపి తమతోఁ దీసికొనిపోవలయునని వీరుమువ్వురు ననేకవిధములుగా నెంతకొట్టిలేపినను నాతఁడించుకయుఁ గదలలేదు. ఇట్లు రాముని లేపుప్రయత్నమున నొకయరగంట కాలమకడవ్యర్థాయాసముతోఁ గడపి యాతని దమతో దీసికొనిపోవుట కాతనిఁ దామిద్దఱు మోసికొనిపోవు సాధనము దప్ప నుపాయాంతరము లేకుండుటచేఁ దెల్లవారునన్న భయమున వారుమువ్వురును దమ బసకు దిరిగివచ్చిరి. మొదలియారుగారిని వారు గలసికొని రాత్రిసోమన్నగారి వేశ్యయింట నిద్రించిన సంగతియు వారుదమకుఁ జేసిన గౌరవమును, సదుపాయమును, గూర్చియు, సోమన్న స్నేహపాత్రతనుగూర్చియు, శ్లాఘించుచుఁ జెప్పిరి. మొదలియారుగారు సోమన్న మిక్కిలి యుచితజ్ఞుఁడనియు, సరసుడనియు, నేర్పరియనియు, కార్యాచరణనిపుణుఁడనియు, వ్యవహారవేత్తయనియు,

నాతనిస్నేహము దామనుష్యముగాఁ జేయఁదగినదనియుఁ, జెప్పిరి. ఇట్లీసలు
గుచు మాటలాడుకొనుచుండగాఁ దెల్లవారినది. రాత్రిబండిపై నెక్కి వచ్చిముం
దు సావడిలో నిద్రపోయిన పెద్దమనిషియు, నాతని వదినెయు, నాకన్యయు,
నిద్రమేల్కొని మొదలియారుగారిని వారిస్నేహితులను జూచి రాత్రి దమకు
బసనుపాయ మొసఁగినందు కనేకవిధములుగా శ్లాఘించి తామాదిన మాగ్రా
మమం దెక్కడనైన నొకబస కుదర్చుకొని యచ్చట కొన్నిదినము లుందుమ
ని చెప్పిరి. తరువాత నావితంతువును నాకన్యయు నింటిలోపలికిఁ బోయి బా
యమ్మను గలిసికొని యామెతో మాటలాడుచు నొకగంటకాల మక్కడ గడ
పిరి. నామనుష్యుఁడు మొదలియారుగారితోఁ దాను బ్రాహ్మణుఁడ ననియు
నావితంతువు దనయన్నగారి భార్యయనియు నాకన్యక దన యన్నకొమార్తె
యనియుఁ దనభార్య నాలుగుసంవత్సరములక్రిందట విశూచిజాడ్యమువలనఁ జ
నిపోయినదనియుఁ దాను బీదవాఁడగుటచేతను నేఁడ్లు గడచినవాఁడగుటచే
తను దిరిగి వివాహమాడఁజాలకఁ దనయన్నభార్యను పిల్లలను గనిపెట్టుకొని
యున్నాననియు దనయన్నగారి కీపిల్లయు నీపిల్లకన్నఁ బెద్దవాఁ డొకకొ
మారుఁడును నున్నాఁడనియు నీపిల్లకుఁ బెండ్లి చేసి యాకన్యాశుల్కము వలనఁ
దనయన్న కొమారు నొకయింటివానినిఁ జేయవలసిన బాధ్యతఁ దనయందు
న్నదనియుఁ, ధనమునకుఁ దనయన్నకొమార్తె నమ్ముటకుఁ దన కెంతయిష్టము
లేకపోయినను వంశము నిలబెట్టుకొనుటకు దనయన్న కొమారునికి వివాహ
ముచేయుట విధాయికము గావునను దాము పేదవాండ్రగుటచేఁ గన్యాశు
ల్కమియ్యకుండ నాతనికి వివాహము చేయగలుగుట దటస్థము గాదనియుఁ
మొదలుగాగల దన గృహచ్ఛిద్రములనెల్ల జెప్పెను. అప్పుడు మొదలియారు
గారును వారిస్నేహితులును గన్యాశుల్కమును గూర్చియు వరశుల్కమును
గూర్చియు వానివలన దేశమునకుఁ దటస్థమగుచున్న దుస్థితిని గూర్చియుఁ జ
ర్చించుచుఁ బేదవాండ్రలో గన్యాశుల్కమియ్యకుండ బురుషులకును, ధనవంతు
లలో వరశుల్క మియ్యకుండ గన్యలకును వివాహములు చేయ నేరరనియు, ని

ట్లు ద్రవ్యమునకు గన్యల నమ్ముకొనునట్టియు, నమితముగా వరశుల్కములను గొని ధనికులు దమపుత్రులకు వివాహములు చేయునట్టియు, దురాచారములు రూపుమాపినఁగాని మనదేశ మెన్నటికిని నభివృద్ధికి రాదనియుఁ జెప్పుకొని వరశుల్కములను గూర్చియుఁ గన్యాశుల్కములను గూర్చియుఁ జర్చించిరి. దేశాభివృద్ధి కొఱకును వంశాభివృద్ధికొఱకును నైహికాముష్మిక సుఖప్రాప్తికిని స్త్రీపురుషులకు వివాహము ముఖ్యధర్మమనియు, స్త్రీపురుషుల కత్యావశ్యకమగు నిట్టి ప్రాపంచికధర్మకార్యానుష్ఠానమును గేవలము ధనలోభమున మనదేశములో ననేకులు ధర్మబాహ్యమగునట్లొనర్చుచున్నారనియు, శెట్టిగారుసెలవిచ్చిరి.

అప్పుడు లోపలినుండి యాకన్యక మొదలియారుగారు మొదలగువారును దన పినతండ్రియు గూర్చుని మాటలాడుచున్న స్థలమునకు వచ్చి యాతనితో నేమో మాటలాడవలయునని దగ్గరనిలబడెను. ఆకన్యకకు పదకొండుసంవత్సరముల ప్రాయముండునని యిదివఱకే చెప్పఁబడినది. ఆకన్యక చామనచాయగలిగి కొంచెము పొడవుగా విశాలమగు నేత్రములతో సలక్షణముగా నుండెను. మొదలియారుగా. రాపిల్లను జూచి కూర్చుండుమని చెప్పి యాపిల్లనుఁ దనయొద్దఁ గూర్చుండబెట్టుకొని తన హృదయమునఁ బొడమిన దయయు గరుణమును నుప్పొంగ "అమ్మాయీ! నీ పేరెవ్వ" రని యడిగి యాపిల్ల "నాపేరు సీతమ్మండి" యని చెప్పగా విని "యీపిల్లనా? కన్యాశుల్కమునకు వివాహముచేయఁ దలపెట్టి ధనమునకు విక్రయింప నిశ్చయించుకొన్నా" రని యాకన్య బినతండ్రి నడిగెను. అందుకాతఁడు దనగండ్ల నీరు గార్చుచుఁ దన దరిద్రము దన్నట్లు చేయఁ బ్రేరేపించుచున్నదనియుఁ దనయన్నకొమారునకు వివాహము చేయవలసిన బాధ్యత తనయందుండుటచే దానినీతిబాహ్యమైనట్టియు నధర్మహేతువైనట్టియుఁ గార్యమును జేయవలసివచ్చినదని కండ్ల నీరుగార్చుచుఁ జెప్పెను. కరుణాసముద్రుఁడగు మొదలియా రాపెద్దమనిషి చెప్పినమాటలను విని నోరెఱుఁగని యాపిల్ల నమ్ముచున్నారను నంశమును దలచుకొనుచుఁ దానును గన్నీరుగార్చెను. శెట్టి

గారును, బిళ్ళగారును, నాయుడుగారును మిక్కిలి జాలిపడిరి. తరువాత నీపెద్దమనిషియు నాతని వదినయు నాకన్యయు నొక కూలివానిచేఁ దమసామానంతయు బట్టించుకొని "తిరిగి తమదర్శనము జేసెద" మని మొదలియారుగారియొద్దను వారి స్నేహితుల యొద్దను సెలవు దీసికొని వారు బసదిగియున్న బాయమ్మగారి యింటికి సమీపముననున్న యొక బ్రాహ్మణుని యింట బసచేసిరి.

సోమన్నగారి వేశ్యయింట నిద్రపోవుచున్న రాముఁ డుదయమెనిమిది గంటలవఱకు లేవనేలేదు. సోమన్నగారేడుగంటలకే కాలోచితములను దీర్చుకొని కాఫీ త్రాగి బయలుదేరి యావలకుఁ బోయిరి. రాముఁడు మేల్కొనిన తరువాత సోమన్నగారి కొమార్తె లిద్దరు నాతని మిక్కిలి యాదరముతో గాగవించి చద్దియన్నము పెట్టి రెండుగంటలు తమయొద్ద గూర్చుండఁబెట్టుకొని నాయుఁడుగారిని గూర్చియు బిళ్ళగారిని గూర్చియు నడిగి వారు మిక్కిలి రసికులనియు, యోగ్యులగు పురుషరత్నములనియు, సంగీతకళాగహాస్యవిదులనియు, నెంతెంతో శ్లాఘించిరి. అప్పుడా వేశ్యల పినతల్లియగు శోభనాచలమును తల్లియగు శ్రీహరియు నచ్చటికి వచ్చి "రామన్నతో నేమిమాట్లాడుచున్నా" రని తనకుమార్తెల నడిగి శెట్టిగారి యోగ్యతను గూర్చియు, మొదలియారుగారి గౌరవప్రపత్తిని గూర్చియు ముచ్చటించిరి. ఇట్లీనలుగురు వేశ్యలు గలసి రామునితో మొదలియారుగారినిగూర్చియు నాయనస్నేహితులను గూర్చియు హాస్యమాడుచు నవ్వుచు నర్మగర్భముగాఁ దమకు వారియందు గల ప్రేమానురాగమును బ్రకటించుచు మాటలాడి యాతనికిఁ దాంబూలమును నొకరూపాయియు నిచ్చి పంపివేసిరి. రాముఁడారూపాయి దీసికొని యపరిమితానందముతో మొదలియారుగారు బసదిగియున్న యింటికి వచ్చునఱకు మధ్యాహ్నము పదకొండు గంటలైనది. మొదలియారును శెట్టియు నంతవఱకు నింటికి రాకపోయినందుకు రామునిపై నాగ్రహపడిరి గాని యాతఁడు చెప్పిన మాటలపై నూరకుండిరి. తరువాతఁ దనయజమానులు భోజనము

సి విశ్రమించి యున్న సమయమున వారియొద్దఁ జేరి యావేశ్యలకు మొదలియారుగారియందును శెట్టిగారిపట్లను బిళ్ళగారియెడలను నాయుఁడుగారి విషయమునను గలగౌరవమును గొనియాడుచు సోమన్నగారి గొమార్తెలిరువురిసౌందర్యమును వారికి నాయుఁడుగారియందును బిళ్ళగారియెడలను గలయనురాగమును తనకుఁ దోచినట్లు వర్ణించియున్నవియు లేనివియుఁ గూడఁ జెప్పెను. శెట్టిగారికిని నాయుఁడుగారికిని బిళ్ళగారికిని నావేశ్యల సంగీతము వినవలయునని మిక్కిలి కుతూహలముఁ గలదు. కాని యీసంగతి బాయమ్మకుఁ దెలియుటకు వీరికెంతమాత్రము నిష్టములేదు. తామాపట్టణములోఁ బెద్దగృహస్థుల స్నేహము సంపాదించి సగౌరవముగా సంచరించుచుండుటచేఁ దాము సోమన్నగారితో నాయన వేశ్యయింటికిఁ బోయినసంగతి యితరులకుఁ దెలిసినయెడలఁ దమకు గౌరవహాని చేకూరునన్న సందేహమును భయమును గూడ వీరికి లేకపోలేదు. కావున రామునితోడను గుప్పుసామితోడను యీవిషయమును గూర్చి యెవ్వరితోను జెప్పవద్దని మొదలియారుగారును వారిస్నేహితులు ముగ్గురునుగూడఁ జెప్పిరి.

తరువాత సాయంకాలము నాలుగుగంటలకు సోమన్నగారు మొదలియారుగారు మొదలగు నీనలుగురుస్నేహితులును బసదిగియున్న బాయమ్మగారి యింటికివచ్చి తన నూతనస్నేహితులతోఁ గొంత ముచ్చటలాడి వారితోఁ గలసి షికారునకు బయలువెడలెను. వీరు పార్థసారధి బసకుఁబోయి యచట నాతనిఁ గలసికొని యాతని దమవెంటఁదీసికొని కొంతదూరము షికారుతిరిగి సూర్యుడస్తమించు సమయమునకు సోమన్నగారి ప్రేరణమున నాతనివేశ్యయింటికిఁబోయిరి. అప్పుడావేశ్య లలంకరించుకొని తమలోఁ దామేమేమో చెప్పుకొనుచు నవ్వుచు గూరుచుండి వీరినిఁ జూచినతోడనే మిక్కిలి వినయభయభక్తులతో గౌరవించి సిగ్గునభినయించుచు నూరకుండిరి. పార్థసారధి వీరికిఁ బూర్వపరిచితుఁడును, స్నేహకోటిలోనివాఁడును గావున నాతఁడు వారితోఁ జనువున మాటలాడుచు వారిని గేలిసేయుచుఁ దన రసికత్వమును ప్రక

టింప మొదలుపెట్టెను. సోమన్నగారు దన గృహమేధిపదవిని విశదీకరింపు చుఁ దన గృహయాజమానత్వపదవి కుచితమగు రీతిని దన వేశ్యయొక్కయు, తన ముద్దుకొమాతెలయొక్కయు, గృహనిర్వాహకత్వమందలి నేమరితనమునకును, నజ్ఞానమునకును వగచుచు విసుగుకొనుచు, వారిని స్నేహభావముతో ప్రేమానురాగగర్భితములగు మాటలతో సాదించుచు, నాయింటనున్న కుర్చీలు బల్లలు మొదలగువానిని సవరించి శుభ్రపఱచి యుచితస్థలములయందు వానినునిచి దీపములను వెలిగించి పడకటిండ్లనెల్ల యథోచితముగా నలంకరించి యిల్లంతయుఁ దిరుగుచు సంసారసంబంధమగు కార్యములనెల్ల మిక్కిలి శ్రద్ధతోఁ గతఁజ్ఞాకతఁజ్ఞభేదము నించుకైనఁ బాటింపకఁ జేయుచుండెను. శెట్టిగారికిని, బిళ్ళగారికిని, నావేశ్యలసంగీతమును వినవలయునని దృఢమైన కోర్కెగలదు; కాని వారెన్నిపర్యాయములు సంగీతము వినవలయునని దమయభిప్రాయములను బ్రకటించి సంగీతము పాడుమని వారినెన్నివిధములఁ గోరినను, వారు సిగ్గునభినయించుచు "సంగీతమును పాడెద" మని చెప్పుచుఁగాలయాపనముచేసిరేగాని, యించుకైనఁ బాడలేదు. నాయుఁడుగారికి వారితో ముచ్చటలాడుచు వారినిఁజూచి యానందించుచుఁ దన యోగ్యతనుగూర్చియుఁ, బ్రయోజకత్వమునుగూర్చియుఁ, జెప్పుకొనుచుఁ దనయశ్వ శిక్షానిపుణత్వమును గుణించియుఁ, దనకుఁ వ్యాయామ క్రీడలయందుఁగల యభినివేశమునుగూర్చియుఁ దానుచెన్నపట్టణమున వ్యాయామక్రీడలలో సంపాదించుకొనిన ప్రఖ్యాతిని గూర్చియు, ననేకవిధములుగా వర్ణించి చెప్పుచు, నావేశ్యలాడుమాటలను వినుచు వారిమొగములు చూచుచుండుటయే మహానందదాయకముగా నుండెను. మొదలియారుగారుఁ దాము చిన్నతనములో నింగ్లాండుదేశములో నున్న సమయమున నచ్చటఁ జూచిన వినోదములనుగూర్చియు, నాదేశమున సర్వస్వతంత్రతతోఁ బ్రవర్తించు స్త్రీలనుగూర్చియు, నాదేశమందలి నాగరికతావైభవమును గూర్చియుఁ, జిత్రకథలుగాఁ జెప్పుచు నావేశ్యలు దన్ను గేలిచేసి నర్మగర్భముగా మాటలాడుచున్నను దన్ను వారు గౌరవించినట్లే సంతసించుచు,

వారాడిన యప్రస్తుతవాక్యములకును, ననుచితాలాపములకును నెల్ల యనౌచిత్యభావముతో వారిమనసుల నించుకైన నొవ్వజేయకుండునట్లు బాగులు చెప్పుచు, సంతోషించుచుండెను. ఇట్లు రెండు మూడు గంటలకాలము వారాయింట గడపి రాత్రి తొమ్మిదిగంటలగుటచే నందఱు గలసి బయలువెడలి యెవరియిండ్లకు వారుపోయిరి. సోమన్నమాత్రము దనకోమటితెగల నిర్గతికిని బిళ్ళగారికిని, నాయుడుగారికిని గట్టిపెట్టి వారిని దన మాయోపాయములచే వశవర్తులను జేసికొనవలయునన్న దృఢమైన యభిప్రాయము మాత్రము లేకపోలేదు. నాయుడుగారికిని, బిళ్ళగారికిని మాత్రము తమకుగల సంగీతాభినయాభిరుచిచేతను, దమ రసికతచేతను, నావేశ్యల సంగీతాభినయములను జెవులార విని కన్నులారఁ జూచి యానందింపవలయునను గోర్కె దప్ప మఱియొక యభిప్రాయము మాత్రము వారికిలేదని స్పష్టముగాఁ జెప్పకతప్పదు. శెట్టిగారు దాను సంగీతాభినయసముద్రుఁడనన్న మనోగర్వముగలవాఁడు గావున నావేశ్యల సంగీతము వినవలయుననియు, నభినయమును జూడవలయుననియుఁ, దన మనసులో నెంతకోర్కెయున్నను, నీశాస్త్రములయందు సంపూర్ణాభినివేశముగల ప్రజ్ఞానిధివలెఁ దనసంభాషణమునఁ దనకీరెండుశాస్త్రములయందును, గవిత్వమందును గల పాండిత్యమును విస్పష్టముగా బ్రకటీకృతమగునట్లు మాత్రము శ్లాఘించి చెప్పుకొనుచుఁ, దన యంతరంగమందలి యభిప్రాయమును మాత్రము చెప్పి వారిని పాడుమనిగాని, యభినయింపుమనిగాని, చెప్పక నావేశ్యల నీరెండుశాస్త్రములయందుఁ దనకు శిష్యప్రాయులగా గారవించుచు నానందించుచుండెను. గాని వారితో స్నేహసంబంధమును గలుగఁజేసికొనవలయునన్న యభిప్రాయమాతనికి లేదు. మొదలియారుగారు వారితో మాటలాడుచు నవ్వుచు సంతోషముగాఁ గాలము గడపవలయునని మాత్రమిష్టము గలవారనుటకెంతమాత్రము సందియము లేదు.

ఇట్లీనలుగురు పెద్దమనుష్యులును సదభిప్రాయములతో సోమన్నగారి స్నేహపాత్రతను సంతసించుచుఁ దమకాయనచేయు సత్కారములకాయన

యందు గౌరవవిశ్వాసములు గలిగి నిష్కల్మషులై సంచరించుచు, సమాయితులు గావున నాతనియంతరంగమునఁగల దురుద్దేశము నించుకయును గ్రహింపఁజాలక నాతని యోగ్యునిగాఁ దలఁచి ప్రవర్తించుచు, నానాటికాతనియందుఁ దమకు విశ్వాసమును, నమ్మకమును నభివృద్ధినొందుచుండుటచే నాతనికి వశవర్తులై ప్రవర్తింపసాగిరి. బాయమ్మగారియందు వీరికి గౌరవమును, విశ్వాసమును దృఢముగ నంతరంగములయందు నాటియుండుటచే నామెను భూలోకసరస్వతిగా నిశ్చయించుకొని తాము సోమన్నతో నాతని వేశ్యయింటికిఁ బోయినసంగతి యామెకుఁ దెలియకుండ జాగరూకతతో నుండిరి. వేశ్యలిండ్లకుఁ బోవు పురుషులయందుఁ దామెట్టివారైనను వివాహితలైన కులాంగనలకు గౌరవముండుట యసంభవమని వీరు గ్రహింపఁగల యుచితజ్ఞులును, నపవాదలకు భయమందువారును, నాత్మగౌరవమును మిక్కిలి శ్రద్ధతోఁ గాపాడుకొని జనుల మన్ననలకు బాత్రులై కాలము గడపవలయునను కోరిక గలవారును, మానమర్యాదలను సంరక్షించుకొన గలుగునట్లు ప్రవర్తించు యోగ్యశీలులును, గావునఁ దమ బుద్ధివిశేషమును, గార్యాచరణనిపుణత్వమును, ననుభవజ్ఞానమును, చతురత్వమును సంపూర్ణముగా వినియోగించుచు సోమన్న స్నేహమును, బాయమ్మకుఁ దమయందుగల సదభిప్రాయమును, గౌరవమును గాపాడుకొనగలుగునట్లు తాము మిక్కిలి జాగరూకతతోనుండిరి. సోమన్న వేశ్యాలోలుఁడనియు, మాయాశీలుఁడనియుఁ, గుత్సితుఁడనియు, దుర్మార్గానువర్తియనియు మోసకారియనియు, నవినీతుఁడనియుఁ, గల్యాణపురవాస్తవ్యులందఱకుఁ దెలిసియుండుటచే బాయమ్మగారి కీతనియందించుకైన గౌరవములేదు. బాయమ్మయందు సోమన్నకాంతరంగికద్వేషమును నీర్ష్యయు గలదని యిదివఱకే చెప్పఁబడియున్నది. సోమన్న మొదలియారు మొదలగు నీనలుగురికొఱకుఁ దనయింటికిఁ దరుచుగా వచ్చుచుండుట బాయమ్మ కంతగా నిష్టములేదు. ఈసంగతి బాయమ్మగారి మాటలవలన నించుకైన గ్రహింపజాలకుండిరి. కాని సోమన్నగారి మాటలను బట్టియు నాయన ప్రసంగమును బట్టియు, దాము సోమన్నగారింట జనచే

సియున్న విషయమునుగూర్చినవ్వుచు నర్మగర్భముగా నాఁడు మాటలనుబట్టియు హాస్యోక్తులను బట్టియు, సోమన్నగారికిని నాతనివేశ్యలకును బాయమ్మగారి యందు సదభిప్రాయములేదని మాత్రమగ్రహించిరి. పూర్వాచారపరాయణత్వమున సోమన్నయుఁ గేవలమీర్ష్యచే నాతని వేశ్యలును బాయమ్మయందు లేని దుర్గుణములను గూడ నారోపణము చేసి యామెను నిష్కారణముగాఁ దూలనాడుచుండిరని వీరు దెలిసికొనగలిగినవారైనను సోమన్నగారి మనసు నొవ్వఁజేతుమని సందేహించుచు సోమన్నగారితోఁ దమకుఁగల స్నేహమును దలఁచియు, నాతఁడు దమయెడలఁ బ్రకటించుచున్న గౌరవవిశ్వాసములనుబట్టియు, నూరకుండి స్నేహభావముతోఁ బ్రవర్తించుచుండిరి. సోమన్నగారితో వీరికి స్నేహము హెచ్చినకొలది వీరాతనిమాట కెదురాడజాలక మోమోటముచే నాతఁడు చెప్పినట్లు వినుచుఁ నాతనికి వశవర్తులైయుండిరి. కాంతయ్యపాత్రుని మూలమున నాయూర వీరు సంపాదించిన స్నేహితులను బరిచితులను గ్రమక్రమముగాఁ గలసికొనుటమాని వీరునలుగురుఁ దమకాలమంతయు సోమన్నగారితోను పార్థసారథితోను గడపుచుఁ బార్థసారథి నాటకసమాజము వారాడు నాటకములను జూచుచు వ్యాపారరహితులై యుండిరి.

అంత నొకనాఁడు సోమన్నగారును బార్థసారథియు నీనలుగురు పెద్దమనుష్యులునుగూర్చుండి మాటలాడుకొనుచు సోమన్నగారి యింటనున్న సమయమున, మొదలియారుగారితోఁ దనయన్నకొమార్తెకు వివాహముచేయఁ దలచి వరాన్వేషణార్థము వచ్చితినని చెప్పిన బ్రాహ్మణుఁడు వచ్చెను. మొదలియారును నాతని స్నేహితులును నాతని నదివఱకే యెఱిఁగియున్నవారగుటచే నాతనిఁ గూర్చుండుమని చెప్పి యాతఁడాపట్టణమునకు వచ్చిన కార్యమునుగూర్చి సోమన్నగారితోఁ జెప్పెను. సోమన్న లౌకికధర్మములను వైదికధర్మములను జక్కఁగా నెఱిఁగిన వాఁడుగావున నాబ్రాహ్మణుని పేరును యింటిపేరును శాఖయు గోత్రమును నడిగి తెలిసికొని వరునిఁ గుదిర్చెదనని యాతనికి ధైర్యము చెప్పెను. తరువాత పార్థసారథియు సోమన్నయు నాలోచించి నాటక

సమాజముతో వచ్చిన కామయ్యయనువాని కాబ్రాహ్మణుని యన్నకొమార్తె ని
చ్చి వివాహము చేయించు టుచితమని నిశ్చయించిరి. పార్థసారధి కీకామయ్య
యందు మిక్కిలి యభిమానము గలదు. ఇతఁడు గొంచెము చదువను వ్రాయను నే
ర్చి నాటకులకువంటచేయుట కానాటకసమాజముతో నాపట్టణమునకు వచ్చి వంట
బ్రాహ్మణుఁడుగాఁ బనిచేయుచున్నను నప్పుడప్పుడు నాటకములలోఁ గొన్ని
వేషములు గూడ వేయుచుండుటచే నాటకప్రయోగమునఁ దా నద్వితీయమైన
నేర్పును బ్రజ్ఞయుఁ గలవాఁడనను నహంభావముతోఁ బ్రవర్తించుచుఁ బార్థ
సారధి కాప్తుఁ డగుటచే నానాటకసమాజికు లందఱిలోఁ దానే ముఖ్యుఁడన
ను గర్వముగలిగి యుండెను. ఈకామయ్య మొదలియారుమొదలగు నీనలుగురి
కిని నింతకు పూర్వము గనిపించలేదు. వీరు పార్థసారథి బసదిగియున్న
యింటికివచ్చినప్పుడెల్ల నీకామయ్య మొగము దాచుకొని వీరికి గనుపించకుం
డ సంచరించుచుండుటచే నాతని వీరు చూచియుండలేదు. తరువాత సోమ
న్నయుఁ బార్థసారథియు నాబ్రాహ్మణునితో వివాహవిషయమును గూర్చి
యుఁ, గన్యాశుల్కమును గూర్చియు, మాటలాడి కామన్న యోగ్యతనుగూర్చి
యు, రూపయౌవనసంపన్నతను గూర్చియుఁ, బ్రయోజకత్వమును గూర్చియు
శ్లాఘించిరి. ఆమాటలకాబ్రాహ్మణుఁడు మిక్కిలి సంతోషించుచు సోమన్నగా
రు దనకుఁ జేయనిశ్చయించుకొనిన యుపకారమున కాయన కనేకకృతజ్ఞతా
పూర్వకవందనములు నర్పించి తన కార్యసంఘటనమంతయు మొదలియారుగారి
యనుగ్రహమువలన గలిగినదనియుఁ దాను మొదలియారుగారి ముఖముఁ జూ
చినవేళ మంచిదనియు నాయనను, శెట్టిగారిని, బిళ్ళగారిని, నాయుఁడుగారిని
గొనియాడెను. “శుభస్యశీఘ్రము” మను న్యాయమునుబట్టి కామన్నను బిలిపించి
యాబ్రాహ్మణునకుఁ జూపించి యాకన్యను బిలచికొనిరమ్మని యాతనితోఁ జెప్పి
వివాహము నిశ్చయించుటుచితమని శెట్టిగారు సెలవిచ్చిరి. పార్థసారథి కామ
న్న కొఱకు వర్తమానమంపెను. కన్యకను దీసికొనిరమ్మని సోమన్నగారా బ్రా
హ్మణునితోఁ జెప్పి యాతని బంపిరి.

తరువాత నొకగంటకుఁ గామన్నయు, మొదలియారుగారికొనాటిరాత్రి కనిపించిన బ్రాహ్మణుఁడును, వివాహార్థమాతఁడు దీసికొనివచ్చిన కన్యయు, నాకన్యతల్లియు, సోమన్నగారియింటికి వచ్చిరి. ప్రప్రథమమునఁ గామన్నను మొదలియారుగారానవాలు పట్టలేక పోయిరి గాని నాయుఁడుగారు మాత్రమానవాలు పట్టి "మిమ్ములను లోకలుఫండు సత్రములో నేను జూచినట్లున్నదే" యని చెప్పఁ దాను లోకలు ఫండుసత్రములో గుమాస్తాగానున్న సంగతి నిజమే యని యొప్పుకొని, యాసత్రముననుండుట కిష్టములేక పార్థసారథిగారి బలవంతముపైన నాటకసమాజమువారితో వచ్చితిననియు, సత్రములో నుద్యోగము చేయుటవలన నించుకైన లాభములేకపోవు టటుండ లేనిపోనియల్లరియు నాయాసమును దుదకు బాపమును గూడ సంప్రాప్తమగుననియు, నందువలన నాయుద్యోగమును మానుకొని యింటికిఁ బోనిశ్చయించుకొని యున్న సమయమునఁ బార్థసారథిగారు దన్ను బలవంతమువిూదఁ దమ నాటకసమాజముతోఁ దీసికొనివచ్చిరనియుఁ జెప్పెను. తరువాత మొదలియారుగారు గాపువాఁడును, నాతని గొమార్తెలును, ముత్యాలమ్మయు, క్షేమముగా నున్నారా! యని యడుగగా నందుకుఁ గామన్న నవ్వి "బాబూ! ఏమిచెప్పుమన్నారు; కాపువాఁడును ముత్యాలమ్మయుఁ బెద్దమనుష్యులని చెప్పకతప్పదు; కాని యాసత్రమునఁ బెద్దమనుష్యులు బసదిగినచో వారికి గౌరవహాని చేకూరకమాన" దని యేమేమో చెప్పవలసిన సంగతులుండియు నౌచిత్యమును బట్టి చెప్పకదాచినట్లు మాటలాడెను. మొదలియారుగారుమాత్రము కాపువాని యోగ్యతయు, ముత్యాలమ్మ మంచితనమును, నాకాపు కన్యకల యమాయికస్వభావమును, దలఁచికొని పాపపుణ్యము లెఱుఁగని యాకన్యకలు నిష్కారణముగా నపవాదపాలగుటకు మనసులో విచారమును బొందిరి. అంతఁ గామన్న నాబ్రాహ్మణునకుఁ జూపి యతని కాకన్యనిచ్చి వివాహముచేయు టుచితమని పార్థసారథియు సోమన్నగారును జెప్పిరి. ఆబ్రాహ్మణుఁడు దన వదినెగారిని బిలచి కామన్న నామెకును నామె కుమార్తెను కామన్నకును జూపించెను. తరువాత

నాబ్రాహ్మణుఁడును, నాతనివదినెయుఁ గొంచెము దూరముగాఁ బోయి యచట నేమేమో గుసగుసలాడి తిరిగివచ్చి "వివాహమునకుఁ గన్యాశుల్కమేమి యిప్పించెద" రని యడిగిరి. కామన్న తాను ద్రవ్యహీనుఁడ ననియు నంతకుఁ బార్గసారథిగారే యున్నారనియుఁ జెప్పెను. అప్పుడు సోమన్నగారును బార్గసారథియుఁ గలసి యాబ్రాహ్మణునితోడను నాతని వదినెతోడను గన్యాశుల్కమునుగూర్చి బేరమాడ నారంభించిరి. వీరీవిధముగా బేరమాడుచుండ నాబ్రాహ్మణుఁడు దనకింత కన్యాశుల్కము గావలయునని యెన్నిపర్యాయములడిగినను జెప్పక తన యన్నకొమారుని మెడలో నైదుజందెములు వడునట్లు చేయుఁడనిమాత్రము చెప్పసాగెను. అతని వదినెగారు కన్నీరుగార్చుచు "నాయనా! మాకిట్టియవస్థ తటస్థమగుటయే చాలును; నాకొమారుని వివాహముకొఱకీపని చేయఁబూనుకొనుటయేగాక కన్యాశుల్కమునుగూర్చి యింతకావలయునని కూడ నే మొగముపెట్టుకొని యడుగఁగలము. మాకు నోటమాటరాదు. నాకొమారుని మీకొమారునిగాఁ దలఁచుకొని యాతనికి వివాహమగునట్లు మాత్ర మనుగ్రహింపుఁడు. నాకొమారునకు సంబంధముగూడ వచ్చియున్నది. కుండమార్పులుగా వివాహముచేయుటకు మాపూర్వస్థితినిఁ బట్టి మాకుఁ జేతులురాక నీయవస్థకుఁ బాలుగావచ్చినది. త్వరలో దమరాలోచించి నాకొమారునకు వివాహమగునట్లనుగ్రహించి వెంటనే యీపిల్లకు వివాహముచేయించినయెడల మేమింటికిఁ బోయి నాకొమారునకు సంబంధము నిశ్చయపఱచుకొని సెలవైనచోఁ దిరిగివచ్చి నాకొమారునికీయూరనే చదువుచెప్పించుకొనుచు మీపంచ నొకమూలఁ గాచుకొని త్రాగుచు మిమ్ములను గనిపెట్టుకొని యుందుము" అని యతిదీనముగా సోమన్నగారితోఁ జెప్పెను. సోమన్న దానీవివాహమును జేయించి యామెను దనయింట నుంచుకొని జీతముకొఱకలేకయే వంటలకొఱకుగాఁ బనిచేయించుకొనవచ్చునని యూహించి "మీకొమారుని వివాహమునకేమి యడుగుచున్నా" రని యడిగెను. అందుకామె యేమిచెప్పుటకు నోరాడక మాటలాడ కూరకుండ నాబ్రాహ్మణుఁడు

నగలక్రిందను గన్యాశుల్కముక్రిందను వేయిరూపాయ లడుగుచున్నారనియు నంతకు(బైగా నొక వందరూపాయిలయిన నున్న(గాని కార్యముగాదనియు(జెప్పెను. సోమన్న దాను స్వయముగా నొకగవ్వయైన నిచ్చువా(డును నియ్య(దల(చినవా(డును గాకపోవుటచేతను నాత(డెంతయడిగినను దనకించుకయిన బాధలేదుగావునను "బ్రాహ్మణులలో నంతకు(దక్కువ మొత్తమునకు వివాహమగుటీదినములలో సాధ్యముగాదని చెప్పెను. పార్థసారథిమాత్రము కామన్న యంతసొమ్మిచ్చుకొన(జాలడనెను. కామన్న దాను నిర్ధనుడననియు(బార్థసారథివంటి పెద్దమనుష్యుల యనుగ్రహము దప్ప ద్రవ్యమించుకయు సంపాదించుకొనియుండలేదనియు(దనవివాహము దామే చేయించి పుణ్యముగట్టుకొనవలయుననియు(జెప్పెను. మొదలియారుగారా బ్రాహ్మణకన్యను గాంచియు నాకన్య తల్లి చెప్పిన దీనవాక్యములను వినియు నాబ్రాహ్మణుడు చెప్పిన మాటలనన్నిటిని(దన మనసులో నాలోచించియు వారి దురవస్థకు మిక్కిలి విచారించుచు(దన హృదయమందలి కరుణారసతరంగము లుప్పొంగ దారిద్ర్యమువలన సంభవించు కష్టములను నష్టములను బేదరికమువలన జనులు చేయవలసివచ్చెడునను చితకార్యములను నంతరంగమున(దలపోయుచు(దనహృదయమున(బొడమిన దయారసమంతకంతకు వెల్లివిరిసి నేత్రాంచలమార్గమున నశ్రుక్రమములై పొఱ(జొచ్చి యామహామహుని దయామయత్వమును గరుణాంతరంగతయు జగద్విదితము సేయుచుండ మాటలాడ కూరకుండిరి. శెట్టిగారు వివాహములలో(గన్యాశుల్కములను వరశుల్కములను దీసికొనుట నీతిబాహ్యమైన యాచారమనియు, నట్టిదురాచారమును మనదేశమునుండి పొఱ(ద్రోలుటయత్యావశ్యకమయినను దారిద్ర్యకారణమునుబట్టి కన్యాశుల్కములు మాన్పించుట దుర్ఘటమనియు, నీవిషయములో నాబ్రాహ్మణకన్యకకు గన్యాశుల్కము గొని వివాహముచేసిన(గాని యాకన్యయన్నకు వివాహముగాకుండెడి హేతువునుబట్టి యేమిచెప్పుటకును వీలులేదనియు నీదురాచారమును గ్రమక్రమముగా జనులు మానుకొనునట్లు చేసిన(గాని దేశమునకు క్షేమమును నభివృద్ధియు(గలుగ

నేరవనియు నీదురాచారమునకు దారిద్ర్యముచేఁ బ్రేరేపింపఁబడిన ధనాశ ముఖ్యకారణమనియుఁ జెప్పిరి. పిళ్ళగారికిని, నాయుఁడుగారికిని నా బ్రాహ్మణకన్యకను కామన్నవంటి మూర్ఖునకిచ్చి వివాహముచేయుట కిష్టముమాత్రము మనసులోలేదు. కాని యాకన్యను కామన్నకిచ్చి వివాహముచేయకుండ నివారించినచో ధనాశచేఁ గన్యాశుల్కమునకాకన్యను విక్రయింప నిశ్చయించుకొనిన దానితల్లియుఁ బినతండ్రియుఁ గామన్నకన్న నిర్భాగ్యుఁడును కాటికి గాళ్ళుచాచుకొని యుండు నింకొక ముసలివానికి గట్టిపెట్టకుండఁ జేయనేరమనియుఁ, గామన్న విద్యాధికుఁడును, ధనవంతుఁడును, యోగ్యుఁడును నంతగా రూపవంతుఁడును గాకపోయినను శరీరదార్ఢ్యము గలవాఁడు గావున నావివాహవిషయములోఁ దామేమియు జోక్యము గలుగఁజేసికొనక యూరకుండుటే యుచితమనియు వీరు నిశ్చయించుకొనిరి. తరువాత సోమన్నగారు తనకార్యసాధనక్రియా నిపుణత్వమంతయు వినియోగపఱచి యెనిమిదివందల రూపాయలు కన్యాశుల్కముగా నిచ్చుటకును నామఱునాఁడే యాదికేశవస్వామి యాలయములో వివాహముచేయునట్లును నిశ్చయముచేసిరి. పార్థసారథి యుచితముగా రెండువందలరూపాయలును బహులుపూర్వకముగా మూఁడువందల రూపాయలును గామన్న వివాహార్థమిచ్చుటకు రెండునాటకములకు వచ్చు సొమ్మంతయుఁ గూడ నిచ్చి సహాయముచేయుటకును నొప్పుకొనెను. తక్కినసొమ్ము కామన్న తనచేతినున్న బంగారుమురుగులను, మొలనున్న వెండిగోవత్రాడును నమ్మి యిచ్చెదననెను. అటుపైన నేమైనఁ గొదవపడినచో నాయూరనున్న తన పరిచితులును స్నేహితులును నగు గొప్పగృహస్థులవలనఁ జందాలమూలమున నిప్పించెదనని సోమన్నగారు చెప్పిరి. ఇట్లు వివాహమునకుఁ జేయవలసిన యత్నములన్నియు సోమన్నయుఁ, బార్థసారథియుఁ, గామన్నయుఁ జేసి యామఱునాఁడు రాత్రి 9 గంటలకు వివాహముహూర్తమేర్పఱచిరి. మొదలియారుగారును నాయన స్నేహితులును వారుచేసిన యేర్పాటులన్నిటిని మనఃపూర్వకముగా నామోదించినవారివలె నన్నిటికిఁ దలయూచుచు బాగుగానున్నదని

చెప్పచునూరకుండిరి. కన్యాశుల్కములుగొని వివాహములు జరిగించుటచేఁగలుగు
రికేని యెంతమాత్రము నిష్టములేకపోయినను, నట్టికార్యము నీతిబాహ్యమని వీరు
స్పష్టముగా నెఱిఁగియున్నను వివాహకార్యమున కాటంకము గలుగఁజేయుట
ఘోరపాతకమని శాస్త్రములుద్ఘోషించుచున్నవనియు నట్టిపాతకము నెడఁగ
ట్టుకొనఁగూడదనియు శెట్టిగారును, గరుణాతిశయత్వమున నోరాడక మొదలి
యారుగారును, గామన్నకాకన్యనిచ్చి వివాహముచేయు టనుచితమన్న చో
నాకన్య నంతకన్న నీచునకును ముసలివానికిని విక్రయించునన్న భయముచేఁ
బిళ్ళెగారును, నాయుఁడుగారును మాటాడకూరకుండిరి. అట్లుగానిచో సదా
చారప్రవర్తకులును, సద్గుణగరిష్ఠులును, దేశోపకారకార్యదీక్షాపరతంత్రులును,
దురాచారనిర్మూలనాయత్తచేతస్కులును, దయాసముద్రులును, ధర్మవిదులును
నగు నీమహామహులీసమయమున నూరకుండుట తటస్థముకాదని చదువరులు
నిశ్చయముగా విశ్వాసపూర్వకముగా నమ్మవలయును.

తరువాత సోమన్నగారియొద్దను, భాగ్యసాగరియొద్దను సెలవుదీసికొని
మొదలియారుగారును, శెట్టిగారును, బిళ్ళెగారును నాయుఁడుగారును దమబ
సకువచ్చి భోజనముచేసి వివాహములలోఁ గన్యాశుల్కములును వరశుల్కములు
ను దీసికొను నాచారమతినీచమగు నీతిబాహ్యమైన దురాచారమనియు, వాని
నిర్మూలము గావించుట యావశ్యకమనియు, నట్టి యధర్మమును రూపుమాపుట
కెంతప్రయత్నమునైన జేయవలయుననియుఁ దమలోఁ దాము మాటలాడుకొను
చుఁ జర్చింపసాగిరి. దరిద్రత యెంతటినీచకార్యమునైనఁ జేయించుననియు,
జీవజీకమువలన జనులకార్యములను జేయసాహసింతురనియు నవివేకమును న
జ్ఞానమును మౌఢ్యమును ప్రబలియున్న మనదేశమున దారిద్ర్యహేతువునుబట్టి
జనులుచితానుచితముల నెంచుకయినఁ బాటించుట కవకాశము గలుగకున్నదని
యు వీరు నిశ్చయించిరి. ఈదురాచారము నాబ్రాహ్మణులలోను, వైశ్యులలో
ను నెక్కువగాఁ గానిపించుచున్నను నన్నిజాతులయందునుఁగూడ బ్రబలియున్న
దనుట కించుకయు సందియములేదని వీరు నలుగురు నెఱుఁగకపోలేదు. కాని

యీయాదురాచారముల నున్మూలనము గావించుటకు సంఘదురాచారసంస్కర్తలు చేయు ప్రయత్నమంతగా సఫలములుగాకుండిన సంగతి నాలోచించి యీదురాచారమును బాఱద్రోలుటకుఁ జేయవలసిన యుచితప్రయత్నములను గూర్చి దూరాలోచనముచేసి కర్తవ్యమును నిశ్చయింపవలయునను కోరికవీరికప్పుడు దృఢముగాఁ గలిగినను ప్రస్తుతము దాముచేయఁదగినదేదియు లేకపోవుటచే నూరకుండవలసినవారైరి. బాయమ్మగారిసంగతియంతయు మొదలియారుగారివలన విని కన్యాశుల్కమునకా కన్యనమ్మి వివాహముచేయుట ధర్మమనియు నట్టి నీతిబాహ్యమైన పనిచేయుటకన్న నాకన్య నింకొకజాతివానికైన నిచ్చి వివాహముచేయుటయుచితమనియుఁ జెప్పెను. అందుకు శెట్టిగారు మన శ్రీనివాసమునకా పిల్ల యీడుదగియున్నచో నాబ్రాహ్మణుఁడు కోరిన ద్రవ్యమిచ్చి యాకన్య నాతనికిచ్చి తాను స్వయముగా వివాహముచేయింతునని మిక్కిలి ధారాళముగాఁ బలికెను. అతిబాల్యవివాహములు దనకసమ్మతములనియుఁ దనకొమారుఁడు విద్యనేర్చి పెద్దవాఁడయినతరువాత నాతఁడు స్వయముగాఁ జూచి ప్రేమించిన కన్యనేగాని వివాహముచేసికొనుట తనకిష్టములేదనియుఁ, బ్రపంచజ్ఞానమించుకయినఁ దెలియక సంసారబాధ్యతను గొంచెమైన గ్రహింపఁజాలని చిన్నపిల్లలకు వివాహము చేయఁగూడదనియు వివాహమన్న నేమియో తెలియని బాల్యదశయందుఁ దన తల్లిదండ్రులు దనకు వివాహముచేయుటచే నతిబాల్యవివాహమువలన సంభవించు ననర్థములన్నియు దాను స్వయముగా ననుభవముచే నెఱిఁగినదాననియు, నట్లతిబాల్యవివాహములవలన సంభవించెడి నష్టములనెల్లఁ జక్కఁగాఁ దెలిసిన తానెన్నఁడు నట్టి యకార్యము నాచరించి తనకొమారునకుఁ జిన్నతనమున వివాహముచేయ నిశ్చయించననియుఁ బలికెను. హిందువులలో రజస్వలావివాహములు చేసికొని సుఖముగాఁ గాలము గడపుకొనుట కవకాశముగల జాతులవారుగూడ బ్రాహ్మణుల యాచారమనుకరించి యతిబాల్యవివాహము లాచరించి తామట్టివివాహములవలన సంభవించు ననర్థముల ననుభవించుచు సంఘమునకు హాని కలుగజేయు

చున్నారనియుఁ దమజాతియందు రజస్వలావివాహములు చేయువాడుక గలిగియున్నను దమ జాతి బ్రాహ్మణవర్ణముతో సమానమైన యత్యుత్కృష్టమైనదని జగద్విదితముచేసి తమజాతికి గౌరవము దెచ్చిపెట్టుకొనవలయునని యెంచి తన స్వశాఖవారగు శిష్యగణములు గూడ నీయకార్యము నాచరించుచున్నారనియుఁ దనతల్లిదండ్రులు దమజాతికిలేని గౌరవమును నుత్కృష్టతయుఁ గల్పింపనెంచి తనగొంతుగోసి యిట్టియకార్యమును జేసిరనియుఁ బ్రాహ్మణేతర జాతులవారైన నీయతిబాల్యవివాహము లింతటితో మాని మనదేశమున కభివృద్ధియు క్షేమమును గలుగఁ జేయవలయుననియుఁ బాయమ్మగారు చెప్పి యతిబాల్యవివాహములు దూష్యములనియు నశాస్త్రీయములనియుఁ బాపహేతుభూతములనియుఁ దానువ్రాసిన వ్యాసములనుగూర్చియు పద్యములనుగూర్చియుఁ దానతిబాల్యవివాహములు మాన్పించుటకుఁ జేయుచున్న ప్రయత్నములనుగూర్చియు వారికిఁ దెలిపెను. ఇట్లు వీరతిబాల్యవివాహములు దూష్యములనియుఁ గన్యాశుల్కములును వరశుల్కములును నపేక్షించి వివాహముచేయుట ధర్మబాహ్యమును బాపహేతువును నైన కార్యమనియుఁ గొంత వఱకుఁ జర్చించి మాటలాడిరి.

పార్థసారథి కామన్న వివాహమునకుఁ జేయవలసిన ప్రయత్నములన్నియుఁ జేయుచుండెను. కామన్న చేతి బంగారుమురుగులను మొలనున్న వెండిమొలత్రాడును విక్రయమునకు దీసికొని యవి యమ్ముటవలన రెండువందల రూపాయల తన్ననెవ్వఁడు రాకపోవుట చేతను దానిచ్చెదనని సోమన్నగారి యెదుటను వెంకటలియూరు మొదలగువారి యెదుటను నతిధారాళముగా వాగ్దానము చేసిన రెండువందల రూపాయల బహుమానమును మూఁడువందల రూపాయల బదులును నియ్యవలసివచ్చుటచేఁ బార్థసారథియుఁ దోచక తనయొద్ద ధనముంచుకయుఁ లేకపోవుటచేఁ నాతఁడు సోమన్నగారియొద్ద నీసొమ్ము బదులుతీసికొనవలయునని నిశ్చయించుకొనెను. సోమన్న వివాహప్రయత్నము నత్యుత్సాహముతోఁ జేయించి యీకార్యమంతయుఁ దానేచేయించుచున్నట్లును

డానేయాశుభకార్యమునకు ముఖ్యుఁడననియుఁ జెప్పుకొనుచు లేనియాజమాన్యమును దెచ్చిపెట్టుకొని మిక్కిలి యహంభావముతో నుండెను. కానితనమఱఁదలిని కొమార్తెలను శెట్టిగారికిని, బిళ్ళగారికిని, నాయుఁడుగారికిని గట్టిపెట్టి వారిని దనకు వశవర్తులనుగాఁ జేసికొనఁ గలుగు నుపాయముల నన్వేషించుచు సోమన్నగారించుకయిన మనశ్శాంతియు, సంతుష్టియులేక తన దురుద్దేశమును నెరవేర్చుకొనుట కుపాయముల నన్వేషించుచుండెను.

అంతఁ బార్థసారథి సోమన్నగారి యింటికివచ్చి కామన్న మురుగులును మొలత్రాడును రెండువందల రూపాయలకన్న నెక్కువ కమ్ముడుగావనియుఁ, దక్కిన యాఱువందల రూపాయలును బ్రస్తుతము దనయొద్ద లేకపోవుటచే బదులు చేయవలసి వచ్చినదనియు, నీశుభకార్యమున కాటంకము గలుగకుండ నామొత్తముఁ దనకు బదులుపూర్వకముగా నిప్పించుమనియుఁ గోరెను. తానొకరియొద్ద సందర్భానుసారముగా నుపాయభేదములచే ధనము గ్రహించుటయేగాని యొకరుచితముగాఁగాని బదులుగాఁగాని యెన్నఁడు సొమ్మిచ్చినవాఁడు లేనివాఁడు గావునను, తనజన్మమెత్తినదాది స్వలాభములేక యొట్టి యల్పకార్యమునైనఁ జేసియుండనివాఁడును, మంచిమాటలచేతను దనవాఙ్నైపుణ్యముచేతను, జనులనుసంతుష్టిపఱచి యఱచేతిలో స్వర్గమునుఁ గనఁబఱచుచుఁ, బరోపకారివలెను, గొప్పదాతవలెను, నటింపఁగల ప్రజ్ఞానిధియుఁ గావునఁ దనయొద్దఁ బ్రస్తుతము సొమ్ములేదనియు, నంతకుఁబూర్వము రెండు దినములక్రిందటనే యొకరికి బదులిచ్చితిననియు, నాబదులిచ్చుటకుఁ గొంత చేబదులుఁగూడ దీసికొని రావలసివచ్చెననియు ననేకవిధములగు కారణములను గల్పించిచెప్పి తనకుఁ బార్థసారథియందుఁగల ప్రాణతుల్యమైన మిత్రత్వమును జరగఁబోవు వివాహకార్యమునకుఁ గావలసిన ధనసహాయముయొక్క యావశ్యకతయుఁ దలఁచి తానీవిధముగాఁ జెప్పుచు సమయమున కక్కఱరాకపోయినందుకుఁ దనకే సిగ్గుగానున్నదనియు విచారము నభినయించుచుఁ బార్థసారథితోఁ జెప్పిరి. తరువాత మీకీసహాయము చేసి నాఁగౌరవము దక్కించక తప్పదని పార్థసారథి

యు నీశుభకార్యమును జేయించి పుణ్యము గట్టుకొనక తప్పదని కామయ్య
యు సోమన్నగారి చేతులును గాళ్ళును బట్టుకొని బతిమాలిరి. ఇట్లు సోమ
న్నగారిని భార్గసారథియుఁ గామన్నయు ననేకవిధములఁ బ్రార్థించుచు
నేవిధముగానైన నాలుగువందలరూపాయలు ఋణము సమకూర్చి పీఁటమీఁదికా
ర్యము చెడిపోకుండఁ జేయక తప్పదని బలవంతపఱచిరి. కన్యాశుల్కము వి
వాహానంతరము నెమ్మదిమీఁద నిచ్చెదమన్నచో నాబ్రాహ్మణుఁడు సమ్మతింపఁ
డు. ఈమొత్తమునకుఁ బ్రామిసరీనోటుగాని దస్తావేజుగాని వ్రాసియిత్తుమ
న్నచో నాబ్రాహ్మణుఁడిదియంతయుఁ దన్ను మోసముచేయుటకుఁ జేసినప్ర
యత్నమని యనుమానపడక మానఁడు. అతనితో నీమాటలు చెప్పినచోఁ గా
ర్యము చెడినను జెడవచ్చును, ఇంతియగాక నీసంగతియితరులకు దెలిసినచోఁ దా
మిచ్చెదమన్న కన్యాశుల్కముకన్న నెక్కువ యిచ్చెదమని యాకన్య నిం
కెవ్వరైనఁ బెండ్లాడి కామన్నకుఁ బెండ్లిగాకుండఁ జేసినను జేయఁగలరు. కాఁ
బట్టి "శుభస్యశీఘ్రమ్ము" ని పెద్దలాడుమాటనుబట్టి యీశుభకార్యమాపు టు
చితముగాదు. సోమన్నగారొక గవ్వయైన బదులుపూర్వకముగానైన నిచ్చు
టకంగీకరించలేదు. పార్థసారథికాయూర నెన్నివిధముల నెంతదూరమా
లోచించినను ధనసహాయముఁ జేయువారుగాని బదులిచ్చువారుగాని గనుపించలే
దు. ఇట్టిస్థితియందుఁ బార్థసారథి మనసును, గామన్న హృదయమును నల్లక
ల్లోలముగా నుండెననుట కాశ్చర్యము లేదుగదా! తరువాతఁ బార్థసారథి
యాయూరిలో నెవరిచేతనైనఁ దనకు బదులిప్పించుమని సోమన్ననడిగెను.
అందుకుసోమన్న తానొకగవ్వయైన నితరులయొద్ద బదులుపుచ్చుకొనననియుఁ,
ద్రవ్యము కొఱకితరుల నాశ్రయించుట తనపనికాదనియుఁ దానెంతధనవంతుల
తో స్నేహసంబంధము గలిగియున్నను వారినెన్నఁడును నొకగవ్వయైన బదు
లుగానైన యడిగి పుచ్చుకొనకుండఁ గాలముగడపుచుఁ దనమానుషమును, నా
త్మగౌరవమును, గాపాడుకొనుచుఁ బ్రవర్తించుచుండుటచేతనే తనమర్యాద
ను దానుగాపాడుకొని యాయూరనుచితముగాఁ గాలముగడుపుచున్నాన

నియుఁ, దాను ధనవంతుఁడయినను, గాకపోయినను జన్మమెత్తి యెన్నఁడు నితరులయొద్ద ఋణముచేసి యుండకపోవుటఁబట్టి ధనికునిగానే బరిగణింపఁబడుచున్న హేతువుచేఁ దానితరులయొద్ద ఋణమైన నడుగుట క్లిష్టములేదనియుఁ బార్థసారథితోఁ జెప్పెను.

తరువాతఁ బార్థసారథియుఁ, గామన్నయు, మొదలియారు మొదలగు నీనలుగురు పెద్దమనుష్యులును బసదిగియున్న బాయమ్మగారి యింటికివచ్చి మొదలియారుగారినిఁ బిలచుకొని సోమన్నయింటికి వచ్చిరి. పార్థసారథియు, గామన్నయు, నీసంగతంతయు మొదలియారుగారితోఁ జెప్పి తాముఁదలపెట్టిన వివాహకార్యమున కాటంకము వచ్చినదనిరి. కామన్న సోమన్నగారిని, మొదలియారుగారిని, ననేకవిధముల నతిదీనముగాఁ బ్రార్థింపనారంభించెను. తనకక్కఱయైన నారువందల రూపాయలు బదులిప్పించినచోఁ దిరిగి నాలుగైదుదినములలోఁ దనయింటివద్దనుంచి సొమ్ముదెప్పించి యడిగిన వడ్డీతో నిచ్చివేతునని యతిధారాళముగా ననేకపర్యాయములు చెప్పెను. పార్థసారథియొద్ద ద్రవ్యమించుకయు లేదనియు, నాతఁడింటియొద్దఁ దనవారికి వ్రాసినను, నెవరికివ్రాసినను నాతనినమ్మి యొకగవ్వయైన నెవ్వరిచ్చువారు లేరనియు, నాతఁడు బదులుపూర్వకముగాఁ బుచ్చుకొనిన సొమ్ము దిఱిగియిచ్చిన పాపము నిదివఱకెన్నఁడు గట్టుకొనని సచ్ఛీలుఁడనియు, మొదలియారుగారి కించుకయు దెలియకపోయినను సోమన్నగారికిమాత్రము జక్కగాఁ దెలియునని చెప్పుట కొంతమాత్రమును సందియములేదు. కాని సోమన్నగారికిఁ బార్థసారథి కేవిధముగానైన నీయారువందలరూపాయిల బదులును సమకూర్చి కామన్న వివాహముచేయించవలయునని మాత్రము కోరిక గలదని మనము ముఖ్యముగాఁ జెప్పవలసియున్నది. కామన్న యతిదీనత్వముతోఁ బలుకుమాటలనుబట్టియుఁ, బార్థసారథివంటి స్నేహితుఁడు సహాయార్థము ప్రార్థనాపూర్వకముగాఁ జెప్పుచున్న సంగతినిబట్టియు, వారుచేయఁదలపెట్టిన శుభకార్యము నెంచియు, దయాసముద్రుఁడును, స్నేహపాత్రుఁడును, పరోపకారపారీణుఁడును, మిక్కి-

లి మోమోటముగలవాఁడును, స్వాశ్రితపక్షపాతియు, నడిగినది లేదని చెప్పఁగల మనోధైర్యములేనివాఁడును, గావున నేమిచేయుటకును దోఁచక యూరకుండెను. కన్యాశుల్కముగొని చేయు నీవివాహమునకుఁ దాను సహాయముచేసి పాపము గట్టుకొనుటకొకవంకను బార్థసారథివంటి స్నేహితున కట్టిసమయమున నంతటి స్వల్పసహాయమును జేయకుండ స్నేహధర్మము నించుకయినఁ బాటింపకుండఁ గేవలము స్వార్థబుద్ధిచేఁ జేతగానివానివలె నూరకుండుటకొకవంకను దనయంతరాత్మ దన్ను బాధించుచుండఁ బరోపకారపరాయణత్వమే పరమధర్మమని నిశ్చయముగాఁ ద్రికరణశుద్ధిగా నమ్మిన సద్గుణగరిష్ఠుఁడగు నామొదలియారుగారిహృదయధర్మమప్పుడెట్లుండెనో చదువరులే గ్రహించుకొనవలయును.

అంత వీనలుగురును గామన్న వివాహార్థ మివ్వవలసిన యారువందల రూపాయీలును సముకూర్చు విషయమునుగూర్చి యాలోచించుచు ఋణము సంపాదించు సాధనములను గూర్చియు, మార్గములనుగూర్చియు నన్వేషింపుచు గొంతకాలము గడపి యితరులయొద్ద నాయూర బదులుచేయుట దమకు గౌరవహానియనియుఁ, దమవంటి యూర్జితమెఱిగిన గృహస్థుల కుచితముగాదనియు నిశ్చయించిరి. కాని కామన్న వివాహమునకు ద్రవ్యలోపమున నాటంకము గలుగుటకును నాశుభకార్యమునకు భంగము గలుగుటకును స్వలాభాపేక్షితుఁడగు గామన్నకటుండఁ దక్కినవారికిఁగూడ నించుకయిన నిష్టములేదని మనము స్పష్టముగా నొప్పుకొనక తప్పదు. అట్టిసమయమునఁ బార్థసారథికిని గామన్నకును సోమన్నగారు దప్ప సహాయముచేయువారెవ్వరును గనుపించకుండిరి. తన్నెంత బ్రతిమాలినను నెంతదీనతతోఁ గామన్న గాళ్ళుబట్టుకొని ప్రార్థించినను సోమన్న యితరులయొద్దనైన బదులుపూర్వకముగా నొకగవ్వయైన నిప్పించుటకు సహాయపడకుండెను. కామన్న దీనత్వమును బార్థసారథి కార్యాతురతయుఁ జూచియు, వివాహమువంటి యత్యుత్కృష్టమును నిహపరసాధనమును నగు శుభకార్యమున కాటంకము గలుగనున్నదని గ్రహించియు, మొదలియారుగారు మిక్కిలి జాలిపడి తానుగూడ నేవిధముగానైన

చా మూరనున్న దనపరిచితులలో నెవరియొద్దనైన ఋణమిప్పించక తప్పదని సోమన్నగారిని యనేకవిధములుగాఁ బ్రతిమాలెను. అప్పుడు సోమన్న దూరమాలోచించి బంగారపువస్తువులను దీసికొని రాఁగలిగినచో నవి కొదువబెట్టి సొమ్ముదీసికొని వత్తుననియు, నావస్తువులనైన నతిరహస్యముగాఁ దనకు నమ్మకమైన స్థలమున నతిగోప్యముగా నుంచి బదులు తీసికొనిరావలయునుగాని యట్లుగాకపోయినచోఁ దన కాయూరఁగల గౌరవమునకును బరపతికిని భంగము గలుగుననియుఁ, జెప్పెను. పార్థసారథియొద్ద నాటకప్రయోగమునకుఁ గావలసిన తెఱలును, దుస్తులును, నితరసామగ్రియుఁ దక్క గొదువపెట్టఁదగిన వస్తువులేమియు లేవు. కామన్నయొద్దనున్న వెండి బంగారపువస్తువులు రెండును నమ్మివేయుటకిదివఱకే నిశ్చయింపఁబడినవి. ఇట్టిస్థితియందుఁ దమకేయుపాయమును దోఁచక పార్థసారధియు మిక్కిలి తొట్రుపాటుతోఁ గామన్నసోమన్నయుగారిని మిక్కిలి దీనత్వముతోఁ బ్రతిమాలుకొనుచుఁ బ్రార్థింపనారంభించిరి. అప్పుడుపార్థసారథితోఁ దనకుఁగల స్నేహభావమును గార్యావసరమునుదలఁచి, యాపద్బాంధవుఁడును, దయాసముద్రుఁడును, బరోపకారపారీణుఁడును నగు మొదలియారు వివాహకార్యమునకు భంగము గలుగకుండఁ జేసిన పుణ్యము దనకరతలామలకముగా నుండునట్టి యలభ్యయోగమగు నదృష్టమును బొందకుండుట కేవలమవివేకలక్షణమును మూర్ఖత్వసూచనమును స్వార్థత్వప్రకటనమును నని తన బుద్ధిబలముచే నిముసములో గ్రహించి వారముదినములలోఁ దిరిగి తనవస్తువులు దనకియ్యఁగలిగినచోఁ దనచెవులనున్న వజ్రములతోఁగట్టబడిన యంటుజోడు నిచ్చెదనని చెప్పెను. సోమన్నగారు మొదలియారుగారి యౌదార్యమును, బరోపకారబుద్ధిని, స్నేహమును జాలమారము గొనియాడిరి. పార్థసారథి మొదలియారుగారితోఁ దుల్యమైన స్నేహితుని దానెన్నఁడును జూడలేదనియు నట్టి యాపద్బాంధవుఁడగు ప్రాణమిత్రుఁడు దనకులభించుట కేవలము దైవయోగముపలన గలిగిన మహాభాగ్యమనియుఁ జెప్పి, యాతనికిఁ గృతజ్ఞతాపూర్వకవందనము లనేకములర్పించి, యాతని సద్గుణముల ననేకవిధములుగాఁ

గొనియాడెను. కామన్న సంతోషమింతింతని చెప్పశక్యమేకాదు. ఆతఁడు మొదలియారుగారి రెండుపాదములు బట్టుకొని తనయందు నిర్హేతుకజాయమానకటాక్షముతోఁ గేవలము పరోపకారబుద్ధితో నామహాపురుషుఁడు దనకుఁ జేయసాహసించిన మహోపకారమునకుఁ గృతజ్ఞతాపారవశ్యమున నొడలెఱుంగకఁ దనయంతరంగస్థితమగు కృతజ్ఞతాభావమును నుచితమగుదానికన్న నెక్కువగాఁ గనపఱచుచు నాసమయమున నాతఁడు మితముదప్పి ప్రవర్తించిన కారణముచేతనో, మొదలియారట్లు కామన్న దన కృతజ్ఞతాప్రకటనము జేయుటకంగీకరింపకఁ దనయుద్దేశమును మాటలచేతను జేష్టలచేతను నివారింపఁజేయు సాధనముల గారణముననో, మనము స్పష్టముగాఁ జెప్పలేముగాని సోమన్నగారి వీధిచావడిలో గుర్చీమీదనున్న యీయుదారసాహసచక్రవర్తి యొకటిరెండు నిముసములలోఁ గ్రిందపడ దయచేసి, యింత పరోపకారము నాచరించిన హేతువుచేఁ దనయంతరాత్మకుఁ గలిగిన సంతుష్టివలనను శాంతిమూలమునను బొందిన సౌఖ్యమును జగద్విదితము చేయుటకోయన వెల్లగిలఁబడి విశ్రాంతిఁ జెందెను. అంత నీమహాపురుషుడీవిధముగా దీర్ఘకాలము విశ్రాంతి జెందుచున్నచోఁ బరోపకారమడుగంటునని యెంచి సోమన్నయుఁ బార్థసారథియుఁ జెరియొకచెయ్యిఁ బట్టుకొని నెమ్మదిగాఁ దమ బలమంతయు వినియోగపఱచి యుచితాసనముపైఁ గూర్చుండఁబెట్టిరి. కాని శాంతస్వభావుఁడగు మొదలియారు దన్నావిధముగా విశ్రాంతిఁ జెందకుండఁ జేసినందుకు వారిపై నించుకయిన విసుగుజెందకఁ దానుచేసిన సత్కార్యమువలనఁ దన యంతరాత్మకు గలిగిన సంతుష్టిని మహానందమును మందహాసముచేఁ బ్రకటించి యనిత్యమగు దనశరీరమునకు సంభవించిన యాయాసమును నించుకయిన లక్ష్యముచేయలేదు. తరువాత మొదలియారుగారు గొదువబెట్టుకొఱకిచ్చెదనని వాగ్దానముచేసిన యంటుజోడువలన నారువందల రూపాయిలవఱకు ఋణము లభింపదని సోమన్నగారు చెప్పిరి. తానుచేయ వాగ్దానముచేసిన సహాయము గొఱతపడి యసంపూర్ణముగానుండుటకును, గార్యావసరమునకుఁ జాలియుండక పోవుటచే

నిష్ప్రయోజనముగాఁ బరిణమించుటకును, మొదలియారుగారి కించుకయిన నిష్టములేకఁ దనస్నేహితులగు నాయుఁడుగారియొద్దను, బిళ్ళగారియొద్దను, శెట్టిగారియొద్దను నున్న వస్తువులను గూడనిప్పింతునని యాయనచెప్పిరి. మహాపురుషులు దాముచేయఁ దలపెట్టిన యుపకారములనెన్నఁటికిని యసంపూర్ణముగను నసంతుష్టికరముగను నర్ధామోదకరముగను జేయరుగదా! తాముదలపెట్టిన కార్యములకెట్టివిఘ్నములును నాటంకములును దటస్థించినను నెట్టిప్రయత్నప్రయాసలకైననోర్చి నిర్వహించుట సాహసౌదార్యచేతస్కులగు సత్కార్య దీక్షాపరులకుసహజలక్షణమనుట కించుకయు సందియములేదు.

తరువాత మొదలియారుగారు పార్థసారథిని దీసికొని బసకువచ్చి తన స్నేహితులతోఁ జెప్పవలసినరీతినిఁ జెప్పి వారినొప్పించి నాయుఁడుగారి చెవులనున్న వజ్రపుటంటుజోడును, శెట్టిగారిచేతినున్న బంగారు గొలుసులను, బిళ్ళగారియొద్దనున్న యుంగరములను దీసికొని కార్యసానుకూల మొనర్పఁగలిఁగిన కారణమువలనఁ దనయంతరాత్మకప్పుడు గొప్పసంతుష్టియు, నానందమునుఁ గలుగఁ, బార్థసారథి దనకు వారుచేసిన మహోపకారమునకుఁ దన కృతజ్ఞతాపూర్వకవందనములనైన నర్పించుట కించుకయిన నవకాశము గలుగకుండ మిక్కిలి సంతోషములో నాతనిచెయ్యి పట్టుకొని పరుగుపరుగున సోమన్నగారి యింటికిఁ దిరిగివచ్చెను. సోమన్నగారి వస్తువుల నన్నిఁటినిఁ దీసికొని వాటినిఁ దనవేశ్యయొద్ద గొదువఁబెట్టిన యెడల నీవ్యవహార మతిగోప్యముగా నుండునని యు, లేనిపక్షమునఁ దనకటుండ నింతపరోపకారబుద్ధితో పార్థసారథియందు దమకుఁగల స్నేహభావమును బరిగణించి చేసినసహాయమున కట్టిమహాపురుషులకుఁగూడ గౌరవహాని దప్పకఁ జేకూరుననియు, వారము పదిదినముల వ్యవహార మితరులకుఁ దెలియునట్లు చేయుటుచితముగాదనియుఁ జెప్పెను. పార్థసారథియుఁ, గామన్నయుఁ, గార్యావసరములనుబట్టి యత్యాతురతతోఁ గన్యాశుల్కమునకుఁ గొఱఁతపడిన సొమ్మేవిధముగానైన సమకూర్పవలయునన్న యాతురతచేతను, మొదలియారు పార్థసారథికి సహాయమొసఁగి తనస్నేహపాత్రతను

బోపకారబుద్ధిని బ్రకటీకృతము చేయవలయునన్న యభిప్రాయముచేతను, సోమన్న చెప్పిన సలహాయొక్క యుచితానుచితముల నించుకైన గ్రహింపలేదు. తరువాత సోమన్న గారివస్తువుల నన్నిటిని దీసికొని తనవేశ్యయింటికిం బోయి మరల దిరిగివచ్చి దానియొద్దగూడ సొమ్ము సిద్ధముగా లేకపోవుటచేం గార్యావసరమునుబట్టి నాఁడు శుక్రవారమని వాళ్ళెంతసంశయించినను బలవంతముమీఁద మఱియొక యింటికిం బంపి సొమ్ముదెప్పించుట కేర్పఱిచి వచ్చితినని చెప్పి వారితో మాటలాడుచు గూరుచుండెను. సోమన్న రెండుమూడు పర్యాయములు త్వరగా సొమ్ముదీసికొనిరమ్మని తనసేవకులను బంపినను రెండుగంటలవఱకు నావేశ్యయింటనుండి సొమ్మురాలేదు. ఈరెండుగంటలకాలములోపలను పార్థసారథియు గామన్నయు మిక్కిలి యాతురతతో నిముసమొక యేఁడుగాఁ గడపిరి. మొదలియారుగూడ సొమ్మువచ్చినతోడనే బసకుఁ బోవలయునని వేచియుండెను. సోమన్న మాత్రము పొడుముపీల్చుచు స్వస్థచిత్తతతో నవ్వుచుఁ దనకాపట్టణమునఁగల గౌరవమునుగూర్చియుఁ, దనయోగ్యతనుగూర్చియుఁ, దనవేశ్యయొక్కయు చిత్రప్రవర్తనమునుగూర్చియు, మర్యాదనుగూర్చియుఁ, దనకొమార్తెల యమాయికవ్యాపారమునుగూర్చియుఁ, జెప్పుచుఁ దనకాపట్టణమునగల యాప్తులలో నెంతెంతధనవంతు లెందఱందరున్నను దానెన్నఁడును వారి నొక తృణమైన నుచితముగాఁగాని ఋణముగాగాని యడిగి పుచ్చుకొనకుండుటఁ బట్టి దానట్టిగౌరవమును, మర్యాదయు, బరపతియు గలిగియుంటినని చెప్పెను. సోమన్న యుచితముగాగాని, ఋణముగాగాని యెన్నఁడును నెవ్వరియొద్దను నొకతృణమైనఁ బుచ్చుకొనలేదని చెప్పినమాట వాస్తవమని మనమొప్పుకొనక తప్పదు. ఏలన; నాతఁడు చోరశిఖామణియుఁ జోరులకు గురువును, మాయోపాయము లనేకముగాఁ బన్ని ధనము గ్రహింపఁగల నిపుణత్వముగలవాఁడును వైదికతంత్రములలోఁ దన గ్రామపౌరోహిత్యపదవిని బట్టి ఫలాపేక్షచే నాపురవాస్తవ్యులచే నర్పింపఁబడిన ధనమునుమాత్రమే గ్రహించుచుండును గావునను దానముగవలసిన యవసరములేకయే నితరులయొద్ద నీతఁడు

వైదికలౌకికతంత్రములచే నుభయమార్గములుగను దన నిపుణత్వమంతయు విని యోగపఱచి యనేకోపాయములచే ద్రవ్యమార్జింపఁగల గొప్పప్రయోజకుఁడే నిమనమొప్పుకొనక తప్పదుకావున నీతఁడు చెప్పినమాట వాస్తవమనియు యథార్థమనియుఁ జెప్పవలసియున్నది.

ఇట్లు వీరు నలుగురు మాటలాడుకొనుచు దాదాపు రెండుగంటలకాలము గడచినతరువాత సోమన్నగారి వేశ్యయింటియొద్దనుండి యొకడు రూపాయిలు దీసికొనివచ్చి సోమన్నగారికిచ్చెను. సోమన్నగారా రూపాయిలు తెచ్చిపెట్టి మొదలియారుగారి కొప్పగించిరి. మొదలియారా యారువందల రూపాయిలును పార్థసారథికిచ్చెను. పార్థసారథి యారూపాయిలు దీసికొని మొదలియారు దనకుఁజేసిన సహాయమునకును నాతని స్నేహపాత్రతకును బరోపకారబుద్ధికిని నాతని ననేకవిధములు గొనియాడి వారము పదిదినముల లోఁ దిరిగి యారూపాయిలు సోమన్నగారి వేశ్యకిచ్చి కుదువపెట్టిన వస్తువులను మొదలియారుగారి కిచ్చివేతునని వాగ్దానముచేసెను. కామన్న, మొదలియారుగారు దన వివాహవిషయమై చేసిన మహోపకారమున కాయనను మిక్కిలి శ్లాఘించి తన్నొక యింటివానిఁగాఁజేసి కృతజ్ఞతాపాశబద్ధునిగాఁ జేసినందులకాయన పాదములుబట్టుకొని యాయన దనకు చేసిన యుపకారమునకుఁ దాను ప్రత్యుపకార మాచరించుటకుఁ సమర్థుఁడు గాకపోయినను దన వంశమున్నంతవఱకుఁ బిల్లపిల్లతరముగా విశ్వాసము గలిగియుందునని చెప్పె, పార్థసారథియు సోమన్నయుఁ దనకొనర్చిన మహోపకారమునకు వారిని శ్లాఘించెను. తరువాత మొదలియారుగారును పార్థసారథియుఁ దమతమ బసలకుఁ బోయిరి. సోమన్నగారు వివాహమునకుఁ గావలసినవస్తువులయు సమకూర్చి సిద్ధముగానుంచెదననియు నామరునాడు తప్పక వివాహముచేయుట కించుకైన నాటంకముండదనియుఁ జెప్పెను. కామన్న దనకృతజ్ఞత పట్టజాలకఁ బరుగుపరుగున సోమన్నగారి వేశ్యయింటికిఁ బోయి సమయమునకు రూపాయిలిచ్చి కార్యావసరము గడపినందుల కావేశ్యను నామె కొమార్తెా

లకు, మిక్కిలి శ్లాఘించి పార్థసారథి బసకువచ్చి, యాతనితో వివాహప్రయత్నములను గూర్చి చెప్పి, మధ్యాహ్నము నాలుగుగంటలకు సోమన్నగారి బసకుఁ దాను వివాహమాడ నిశ్చయించుకొన్న కన్యను నాకన్య పినతండ్రినిఁ దల్లిని దీసికొనివచ్చెదనని చెప్పి వారు బసదిగియున్న యింటికిఁబోయెను. కన్యాశుల్కముగానిచ్చుటకొప్పుకొనిన యెనిమిదివందలరూపాయిలును సిద్ధముగానున్నవనియు, నామఱునాఁడు దప్పక నాదికేశవస్వామి యాలయమున వివాహము నిశ్చయింపఁబడినదనియు, వారితోఁ జెప్పెను. ఆబ్రాహ్మణుఁడామాట విని మిక్కిలి సంతోషించి తన యన్నకొమారునకు వివాహముచేయ నిశ్చయించుకొన్న కన్య నాపుటకు వీలులేదనియు, నాకన్య దమకుఁ గావలసినయెడలఁ దక్షణమే కన్యాశుల్కముగా నియ్యనిశ్చయించుకొన్న సొమ్మిప్పించి వివాహము నిశ్చయించుకొనవలసినదనియుఁ, దనకప్పుడే యింటియొద్దనుండి యుత్తరమువచ్చినదనియుఁ గామన్నతోఁ జెప్పి, యొకయుత్తరమాతనికిఁ జూపించి తానాపట్టణమునకువచ్చినవేళ యత్యుత్కృష్టమైనదనియుఁ, దనయన్నకొమారితకును గొమారునకును వివాహములు సమకూరెననియుఁ, నామఱునాఁడు వివాహమైన తక్షణమే యింటికిఁబోయి తనయన్న కొమారుని వివాహార్థమియ్యవలసిన కన్యాశుల్కమిచ్చి యాసంబంధము నిశ్చయించుకొని వెంటనే దిరిగివచ్చెదననియుఁ, గామన్నతోఁ జెప్పెను. కామన్న దనవివాహము ద్వరలోఁ గావలయునన్న యాతురతతో నుండుటచే నాబ్రాహ్మణుఁడాడిన మాటలను జక్కగా వినకఁ దనయత్తగారిని జూచి యామెతోఁగూడ నీసంగతంతయుఁ జెప్పి, వివాహమునకుఁ జేయవలసిన ప్రయత్నములన్నియు సోమన్నగారు చేయించుచున్నారనియు, వారి యింటికా సాయంత్రము నాలుగు గంటలకుఁ దప్పక కన్యను దీసికొని రమ్మనియుఁ గోరెను. కామన్న యత్తగారాతఁడుచెప్పిన మాటలు విని యాప్రకారము నాలుగు గంటలకు సోమన్నగారి యింటికిఁ బిల్లను దీసికొని వచ్చెదనని చెప్పి, పెండ్లికొమారితయగు దనకూతున కభ్యంజనముచేయించి యొకక్రొత్తచీరయైనఁ గట్టఁబెట్టుట

కు వశవర్తురాలై యుంటినని కన్నీరుఁగార్చెను. అప్పుడు కామన్న పార్థసారథిబసకుఁ బరుగెత్తి కొన్నిరూపాయలు దీసికొని యొకక్రొత్తచీరెయు, రైకయు, బసుపుకుంకుమముఁ గొని పరుగుపరుగునఁ దిరిగివచ్చి తనయత్తగారికిచ్చెను. ఆమె యవియన్నియు గ్రహించి తనకొమార్తెను దీసికొనివచ్చి "నీమగఁడు నీకొఱకివియన్నియుఁ దీసికొనివచ్చినాఁడమ్మా" యని యాకన్యతోఁజెప్పి, దాని నభ్యంజనముచేయించి పెండ్లికొమార్తెను జేసి సాయంత్రమందఱుఁగలసి సోమన్నగారి యింటికి వత్తుమనెను. తరువాత కామన్న మొదలియారుగారి బసకు వెళ్ళి యచ్చటనున్న మొదలియారుగారిని వారిస్నేహితులనుఁ దనతనివిదీరునట్లును వారికి విసువుపుట్టునట్లును శ్లాఘించి సాయంత్రము నాలుగుగంటలకు సోమన్నగారియింటికి తప్పక దయచేయుఁడని కోరెను. కామన్న యాదినమంతయుఁ బార్థసారథిబసకును, మొదలియారుగారిబసకును, దానువివాహమాడ నిశ్చయించుకొన్న కన్యయున్న బసకును, సోమన్నగారి యింటికిని, నాయనవేశ్య యింటికిని దిరుగుచు మిక్కిలి యాతురతతోఁ గడపెను. మొదలియారు తానుగామన్న వివాహార్థ మియ్యవలసిన కన్యాశుల్కమునకుఁ దన తమ్ముంటుజోడును దన స్నేహితులయొక్క వస్తువులను గొదువబెట్టి సొమ్మిచ్చినసంగతి బాయమ్మగారికించుకయుఁ దెలియలేదు. ఈసంగతియామెకుఁ దెలియుటకు వీరెవ్వరికి నిష్టములేకపోవుటచే వీరెవ్వరును బాయమ్మగారితోఁ జెప్పక నతిగోప్యముగా నుంచిరి. తమ సేవకులగు రాముఁడును గుప్పుసామియు రహస్యము దాఁచ నేరని యవివేకులును యుచితానుచితములను గ్రహింపఁజాలని యజ్ఞానులును గావున వారికీవిషయమును గూర్చి తెలియనియ్యఁగూడదని వీరునలుగురును జక్కఁగా గ్రహించిరి. కాని రాముఁడును గుప్పుసామియు మొదలియారుగారి యాతురతను గనిపెట్టియు వీరు నలుగురును జేరి గుసగుసలాడుచు రహస్యముగా మాటలాడుకొనుచున్న సంగతిని గ్రహించియు మొదలియారుగారంతకుఁ బూర్వమొకసారి బసకువచ్చి తనస్నేహితులతో నేమో రహస్యముగా మాటలాడి తక్షణమే తిరిగ పోవలసెఁబోయి రెండుమూడుగం

టలవఱకింటికి రాకపోవుటయు నాలోచించియుఁ దన యజమానులేదో రహస్యవ్యాపారమును దలపెట్టి తమకుఁ దెలియకుండఁ జేయుచున్నారని మాత్రము నిశ్చయించుకొని దృఢముగా నమ్మిరి. కామన్న వివాహమునకియ్యవలసిన కన్యాశుల్కమునకుగావలసిన ద్రవ్యమును వీరు తమవస్తువులను గొదువపెట్టి సహాయముచేసిరని రామునకుగాని కుప్పుసామికిఁగాని యించుకయుఁ దెలియదని మనము నిశ్చయముగాఁ జెప్పఁగలము. బాయమ్మకుఁగాని కాంతయ్యపాత్రునకుఁగానియీవిషయమును గూర్చి తెలియనే తెలియదు. బాయమ్మగారాదినమున స్త్రీల సభలోఁ జదువుటకేర్పఱచుకొన్న స్త్రీవిద్యనుగూర్చియు స్త్రీల స్వాతంత్ర్యతను గూర్చియు నొకవ్యాసమును వ్రాయుచుఁ దనభర్తతోఁగాని శ్రీనివాసముతోఁగాని మాటలాడుటకైనవ్యవధిలేక పనిచేయుచుండుటచే నీవిషయమునుగూర్చి యించుకయైన ననుమానపడుటకైన నామెకు వీలుగలిగినదికాదు.

తరువాత సాయంత్రము నాలుగుగంటలు కాకపూర్వమే పార్థసారథియుఁ గామన్నయు సోమన్నగారి యింటికిఁబోయిరి. సోమన్నగారప్పటికింకను దనవేశ్యయింటనుండి రాకపోవుటచేఁ గామన్న ఆయనకొఱకా వేశ్యాగృహమునకుఁ బోయెను. పార్థసారథి మొదలియారు మొదలగు స్నేహితులను సోమన్నగారియింటికిఁ దీసికొనివచ్చుటకు వారిబసకుఁ బోయెను. మొదలియారుగారి బసకీతఁడు వచ్చునప్పటికినలుగురును సోమన్నగారియింటికిఁ బయనమై పోవ ప్రయత్నమున దుస్తులను దొడుగుకొనుచుండిరి. పార్థసారథిని జూచినతోడనే వీరు మిక్కిలి గౌరవముతో నాహ్వానించి కొంచెమైన నాలస్యముచేయక యాతనితో బయలుదేఱి సోమన్నగారియింటికివచ్చిరి. కాని సోమన్నగారును గామయ్యయు నింకను రాకపోవుటచే నీయైదుగురును గలసి మాటలాడుకొనుచు సోమన్నగారియింట వీధిసావడిలోఁ గూర్చుండిరి. సోమన్నకొఱకు గామన్న యొకగంటవఱకు నావేశ్యాగృహమున వేచియుండి యాయన యాగృహమునఁ జేయుచున్న గృహకృత్యముల నెల్ల నెఱవేర్చి ఫలహారము చేసినతరువాత నాయనతోఁ గలిసి సోమన్నగారియింటికి వచ్చునప్పటికైదు గంటలు దాఁటినది.

అప్పుడు సోమన్నగారితోఁ గలసి వీరందఱు గామన్న వివాహము నిమిత్తము చేయవలసిన యేర్పాటులనెల్ల చేసిరి. కామన్న వివాహమాడ నిశ్చయించుకొన్న కన్యయు, నాకన్య తల్లియుఁ, బినతండ్రియు, నింకనుఁ బూర్వమే వచ్చి సోమన్నగారి భార్యతో మాటలాడుచు లోపలఁగూరుచుండిరి. సోమన్నగారు వచ్చినతరువాతఁ బెండ్లికూఁతును దీసికొనివచ్చి యామెపినతండ్రి సోమన్నగారికి నమస్కరింపఁజేసి తాను వివాహమైనవెంటనే యింటికిఁ బోయి తన యన్నకొమారునకు గన్య నియ్యవచ్చి యున్నవారి కియ్యవలసిన కన్యాశుల్కమిచ్చి వివాహము నిశ్చయపఱచుకొని యొకటిరెండు దినములలోఁ దిరిగివత్తుననియు, నంతవఱకుఁ దన వదినెయుఁ బెండ్లికొమార్తెయు నాపట్టణముననే యుందురనియుఁ, జెప్పెను. తన వివాహమైనతరువాత నాతఁడెక్కడకుఁ బోయినను దనకు నిమిత్తములేదని కామన్న యాతఁడు చెప్పినదానికెల్ల నొప్పుకొనెను. మొదలియారు మొదలగు నీనలుగురును బార్థసారథియుఁ దప్పక నామఱునాఁడే వివాహము నిరాటంకముగా జరగు సాధనములను సమకూర్చి వివాహప్రయత్నములనెల్ల సత్వరముగాఁ జేయింపుఁడని సోమన్నగారిని ద్వరపెట్టిరి. సోమన్న వివాహమునకుఁ గావలసినవన్నియు సమకూర్చుటకొప్పుకొని యామఱునాఁడు రాత్రి 8 గంటలకు ఆదికేశవస్వామి యాలయములోఁ గామన్నకు వివాహము చేయించుటకుఁ జేయవలసిన యత్నములన్నిటిని మిక్కిలి శ్రద్ధతోఁ జేయింపనారంభించెను. తరువాత వీరందఱు గలసి కామన్న వివాహమునుగూర్చి చేయవలసిన యేర్పాటులవిషయమై మాటలాడుకొనిరి. అంత సోమన్న పార్థసారథిని మొదలియారు మొదలగు నీనలుగురిని దీసికొని తన వేశ్యయింటికిఁ బోయెను. కామన్న తన యత్తగారితోను బినమామగారితోను బెండ్లికొమార్తెతోను వారి బసకుఁబోయి యచట నొకటిరెండు గంటలు వారితో ముచ్చటలాడుచుఁ గడపి సోమన్నగారి యింటికిని, నాతఁడచ్చట లేకపోవుటఁ బట్టి యాతని వేశ్యయింటికిని బోయి రాత్రి పదిగంటలకుఁ దనబసఁ జేరెను.

పార్థసారథి తనకుఁజేసిన సహాయమునకును గార్యావసరమునకు సొమ్ము సర్దుబాటుచేసిన మహోపకారమునకును నావేశ్యను శ్లాఘించి మొదలియారుగారి స్నేహపాత్రతను గూర్చియుఁ బరోపకారబుద్ధిని గూర్చియు మిక్కిలి కొనియాడెను. మొదలియారుగారు స్నేహితు లొండొరులకు సహాయము చేసికొనకపోయినచో వారిస్నేహమువలనఁ బ్రయోజనమేమియు లేదనియు, నన్యోన్యసహాయము స్నేహమునకుఁ బ్రధానలక్షణమనియుఁ జెప్పిరి. కన్యాదానఫలమత్యుత్కృష్టమని శాస్త్రములు ఘోషించుచున్నవనియు వివాహకార్యమునకు సహాయముచేయుట మిక్కిలి పుణ్యమనియు గార్యావసరసమయమునకు సొమ్ము సర్దుబాటుచేసి సోమన్నగారును నాతోఁ వేశ్యయుఁ నాపుణ్యమునుగట్టుకొన్నారనియుఁ శెట్టిగారు సెలవిచ్చిరి. పిళ్ళగారును, నాయుఁడుగారును, సోమన్నగారి వేశ్యయొక్క యుచితజ్ఞతకునుఁ, గామన్న వివాహమునకుఁ జేసిన సహాయమునకును మిక్కిలి సంతోషించుచు మాటలాడిరి. సోమన్నగారు తనవేశ్యయొక్క సత్స్వభావమును గూర్చియుఁ, దనకొమాళ్ల యమాయికవ్యాపారమునుగూర్చియు ననేకవిధములుగాఁ జెప్పిరి. మఱియుఁ దనవేశ్య వివాహమాడిన కులస్త్రీలకన్న నత్యుత్కృష్టమైన సచ్ఛీలముగలదనియు, వేశ్యాకులము నజన్మించిన లోపమొక్కటి తప్ప దానియందేదోషములును లేవనియు, జాతికన్న గుణమే ప్రధానమనియుఁ దనకొమాళ్లిద్దఱును గుణసమృద్ధియందును, సచ్ఛీలములందును, నద్వితీయులనియుఁ, దనకొమాళ్లనుగూర్చి తాను జెప్పుకొనుట మంచిదికాదనియుఁ జెప్పి వారిని బాల్యదశనుండియుఁ దాను విశేషశ్రమకోర్చి పెంచినవిధమును, వారి సౌకుమార్యమును, అమాయికవ్యాపారమును, వివేకమును, దెలివిని, ఉచితానుచితజ్ఞానమును యథేచ్ఛముగాఁ గొనియాడెను. తరువాత సోమన్న తనకొమాళ్లు ప్రతిదినమును దాను స్వయముగా నన్నము గలిపిపెట్టినఁగాని దినకుండినంత ప్రేమానురాగములు దనయందుఁ గలిగియుండుటచే వారికిఁ దానే స్వయముగా నన్నము బెట్టి పెంచుచున్నాననియు, దాను స్వయముగా వారియుపచారముల నెల్లఁ జే

సినగాని వారికిఁ దృప్తికరముగా నుండకపోవుటచేఁ దమ శరీరసౌఖ్యములను గూడఁద్యజించి తనకొఱకు మిక్కిలి బెంగతోఁ గనిపెట్టుకొని దిక్కులు చూచుచు గూరుచుండునంతటి యమాయికులు గావున వారిబాధ్యతంతయుఁ దనయం దేయున్నదనియుఁ, దాను బ్రతికియున్నంతవఱకు వారికేలోపమును రాదనియు, దన యనంతరము వారెట్లు జీవింతురో తెలియదనియు, నంతకును దైవమేయు న్నాఁడనియుఁ, జెప్పి తన యనంతరము తనకొమార్తెల యసహాయత్వమును దలఁచుకొని యతిదీనముగా గద్గదస్వరముతోఁ గన్నీరించుక గార్చుచుఁ బలికెను. మొదలియారుగారును, శెట్టిగారును సోమన్నగారి క్షేమము మిక్కిలి సంతోషించిరి. సోమన్నగారి వేశ్య యీమాటలన్నియు విని తనకొమార్తె లను లేనిపోని గారాబముతో నెత్తి నెక్కించుకొని తిరుగుచుఁ బాడుచేయు చున్నారనియు, వారాటపాటలనేమఱి మూర్ఖులై పాడగుటకుఁ గూడఁ గా రణభూతులగుచున్నారనియుఁ, దనకొమార్తెలు కొంచముగనో గొప్పగనో పూర్వజన్మమున విద్యాదానము చేసి పుట్టిన హేతువునుబట్టి స్వభావమువలనఁ దెలివిగలవారుగనుకఁ దండ్రి వారికెంత చనువుచేసినను కొంచెము సంగీతము నేర్చుకొని చక్కఁగాఁ బాడనేర్చిరనియుఁ, దనభర్తను సాధించెను. పిళ్ళగా రును, నాయుఁడుగారును నావేశ్యల సంగీతమెన్నఁడు వినియుండకపోయినను వారు సంగీతశాస్త్రపారంగతలనియే నమ్మియుండిరి. శెట్టిగారు సంగీతవిద్య గాంధర్వాంశ గలిగి పూర్వజన్మసుకృతము గలవారికేఁగాని యన్యుల కలవడ దనిరి. ఇట్లు వీరందఱు రాత్రి యెనిమిదిగంటలవఱకు మాటలాడుకొని యెవరి యింటికివారు పోయిరి.

కార్యావసర ముచితానుచితములను గ్రహింపఁజేయ నేరదు గదా! జనులు దాము కార్యావసరమును బట్టి యవలంబించిన మార్గముచితమైనదో యనుచిత మైనదో తామాయవసరమును బట్టి కార్యసానుకూలము కొఱకుఁ బన్నిన యు పాయములవలనఁదమకు నష్టము సంభవించునో లాభముగలుగునో తోఁచుట దు ర్ఘటముగదా! కపటస్వభావముగల దుర్మార్గులగు తుచ్ఛితులు జనుల కార్యావసర

సమయమును బట్టి యెన్నెన్ని మాయోపాయములనైనఁ బన్ని వారినివంచించి లేనిపోని బాధలకుఁ బాలుచేయుచుందురు గదా! ఎంతటి బుద్ధిశాలులకయిన నను దూరాలోచనపరులకైనను గార్యావసరమును బట్టి యొకానొకప్పుడు వివేక మడుగంటును. దుర్మార్గులగు కుచోద్యుల మాయోపాయములను గనిపెట్టుట మిక్కిలి కష్టము. ధనాశ యెంతెంత కార్యములనైనఁ జేయించును. అమాయికత్వమును, సహిష్ణుత్వమును, నమ్మికయు, శక్తివానికిని జేతఁగానివానికిని సమాజలక్షణములని కార్యశీలురగు కుచ్చితులు దలపోయుచుందురు. ప్రపంచస్వభావమును జనులస్వభావములను గనిపెట్టుటకన్నఁ గష్టసాధ్యమైన పనియింకొకటిలేదు. సమయోచిత జ్ఞానమెంత శాస్త్రపాత్రమైన దైనను జనుల నెవ్వరిని గూడనమ్మకవిశ్వాస ముంచకయులేక ప్రవర్తించుచు నమితలాభముల నందుటకన్న విశ్వాసము గలిగి నమ్మి నష్టముల పాలగుటయే యుచితమని కొందరూహించుచుందురు. ప్రపంచమంతయు దుర్గుణ భూయిష్ఠమైనదనియుఁ జనులందరు. విశ్వాసానర్హులనియుఁ దలఁచుచు జాగరూకతతోఁ బ్రవర్తించి లాభమందుట కన్న ప్రపంచమునుగూర్చియు జనులనుగూర్చియు సదభిప్రాయముతో సంచరించి నష్టముల పాలగుటవలన జనులకు హృదయశాంతియు మనస్సంతుష్టియుఁ గలుగును. పరుల యింగితము గ్రహింపఁగలుగుట మిక్కిలి కష్టసాధ్యము. కపటకల్మషము లెఱుఁగక విశ్వాసముతో నమ్మిన స్నేహితులే మాయాశీలురై కుచోద్యముగలిగి వంచించి మోసముచేసిన చో నెవ్వరేమి చేయఁగలరు. అట్లు జనులనునమ్మించి వంచించిన మోసకారులను ఘాతుకులను విషసర్పములవలెను క్రూరవనసత్వములవలెను పరిగణించి మనుష్యసంఘమునుండి బహిష్కారము చేసి క్రూరవన్యములవలెను విషసర్పములవలెను రూపుమాపఁ బ్రయత్నించుట ధర్మముగాని యట్టివారి వాతఁబడి కష్టముల పాలయిన యమాయికస్వభావము గల సాధుజనులను ప్రాపంచికజ్ఞానరహితులనియుఁ, జేతఁగానివారనియు నెంచి తూలనాడుట ధర్మముగాదు. మాయోపాయము గలిగి స్వార్థపరాయణులై సంచరించు చతురులను గార్యసాధకులనియుఁ, బ్రయోజకులనియుఁ, బ్రాపం

చికజ్ఞానపరిపూర్ణులనియు, వివేకులనియు శ్లాఘించుచు నమాయకవృత్తితోఁ దమదారిని దాము పోవుచుఁ దాము నొచ్చినను నొరుల నొవ్వఁజేయనొల్లక సాధుచిత్తముతోఁ గాలము గడపు వారి నవివేకులనియు, వెఱ్ఱివారనియుఁ జేతఁగాని నిర్భాగ్యులనియుఁ బరిగణించుచుండుట ప్రపంచధర్మముగాఁ గనుపించుచున్నది. మఱియుఁ "తొల్లియుండియు సైరణసేయునతఁడుఁ । బేదవడియును నర్థికిఁ బ్రియముతోడ । దనకుఁగల భంగి నిచ్చునతండు పుణ్య । పురుషులని చెప్పి రార్యులు బుధవరేణ్య" యనియు "ఒరులేయవి యొనరించిన । నరవరయప్రియము దనమనంబున కగుఁ దా । నొరులకు నవి సేయకునికి । పరాయణము పరమధర్మపథములకెల్లన్" అనియు భారతమునఁ జెప్పఁబడిన నీతివాక్యములకు విరుద్ధముగా సైరణచేయుటయు స్వార్థపరత్వమును విడనాడి పరోపకారమొనర్చుటయుఁ దమ్ము బాధించు దుర్మార్గులకుఁ బ్రతిక్రియాపూర్వకముగా నపకారమాచరింపకుండుటయుఁ బ్రాపంచికజ్ఞానరహితులును నవివేకులును నగు చేతఁగాని వారి సహజలక్షణములని యెంచుచుండుట ప్రపంచధర్మముగాఁ గనుపించుచుండుట మిక్కిలి శోచనీయముగదా!

చదువరులెట్లు తలఁచినను, యేమని నిశ్చయించుకొన్నను, మన కథానాయకులగు మొదలియారు మొదలగు నీనలుగురును దమకు సంప్రాప్తమైన మాయాశీలురగు కపటస్నేహితుల వలన నెంతమోసముఁ జెందినను, యెంతెంత కష్టములకుఁ బాలగుటఁ దటస్థించినను, నుత్తమోత్తములనుట కెంతమాత్రమును సందియములేదు. లోకలుఘంటు సత్రము దగ్గిర స్వకాయకష్టముచే జీవించుచు సాధువృత్తిచేఁ గాలముగడపుచున్న యాకాపువానికిని బ్రపంచజ్ఞానమెఱుఁగక మిక్కిలియమాయిక స్వభావముతో నున్న నోరెఱుఁగని యాతని కొమార్తెలకును దుర్భరమైన యపకీర్తియు, నమితమగు నష్టమును దెచ్చిపెట్టి వారి యుల్లములను క్షోభింపఁజేసిన కామన్న దుశ్శీలుఁడనియుఁ, గుచ్ఛితుఁడనియు, నవినీతుడనియు, మొదలియారును, శెట్టిగారును, గాకపోయినను, బిళ్లేగారును నాయుఁడుగారునైన గ్రహించియుండియుండకపోరు. ఆతనియపాత్రత గ్రహింపఁ

గలబుద్ధియు వివేకమునుగూడ మనకథానాయకులు నలుగురికిని గూడ లేకపోలే దనుట నిశ్చయముగా నమ్మఁదగు. మఱియుఁ గన్యాశుల్కమునను విక్రీతగాఁ జేయఁ దీసికొని రాఁబడిన శూద్రబ్రాహ్మణకన్యకను గన్యాశుల్కమిచ్చి వివాహము చేయించుట యధర్మమనియు, కేవలము దూష్యవ్యాపారమనియు, నిరూహించి హృదయపూర్వకముగా నమ్మియున్నవారని యిదివఱకే చెప్పబడియున్నది. అయినను, వీరు తమను రాఁబోవు నష్టములను, గష్టములను, నపకీర్తిని, నిందకైనఁ గణింపకఁ దమకొసఁగఁబడియున్న విలువగల వస్తువులనుగూడ నించుకైన సంశయింపక నూఱుఁబెట్టి కైవశమున్న వేశ్యయొద్దఁ గొదువఁ బెట్టఁగామన్న వివాహమునఁ గన్యాశుల్కమునకు ధనసహాయముఁ జేయఁబూనుకొనుట కేవలము వీరికన్యసహాయత్వమును, బరోపకారవ్యాపారమును, సాధువృత్తియు, నమాయికత్వము, స్నేహపాత్రతయు, నమ్మికయు, సహృదయత్వమును, దక్క మఱియేమియుఁ గారణములుగావని మనము త్రికరణశుద్ధిగా నిశ్చయముగా నమ్మవలసియున్నది. ప్రపంచానుభవముగలిగి సముచితప్రజ్ఞాధురంధరులై జాగరూకతతో సంచరింపఁగల చతురులీ మహనీయులని శాల్తీవారనియుఁ బనికిమాలిన నిర్భాగ్యులనియుఁ బరులచే నతిసులభముగా వంచింపఁబడి మోసపడు నైసర్గికగుణముగలవారనియుఁ, దలఁచినను హృదయధర్మములను బట్టి వీరమాయికస్వభావమును సాధువృత్తియుఁ బరోపకారచింతయు, సహిష్ణుత్వము, స్నేహపాత్రతయుఁ గల యుత్తమోత్తములగు మహనీయులని మనమొప్పుకొనక తీరదు.